సంఘర్షణ

కన్నడ మూలం
'త్రివేణి'

అనువాదం
కల్యాణి

సంఘర్షణ

కన్నడ మూలం :

'త్రివేణి'

తెలుగు సేత :

కల్యాణి

MSCo
259

యం. శేషాచలం అండ్ కంపెనీ
మచిలీపట్నం — సికింద్రాబాద్

SANGHARSHANA

Kannada Novel by 'TRIVENI'
Telugu Translation by KALYANI

First Published in MSCO series :
May, 1985

Publishers :
M. SESHACHALAM & Co.,
Machilipatnam - Secunderabad - 3

Printers :
PUSHPA PRINTERS,
Tilak Nagar, Hyderabad.

Cover Design :
UTTAM

Distributors :
ANDHRA PRADESH BOOK DISTRIBUTORS,
3237, Rashtrapati Road, Secunderabad-500 003

Price : Rs. 12-00

సంఘర్షణ

ఒకటి... రెండు... మూడు... నాలుగు... క్లాసులో కూర్చున్న సునంద కాలేజీ గడియారం నాలుగు కొట్టడాన్ని మనస్సులోనే లెక్క పెట్టింది. ఈ నాలుగు గంటలకోసం ఆ పీరియడ్ మొదలయినప్పటినుండి ఎదురుచూస్తోంది. విసుగుతోపాటు బాగా ఆకలి కూడా వేస్తోంది. ఉదయం పదిగంటలకు తిన్నతిండి. కాలేజికి ఆలస్యమయి పోతోందని హడావిడిగా కంచం పెట్టుకుంది.

"తొందరగా వడ్డించండి తాతా. అప్పుడే పదయిపోయింది. నేను భోంచేసి పదిన్నరలోగా కాలేజీలో ఉండాలి." అంటూ తొందర పెట్టింది సునంద వంటాయన్ని.

"నా వంట తొమ్మిదన్నరకల్లా అయిపోయింది తల్లీ. నువ్వే తొందరగా రాలేదు" అన్నారు తాత ఆప్యాయంగా.

"ఏం చేయను చెప్పండి, పాడు పరీక్ష..."

"రోజూ ఇలాగే చేస్తున్నావమ్మా. తొందరగా రాకుండా పది గంటల కొచ్చి హడావిడిగా తినేసి వెళ్ళిపోతావు. సాయంకాలం నాలుగు గంటలకు అలసిపోయి వస్తావు. ముందుగానే వచ్చి కొంచెం నెమ్మదిగా..."

"సునందా... సునందా..." అంటూ తలుపు దగ్గర్నుండి పిలిచింది మీనాక్షి.

"ఒక్క నిమిషం మీనా..." సునంద వంటింటిలో నుండే జవాబు చెప్పింది.

"పదిగంట లయిపోయింది......" అంటూ తొందరపడుతోంది మీనాక్షి.

"మా ఇంటి గడియారం పది నిముషాలు ముందుంది లోపలికి రామ్మా" అంటూ సుందరమ్మగారు పక్క గదిలోనుండి కొత్త జాకెట్టుకు గుండీలువేస్తూ హాల్లోకి వచ్చారు.

మీనాక్షి తన గడియారం చూసుకుంది.

"లేదండి. నాది కాలేజ్ టైమే" అంది.

"సునందా. మీనాక్షి నీకోసం కాచుక్కూర్చుంది" అంటూ మళ్ళీ పిలిచారు సుందరమ్మగారు.

"అయిపోయిందమ్మా, ఒక్కనిముషం" అంటూ సునంద పెరుగన్నం తినివేసింది.

"రోజూ ఇలా ఆలస్యం చేస్తే ఎలా సునందా?"

"ఏంచేయను మీనా, రోజూ ఆలస్యం అవుతోంది."

"తొందరగావెళ్ళి పుస్తకాలు తీసుకురా. మళ్ళీ ఇక్కడే మాట్లాడుతూ నిల్చోకు" అని సుందరమ్మగారు అన్నాకగాని సునంద పైకి వెళ్ళలేదు. పుస్తకాలు తీసుకుని ఇంకా కొంచెం పౌడరు రాసుకుని క్రిందికి వచ్చింది. మీనాక్షి అప్పటికే గేటుదగ్గర నిల్చుంది.

"చాలా ఆలస్యమయింది. క్షమించు" అంది సునంద దీనంగా మొహంపెట్టి.

ఆరోజు ఆఖరి పీరియడ్‌లో లాజిక్ లెక్చరర్ హైపాథిసిస్‌మీద లెక్చరిస్తుంటే అలసిపోయిన సునంద మనస్సు ఉదయం తాను హడావిడిగా కాలేజీకి బయలుదేరిన విషయాన్నే తల్చుకుంది. రోజూ టైముకు సరిగ్గా బయలుదేరుదామని అనుకున్నా ఎప్పుడూ వీలయ్యేదికాదు. మీనాక్షి సునందను పిలవటానికి వచ్చేటప్పటికి ఒక్కరోజయినా సునంద భోంచేసి ఉండేదికాదు. కంచంపెట్టుకుని తాతని తొందరపెడుతున్నప్పుడే మీనాక్షి వచ్చేది. దాంతో పెరుగన్నం మాత్రమే తిని కాలేజీకి బయలుదేరేది సునంద.

నాలుగు గంటలకు బాగా ఆకలివేసేది. అందువల్ల కాలేజీ గడియారం నాలుగు గంటలు ఎప్పుడు కొడుతుందా అనే ఎదురు చూస్తూండేది. ఈరోజూ నాలుగుగంటలు కాగానే ఊపిరితీసుకొంది.

"ఇంకేం బెల్లు కావచ్చును" అనుకుంటూండగానే గంట

కొట్టారు. లెక్చరర్ బయటికి వెళ్ళగానే అమ్మాయిలందరూ అల్లరి చేస్తూ బయటికి వచ్చారు.

కాలేజి సూపరింటెండెంటు అమ్మాయిల్ని పిలిచి "కాలేజీహాల్లో గ్రీకులసంస్కృతిమీద ల్యాంటర్న్ లెక్చర్ ఉంది. అది చూసుకుని వెళ్ళండి" అన్నారు.

అమ్మాయిల వికసించిన ముఖాలు మళ్ళీ ముడుచుకున్నాయి. సునంద ధైర్యంచేసి అడిగింది. "లెక్చర్ ఎన్ని గంటలవరకూ ఉంటుంది?"

"ఏడుగంటలవరకూ ఉండవచ్చు."

"మేము ఇంటికివెళ్ళిరావచ్చునా?" శ్యామల అడిగింది.

"మీరు ఇంటికి వెడితే మళ్ళీ వస్తారన్న నమ్మకం నాకు లేదు. మీకోసమే ఈ లెక్చర్ పెట్టిస్తున్నాం. ఆపైన మీ ఇష్టం" అన్నారు సూపర్ కోపంగా.

ఆమె కోపాన్ని చూశాక మళ్ళీ మాట్లాడే ధైర్యం రాలేదు ఎవరికీ. ఆర్ట్సు విద్యార్థినులు నేరస్తుల్లా వెళ్ళి కాలేజీ హాల్లో కూర్చున్నారు.

కిటికీలు, తలుపులూ అన్నీ మూశారు; లెక్చరర్స్ అందరూ వచ్చి ముందుగా ఉన్న కుర్చీల్లో కూర్చున్నారు. ఉపన్యాసకులను సూపర్ విద్యార్థినులకు పరిచయం చేశారు. దీపాలన్నీ ఒక్కటొక్కటిగా ఆర్పేశారు. హిస్టరీ లెక్చరర్ వెనుదిరిగి అమ్మాయిలనుచూసి "ఇంకా ముందుకురండి" అన్నారు.

"ఇక్కడనుండే మాకు చక్కగా కన్పిస్తోంది మేడమ్"అన్నాయి నాలుగైదు కంఠాలు ఒక్కమారే.

"అలాగా" అంటూ కూర్చున్నారావిడ.

దీపాలన్నీ ఆరిపోయాక హాలంతా చీకటి ఆవరించింది. తెర మీద ఏథెన్సు రాజగృహాలు, పురాతన సంస్కృతిని ప్రతిబింబించే భవనాలు కనిపించసాగాయి.

"మీనా..." అంది సునంద నెమ్మదిగా.

"ఏమిటి?"

"నీకు వినుగ్గాలేదూ?"

"విసుగుకన్న ఎక్కువగా ఆకలివేస్తోంది తల్లీ."

"నాకూ అంతే."

"ఏంచేస్తాం మరి?"

"చప్పుడు చేయకుండా వెళ్ళిపోతేనేం?"

"సూపర్‌కు తెలిస్తే" అంది మీనా భయంగా.

"ఆవిడకెలా తెలుస్తుంది. ముందు వరుసలో కూర్చున్నారామె. చీకటిగావుందికూడా. ఇంతమంది అమ్మాయిల్లో మనం ఇద్దరం లేమని ఎలా కనుక్కుంటారు?"

"అయితే కనుక్కో లేరంటావా?"

"చప్పుడు చేయకుండా వెడితే ఎవరూ కనుక్కోలేరు."

"అయితే, నువ్వు నెమ్మదిగా వెళ్ళి బయట నిల్చుని ఉండు. రెండు నిమిషాల్లో నేనూ వస్తాను" అంది మీనాక్షి.

సునంద పుస్తకాలు తీసుకుని అడుగులో అడుగు వేసుకుంటూ తలుపు దగ్గరికి వచ్చింది. తలుపు కొద్దిగా తెరచి కటకటాల మధ్య దూరిపోయే పిల్లిలా బయటికి వచ్చింది.

రెండు నిమిషాల్లో మీనాక్షికూడా అలాగే వచ్చేసింది. ఇద్దరూ ఇంటికి బయలుదేరారు.

"మనల్ని ఎవరూ కనుక్కోలేదు" అంది సునంద గర్వంగా.

"కొన్ని విషయాల్లో అసాధ్యురాలివి తల్లీ నువ్వు."

సునంద ఇంటికిరాగానే తల్లి గేటుదగ్గరే నిల్చుని ఉండటాన్ని గమనించింది. కూతురు కంటపడగానే ఆమె ముఖం తేటపడింది.

"ఎన్ని గంటలకు తల్లీ నువ్వు ఇంటికి రావటం. నీకోసం ఎదురు చూసి చూసీ నా కళ్ళు కాయలు కాచాయి. ఇంకా కొంచెంసేపు చూసి రంగడిని పంపుదామనుకుంటున్నా" అన్నారు.

"ఏదో స్పెషల్ లెక్చర్ ఉంది. కాని మేమిద్దరం ఫ్రెంచిలీవ్ పెట్టి వచ్చేశాం. అంతగా ఎదురు చూడటం దేనికివ్వాళ?"

"ఇది మరీబావుంది. పద్దెనిమిదేళ్ళకే ఇంత మతిమరుపయితే ఎనభై ఏళ్ళకు ఎలాఉంటావో?"

"అమ్మబాబోయ్ అన్నేళ్ళ బ్రతకాలనిలేదు నాకు."

"వెళ్ళి టిఫిన్ తినుముందు. ఈరోజు శ్రీకంఠయ్యగారి అమ్మాయి పెళ్ళిగదూ? రిసెప్షన్‌కు వెళ్ళాలన్న విషయమే మర్చిపోయినట్టున్నావు."

"అయ్యో, మర్చేపోయాను. నువ్వు సిద్ధంకా. అంతలోగా నేనూ వస్తాను" అంది సునంద.

"నాదేముంది? తల దువ్వుకోటం ఎప్పుడో అయిపోయింది. చీర కట్టుకోవాలంతే! నీలా స్నో రాసుకొని పౌడర్ కోటా కొట్టి... ..."

సునంద తల్లి మాటలు వింటూ నిల్చోలేదు. పుస్తకాలు పెట్టటానికి మేడమీదికి వెళ్ళిపోయిందామె.

టిఫిన్ తిన్నాక జడవేసుకుంది. తరువాత ఏ చీరకట్టుకోవాలో తానుగా పరిష్కరించలేని సమస్య ఎదురయింది. మేడమీదనుండే తల్లి నడిగింది.

"అమ్మా...ఏచీర కట్టుకోమన్నావ్ ?"

"కనకాంబరం రంగు టిష్యూ చీర......."

"చాలా గాడీగా ఉంటుందమ్మా........"

"చిన్న జరీ పూలున్న......"

"అబ్బ అది మరీను......"

ఆవిడ విసుగ్గా అన్నారు "నీ ఇష్టం తల్లీ."

సునంద మెట్లమీదకు వచ్చి "చెప్పమ్మా" అంది.

"నెమలికంఠం రంగుచీర కట్టుకో. అదేరంగు జాకెట్టు...."

"ఓ. కె." అంటూ సునంద తనగదిలోకి వెళ్ళిపోయింది. కాని తన ఎదుటగదిలో చిందరవందరగా పడివున్న రెండు పక్కచుట్టలు, పెట్టె, బూట్సుల జతలుచూసి ఆగిపోయింది.

"అమ్మా" అంటూ మళ్ళీ పిల్చింది సునంద.

"ఇంకా కాలేదా తల్లీ" అన్నారావిడ చిరాగ్గా.

"అది కాదమ్మా! ఆ పెట్టె బేడా ఎవరివి ?"

"అదా? శ్రీకంఠయ్యగారింట్లో పెళ్ళికివచ్చిన చుట్టాలవి. పాపం ముసలాయన ఆ పెళ్ళింట్లో హడావిడికి తట్టుకోలేరని ఇక్కడ దిగారు. మీ నాన్న, ఆయన చిన్నప్పుడు కలిసే చదువుకున్నారట..."

"నాన్నగారు పెళ్ళికి రారా?"

"శ్రీనివాసరావుగారు ఉదయమే మీ నాన్నని పెళ్ళికి తీసుకుని వెళ్ళారు."

శ్రీనివాసరావుగారు ఎప్పుడొచ్చారో అనుకుంటూ ముస్తాబు చేసుకోసాగింది సునంద. నెమలికంఠం రంగుచీర. అదేరంగు జాకెట్టు వేసుకొని, చాలా జాగ్రత్తగా ముస్తాబుచేసుకుని అద్దంలో చూసుకుంది. అంతలోగా ఎవరో మేడమీదకు వస్తున్నట్లు అడుగుల చప్పుడయింది. తాను ఆలస్యం చేస్తూండడంలో తల్లే తన్ను పిలవటానికి వస్తూంటుందని ఊహించి సునంద పెద్దగా అంది.

"నువ్వు పైకి రావద్దులే అమ్మా నేనే వస్తున్నా."

జవాబు రాలేదు. కాని అడుగుల చప్పుడు సమీపించింది.

"నీ కెంత ఆత్రం..." అంటూ సునంద బయటికి వచ్చింది. అప్పటికే అతడు పైకి వచ్చేశాడు.

సునంద మాటలు విన్నందువల్ల కాబోలు చిరునవ్వు అతడి కళ్ళ ల్లోంచి తొంగిచూసి మొహాన్నంతా అలుముకుంది. అతడు జరీ అంచు పంచ కట్టుకుని, తెల్లటి షర్టు వేసుకుని భుజం మీద ఓ కండువా వేసుకున్నాడు.

సునంద కంగారుగా తలుపు నానుకుని నిల్చుంది. ఆమె తడ బాటును చూసి చాలా నవ్వు వచ్చిందతడికి. ఎదురుగా ఉన్న ఆమెను లెక్కచేయకుండా నవ్వేశాడు. సునంద మొహం ఎర్రబడింది. పైగా కోపంకూడా వచ్చింది.

"క్షమించండి. నేను అమ్మ అనుకుని..." సునంద వాక్యం మొదలు పెట్టింది—కాని అతడి చిలిపి నవ్వుతో కంగారుపడి మెట్లవైపుకు పరిగెత్తింది. రెండు రెండు మెట్లను ఒకేమారు దిగుతూ ఒక్క నిమి షంలో కిందకు వచ్చేసింది.

సుందరమ్మగారు గులాబిమాల చేతిలో పట్టుకుని నిల్చున్నారు. తల్లోపూలు పెడుతున్నపుడు సునంద అడిగింది.

"అమ్మా వచ్చింది నాన్నగారి స్నేహితులన్నావ్...?"

"అవును."

"ముసలాయన అనికూడా చెప్పినట్టున్నావు."

"అవును."

"మరి ఇప్పుడెవరో మేడమీదికి వచ్చారు. మన సీతారాం ఈడే ఉంటుంది."

"అతడు శ్రీనివాసరావుగారి అబ్బాయి. పేరు శేఖరం. ఇంజనీరింగ్ కాలేజిలో చదువుతున్నారు."

"ఫరవాలేదు. అప్పుడే కులగోత్రాలన్నీ కనుక్కున్నావు"—అంది సునంద చిలిపిగా. కాని ఆవిడ దానికి తగ్గట్టే "పెళ్ళీడుకొచ్చినకూతురు ఇంట్లో ఉన్నాక అన్నీ కనుక్కోవాలి మరి" అన్నారు.

సునంద జవాబు చెప్పలేదు. కాని ఆమె బుగ్గలు సిగ్గును పూసుకున్నాయి.

తల్లీ కూతుళ్ళు పెళ్ళి పందిట్లోకి వెళ్లేటప్పటికి వధూవరులను రిసెప్షనుకు కూర్చోబెట్టారు. పందిరంతా హడావిడిగా ఉంది. అమ్మాయిలు కొంతమంది తలుపుదగ్గర నిలబడి వస్తున్న అతిథులకు కుంకుమ, గంధం, పూలు, తాంబూలం ఇస్తున్నారు. సుందరమ్మగారి కా పందిట్లో తెలిసిన వారొకరు కనపడ్డారు.

"జ్ఞాపకమున్నానా సుందరమ్మగారూ?"

"జ్ఞాపకం లేకేమి? కులాసాయా?"

"ఊఁ. మీ కూతురనుకుంటా. పెళ్ళయిందా?"

పెళ్ళీడుకొచ్చిన కూతుళ్ళుండే వీరికి పెళ్ళి మాటలు తప్ప మరింకేమీ ఉండవేమో అని విసుక్కుంది సునంద మనస్సులోనే.

"ఇంకా లేదమ్మా" అన్నారు, సుందరమ్మగారు.

"ఎక్కడైనా సంబంధాలు చూశారా ?"

"ఓ రెండు సంబంధాలు చూశాం, కాని ఇంకా ఏదీ నిశ్చయించలేదు."

తల్లిమాటలు విని ఆశ్చర్యపోయింది సునంద. తన పెళ్ళికోసం సంబంధాలు చూస్తున్నట్టే తెలియదామెకు. ఎన్నడూ కూతురిముందు ఆమె పెళ్ళిని గురించి చర్చించలేదు. సీతారాంకి పిల్లనివ్వటానికి కొంతమంది వచ్చినప్పుడు సునందకు పెళ్ళి అయేవరకూ సీతారాంకు పెళ్ళి చేయదల్చుకోలేదని సుందరమ్మగారు చెప్పారు.

అయినా నాకెందుకు వాళ్ళ గొడవలు. ఏమైనా చేసుకోనీ అనుకుంది సునంద. సుందరమ్మగారు, ఆమె స్నేహితురాలు ఏదో సంసారపు గొడవల గురించి మాట్లాడుకుంటున్నారు. సునందకు ఆ మాటల్లో ఆసక్తిలేదు. తన స్నేహితురాళ్ళెవరైనా కనిపిస్తారేమోనని చుట్టూ చూసింది సునంద. కొంచెంసేపు వధూవరులను చూసింది. తరువాత తల్లితో "ఇక వెడదామమ్మా" అంది. సుందరమ్మగారికి కూతురుమాట చెవిని పడలేదు. ఆవిడ తన స్నేహితురాలితో కబుర్లు చెప్పుకోవడంలో మునిగిపోయారు.

"అమ్మా వెడదామమ్మా!"

"ఎందుకమ్మా అంత కంగారు? ఇంట్లో నీపిల్లలు ఏడుస్తున్నారా? చాలా రోజులకు రత్నమ్మగారు కనబడ్డారు. కొంచెం సేపు హాయిగా మాట్లాడుకోనీ" అన్నారు సుందరమ్మగారు.

సునంద ఇక తల్లిని బయలుదేరదీసే ప్రయత్నం విరమించి మళ్ళీ చుట్టూచూసింది. మగవాళ్ళ వైపున రావుగారు ఇంకో బట్టతల ముసిలాయనతో మాట్లాడుతున్నారు. ఆయనే శ్రీనివాసరావుగారయి ఉంటారు అనుకుంది సునంద. అప్పుడే శేఖరం లోపలికి వచ్చాడు. ఆమె ఇంటినుండి బయలుదేరేటప్పుడు ధరించిన దుస్తులకూ, ఇప్పటి ముస్తాబుకూ ఏమాత్రమూ సంబంధంలేదు. అప్పుడు అచ్చం భారతీయుడిలా ఉన్నాడు. ఇప్పుడు సూటు వేసుకుని, టై కట్టుకుని, కోటు బటన్ హోలులో చిన్న గులాబి పువ్వును అలంకరించుకుని వచ్చాడు. శేఖరం మొహం కంట పడగానే సునంద ఇంకోవైపు తన దృష్టిని మరల్చుకుంది.

శేఖరం తన తండ్రితో కాసేపు మాట్లాడి తరువాత తన వయస్సు అబ్బాయిలు నలుగురున్న వైపుగా నడిచాడు. ఆ నలుగురే కబుర్లు చెప్పుకుంటూ నిల్చున్నారు. శేఖరం సునంద వైపుకే తిరిగి నిల్చున్నా ఆమెను గమనించలేదు.

సునంద చూపులు మళ్ళీ చిరాగ్గా పందిరినంతా కలయచూసి మళ్ళీ శేఖరం ఉన్నచోటికే వచ్చాయి. అప్పుడు సునందను చూశాడు

శేఖరం. అతడింకా తన కంగారును చూసే నవ్వుతున్నట్లే అనిపించింది సునందకు.

జీవితంలో మొట్టమొదటిమారు ఓ యువకుడి చూపు ముందు ఓటమిని అంగీకరించి సునంద తల దించుకొంది. తరువాత ధైర్యంగా తలఎత్తి చుట్టూ చూడలేకపోయింది.

సుందరమ్మగారు తమ మాటలు ఆపి లేచినప్పుడు సునందకూడ నిట్టూర్చి లేచి నిల్చుంది.

సుందరమ్మగారు కూతురితో "మీనాన్న ఇప్పుడే వస్తారేమో కనుక్కో" అన్నారు.

సునంద తండ్రి కూర్చున్నవైపుకు వెళ్ళింది. ఆయన కూతుర్ని చూడగానే "ఏమిటమ్మా?" అన్నాడు.

"అమ్మ అడిగింది. నువ్వు ఇప్పుడేవస్తావా? లేకపోతే..."

"నేనూ మీతోనే వస్తాను. శ్రీనివాస్, ఈ అమ్మాయే నా కూతురు సునంద."

శ్రీనివాసరావుగారు సునందవైపు చూసి నవ్వారు.

అదేనవ్వు—అదే మాధుర్యం—రెండు పళ్ళూడిన నోరు — కొంచెం వయస్సు మళ్ళిన నవ్వు.

సునందకూడా నవ్వింది— కొంచెం సంకోచంతో.

శ్రీనివాసరావుగారు రావుగారితో "నేనూ మీతోనే వస్తున్నా" అన్నారు.

అక్కడే తిరుగుతున్న ఓ అబ్బాయిని శ్రీకంఠయ్యగారిని పిలవటానికి పంపారు. అతడు శ్రీకంఠయ్యగారిని పిల్చుకునివచ్చాడు.

"నేనిక వెళ్ళొస్తాను" అన్నారు శ్రీనివాసరావుగారు.

"రాత్రి బువ్వపు బంతికి ఉండి..........."

"నేనూ ముసలివాడినయ్యాను. రాత్రి పొద్దుపోయి భోంచేస్తే నాకు పడదు. నిద్రచెడినా కష్టమే."

శ్రీకంఠయ్యగారు....ఇంకేం చేయలేక ఒప్పుకున్నారు.

"పోనీ మీ అబ్బాయిని—"

"ఆఁ దానికేం, వాడింకా చిన్నవాడు, ఉంటాడు."

"మీరే చెప్పేసి వెళ్ళండి."

"శేఖరం......"

తండ్రి పిలుపువిని శేఖరం వచ్చాడు.

"ఏమిటి నాన్నా?"

"నువ్వు ఇక్కడే భోంచేసిరా, నేను వెడుతున్నా."

"అలాగే."

"ఇంకేం, నా కొడుకు నా బదులు ఉంటాడు" అన్నారు శ్రీనివాస రావుగారు.

ఇంటికి వచ్చేటప్పటికి ఎనిమిదయింది. సీతారాం డ్రాయింగు రూమ్‌లో రేడియోవింటూ కూర్చున్నాడు. తండ్రి రావటాన్ని చూసి రేడియో ఆపేసి లోపలికి వెళ్ళాడు.

శ్రీనివాసరావుగారు భోంచేసి వచ్చేటప్పటికి సీతారాం ఆయన పక్క పరిచాడు. శ్రీనివాసరావుగారు అతడు చేస్తున్నపని చూసి "నువ్వెందుకు పరిచావు బాబూ? నేనే వేసుకునేవాడినిగా" అన్నారు.

"ఎవరు వేస్తేనేం? మీకు మేడ ఎక్కటం, దిగటం కష్టమని కిందే వేశాను. శేఖరం మేడమీదే పడుకోవచ్చు."

"వాడు రావటం ఎంతసేపవుతుందో ఏమో"?

"ఎప్పుడైనా రానివ్వండి, నేను తలుపులు తీస్తాను."

సునంద భోజనాలయ్యాక తన గదికి వెళ్ళింది. విప్పిన చీరను మడిచి పెట్లో పెట్టింది. తరువాత ఓ పుస్తకం పట్టుకుని కూర్చుంది. కొంచెంసేపు చదివేటప్పటికే ఆవలింతలు మొదలయ్యాయి. తరువాత కొంచెంసేపటికి తల టేబుల్‌మీదకు వాలింది. చేతిలోనున్న పుస్తకం నేలమీద పడింది. గదిలో దీపంమాత్రం వెలుగుతూనే వుంది.

శేఖరం వచ్చేటప్పటికి పదకొండయింది. అతడికోసం ఎదురు చూస్తూ సీతారాం ఓ నవల చదువుతూ కింద కూర్చున్నాడు. అతడు తలుపు తట్టగానే వెళ్ళి తలుపులు తీసి "రండి" అన్నాడు. ఇద్దరూ మేడెక్కారు.

"నేను చాలా శ్రమకలిగించానేమో! నాకోసమని మీరు మేలుకొని ఉండవలసివచ్చింది."

"నేను ఎప్పుడూ పడుకోవటం పదకొండు గంటలకే" అన్నాడు సీతారాం.

మేడమీదకు రాగానే చెల్లెలి గదిలో వెలుగుతున్న దీపాన్ని చూసేడు.

"పందెం వేస్తాను సునంద నిద్రపోతూ ఉంటుంది" అన్నాడు సీతారాం శేఖరుతో.

"పరీక్షలని చదువుతూ ఉండవచ్చు."

"ఆవిడగారి చదువు నాకు తెలియదా? గది అంతా నిశ్శబ్దంగా ఉందంటే సునంద పడుకుని ఉందనే అర్థం."

"గొడవచేస్తూ చదవటం ఎలా?" శేఖరు చిరునవ్వుతో అన్నాడు.

"సునంద మేలుకుని ఉంటే పుస్తకం కింద పడేయటం, ఎత్తటం ఇలా చేస్తూనే ఉంటుంది. అదీకాకపోతే టేబుల్, కుర్చీ కదుపుతూ చప్పుడు చేస్తూ ఉంటుంది. ఇప్పుడు చూడండి పడుకునే ఉంటుంది" అంటూ తలుపులు తెరిచాడు సీతారాం.

అతడు అనుకున్నట్టుగానే సునంద కుర్చీమీద కూర్చుని టేబుల్ మీద తల ఆన్చి నిద్రపోతోంది. నేను చెప్పానుగా చూడండి అన్నట్టు సీతారాం శేఖర్‌వైపు చూశాడు. శేఖరం పసిపిల్లలా నిద్రపోతున్న సునందనే చూస్తూ నిలబడ్డాడు.

నల్లటి పొడుగాటి జడ భుజంమీదుగా వచ్చి నేలను తాకుతోంది. ఆమె పెట్టుకున్న గులాబిపూల సువాసన గదినంతా ఆవరించింది. ఎడం చేతిమీద తల పెట్టుకుని నిద్ర పోతోంది సునంద.

"సునందా" సీతారాం నెమ్మదిగా పిలిచాడు.

"లేపకండి" అన్నాడు శేఖర్.

"అయితే రాత్రంతా ఇలాగే పడుకోనిమ్మంటారా?" అంటూ గదిలోకి వెళ్ళాడు సీతారాం. మంచంపైన పక్కవేసి చెల్లెలి భుజంమీద చెయ్యివేసి కదిపేడు.

"సునందా. లేమ్మా పడుకో" అన్నాడు.

సునంద ఉలిక్కిపడి కళ్ళు తెరిచింది. ఒకమారు తలెత్తి అన్నయ్యవైపు చూసి మళ్ళీ అలాగే పడుకుంది. బంగారు గాజులు

గుర్తు ఆమె బుగ్గలమీద స్పష్టంగా పడింది.

"సునందా...సునందా...." సీతారాం మళ్ళీ లేపాడు.

"ఊఁ...ఊఁ..." చిన్నపిల్లలా సునంద రాగం తీసింది. సీతారాం చెల్లెల్ని లేపి పడుకోబెట్టి దుప్పటి కప్పాడు. గదిలోని దీపమార్పి తలుపులువేసి శేఖరు దగ్గరకు వచ్చాడు.

"ఇక పడుకోండి. చాలా పొద్దుపోయింది. రాత్రిళ్ళు మంచినీళ్ళు తాగే అలవాటుందా?"

"లేదు."

"గుడ్‌నైట్" అంటూ సీతారాం వెళ్ళిపోయాడు.

సీతారాం పక్కగదిలో పడకవేసుకొని పడుకున్న శబ్దం శేఖరానికి వినిపించింది.

"మంచి అబ్బాయి" అనుకుంటూ లైటార్పి పడుకున్నాడు శేఖరం.

♦ ♦ ♦

ఉదయం సునంద లేచేటప్పటికి ఏడుగంటలయింది. అప్పటికే శ్రీనివాసరావుగారు, శేఖరం పెళ్ళివారింటికి వెళ్ళిపోయారు. సునంద తన పనులన్నీ చేసుకుని భోజనాలగదిలో కంచం పెట్టుకునేటప్పటికే మీనాక్షి వచ్చేసింది.

"సునందా టైమయిపోయింది" అని పిలిచింది.

"వస్తున్నా. ఒక్క నిమిషం."

ఇద్దరూ తొందరగా కాలేజీకి వెళ్ళారు. అప్పటికింకా బెల్లుకాలేదు.

మొదటి పీరియడ్ ఎకనామిక్స్ లెక్చరర్ వచ్చారు. క్లాసులోకి వచ్చేటప్పుడే కొంచెం ముభావంగా వున్నారు. రాగానే ప్లాట్‌ఫారం ఎక్కి నిల్చున్నారేకాని ఆటెండెన్సు రిజిష్టర్ తీయలేదు. గంభీరంగా అన్నారు.

"నిన్నటి మీ ప్రవర్తనచూసి మాకందరికీ చాలా బాధగా ఉంది. మీరు అలా ప్రవర్తిస్తారని నేను కల్లోకూడా అనుకోలేదు. మీ మీద ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నాను. సూపర్‌కూడా చాలా విసుక్కున్నారు. మీకోసమనేగా మేమా ఉపన్యాసం ఏర్పాటుచేశాము. నిన్న లెక్చర్

అయిపోయాక లైటువేస్తే మేము, ఆలెక్చర్ ఇచ్చినవారు మాత్రమే ఉన్నాం."

ఒక్కొక్క మాట అడుగుతున్నకొద్దీ ఆమె ముఖంలోని గాంభీర్యం కరగిపోసాగింది. చివరికి నవ్వేశారు. ఆవిడ నవ్వగానే గాభరాగా నిల్చున్న అమ్మాయిలు కూడా నవ్వారు అందరూ నవ్వుతూండగా ఆవిడ మళ్ళీ గంభీరంగా :

"ఇక పాఠం మొదలెడదాం" అన్నారు.

అందరూ మౌనం వహించారు. సాయంకాలం సునంద ఇంటికి వచ్చేటప్పటికి సుందరమ్మగారు తలుపుదగ్గరే నిలబడ్డారు.

"టిఫిన్ తినేసిరా. మీ అన్నయ్య జగన్మోహన ప్యాలెస్ సినిమా అని ప్రోగ్రాం వేశాడు" అన్నారు.

"నేను వెళ్ళనమ్మా!"

"ఆ విషయం వాడితోనే చెప్పు."

సునంద పుస్తకాలు పెట్టటానికి మేడమీదకు వెళ్ళింది. ఆమెను చూడగానే సీతారాం హడావిడి చేసేడు.

"తొందరగా ముస్తాబు కాసియ్ సునందా. ఒక్క పావుగంట మాత్రమే టైమిచ్చాను" అన్నాడు.

"నేను రావటం లేదన్నయ్యా."

సీతారాం చిలిపిగా "శేఖర్ వస్తున్నారు" అన్నాడు.

సునంద కంగారుగా గదివైపు చూసింది.

"భయపడకు చిట్టితల్లీ. ఎవరో స్నేహితుడిని చూచుకుని వస్తానని వెళ్ళారు."

"నేను మాత్రం రానుబాబూ."

"అమ్మా, నాన్నా, శ్రీనివాసరావుగారు అందర్నీ బయలుదేరదీశాను."

"ఓ, అయితే వాళ్ళందరూ వస్తున్నారా ?"

"లేకపోతే మరింకే మనుకున్నావు. నిన్నూ, శేఖరాన్ని మాత్రమే పంపుతామనుకున్నావా ? ఆరోజు ఇప్పుడు కాకపోతే రేపు వస్తుంది. ఆ లేత నీలం జార్జెట్ చీర కట్టుకో. అది నీకు చాలా బావుంటుంది. ఆ

నీలం చీరలో నిన్ను శేఖరం చూస్తే 'క్లీన్‌బౌల్డు'..."

"ఏమిటన్నావు? అయితే శ్రీనివాసరావుగారు వాళ్ళ అబ్బాయి రావటం..."

"పెళ్ళింట్లోని గొడవ భరించలేక కాదు, నిన్ను చూద్దామని..."

"అమ్మ నాతో చెప్పనేలేదు......"

"చెబితే ఇంకా కొంచెం ముస్తాబు చేసుకుని తిరిగేదానివా?"

"ఛ! ఇలా అల్లరిపెట్టేలా ఉంటే నేనసలు రాను......"

"అలా అంటే ఎలా సునందా? నిన్నరాత్రి దీపం ఆర్పకుండానే పడుకున్నావు కదా! అప్పుడు శేఖరం నిన్ను లేపవద్దని......"

సునంద కోపంతో అంది. "ఆయన్ను ఎందుకు నా గదిలోకి తీసుకుని వచ్చావ్? నీకసలు..."

"పాపం! శేఖరం గదిలోకి రానేలేదు. నేను లోపలికి వచ్చి పడుకోబెట్టాను. నేను మళ్ళీ వెళ్ళేటప్పటికి ఆయన తన గదిలో కూర్చున్నారు. అన్నట్టు నువ్వు నిద్రపోతున్నప్పుడు ఎలా ఉంటావన్న ఐడియా వచ్చింది ఆయనకు. నిన్ను మేలుకున్నప్పటికన్నా నిద్రపోతున్నప్పుడే ఎక్కువ మెచ్చుకున్నట్టున్నారు..."

"అంతా నీదేనన్నమాట ఈ అల్లరంతా?"

"మరి నిన్ను ఈ ఇంటినుండి సాగనంపడమంటే అంత తేలికనుకున్నావా?"

"ఏమైనా చెప్పు నేను మాత్రం రాను."

"నువ్వు మంచి పిల్లవుగాని నల్లటి వెల్వెట్ జాకెట్టు మరచిపోకు, గులాబి మాలపెట్టుకో."

"ఊహుం"

"సినిమాలో శేఖరాన్ని నీపక్కనే కూర్చోబెడతాను."

"అలా మాత్రం చెయ్యకు బాబూ."

"అంటే వస్తాననేగా అర్థం. గుడ్" అంటూ సీతారాం కిందికి వెళ్ళిపోయాడు. సునంద జడ విప్పుకుంటుండగా సీతారాం కాఫీ, టిఫిన్ తెచ్చిపెట్టాడు.

"నేనే కిందికి వచ్చేదాన్ని కదన్నయ్యా."

"నువ్వు తాతతో మాట్లాడుతూ కూర్చుంటావని నేనేతెచ్చేశాను."

అన్నయ్య హడావుడీ కంగారూ చూసి నవ్వు వచ్చింది సునందకు.

"చాలా థ్యాంక్స్."

"ముస్తాబు తొందరగా కానీ" అంటూ సీతారాం వెళ్ళిపోయాడు.

అన్నయ్య చెప్పినట్టే సునంద లేతనీలం రంగు చీర కట్టుకుని, నల్లటి వెల్వెట్ జాకెట్ వేసుకుంది. తను ముస్తాబు ముగించి కిందకు వచ్చేటప్పటికి సుందరమ్మగారు గులాబిమాల తల్లో పెట్టారు. సునంద కుర్చీమీద కూర్చుని హైహీల్డుషూస్ వేసుకుని తలెత్తేటప్పటికి శేఖర్ ఇంట్లోకి వచ్చాడు.

అందరూ ఇంటినుండి బయలుదేరారు. అందరికన్నా వెనుకవచ్చిన సీతారాం చెల్లెలిచేతికి నీలం వెల్వెట్ వ్యానిటీ బ్యాగ్ఇచ్చి, "కుర్చీమీద పెట్టిమర్చిపోయావు" అన్నాడు.

నిజానికి సునంద వ్యానిటీబ్యాగ్ తీసుకోనేలేదు. చేతిలో డబ్బు లేక పోయినా ముస్తాబు పరిపూర్ణత నందుకోవాలంటే చేతిలో వ్యానిటీ బ్యాగ్ ఉండాలని సీతారాం అభిప్రాయం.

"మర్చిపోయాను" అంటూ ఆ బ్యాగ్ తీసుకుని అన్నయ్య మొహం చూసి నవ్వింది సునంద.

మొదట జగన్మోహన ప్యాలెస్‌కు వెళ్ళి తరువాత సినిమాకు వెళ్ళారు.

"నేనూ, సునందా ఆడవాళ్ళవైపుకు వెడతాం" అన్నారు. సుంద రమ్మగారు.

"వద్దమ్మా, అందరం ఒకేచోట్లో కూర్చుందాం"అన్నాడు సీతా రాం అందరూ ఒకేచోట్లోనే కూర్చున్నారుగాని ఒక చివర శేఖరం, ఇంకోచివర సునంద కూర్చున్నారు. దీన్నిచూసి సీతారాంకు నిరాశ కలిగినా ఏం మాట్లాడలేకపోయాడు.

సుందరమ్మగారికి హిందీరాదు. అందుచేత సినిమా అర్థంకాలేదు. సునందకు హిందీవచ్చినా సినిమా అర్థంచేసుకునే స్థితిలోలేదు.

సినిమా అయిపోయి ఇంటికివస్తున్నపుడు సునంద అన్నయ్యను అడిగింది.

"అన్నయ్యా, ఈ సినిమా పేరేమిటి? రేపు మా ఫ్రండ్సు అడుగు తారు సినిమా పేరేమిటి అని"

"ఇది మరీ బావుంది. వెనుకటికి ఎవడో నీలాంటివాడే రాత్రంతా రామాయణం విని రాముడికి సీతేమవుతుందన్నాట్ట హాల్లో నిద్రపో యావా? సినిమా పేరు అనార్కలీ."

"ఏం సినిమాయో ఏమిటో," అన్నారు సుందరమ్మగారు.

"తన్ను కొనుక్కున్నది సలీమ్ అని అనార్కలికి తెలియొద్దూ" అన్నారు రావుగారు.

"పాటలుమాత్రం బావున్నాయి" అన్నారు శ్రీనివాసరావుగారు.

"నీకు, శేఖర్?" అన్నాడు సీతారాం.

ఏదో ఆలోచిస్తున్న శేఖర్ ఉలిక్కిపడి "నాకు హిందీ సినిమా లంటే అంతపెద్ద ఇష్టంలేదు...." అని నసిగాడు.

"అయితే ఇంతమందిలోనూ నేనే అన్నమాట ఎంజాయ్ చేసింది" అన్నాడు సీతారాం.

మర్నాడు భోజనాలు కానిచ్చి శ్రీనివాసరావుగారు, శేఖరం ఊరికి వెళ్ళటానికి నిశ్చయించుకున్నారు. వాళ్ళకోసం సుందరమ్మగారు విందు భోజనం ఏర్పాటు చేశారు. సునంద మామూలుగానే కాలేజికి వెళ్ళటానికి తయారయింది. కాని సుందరమ్మగారు అభ్యంతరం పెట్టారు.

"ఈరోజు కాలేజికి వెళ్ళకు, ఇంట్లోనే ఉండు" అన్నారు.

"ఉహూ నేను వెడతాను. ఇంట్లో ఉండి నేనేం చెయ్యాలి?"

"నువ్వు ఏమీ చెయ్యనక్కర్లేదు. నేను చెప్పినట్లు చేయి చాలు."

సునంద విధిలేక ఒప్పుకుంది. మీనాక్షి వచ్చినపుడు సునంద "నేను ఈరోజు రావడంలేదు," అని పిలిచిచెప్పింది.

"ఏం ఒంట్లో బాగాలేదా?"

"అబ్బే అదేంకాదు. ఈరోజు ఇంట్లో ఎవరికో విందు చేస్తున్నారు."

"ఎవరికి"

"మా నాన్నగారి స్నేహితులకట; అందుకని అమ్మ కాలేజీకి

వెళ్ళకని చెప్పింది."

"ఏదో ఉంది రహస్యం..." అంటూ మీనాక్షి కొంటెగా నవ్వుతూ వెళ్ళిపోయింది.

భోజనాలయ్యాక తండ్రి కొడుకులు బయలుదేరారు. సీతారాం కూడా వారితో బాటు స్టేషనుకు బయలుదేరాడు. వెళ్ళేముందు చెల్లెల్ని ఓ పక్కకు పిలిచేడు.

"ఏమైనా ప్రేమ సందేశం ఉంటే చెప్పు శేఖరానికి రహస్యంగా అందచేస్తాను" అన్నాడు కొంటెగా.

"ఏడిశావు" అని విసుక్కుంది సునంద.

శ్రీనివాసరావుగారు రావుగారితో "నేను ఏ సంగతీ తరువాత ఉత్తరంలో రాస్తాను" అన్నారు.

జట్కా వెళ్ళిపోయాక సుందరమ్మగారు, రావుగారు ఇంట్లోకి వచ్చారు.

సునందమాత్రం ఇక అక్కడ నిలవలేదు.

పెళ్ళి ముహూర్తం ఏప్రిల్ నెల్లో పెట్టారు. ఇల్లంతా పెళ్ళిసందడిలో హడావిడిగా ఉంది. ఆ గొడవలోనే సునంద పరీక్షకు చదవటానికి ప్రయత్నించింది. ఇంటర్‌లో కనీసం సెకెండ్‌క్లాసయినా తెచ్చుకోవాలనుకుంది సునంద. కాని ఆ పెళ్ళింట్లో చదవటానికి సాధ్యపడలేదు. ఎప్పుడూ హడావిడిగానే ఉండేది ఇల్లు. చివరికి పరీక్షలయిపోతే చాలురా బాబూ అనిపించింది సునందకు.

పరీక్షలయిపోయేవరకూ సునందకు తన పెళ్ళివిషయం ఆలోచించడానిక్కాని, భావిజీవితాన్ని గురించి ఊహా సౌధాలను నిర్మించటానిక్కాని అవకాశమే చిక్కలేదు. కాని పరీక్షలయ్యాక తన పెళ్ళి ఆలోచనలతోనే ఉక్కిరిబిక్కిరయింది.

ఒక్కోమారు తన వైవాహిక జీవితాన్ని గురించి ఆలోచిస్తూ ఊహాలోకంలో విహరించేదామె.

ఒక్కోమారు తనకు పెళ్ళి అన్న విషయాన్ని జ్ఞప్తికి తెచ్చుకుని బెదిరిపోయేది. అయినా పెళ్ళంటే అంత భయపడాల్సిన అవసరంలేదు. ఎప్పుడూ సన్నజాజుల పరిమళం, ప్రణయ మాధుర్యంతో కూడిందే

దాంపత్య జీవితం అని సునంద తాను నచ్చజెప్పుకోబోయినా, అప్పుడప్పుడూ అదో ముళ్ళతో నిండిన అంతులేని అగాధం అనిపించేది.

అప్పుడు శేఖరు రూపమే ఆమె మనోనేత్రంముందు నిల్చేది.

కపటంలేని మొహం. చిరునవ్వునవ్వే కళ్లు, స్నేహపు పలుకులు, ఆమె భీతి హృదయానికి ధైర్యాన్ని చేకూర్చేవి. అప్పుడు తమకో లెక్చరర్ చెప్పిన మాటలు గుర్తుకొచ్చేవి.

భగవంతుడి స్వరూపం ఫలానా అని ఖచ్చితంగా చెప్పటం చాలా కష్టం. మీరు ఈశ్వరుడిగా భావిస్తే ఈశ్వరుడవుతాడు. కృష్ణుడిగా వూహిస్తే కృష్ణుడవుతాడు. పార్వతనుకుంటే పార్వతే అవుతుంది అలాగే మన జీవితం కూడా అందంగా ఉందనుకుంటే ఆనందంగానే ఉంటుంది. వారు ఎలా అనుకుంటే అలాగే...."

ఆ మాటలనే జ్ఞప్తికి తెచ్చుకొచి సునంద ధైర్యంగా ఉండేది.

శేఖర్ ఓ పసిపాప వంటివారు అనిపించింది. ఆయనను పెళ్ళి చేసుకొని తాను సుఖంగా ఉండగలదన్న ఆత్మవిశ్వాసం ఏర్పడింది.

పెళ్ళి ముహూర్తం సమీపిస్తున్న కొద్దీ ఇంట్లో హడావిడి ఎక్కువయింది. సునంద పగటి కలలు కనడం ఇంకా ఎక్కువయింది.

పెళ్ళికి ముందు రోజున ఉద్రేకం ఆనందంతో సునందకు నిద్ర పట్టలేదు. రాత్రంతా ప్రక్కమీద ఇంట్లోని హడావిడినంతా గమనిస్తూ పడుకుంది. ఆమె తల్లిదండ్రులుకూడా నిద్రపోయినట్టు కనపడలేదు.

తల్లి మాటిమాటికి ప్రక్కమీదే పొర్లేవారు.

తండ్రి నిమిషానికోమారు బయటికి వెళ్ళి వచ్చేవారు.

వారికీ తనలాగే ఆరాటం కాబోలు. తెల్లవారుఝామున అలసిపోయిన సునందకు కొంచెం నిద్రపట్టింది. పెళ్ళి బ్యాండువాళ్ళు వచ్చి తమ మంగళ వాద్యాలతో అందర్నీ లేపారు. చిన్న పిల్లలందరూ ఏడవటానికి మొదలెట్టారు.

సుందరమ్మగారు వచ్చి సునందను లేపారు

"కాశీ యాత్రకు వెళ్ళే పొద్దయింది. సుందరమ్మగారు పెళ్ళి కూతురు దుస్తుల్లో ఉన్న సునందను దేవుడిగదిలోకి తీసుకొనివచ్చారు.

క్రొత్త పెళ్ళికూతురు సునంద ఏదో కొత్త అందంతో మెరిసి పోతోంది.

"గౌరిని నిండు మనసుతో పూజచేయి సునందా, శ్రీరామచంద్రుడి లాంటి భర్తే రావాలి. కలకాలం పసుపూ కుంకం నిలవాలి" అని కోరుకో. నేనిక కాశీయాత్రకు వెళ్ళనా? అన్నారు సుందరమ్మగారు కూతురితో.

సునంద నెమ్మదిగా తలూపింది. నెమ్మదిగా చుట్టూ చూసింది. ఆ ప్రక్కనే వున్న పూలమాలల్ని చూసి తలభారంతో వంగింది.

ఒకటి తనకు, ఇంకొకటి ఆయనకు!

పెళ్ళి ముహూర్తం సమీపిస్తున్న కొద్దీ సునందకు ఆరాటం గాబరా ఎక్కువయ్యాయి.

తనకే పెళ్ళి! పెళ్ళి అన్న పదమే ఎంతో విచిత్రంగా కనిపించింది. ఇంతవరకూ తల్లి వడిలో కష్టాలగాలికూడ తగలకుండా సుఖంగా పెరిగిందా కూతురు.

ఇప్పుడు తనకు ఇంచుమించు అపరిచితుడయిన పురుషుడికి తన్ను తాను అర్పించుకోవట మన్నది చాలా పెద్ద బాధ్యత అనిపించింది సునందకు. అతడి... ఏకవచనంలో అతడిని సంబోధించటానికి వెనుకంజ వేసిందామె మనస్సు. ఆయన కష్టసుఖాల్లో తోడునీడగా నిలవాలి. ఎంతటి బాధ్యత!

ఆయన స్వభావం ఎలాంటిదో? ఆ రోజు మెట్లెక్కి వచ్చి స్వచ్ఛమైన నవ్వుతో తనవైపు చూచిన చూపు ఓ మధుర స్మృతిగా నిల్చిపోయింది సునందకు. కాని ఒకటి రెండు రోజుల పరిచయంలో మనిషి లోతుపాతులను తెలుసుకోగలమా? ఆయన ఎప్పుడూ నవ్వుతూనే ఉంటారన్నది నిజమే కాని...

లలిత భర్తకూడా ఎప్పుడూ నవ్వుతూనే ఉంటాడు. కాని ఆ చిరునవ్వు వెనకాల ఎంతటి క్రూరమైన మనస్సు దాక్కుంది. లలిత లాంటి మంచి అమ్మాయిని కొట్టడానికతడి చేతులెలా వస్తాయో! తన కాబోయే భర్త లలిత మొగుడిలా ఉంటే....?

"అమ్మా! అలా కానివ్వకు" అనుకుంటూ దేవిని పూజించింది సునంద.

కమల భర్త ఓ అడంగి. పెళ్ళాం చెప్పినట్లల్లా వినే సాధు

జంతువు. కమల అతడిని ఓ పెంపుడు కుక్కలా చూసేది. ఎప్పుడూ పెళ్ళాం కొంగుపట్టుకుని తిరిగే అతనిని చూస్తే జాలి వేసేది సునందకు.

పౌరుషం ఆత్మాభిమానంలేనివాడేం భర్త?

"అలాంటి వ్యక్తిమాత్రం నాకొద్దు తల్లీ" అనుకుంటూ — సునంద తుల్లెపూలను దేవి పాదాలవద్ద ఉంచింది.

రత్న భర్త కమల మొగుడిలా అదంగికాదు. లలిత భర్తలా క్రూరుడూకాదు. కాని అతడిని మెచ్చుకోలేక పోయింది సునంద. కారణం రత్న మొట్ట మొదటిమారు అత్తవారింటి దగ్గర్నుంచి వచ్చి నపుడు సునంద కొంటెగా అడిగింది.

"ఎలావుంది రత్నా దాంపత్య జీవితం?"

రత్న చేదుమందు మ్రింగినదానిలా మొహం పెట్టింది. "ఛ... ఇదేం జీవితం సునందా నాకీ బ్రతుకంటేనే రోత పుట్టింది" అంది.

అప్పుడే యౌవనంలో అడుగుపెట్టిన స్త్రీ ఇలాంటి మాటలు మాట లాడుతోంది! బ్రతుకంటేనే వైరాగ్యం పుట్టించారంటే ఇక ఆయన ఎలాంటి వారయుంటారు? సునందదేవి నుదుట కుంకుమను వణుకు తున్న చేతులతో పెట్టింది.

సన్నాయి వాయిద్యం ఇంటిని సమీపించింది. బైట కొత్త చీరల గరగరలు. చేతిగాజుల గలగలలు.

సుందరమ్మగారు లోపలకువచ్చి కూతురిప్రక్కనే కూర్చుని పువ్వులు సర్ది, కుంకుమను సరిచేసి, తమ వడిలో పెరిగిన పెళ్ళికూతు రైన కూతుర్ని అభిమానంతో చూశారు.

"ఓ పెళ్ళి కూతురుగారూ. ఒక్క నిమిషం తలెత్తండి, ఒక్క చిరునవ్వు...ఆఁ ఆలా" అంటూ హడావిడిగా ఫోటో తీసుకుని వెళ్ళి పోయాడు సీతారాం.

సుముహూర్తంలో శేఖర్, సునందా భార్యాభర్తలయ్యారు. అంత వరకూ బాధ్యతల్లేని బాలికా హృదయాన్ని స్త్రీత్వం ఆక్రమించుకుంది.

మర్నాడు ఉదయం లేపగానే సునంద మొహం కడుక్కుని కుంకుమ పెట్టుకుంది. సుందరమ్మగారు చూశారు.

"ఇంత వరకూ ఇంట్లో ఉండేటప్పుడు బొట్టు పెట్టుకునే దానివే

కాదు. అలా వుండరాదని చెప్పినా వినేదానివే కాదు. ఇప్పుడు చూడు ఉదయం లేచిందే బొట్టుపెట్టుకుంటున్నావు" అని హాస్యంచేశారు.

"అప్పుడు బొట్టు అందంగా కనబడడానికే పెట్టుకునేదాన్ని."

"ఇప్పుడో?"

"ఇప్పుడది సుమంగళత్వానికి చిహ్నం."

"అదొక్కటే కలకాలం నిలిస్తేచాలు"అన్నారు సుందరమ్మగారు.

పెళ్ళికాగానే పెళ్ళికొడుకు బంధువులందరూ వెళ్ళిపోయినాగాని పెళ్ళికొడుకుమాత్రం వెళ్ళలేదు. శ్రీనివాసరావుగారు కొడుకుని తమతో రమ్మని అడగనూలేదు. వెళ్ళటానికి అతడు ఏమాత్రం కుతూహలం కనబర్చలేదు. అప్పుడే పెళ్ళయింది. ఇంకా సెలవులు కూడా ఉన్నాయి. అలాంటప్పుడు ?

కాని జానకమ్మగారికి భర్త, కొడుకూ చెప్పినమాటలేం నచ్చ లేదు. ఊరికి వెళ్ళేముందు భర్తనద్ద సణిగింది.

"ఇదేమిటి. శేఖరాన్ని భార్యతో సరసాలాడుతూ కూర్చోమంటా రేమిటి ? నలుగురూ ఏమంటారు" అన్నారు.

"వాడి పెళ్ళాంతోనేకదా వాడు సరసాలాడుతోంది. వాడినో రెండు రోజులు హాయిగా ఉండిరానీ. భార్యతో కులాసాగా కాలం గడపాలని ఎంత ఆశగా ఉందో అబ్బాయికి."

"సరి సరి, వాడిమాటలకు మీ రొకరు వంత పాడతారు"

"మరింకేం చేయమంటావ్? తన్ని బయటికి దీయమంటావా? ఇది ఓ వయస్సు. ఇప్పుడు నేను నీతో మాట్లాడాలని సరదాపడ్తానా? నువ్వెక్కడికైనా వెడితే చాలని చూస్తుంటాను..."

"ఇక మీకెప్పుడూ నన్ను చూస్తేనే ఇది..."

"ఏది?"

"ఏదో"అంటూ విసుక్కున్నారు జానకమ్మగారు. మరు నిమిషమే నవ్వేశారు. శ్రీనివాసరావుగారు ఊరికి వెళ్ళేముందు శేఖరాన్ని పిల్చేరు.

"నాలుగురోజులుండి వచ్చేటప్పుడు కోడల్ని తీసుకునిరా శేఖరం. అక్కడేదో పేరంటం అదీ పెట్టుకుంది మీ అమ్మ" అన్నారు.

శేఖరు మొహం సంతోషంతో వెలిగిపోయింది.

"అలాగే నాన్నా" అన్నాడు ఉత్సాహంతో.

విడిదిలో దిగిన బంధువులందరూ వెళ్ళిపోయారు. శేఖరం బెడ్డింగూ పెట్టె మామగారింటికి పంపేశాడు.

శేఖరం శీతారాం వైపు చూశాడు. సీతారాం సుందరమ్మగారి వైపు చూశాడు. ఆవిడ అర్థగర్భితంగా భర్తను చూశారు, ఆయన తలుపు వెనక దాక్కున్న కూతురివైపు చూచి నవ్వేరు.

"సీతారాం సునంద గదిలో పెట్టించే సెయ్యి అన్నారు."

"సీతారాం శేఖరాన్ని మేడమీదకు తీసుకుని వెళ్ళాడు, కూలీ సామాన్లను సునంద గది తలుపువద్ద ఉంచేసి వెళ్ళిపోయాడు.

శేఖరం సునంద గదిలో ఓ కుర్చీమీద కూర్చొని ఓ పుస్తకంతో గాలి విసురుకుంటూ "సీతారాం కొంచెం మంచినీళ్ళిస్తారా" అన్నాడు.

సీతారాం కొంటెగా, "మీకిప్పుడు కావలసింది మంచినీళ్ళా, సునందా?" అన్నాడు.

"మంచినీళ్ళే"

"అయితే నన్నే తీసుకుని రమ్మన్నారా?"

"ఊఁ"

సీతారాం కిందకు వెళ్ళిపోయాడు. శేఖరం సునందగదిని పరిశీలిస్తూ కూర్చున్నాడు.

గదిలో ఓ పక్కగా మంచం. దానిమీద తెల్లటి పక్క ఉంది. కిటికీ కెదురుగుండా టేబుల్, కుర్చీ ఉన్నాయి. మంచం కింద రెండు పెట్టెలున్నాయి. పుస్తకాల రాక్ డ్రెస్సింగ్ టేబుల్, దానిమీద స్నో, పౌడర్, సెంటు, కర్చీపులు చక్కగా అమర్చబడి ఉన్నాయి. డ్రెస్సింగ్ టేబుల్ కిందనే ఆరేడు జతల రకరకాల చెప్పులున్నాయి. గోడలమీద గాంధీ, రవీంద్రుల ఫోటోలుతప్ప మరింకేమీ లేవు. టేబుల్‌మీదున్న పూలకుండీలోని పువ్వులు నవ్వుతున్నాయి.

ఆ గదిలోకి సునంద నాన్నగారూ, సీతారాం కాకుండా ఎవరైనా పరపురుషులు అడుగు పెట్టడం అదే మొదటిమారు. ఆరోజు శేఖరం గది తలుపు దగ్గరే నిల్చుని నిద్రపోతున్న సునందను పరికించాడు. ఆరోజు అతడు పరాయి మగవాడు. కాని ఇప్పుడు సునంద గది శేఖ

రానిదే. ఆ మూడుముళ్ళు పడినదగ్గర్నుండి పరిచయం లేకపోయినా సునంద శరీరంమీద, మనస్సుమీద అతడికి హక్కుంది. ఆమెకు చెందిన ప్రతీది ఇక శేఖరానిదే!

శేఖరం అద్దంలో తన మొహం చూసుకున్నాడు. జుత్తంతా రేగి పోయింది. డ్రెస్సింగ్. టేబుల్ మీదున్న దువ్వెనను చేతిలోకి తీసుకున్నాడు. కాని సునందను అడగకుండా ఆమె వస్తువులు తీసుకోవడం తప్పుకాదూ? మళ్ళీ కుర్చీమీద కూర్చున్నాడు.

సీతారాం తెస్తాడో లేకపోతే సునంద చేతనే పంపుతాడో?

మెట్లమీద చప్పుడయింది. శేఖరం జాగ్రత్తగా విన్నాడు. అది ఆడవాళ్ళ సున్నితమైన అడుగుల చప్పుడు కాదు. శేఖరానికి నిరాశ కలిగింది.

సీతారాం నవ్వుతూ తీసుకోండి. అంటూ ఇచ్చాడు మంచినీళ్ళు. శేఖరం తాగి గ్లాసు టేబుల్ మీద పెట్టాడు.

"ఇప్పటికైనా మీరు ఓడిపోయారని ఒప్పుకుంటే సునందను పైకి పంపుతాను."

"నేను ఓడిపోయానని పెళ్ళికిముందే ఒప్పుకున్నానుగా."

"అయితే సునందను పైకి పంపమన్నారా?"

"ఇప్పుడే వద్దు నన్ను కొంచెం మొహం కడుక్కోనివ్వండి."

"ఆ తరువాత?"

శేఖరం చిన్నగా సీతారాం వీపుమీద కొట్టి అన్నాడు.

"నేను ఇక్కడకొచ్చింది ఎందుకనుకున్నారు?"

శేఖరం పెట్టె తెరచి సబ్బు, తువ్వాలు తీసుకుని క్రిందకు వెళ్ళాడు. మొహం కడుక్కొని వచ్చి తల దువ్వుకున్నాడు.

సీతారాం సునంద గదికి ఎదురుగావున్న గదిలో కూర్చుని ఒక్కడే చదరంగమాడుకుంటున్నాడు.

సునంద చిన్నగా వణుకుతూ పైకి వచ్చింది. ఆమె చేతిలో ఉన్న పాలగ్లాసుకూడా వణుకుతోంది.

గదిలోకివచ్చి పాలగ్లాసు టేబుల్ మీద పెట్టి తలవంచుకుని నిలబడింది. ఆమె మొహాన్నే చూస్తూ కూర్చున్నాడు శేఖరం. ఎంత

అందంగా ఉంది అని మనసులోనే అనుకున్నాడు.

తెల్ల జార్జట్‌చీర, తెల్లటి సిల్కు జాకెట్, చెవుల్లోని ముత్యాల దుద్దులు, చేతిలోని ఆకుపచ్చటి గాజులు, బంగారు గాజులు, జడలోని గులాబిపూవులు, మెడలో మెరుస్తున్న పసుపుతాడు, బంగారు మంగళ సూత్రం అన్నీ ఆమె సౌందర్యాన్ని మెరుగు పెడుతున్నాయి.

గులాబి మధురమైన వాసన మత్తెక్కిస్తోంది.

"కూర్చోండి" అన్నాడు శేఖరం.

సునంద మెదలకుండా అలాగే నిల్చుంది. తలనోమారు తిప్పి చదరంగ మాడుకుంటున్న సీతారాంని చూసింది. సీతారాం చెల్లెల్ని చూసి నవ్వి కన్ను గీటాడు. సునందకు నవ్వు వచ్చింది కాని నవ్వలేదు.

"లోపలికి వచ్చి తలుపు వేస్తారా?"

సీతారాం చూస్తుండగానే తలుపులు మూయటమా! తను మాత్రం చేయలేదావని! ఆతరువాత బాగా ఏడిపించేస్తాడు.

సీతారాం గదిలోనుండే చెల్లెలి తడబాటును గమనించాడు ఆమె సంకోచాన్ని చూసి నవ్వు వచ్చింది. బావగార్ని చూస్తే జాలివేసింది. పాపాయిముందు తినేవస్తువు పెట్టి దాన్ని తనకు ఊరికే చూస్తూ కూర్చో అంటే ఎంత బాధపడుతుంది పాపాయి

సీతారాం లేచి తలుపులు వేశాడు. సునంద ఏదో మధురమైన భయంతో వణికిపోయింది.

శేఖరం కుర్చీమీద కూర్చునే భార్యతో "నిలుచునే ఉన్నారేం?" అన్నాడు.

ఆ గదిలో ఉన్నదొక్కటే కుర్చీ. సునంద మంచంమీద కూర్చుంది. శేఖరం చిరునవ్వుతో "ఈరోజూ ఆవాల్టిలాగే పైకి రావద్దంటే వెళ్ళిపోతాను" అన్నాడు.

సునంద జవాబు చెప్పలేదు.

"వెళ్ళిపొమ్మన్నారా?"

"వద్దు" అంది సునంద నెమ్మదిగా.

"మీరేం చెప్తున్నారో నాకు వినబడటం లేదు" అంటూ వచ్చి ఆమె ప్రక్కనే కూర్చున్నాడు శేఖరం.

"నాన్నగారు నేను ఊరికి వెళ్ళేటప్పుడు మిమ్మల్నికూడా తీసుకుని రమ్మన్నారు. మీరు వస్తారా?"

"వస్తాను."

ఇంకా ఏం మాట్లాడాలో తెలియలేదు శేఖరానికి. ఓ క్షణం అలాగే ఊరుకుని.

"మీ ఉంగరాన్ని చూడనివ్వండి" అంటూ ఆమె ఎడమ చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు. ఇద్దరి చేతులూ వణుకుతున్నాయి.

"బావుంది. కాని ఇంత దూరంగా కూర్చుంటే నేనెలా మాట్లాడను?"

"దగ్గరికొస్తే మాట్లాడడం మరింత కష్టం" అనుకుంది సునంద "నేను వెళ్ళిపోతాను బాబూ. మీకు చాలా సిగ్గు..." సునంద కొంచెం అతనివైపు జరిగింది.

"సునందా..."

"ఏమిటి?"

"మీరు అస్సలు మాటాడటమే లేదేం?...

"మీతో మాట్లాడాలని నాకెంతో ఆశగా ఉంది."

సునంద నెమ్మదిగా అంది "హృదయం ఆనందంతో నిండుగా ఉన్నప్పుడు మాట్లాడటం ఎలా?"

శేఖరం నవ్వుతూ అన్నాడు "ఫరవాలేదు, మీకు చక్కగా మాట్లాడటం వచ్చును."

"మీరు అనకండి"

"ఇంకేమనాలి?"

"నువ్వు అంటే చాలు."

"అలాగే" అన్నాడు శేఖరం. సునందలాంటి సౌందర్యరాశి తనది అన్న ఆనందం, గర్వం అతడిని ఆవరించింది.

"ఆరోజు నేను పైకి రావద్దన్నప్పుడు మీకు కోపం వచ్చిందా?"

"ఊహుం లేదునవ్వొచ్చింది. నీ గాబరా చూచి-నేను అక్కడకు వస్తే మాటలలోనే విందు చేస్తావా?"

....

"అలా నన్ను అడక్కండి ఎక్కడున్నా ఎలా ఉన్నా కాయా, వాచా, మనసా నేను మీ దాన్ని."

శేఖరం ఆమె ముఖాన్ని తన చేతుల్లోకి తీసుకొని అమాయకంగా ఉన్న ఆమె ముహాన్ని ముద్దులతో నింపేశాడు. వారిద్దరి మధ్య ఉన్న అపరిచితులమన్న భావన ఈ ప్రేమ ప్రవాహంలో కొట్టుకుపోయింది.

సునంద జడ సరిచేసుకుని గులాబుల దండను కిటికీలోనుండి బయట పారేసింది.

"క్రిందికి వెళ్ళటానికి సిగ్గుగా ఉంది" అంది.

"ఏం?"

"సీతారాంఏడిపిస్తాడు బాబూ."

"నన్ను కిందకు వచ్చి ఏడిపించ వద్దని చెప్పమన్నావా?"

"వద్దు. అలా అంటే మరింత ఏడిపిస్తాడు. నే నొక్కదాన్నే వెడతాను."

"సాయంకాలం ఎక్కడికైనా వెడదామా?"

"అలాగే."

"ఆరోజు కట్టుకున్న నెమలి కంఠంరంగు చీరే కట్టుకుంటావు కదూ"

"ఉహూఁ దాన్ని మాత్రం కట్టుకోను...."

"ఏం?"

"నేను చెప్పను బాబూ" అంటూ కిందకు పరిగెత్తింది సునంద.

అదృష్టం బావుంది. సీతారాం ఇంట్లో లేడు. సుందరమ్మగారు కూతుర్ని చూసి నవ్వారు. సునంద మొహం ఎర్రబడింది తలెత్తి తల్లి మొహం చూడలేకపోయింది.

కూతురూ, అల్లుడూ ముస్తాబయి షికారుకు వెడుతూంటే సుంద రమ్మగారూ, రావుగారూ, సంతోషంతో చూస్తూ నిలబడ్డారు. ఇద్దరూ నవ్వుకుంటూ తమ ప్రపంచంలో విహరిస్తూంటే చూసి, కూతురికి తగిన అబ్బాయితోనే పెళ్ళిచేశాననుకుంటూ తృప్తి చెందారు రావుగారు. ఇద్దరూ కనుచూపు మేరను దాటిపోగానే భార్యనడిగారు.

"సుందరీ నీ కూతురి కెన్నేళ్ళిప్పుడు?"

"ఇంకా పద్దెనిమిది నిండలేదు."

"శేఖరానికి?"

"ఇరవై రెండు. అయినా ఇదేమిటి సిగ్గుచేటు, కూతురిదీ, అల్లుడిదీ వయస్సు అడుగుతున్నారు?"

"అహఁ ఇద్దరూ అలా వెడుతుంటే బడికి వెళ్ళే కుర్రాళ్ళల్లే ఉన్నారు. అందుకనే అడిగాను అంతే."

"ఇద్దరూ బడికి వెళ్ళే కుర్రాళ్ళే కదా?"

"సుందరీ, విసుగ్గా ఉంది, అలా వెళ్లొద్దామా!"

"పదండి. కొంచెం పూలుకూడా తీసుకుని రావాలి."

సుందరమ్మగారూ, రావుగారూ వంటాయనను తలుపు వేసుకోమని చెప్పి బయటికి వెళ్ళారు. వాళ్ళు మళ్ళీ ఇంటికి వచ్చే వేళకు సునంద, శేఖరం ఇంకా తిరిగిరాలేదు.

సుందరమ్మగారూ, సీతారాం కలిసి సునంద గదిని అలంకరించారు. అగరువత్తులు వెలిగించి పెట్టారు.

సునందా శేఖరం రాగానే అందరూ భోంచేశారు.

మేడమీదికి వెడుతూ శేఖరం సీతారాంను పలకరించాడు.

"మీరెక్కడికి వెళ్ళారు సీతారాం? సాయంకాలం మిమ్మల్ని పిలుచుకుని వెడదామనుకున్నాం మేము" అన్నాడు.

"నేనూ చాలా సేపు కాచుక్కూర్చున్నాను. ఎంతసేపయినా మీరు మా మీద దయచూపనే లేదు. అయినా నేనెందుకు లెండి మీ మధ్య పానకంలో పుడకలా."

"ఊరుకుందూ, ఎప్పుడైనా ఆ కొంటె బుద్ధి పోనిచ్చుకున్నావ్ కాదు."

"ఇదిగో శేఖర్ ఒక చిన్నమాట. సునందను అవాళ్టిలాగే టేబుల్‌మీద తలపెట్టుకొని నిద్రపోతే లేపి పడకమీద పడుకోబెట్టాల్సిన భారం మీదే.

సునంద తన చేతిలో వున్న బత్తాయిని సీతారాం మీదకువిసిరింది. సీతారాం నవ్వుతూ తన గదిలోకి వెళ్ళి తలుపులు వేసుకున్నాడు. మరుక్షణమే తలుపులు తెరచి తల మాత్రం బయటపెట్టి "గుడ్‌నైట్. స్వీట్

డ్రీమ్స్" అంటూ తలుపులు మళ్ళీ వేసుకున్నాడు.

సునంద తన గదితలుపులు తీసింది. అగరవత్తుల వాసన సన్నగా వచ్చింది. అలంకరించిన గదిని చూసి శేఖరం అన్నాడు.

"ఇదంతా మీ అన్నయ్యపనే అయుంటుంది.

"ఊఁ వాడికి నన్ను ఏడిపిస్తేనేగాని తృప్తిగా ఉండదు."

"లోపలికి మీరు వెళ్ళొచ్చుగా...."

"మీరే ముందు వెళ్ళండి."

"ఉహూఁ నువ్వే వెళ్ళు"

"సునందా" అంటూ పిలిచారు సుందరమ్మగారు మెట్లదగ్గర సునంద కిందకు వెళ్ళింది. ఆమె సన్నజాజుల, మల్లెల మాలలు చేతిలో పట్టుకుని నిల్చున్నారు

"పూలు పెట్టుకుని వెడుదువుగాని రా!"

"పడుకునేటప్పు డెందుకమ్మా పూలు, పొద్దున్న పెట్టుకుంటాలే."

"రేపటికి ఇంకా ఉంచాను. ఇప్పుడూ పెట్టుకో"

శేఖరమప్పుడే పడుకోబోతున్నాడు. సునంద రావటాన్ని చూసి లేచి కూర్చున్నాడు.

"ఫరవాలేదు పడుకోండి "

"అమ్మ ఎందుకు పిలిచారు?"

అదంతా మా రహస్యం మీకు చెప్పను."

"నాకూ౯ డానా?"

"మరి ..మరి మీ ఆయనకు నిద్ర పట్టగానే కిందకు వచ్చేయి. నా దగ్గరే పడుకుందువుగాని అని చెప్పారు" అంది సునంద వచ్చే నవ్వును ఆపుకుంటూ.

"అలా అయితే నే నివ్వాళ రాత్రంతా నిద్రపోను"

"నేను వెళ్ళిపోకుండా కావలా కాస్తారా ఏం?"

"ఊఁ"

"అలా అయితే నే నెందుకూ మీకు నిద్రవచ్చేవరకూ కాచుక్కూర్చోవటం? ఇప్పుడే వెళ్ళిపోతాను, మీరు లైటు ఆర్పేసి నిద్రపోండి" సునంద తలుపులు తెరచి తను వెళ్ళిపోతున్నట్టే నటించింది. శేఖరం

ఆమెను గట్టిగా పట్టుకున్నాడు.

"నువ్వు వెళ్ళిపోతే నేనేం చెయ్యను?" అన్నాడు.

"నిద్రపోండి."

"నువ్వులేకపోతే నాకు నిద్రపట్టదే."

"నే నింకా రాలేదని అమ్మ ఎదురు చూస్తూంటుంది. నేను వెళ్ళాలి."

"నిజంగానా?"

"నిజం."

"నామీద ఒట్టు వేయి"

శేఖరు నోటిని సునంద తన చేత్తో మూసింది.

"ఛ అలాంటిమాట అనకండి. అయినా ఇలాంటి చిన్న విషయానికి ఒట్టేమిటి? మీ మీద ఒట్టు పెట్టడానికి ముందు నేనే చచ్చిపోయుంటాను."

"నువ్వు మళ్ళీ అలాంటి మాటలనకు సునందా. అయినా ఈ రాత్రెందుకూ చావుమాటలు."

"అలా అన్నారు బావుంది."

"నువ్వు నిజంగా వెళ్ళాలా సునందా?"

"ఆఁ, ఎక్కడికో తెలుసా?"

"ఎక్కడికి?"

"మీ దగ్గరకే."

"అలాగా" అంటూ సునంద పొడుగాటి జడను పట్టుకుని ఆమెను తనవైపుకు లాక్కున్నాడు శేఖరం.

"లైటు ఆర్పేయనా సునందా?"

"ఈ లైటు ఆర్పేయండి. నా లైటు వేరే ఉంది"

"వేరే బెడ్‌ల్యాంప్ ఉందా ?"

సునంద శేఖరు గుండెల్లో దాచుకున్న తన తలను పైకెత్తి చిరునవ్వు నవ్వింది.

"నా దీపం మీరే" అని మళ్ళీ కళ్ళు మూసుకుంది. వెంటనే లైటు ఆరిపోయింది.

నాలుగు రోజులుండడానికి నిశ్చయించుకున్న శేఖరం ఏడు రోజులు అక్కడే ఉండిపోయాడు. సునందా శేఖరులకు ఆ వారం రోజులూ రోజూ ఓ పండగలాగా గడిచిపోయింది. ఓరోజు సినిమా, ఇంకోరోజు బృందావన్ గార్డెన్స్, మరో రోజు శ్రీరంగపట్నం అంటూ ఆ వారం రోజులూ ఎలా గడిచాయో కూడా తెలీకుండా గడిచిపోయింది. సునంద మధుర సాన్నిధ్యంలో ఆమె మాటలు వింటూ ఆమె సౌందర్యపు నిషాలో మునిగి తేలుతూ, తక్కిన ప్రపంచాన్నే విస్మరించాడు. శేఖరం సునంద లేకుండా అంతకుముందు అన్ని రోజులూ తనెలా గడిపాడా అని ఆశ్చర్యపోయేవాడు.

సునంద ఎప్పుడూ భర్త మనస్సును సంతోష పెట్టడానికే ప్రయత్నిస్తూండేది. అతడు ఎప్పుడైనా కాస్త ముభావంగా ఉన్నా గాభరా పడిపోయేది. కొంచెం తక్కువగా భోజనం చేస్తే ఎప్పటిలా ఎందుకని భోజనం చెయ్యలేదని బాధ పడేది.

ఆ రోజు శ్రీనివాసరావుగారినుండి రావుగారికో ఉత్తరం. శేఖరానికో ఉత్తరం వచ్చాయి. బెంగుళూరులో ఏదో పేరంటం ఏర్పాటు చేస్తున్నట్టు రాశారు. ఆయన ఉత్తరం చదువుకుని భార్యను పిలిచారు

"సుందరీ! శ్రీనివాసరావుగారు ఉత్తరం రాశారు" అని చెప్పారు.

"ఏమని రాశారు?"

"కొడుకూ కోడళ్ళకు ఏదో హారతీ అదీ ఇవ్వాలిట. మనల్ని తప్పకుండా రమ్మని రాశారు.

"మనం వెళ్ళిపోతే ఇంట్లో ఎవరుంటారు?"

"సీతారాం, తాతా ఉంటారు."

సుందరమ్మగారు ఒప్పుకున్నారు. మేడమీద శేఖరం ఉత్తరం చదువుకున్నాడు.

"నాన్నగారు ఉత్తరం రాశారు" అన్నాడు భార్యతో.

"ఏమని?"

"నేను ఈ ఉత్తరం చూడగానే బెంగుళూరికి బయలుదేరాలట."

"మరి నేనో" సునంద ఆత్రుతతో అడిగింది.

శేఖరం చిలిపిగా "నాన్నగారు కనీసం నీ పేరుగూడా ఎత్తలేదే ఉత్తరంలో. నాకు పెళ్ళయింది. ఓ పెళ్ళాముంది అన్న విషయమే మరచిపోయినట్టున్నారు" అన్నాడు.

"ఆఁ అంతా అబద్ధాలు, ఆ ఉత్తరం ఇలా ఇవ్వండి."

"పరాయివాళ్ళ ఉత్తరాలు చదువగూడదు"

"మీరు నాకు పరాయివారేం కాదుగా?"

"అయినా చూడకూడదు."

"సరే మీ ఇష్టం, ఈరోజు నా స్నేహితురాళ్ళందరూ టాక్సీ ఏర్పాటు చేసుకుని శ్రవణ బెళగొళకు ప్రోగ్రాం వేశారు. నన్ను పిలిచారు, వెడతాను, మీ క్యామరా ఇస్తారా?"

శేఖరం బిక్క మొహం వేసుకున్నాడు. అయితే మీరు మళ్ళీ తిరిగిరావటం......"

"ఇప్పుడప్పుడే ఎక్కడొస్తాం, మూడు రోజులు అక్కడే క్యాంప్......"

"మూడు రోజులా?"

"మీరెలాగూ బెంగుళూరు వెడుతున్నారు, ఇక ఆ బెంగే లేదు. అమ్మా నాన్నా ఒప్పుకున్నారు. ఇక మీరూ ఒప్పుకుంటే......"

"నేను ఒప్పుకోక పోతే?

"నాకేమో వాళ్ళతో వెళ్ళాలని చాలా సర్దాగా ఉంది. మీరొప్పుకోకపోతే మరింకేం చేస్తాను......."

"నీకు నిజంగా వెళ్ళాలని ఉందా?"

"ఊఁ"

"ఇక నేను వద్దనడం దేనికి? కాని నాన్నగారు రాశారు చూడు...."

శేఖరం ఉత్తరాన్ని సునంద చేతికిచ్చాడు.

సునంద ఉత్తరం చదివింది.

"మీరోడిపోయారు" అంది,

"ఎలా?"

"మీరు ఉత్తరం," ఇచ్చేశారు. అదీకాక నేను చెప్పిందంతా అబద్ధాలే."

"అబ్బ ఎంత నాటకం ఆడావ్" అంటూ శేఖరం లేచాడు.

సునంద తలుపులు తెరచి కిందకు పరిగెత్తింది.

సీతారాం, తాతలకు యిల్లు అప్పగించి రావుగారు భార్యనూ, కూతుర్ని అల్లుడిని తీసుకొని బెంగుళూరుకు వెళ్ళారు. శ్రీనివాసరావు గారు వాళ్ళని స్టేషనులో కలుసుకొన్నారు.

మర్నాడే సునందా శేఖరులకు ఆడంబరంగా హారతి ఇచ్చారు. "శేఖరు స్నేహితులందరూ పెట్టి టీ పార్టీతోనే ముగించకు డిన్నర్‌పార్టీ ఇవ్వకపోతే ఊరుకునేది లేదు." అని గేలిచేశారు.

రావుగారు సుందరమ్మగారు హారతికాగానే మళ్ళా మైసూరు వెళ్ళిపోయారు. కాని సునంద మాత్రం శెలవు అయిపోయే వరకు అక్కడే ఉండాలని నిశ్చయం చేశారు పెద్దవాళ్ళు.

ఓ రోజు సునంద తల స్నానంచేసి జుత్తు ఆరబెట్టుకుంటూ కూర్చుంది. శేఖరంబయటి నుంచి ఉత్సాహంగా లోపలి కొచ్చాడు. నల్లటి జలపాతంలాంటి జుత్తును చూచి ఆశ్చర్యపడ్డాడు.

"అబ్బ" అన్నాడు.

సునంద వెనుదిరిగి "ఏమిటి?" అంది.

"నిరాభరణ సుందరి అంటే ఎలా ఉంటుందో ఇప్పటికి తెలిసింది."

"నేను నిరాభరణను కావచ్చుగాని సుందరిని మాత్రంకాదు."

"ఒక్క నిమిషం అలాగే ఉండు సునందా క్యామరా తెస్తాను" అంటూ గదిలోకి పరుగెత్తాడు శేఖరం.

సునంద తల స్నానం చేసేటప్పుడు నగలన్నీ తీసిపెట్టింది. నల్లటి అంచున్న తెల్లచీర కట్టుకొని తెల్లజాకెట్టు తొడుక్కుంది. చేతులకు మట్టిగాజులు మాత్రం ఉన్నాయి. నుదుట పెద్దగా కుంకుమ పెట్టుకుంది. శేఖరం క్యామరా తీసుకు రాగానే ఒద్దుబాబూ "ఈ వేషంలో అసలొద్దు ఓ రాక్షసిలా ఉంటాను నేను" అని బ్రతిమాలుకుంది.

"జుట్టు విరబోసుకున్న ద్రౌపదిలావున్నావు."

"ఏవో అంతా మీకే తెలిసిపోయినట్టు మాట్లాడుతున్నారు.

ద్రౌపదెవరో చెప్పండి?"

"అర్జునుడి భార్య."

"కాదు పాండవులభార్య."

"అర్జునుడూ పాండవులలో ఒకడేగా."

"నాకుమాత్రం ఫోటోవద్దు."

"ఇక్కడొద్దు. పైన డాబామీదికి పోదాం పద."

"ఈ చీర బాగాలేదు."

"మోహినికి తెల్లచీరే బావుంటుంది."

సునంద భర్తతో డాబా మీదికి వెళ్ళింది. జుత్తును ఎడమభుజం మీద నుండి ముందుకు వేసుకుని పిట్టగోడమీద కూర్చుని నవ్వుతుండగా శేఖరం ఫోటో తీశాడు

సునంద లేచి "ఇక చాలు" అంది.

"క్యామరాలో ఇంకా నాలుగు ఫిల్ములున్నాయ్."

సునంద పడుకున్నట్టు, సగం పడుకున్నట్టు ఇంకా నాలుగు ఫోటోలు తీశాడు శేఖరం.

"ఇక తృప్తిగా ఉందా?" సునంద అడిగింది.

"దీనికే సంతృప్తి చెందుతానా? ఇప్పుడో మంచివార్త చెపితే నాకేమిస్తావ్?"

"మీ రడిగింది."

"నేను ముందుగానే రిజల్ట్సు తెలుసుకుని వచ్చాను. నీకు సెకెండ్ క్లాసు వచ్చింది, నాకు......ఇక మాట్లాడకుండా విచారంగా పెట్టాడు మొహం.

"ఆ" సునంద ఆత్రుతలో "మీదేమయింది" అంది.

"ఏం కావాలో అదే అయింది."

"అంటే?"

"పాస్"

సునంద కోపంతో అతని దగ్గరకు వెళ్ళి భుజాన్ని పట్టుకొని "ఒక్క నిమిషంలో ఎంత గాబరా పెట్టేశారు నన్ను" అంది.

"నేను ఫెయిలయితే నీకు అంత బాధ కలుగుతుందా?"

"కాదా మరి, మిమ్మల్ని వదలి నేనింకా ఎన్నిరోజు లుండాలి."

"అయితే నువ్వీ సంవత్సరం ఇక్కడ ఉండవా?"

"ఊహుఁ ఇది ఏలాగో ఆఖరి సంవత్సరమేగదూ, శెలవులయి పోగానే నేను మైసూరికి వెళ్ళిపోతాను."

"ఇక్కడుంటే నీకేం బాధ...."

"ఇక్కడుంటే నాకేం కష్టములేదు. మీకే కష్టం." నేనిక్కడే ఉంటే మీరు పుస్తకాలు ముట్టుకోరు ప్యాసూకారు.

"రాణీ సాహెబ్‌గారు అలా అన్నాక యీ సేవకుడింకే మన గలడు? అన్నట్లు శుభవార్త చెప్పినందుకు నాకేమిస్తావ్?"

"నన్నే అర్పించుకున్నానుగా."

"నిన్ను నాకిచ్చింది మీ అమ్మా నాన్నా నువ్వుకాదు."

"నా మనసే అర్పించానుగా. పెళ్ళయినంత మాత్రాన ప్రేమించా లనే నియమం లేదుగా."

"మాటల మల్లి."

సునంద ఏమో జ్ఞాపకానికి తెచ్చుకుని నవ్వింది. శేఖరం ఆమె తల వెంట్రుకలతో ఆటలాడుకుంటూ "ఎందుకు నీలో నువ్వే నవ్వు కుంటున్నావ్. నాతోనూ చెప్పు" అన్నాడు.

"పెళ్ళి రోజున నే నెంత భయపడ్డానో తెలుసా?"

"ఏం? నేనేమన్నా పెద్దపులినా?"

"ఎందుకో నేను మగవాళ్ళంటే భయపడేదాన్ని. అదీకాక నా స్నేహితురాళ్ళ భర్తలందరూ ఒక్కొక్కరు ఒకోరకం. మీరెలాంటి వారో అని భయపడ్డాను కాని...."

"ఊఁ....కాని....?"

"మీరు మనుష్యులు కాదు దేవుడే."

"సునందా?"

"నేనిప్పుడో స్వప్నంలో ఉన్నాను. నన్ను లేపకండి" అంటూ శేఖరం భుజమ్మీద పడుకుని కళ్ళు మూసుకుంది.

వేసంగి శలవులయి పోవటానికింకా నాలుగురోజులున్నాయనగా శేఖరం భార్యను పుట్టింట్లో దిగబెట్టి రావడానికి వెళ్ళారు.

సీతారాం చెల్లెల్ని, బావగార్ని స్టేషనులోనే కలుసుకున్నాడు.

"ఓ, సునందా దేవిగారికి సంతోషం ఎక్కువయినట్టుంది బాగా లావెక్కినట్టున్నారే" అంటూ స్టేషన్లోనే ఏడిపించాడు.

మైసూరులో మళ్ళీ మూడు రోజులు సంతోషంగా గడిచాయి.

శేఖరం బెంగుళూరు వెళ్ళటానికి సిద్ధమవుతూంటే సునందకు ఏడుపొచ్చింది.

ఆమె కంట్లో నీరుండటాన్ని చూసేడు శేఖరం.

"ఇంతకే ఏడుస్తారా ఎవరైనా నీకు పిచ్చిగాని" అన్నాడు.

"నాకీ పిచ్చిపట్టించింది మీరే."

"నేనా?"

"ఊఁ మీరే. మీరింత మంచి వారెందుకయ్యారు. అలాకాకుండా ఉంటే మిమ్మల్నింత పట్టించుకునే దాన్నికాదు."

"నా చదువయిపోయాక బెంగుళూరికి వస్తావుగా అప్పుడు తెలుస్తుంది నా మంచితనం."

"ఇప్పుడే తెలిసిపోతే బావుండేది."

"ఏఁ."

"ఈ సంవత్సరం గడపడం ఇంత కష్టమయ్యేది కాదు."

"నువ్వు నాతోనే వచ్చేయి సునందా. నిన్ను వదలి నేను మాత్రం ఉండగలనా?"

"నేను ఏ విధంగాకూడా మీ చదువుకు అడ్డం రాదలుచుకోలేదు. మీరు బాగా చదివి ఫస్టుక్లాసు తెచ్చుకోండి. అప్పుడే మనిద్దరం ఈసంవత్సరం ఒకర్నొకరు వదిలి ఉన్నది, సార్థకం. ఒద్దుబాబూ నన్ను టెంప్టు చేయకండి నేను చాలా దుర్బలురాల్ని."

శేఖరం మళ్ళీ సునంద బెంగుళూరికి వచ్చేమాట ఎత్తలేదు.

సీతారాం, సునంద, శేఖరాన్ని సాగనంపటానికి స్టేషనుకు వెళ్ళారు. సునంద రైలు బయలు దేరుతుంటే ఆఖరిమారు మళ్ళీ గుర్తు చేసింది.

"దసరా శెలవులకు తప్పకుండా రావాలి. నేను ఎదురుచూస్తూంటాను, ఉత్తరాలు..."

"నువ్వూ రాయాలి. వారానికి రెండు..."

"మీరూ అంతే వారానికి రెండు,"

"వారానికి ఏడువద్దా?" సీతారాం అడిగాడు.

"నీకంతా తమాషే అన్నయ్యా!" అంది కళ్ళలోని నీటి నడుమనే నవ్వుతూ.

"అతడికి పెళ్ళయి సునందలాంటి భార్య ఉంటే నా బాధ అర్థ మయ్యేది" అన్నాడు శేఖరం.

"ప్రస్తుతానికి నే నెవ్వరికిందా లేను."

రైలు వెళ్ళిపోతుంటే సునంద మళ్ళీ అంది "దసరా సెలవులకు."

శేఖరం తలూపి చేయి ఊపాడు. రైలు కనుమరుగయింది. కాని సునంద అలాగే నిలబడిపోయింది.

సీతారాం చెల్లెల్ని మేలుకొలిపాడు.

"ఇక వెడదామా సునందా? శేఖరాన్ని తీసుకువెళ్ళిన రైలు ఈ పట్టాలమీదే వెళ్ళిందని దాన్నే చూస్తూ నిల్చుంటావా?"

కాని సునంద అన్నయ్య మాటలు విని నవ్వలేదు.

ఇంటికి వచ్చాక సునందనలా ముభావంగా కూర్చోవడానికి వద ల్లేదు. అందర్నీ "నో రూమ్ ఫర్ ది గ్రూప్" అనే హాస్య చిత్రానికి లేవ దీశాడు.

సునంద మళ్ళీ కాలేజిలో చేరలేదు. సుందరమ్మగారు ఇంకా పైకి చదివించడానికిష్టపడలేదు. శ్రీనివాసరావుగారికి స్త్రీలు చదవడం పైన అంత మంచి అభిప్రాయం లేదు. కాని రావుగారికి మాత్రం కూతుర్ని బి.ఎ. చదివించాలనే ఉంది. దాని విషయమే భార్యా, భర్త లిద్దరూ ఓ రోజు చర్చించుకున్నారు.

"సునంద ఊరికే ఇంట్లో కూర్చుని ఏం చెయ్యాలి? కాలేజీలో చేరితే మంచిది గదూ?"

"శేఖరం చదువు సంవత్సరంలో అయిపోతుంది. సునంద బి.ఏ. పూర్తి చేయడానికి వీలుండదు. జూనియర్ అయ్యాక మళ్ళీ మానెయ్యాలి, ఆ భాగ్యానికి కాలేజీలో చేరడం దేనికి?" అని సుందరమ్మగారు అభి ప్రాయ పడ్డారు.

జూనియర్ అయ్యాక మళ్ళీ మానెయ్యడం దేనికి? సీనియర్ కూడా చదవనీ."

"సరి! సరి ఆ మొగుడు ఒప్పుకోవద్దూ, ఈ సంవత్సరమే సునంద నిక్కడే ఉంచేయడానికిష్టపడలేదతను. సునంద భర్త చదువుకు ఎలాంటి విఘ్నమూ కాకూడదని ఇక్కడేవుండి పోయింది."

"సునంద అక్కడే ఉంటే అతడి చదువుకేం కష్టమట?"

"పాపం భర్తపైన ఎన్నెన్ని ఆశలు పెట్టుకుంది పిచ్చిపిల్ల, బాగా చదివి ర్యాంక్ తెచ్చుకోవాలి. తరువాత స్కాలర్‌షిప్పుకు ప్రయత్నించాలి అంటూ ఏమేమో అనుకుంటోంది. తను అక్కడుంటే ఆ వ్యామోహంలో పడి చదువును నిర్లక్ష్యం చేస్తాడేమోనన్న భయంతో ఇక్కడికి వచ్చిందంతే"

"సునంద అభిప్రాయమూ సరైందే. కాని ఇక్కడే ఉండి చదవవచ్చుగా."

"ఈ సంవత్సరమేమో అతడి చదువుమీది ఆశతో ఇక్కడే ఉంది. కాని ఆ తరువాత ఒక్క క్షణం కూడా ఇక్కడుండదు."

"పోనీ సీనియర్ బి.ఏ. బెంగుళూరు లోనే చదవనీ."

"అత్తవారింట్లో కూర్చుని ఎలా చదువుతుందో చెప్పండి? ముసలి అత్తగారు ఇంట్లో పనిచేస్తూంటే కోడలు హాయిగా కాలేజికి వెళ్ళి రాని వ్వండి, చాలా బావుంటుంది." అన్నారు వ్యంగ్యంగా సుందరమ్మగారు.

"ఇక్కడే సీనియర్ బి.ఏ. ను పూర్తి చేయనీ"

"శేఖరం బెంగుళూరుకు వెళ్ళి ఇంకా వారం కాలేదు. అప్పుడే చిక్కిపోయింది. ఇప్పట్నుంచే దసరా శెలవ లెప్పుడొస్తాయా అని ఎదురు చూస్తోంది. చదవమని మళ్ళీ దాన్ని బాధ పెట్టకండి, తనకు ఎలా ఉండాలని ఉందో అలాగే ఉండనివ్వండి. అమ్మాయిలు సంతోషంగా ఉండటమే మనకు కావలసింది."

సునంద మేడమీదనుండి ఏదో ఉత్తరం పట్టుకుని రావడంతో వారి సంభాషణకు అంతరాయం కలిగింది.

"అమ్మా! ఈ వుత్తరాన్ని రంగడికిచ్చి పోస్టు చేయించమ్మా." అంటూ తల్లి చేతి కో ఉత్తరాన్నిచ్చింది. ఆమె రంగడిని వెతకటానికి

వెళ్ళారు.

శేఖరాన్నుండి సునందకు వారానికి రెండు ఉత్తరాలు ఖచ్చితంగా వచ్చేవి. లేత నీలం రంగులో సువాసనను వెదజల్లే ఆ ఉత్తరాలను శ్రీగంధపు పెట్టెలో దాచేది సునంద. ఆ పెట్టె ఈ ఉత్తరాలతో నిండిపోయింది.

సీతారాం బి.ఏ. మైసూరులోనే చదివి, ఎల్.ఎల్.బి. బొంబాయిలో చేసి, మైసూరులోనే ఓ వకీలుగారి దగ్గర రెండేళ్ళు జూనియర్‌గా పనిచేసి, తరువాత తన ఆఫీసు పెట్టుకున్నాడు.

o o o

సీతారాం తన కాళ్ళమీద తాను నిలబడగలిగే శక్తి సంపాదించాక తల్లిదండ్రులు అతడి పెళ్ళి గురించి ఆలోచించడం మొదలెట్టారు.

సునంద పెళ్ళికూడా అయిపోయినందువల్ల ఇంకా అతడి పెళ్ళిని ముందుకు వాయిదా వేయడంలో అర్థం లేదనిపించింది. సీతారాం పెళ్ళి దసరాలో చేయడానికి నిశ్చయించారు.

అన్నయ్య పెళ్ళికి ముందే దమయంతితో మంచిస్నేహమయింది సునందకు. దమయంతిని సీతారాం చూసి ఒప్పుకున్నాక సునంద అప్పుడప్పుడూ వాళ్ళింటికి వెళ్ళి వచ్చేది. వాళ్ళింటికి వెళ్ళేందుకు ముందు సీతారాం దగ్గరకు వెళ్ళి అన్నయ్యా! దమయంతి వాళ్ళింటికి వెడుతున్నాను ఏమైనా చెబితే నేనూ... అనేది.

"నువ్వేం చెప్పనక్కరలేదు తల్లీ నీ పనేదో నువ్వు చూసుకో."

"ఎందుకన్నయ్యా అంత సిగ్గుపడతావేం? దమయంతి ప్రతిమారు 'మీ అన్నయ్య ఏమైనా చెప్పారా?' అని అడుగుతుంది. ఏమీ లేవంటే పాపం నిరాశతో క్రుంగిపోతోంది."

"సునందా! నువ్వు ఇలా రోజూ వాళ్ళింటికి వెళ్ళడం ఏమంత బావుండదు."

"నేనేం రోజూ వెడతానా వాళ్ళింటికి? ఎప్పుడయినా మరీ విసుగ్గా వుంటే వెడతానంతే."

"నువ్వు ఇన్నిరోజులు అక్కడికి వెడుతున్నావ్‌గానీ నీ స్నేహితురాలు మాత్రం ఒక్క రోజయినా..."

సునంద నవ్వేసింది.

"దమయంతితో మాట్లాడాలని అంత ఆశగా ఉంటే నాతో చెప్ప కూడదూ? నేనే తీసుకొచ్చేదాన్నిగా."

"చూద్దాం నీ తెలివంతా ఉపయోగించి తీసుకురా."

"అలాగే."

సునంద దమయంతి ఇంటికి వెళ్ళేటప్పటికి సాయంత్రం అయిదు గంటలయింది. దమయంతి గదిలో కూర్చుని వీణ సాధన చేసు కుంటూంది. బామ్మగారు అప్పడాలు చేసుకుంటున్నారు. సునందను చూసి "రామ్మా. సునందా" అన్నారు.

"పనంతా అయిపోయిందా బామ్మా?"

"అలా ఆ చాపమీద కూర్చో తల్లీ. దమయంతీ..."

సునంద గొంతువిని ఆమె వీణను లోపల పెట్టేసింది. దమయంతి బయటకు రాగానే మీ సాధనకు అడ్డు వచ్చానేమో అంది.

"అబ్బే లేదు. నేనే ఇక ఆపేద్దామని అనుకుంటూటే మీరు వచ్చారు. రండి అలా తోటలో కూర్చుందాం."

సునంద, దమయంతి వెళ్ళి తోటలో గడ్డిమీద కూర్చున్నారు.

సునంద శేఖరం తనకు ఇచ్చి వెళ్ళిన సిల్కు కర్చీపుతో ఆడు కుంటూ "ఓ చిన్న మాట" అంది.

"ఏమిటది?"

"అన్నయ్య మిమ్మల్నివ్వాళ్ళ ఇంటికి తీసుకుని రమ్మన్నాడు."

"నిజంగానా?"

"నిజం. అందుకనే ఆఫీసుకు కూడా వెళ్ళకుండా ఇంట్లోనే ఉన్నాడు"

"అమ్మా నాన్నా ఇంట్లోలేరు. బామ్మనుగనుక మీరు ఒప్పిస్తే..."

"మీ బామ్మను ఒప్పించడం ఏం కష్టం. మీరు ఇక్కడే ఉండండి. నేను అడిగివస్తాను అంటూ సునంద లోపలికి వెళ్ళింది.

"బామ్మగారూ"

"ఏవమ్మా?"

"దమయంతిని మా యింటికి తీసుకు వెళతాను. మళ్ళీ నేనూ అన్నయ్యా కలిసి దిగబెట్టి వెడతాం."

బామ్మగారు ఆశ్చర్యంతో నోరు తెరచారు.

"సిగ్గుచేటు! పెళ్ళికాకుండానే భర్త ఇంటికి వెళ్ళటమే! అలా అంతా కలిసి తిరుగవచ్చునా! నా గొంతులో ఊపిరి ఉండగా అలాంటి పని జరగనివ్వను. కలియుగమమ్మా కలియుగం..."

"నేను వాళ్ళిద్దర్నీ ఒంటరిగా వదలనండి. నేనూ వాళ్ళతో నే ఉంటాను."

"అయినా పిల్లికి ఎలుక సాక్ష్యమట. మీ వ్యవహారం అలాగే ఉంది. మీరందరూ చెడిపోయారు. ఈకాలపిల్లలంతా ఇంతే..."

ఇంక మెదలకుండా బయటికి వచ్చింది సునంద. ఆమె మొహం చూస్తే వెళ్ళినపనేమయిందో గ్రహించుకుంది దమయంతి.

"బామ్మగారొప్పుకోలేదు..."

"ఆవిడ ఒప్పుకోరని నాకు ముందే తెలుసు" అంది దమయంతి నిరాశతో.

"పోనివ్వండి. ఎంతయినా పూర్వకాలపు వాళ్ళు మనలా ఉండలేరు" సునంద నిరాశతో క్రుంగిపోయిన దమయంతిని ఓదార్చింది.

ఆరున్నరవరకూ కబుర్లు చెప్పుకొంటూ కూర్చుని తరువాత ఇంటికి వెళ్ళింది సునంద.

తనొక్కతే రావటాన్ని చూసి సీతారాం "అమ్మాయిగారి తెలివి తేటలేమిటో తెలిశాయిగా" అంటూ నవ్వాడు. కాని దానిలో నిరాశే ధ్వనించింది.

"నన్నేం చేయమన్నా వన్నయ్యా బామ్మగారొప్పుకోలా."

"పోనీ" అంటూ అక్కడనుండి వెళ్ళిపోయాడు సీతారాం.

దసరా వస్తున్నకొలది రావుగారింట్లో పెండ్లిసందడి ఎక్కువ యింది. కొడుకు పెళ్ళి. అల్లుడుకూడా ఊరికి వస్తున్నాడు.

సునంద ఇంట్లో ఒక్క నిమిషం స్థిమితంగాకూర్చోలేకపోయింది. శేఖరాన్ని తీసుకొచ్చే రైలు సాయంకాలం వస్తోంది. సీతారాం తనతో బాటు స్టేషనుకు రావటానికి ఒప్పుకున్నాడు. అతన్ని ఎదుర్కోవటానికి

ఏ చీర కట్టుకోవటమా అని ఉదయంనుండి ఆలోచించి తన్ను మొట్ట మొదటిమారు చూసి మెచ్చుకున్న నెమలి కంఠం రంగుచీర సరిగ్గా ఉంటుందని నిర్ణయించుకుంది సునంద.

సాయంకాలం ఆరుంపావుకి ఆ ట్రైను వస్తుందని తెలిసి కూడా అయిదుంపావుకే బయలుదేరదీసింది అన్నయ్యను. సీతారాం ఏదో పుస్తకం చదువుకుంటూంటే వచ్చి "ఇక వెడదాం అన్నయ్యా" అంది.

"ఇంకా అయిదుంపావే అయింది చిట్టి తల్లీ."

"నీ వాచీ స్లోగా నడుస్తోంది. నా దాన్లో అప్పుడే అయిదున్నర అయింది."

సీతారాం పుస్తకం మూసి సునందను పరిశీలనగా చూసేడు.

"అంతా బాగానే ఉంది. కాని జడమాత్రం కొంచెం పక్కకుంది" అన్నాడు.

సునంద కంగారుగా "రెండు మార్లు వేసుకున్నాను. అయినా సరిగ్గా రాలేదా అన్నయ్యా? సరయితే ఇంకోమారు...."

"రైలుకు లేటవుతామేమో. అలాగే ఉండనిద్దూ."

"ఒక్క అయిదే నిమిషాలు ప్లీజ్..." అంటూ మేడమీదకు పరుగెత్తింది సునంద. సీతారాం లేచి మొహం కడుక్కుని దుస్తులు మార్చి తల దువ్వుకున్నాడు. ఇంకా సునంద రెడీ కాలేదు. సీతారాం ఆమె గదికి వెళ్ళేటప్పటికి హేర్‌పిన్ పెట్టుకుంటోంది.

"ఇంకా కాలేదా?"

"అయిపోయిందన్నయ్యా గులాబి పెట్టుకొని వచ్చేస్తున్నా."

"జడ సరిగా రాలేదని చెప్పటం మంచిదే అయింది." అన్నాడు సీతారాం నవ్వుతూ.

"ఏమయింది?"

"నీ జడ బాగానే ఉంది కాని నన్ను డ్రస్ చేసుకోవడానికి వదలవని అలా అన్నాను." అంతే.

"మోసం. లేకపోతే ఈపాటికి స్టేషనులో వుండేవాళ్ళం."

"మనం ఎప్పుడు పోయినా ట్రైను తన టైముకే వస్తుంది. మనం తొందరగా వెళ్ళామని అదీ తొందరగా వస్తుందా ? పద."

ఇద్దరూ స్టేషనుకు వెళ్ళారు, సునంద ప్లాట్‌ఫారమ్ మీద అటూ ఇటూ పచార్లు చేసింది. 'ఫిలింఫేర్' తీసుకుని కొంచెం సేపు పేజీలు తిప్పింది. నిమిషానికోమారు గడియారం చూసుకుని "వెధవ రైలు లేటు" అంటూ విసుక్కుంది.

శేఖరం తలుపుదగ్గర నిల్చున్నాడు. భర్తను చూసి చిరునవ్వు నవ్వింది. ఒక్క చూపుల్లోనే పరీక్షించి "బాగా చిక్కిపోయారు. ఎక్కువగా చదువుతున్నారేమో" అనుకుంటూ.

శేఖరం సూట్‌కేసు తీసుకుని సునంద వద్దకు వచ్చాడు. నోరు విప్పకుండానే మాట్లాడుకున్నారు కళ్ళతోనే. సీతారాం సూట్‌కేసు అందుకున్నాడు.

"రైలు రావటం ఇంకో కాస్త ఆలస్యమయితే బెంగుళూరు వెళ్ళే రైలు ఎక్కేసేది సునంద" అన్నాడు.

"కంగ్రాట్స్ సీతారాం."

"థ్యాంక్స్"

"మీ స్వీట్ హార్ట్‌ని తీసుకునే వస్తారనుకున్నా." సునంద మధ్యలోనే అందుకుంది.

"రేపు సాయంకాలం అందరం కలిసి ఎగ్జిబిషన్‌కు వెడదాం దమయంతి అమ్మానాన్నలను ఒప్పించి తీసుకొని వస్తాను."

"ఆఁ ఆరోజు ఇంటికి తీసుకుని వస్తానని మా బాగా తీసుకొచ్చావుగా" అని ఎక్కిరించాడు సీతారాం.

"ఈమారు ఖచ్చితంగా తీసుకొస్తాను ఆఖరికి అబద్ధమాడయినా..."

"మంచిమాటన్నావ్. అసలు విషయం చెప్పకు. మేం స్నేహితురాళ్ళం కలిసి వెడుతున్నామని చెప్పు."

"ఇంకో వారంలోనే పెళ్ళి. అప్పుడే ఎంత ఆత్రం అన్నయ్యా నీకు."

రాత్రి భోజనాలకు కూర్చున్నప్పుడు శేఖరం చెప్పిన వార్త అందరినీ బాగా నిరుత్సాహ పరిచింది.

"సీతారాం మీ పెళ్ళికి నేను రావడానికి వీలు పడదని చెప్పడానికి నాకు చాలా బాధగా ఉంది..."

రావుగారు "మీరు లేకపోతే పెళ్ళెలా జరుగుతుంది. మీరు తప్పకుండా రావాలి" అంటూ బలవంత పెట్టారు.

"కాని వీలుపడదు ఈ మారు ఫైనల్ ఇయర్ స్టూడెంట్స్‌ను ఉత్తర ఇండియా తీసుకొని వెడతారు. అక్కడి ఫ్యాక్టరీలు గనులు అన్నీ మాకు చూపాలిట."

భర్త మాటలు విన్నాక భోజనమే చేయబుద్ధి కాలా సునందకు. అన్నయ్య పెళ్ళి గురించి ఎన్నెన్నో కలలు కట్టుకుంది. తనూ శేఖరం చక్కగా ముస్తాబు చేసుకుని పెళ్ళిపందిట్లో తిరుగుతూంటే అందరికళ్ళూ తమ పైనే ఉండాలి, దంపతి పూజా సమయంలో తమిద్దర్నీ పీటలమీద నిలబెట్టి అన్నయ్యా వదినలచేత కాళ్ళు కడిగించుకుని తాంబూలంపుచ్చుకుంటే ఎంతబావుంటుంది. తను నిమిషానికోమారు దుస్తులు మార్చుకుని శేఖరం చేత పొగిడించుకోవాలి. ఇలా ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్న సునంద ఉత్సాహమంతా భర్త మాటలు విని నీరుగారిపోయింది.

సీతారాం కూడా చాలా నిరాశ చెందాడు.

"అయితే పెళ్ళి ముహూర్తం మార్చేయటమే మంచిది." అన్నాడు.

"ఇది మరీ బావుంది. మీరు అన్ని ఏర్పాట్లు చేసుకుని నా ఒక్కడి కోసమని పెళ్ళి అపుచెయ్యటం ఏం బావుంటుంది. అవతల ఆడపెళ్ళి వారు పాపం ఎన్నెన్నో ఏర్పాట్లు చేసుకొని ఉంటారు. వాళ్ళకు నష్టం కాదూ? అయినా పెళ్ళికి వధూవరులుంటే చాలు."

"అయినా మీరుంటే బావుండేది." సుందరమ్మగారన్నారు.

"ఇప్పుడేం చేయటానికి వీల్లేదు. ఈ ట్రిప్పు విషయం ఖచ్చితంగా తెలిసింది మొన్ననే. లేకపోతే ఇంతకు ముందే ఉత్తరం రాసేవాడిని. నా బదులు మా అమ్మా నాన్నా వస్తారు.

"వాళ్ళు వస్తే మీరు వచ్చినట్టవుతుందా?" సునంద హఠాత్తుగా అంది.

శేఖరం ఏం జవాబు చెప్పలేదు. ఆ ఒక్కమాటతోనే తాను రానన్నందువల్ల సునంద కెంత బాధగా ఉందో గ్రహించుకున్నాడు. అందరూ మాట్లాడకుండా భోజనాలు కానిచ్చారు.

సునంద గదిలోకి వచ్చేటప్పటికి ఆమె మొహం అదో మాదిరిగా ఉంది. పాలగ్లాసు టేబుల్‌మీద పెట్టి కిటికీ దగ్గరగా వెళ్ళి నిలబడింది. తనే పలకరిస్తుందేమోనని కొంచెంసేపు చూశాడు శేఖరం. కాని సునంద నోరు విప్పనేలేదు.

శేఖరం ఆవలించి "అబ్బ ఉక్క" అన్నాడు. ఒక్క నిమిషం ఆగి, "నిద్ర వస్తోంది" అన్నాడు. చివరికి సునంద దగ్గరకు వచ్చిగడ్డం పట్టుకుని "ఎందుకింత కోపం నామీద" అన్నాడు. అంతవరకూ కను కొలకుల్లోనే వున్న నీరు బుగ్గలమీద జారింది.

శేఖరం తనకు తెల్సిన ఒకే ఒక్క మార్గంలో ఆమె కన్నీటిని తుడిచాడు. సునంద బాధ కొంచెం తగ్గింది, శేఖరం నవ్వుతూ అడిగాడు.

"నేను మీఅన్నయ్య పెళ్ళికి రాకపోతే నీ కంత కష్టంగా వుందా?"

"ఊ. మీ రొస్తారని ఎన్ని ఆశలు పెట్టుకున్నాను. చాలా కష్టం అనిపించింది, మీరు రారని తెలిసినప్పుడు."

"అయితే వెళ్ళటం మానుకోమన్నావా?"

"వద్దు! వెళ్ళిరండి."

"మరెందుకలా ఏడ్చావ్. నువ్వు ఏడిస్తే నాకు సంతోషంగా ఉంటుందనుకున్నావా?"

"నేను ఏడ్చింది అందుక్కానే కాదు."

"మరింకెందుకు?"

"నేను ఏడ్చినకొద్దీ మీరెక్కువ ఓదారుస్తారని నాకు తెలుసు...." అంటూ క్రీగంటితో భర్తవైపు చూసింది సునంద.

"నీ కంత సరదాగా ఉంటే నన్నే అడిగితే పోయేదిగా."

"నేన్తై నేనే అడగటం బావుండదు"

"మరిప్పుడు చెప్పేశావుగా. ఇక నేనూరుకుంటానా" అంటూ శేఖరం ఆమె దగ్గరకు వచ్చాడు.

"రక్షించండి అని కేకలు వేస్తాను."

"చూద్దాం నానుండి నిన్నెవరు రక్షిస్తారో" అన్నాడు శేఖరం నవ్వుతూ.

♦ ♦ ♦

సునంద దమయంతి తల్లి దండ్రులను అడిగి బామ్మగారి దగ్గరకు వెళ్ళింది.

"బామ్మగారూ ఓ చిన్నమాట."

"ఏమిటి?"

"దమయంతిని నాతోబాటు ఎగ్జిబిషనుకు తీసుకుని వెడతాను."

"ఎవరెవరు వెడుతున్నారు?" అన్నారావిడ అనుమానంతో.

"నేను, మీనాక్షి, సుసంత, రాజలక్ష్మి, సీతా...."

"మీ అన్నయ్య రావటంలేదు కదా?"

"లేదు."

"అలా అయితే తీసుకుని వెళ్ళు, కాని పొద్దుపోయేదాకా ఉండకండి."

"అలాగే" అంది సునంద.

ముస్తాబు చేసుకుని తలుపు వెనకే వాళ్ళమాటలు వింటూ నిల్చున్న దమయంతి మొహం వికసించింది.

దమయంతీ, సునందా ఇంటికి వచ్చేసరికి శేఖరం, సీతారాం సిద్ధమయి వాళ్ళకోసం ఎదురు చూస్తున్నారు.

సునంద ఏదో అలసిపోయినట్టు మొహంపెట్టి "దమయంతిని ఇవ్వాళ తీసుకుని వచ్చేటప్పటికి నాతలప్రాణం తోకకు వచ్చింది. నాకేం బహుమతి ఇస్తారు" అంది.

సుందరమ్మగారు, రావుగారు ఈ కాలానికి తగినవారవటం వల్ల వాళ్ళ సరదాలకేం అడ్డు చెప్పలేదు. దమయంతి సిగ్గుపడుతూనే కాబోయే అత్తగారితో "మీరూ వస్తే బావుండేది" అంది.

"మీరూ మీరూ కలిసివెళ్ళండి మధ్యలో మే మెందుకు."

త్రోవలో దమయంతి మాట్లాడనే లేదు. సీతారాం ఆమె నోట మాట తెప్పించటానికి ఎంతో ప్రయత్నించాడు. అవును, కాదు అని తప్పితే మరోమాట ఆమె నోటినుండి రాలేదు. సునందా, శేఖరంకూడా చాల ప్రయత్నించారు. కాని దమయంతి మాట్లాడలా.

శేఖరం "చాల సిగ్గుపడుతున్నట్టుంది" అన్నాడు.

సీతారాం నవ్వుతూ అన్నాడు "ఈ జోక్ను విన్నారా? పెళ్ళి

ముందు భర్త మాటాడుతుంటే ఆమె వింటూండేదట. హనీమూన్‌లో ఆమె మాట్లాడుతుంటే, అతను వింటూండేవాడట. కాపురం పెట్టాక ఇద్దరూ మాట్లాడుతుంటే ఇరుగుపొరుగు వినేవారట."

అతడిమాటలు విని దమయంతి కొంగుతో నోరుమూసుకుని నవ్వింది.

"అమ్మయ్య నవ్వటం అయినా వస్తుందని తెలిసింది. ఏమంటావు సునందా."

"నిజమేనన్నయ్యా?"

ఎగ్జిబిషన్ దగ్గర చాలా రద్దీగా ఉంది. ఆడవాళ్ళు టికెట్ తీసుకునేచోట అంత ఎక్కువమంది లేకపోవటంతో సునందే వెళ్ళి టికెట్ తీసుకుని వచ్చింది.

ఫౌంటెన్ దగ్గర శేఖరం అన్నాడు.

"సీతారాం మీ ఉడ్-బి చాలా సిగ్గుపడుతున్నారు. మేముండటం వల్లే మాట్లాడటం లేదేమో. ఇక్కడ మనం విడిపోదాం. మళ్ళీ సరిగ్గా ఎనిమిది గంటలకు ఇక్కడే మళ్ళీ కలుసుకుని ఇంటికి వెళదాం."

సీతారాం కృతజ్ఞతతో "అలాగే" అన్నారు. దమయంతి మాత్రం సీతారాంతో తానొక్కతే వెళ్ళటానికి భయపడింది.

"అన్నయ్యేం పెద్దపులిగాదు మిమ్మల్ని తినెయ్యటానికి, వెళ్ళండి" అంది సునంద.

సీతారాం చిలిపిగా "ఇంకొంచెంసేపు అలాగే నిల్చుంటే చేయి పట్టుకుని లాక్కునిపోతాను." అన్నారు.

హడలిపోయి "వద్దు, నేనే వస్తున్నా" అంది దమయంతి.

సునంద శేఖరం యింకోవైపుకు తిరిగారు.

"మీ వదినకు చాలా సిగ్గు" అన్నాడు శేఖరం.

"అవును అన్నయ్య మొహం చూస్తేనే ఎర్రబడిపోతుంది ఆమె."

"లేకపోతే అందరూ నీలా ఉంటారా ఏం? పెళ్ళికి ముందే పైకి రావద్దని తరిమివేయటానికే ప్రయత్నించావ్ నువ్వు."

"చూడండి, ఎదురుగుండా ఎవరో వస్తున్నారు. నా మొహం చూసుకుని నడిస్తే ఎవరైనా ఢీకొంటారు."

"నీలోలేని ఆకర్షణ ఎగ్జిబిషన్‌లో ఏముంది లెద్దూ."

"అయితే ఇక్కడి కెందుకొచ్చారు?"

"నేనేం రాలా, నువ్వే తీసుకొచ్చావ్."

"మెసూరి కెందుకు వచ్చారు ?"

"నీకోసమే వచ్చాను. ఎగ్జిబిషను కోసంకాదు."

"మిమ్మల్ని ఓడించేవారెవరు బాబూ ?"

"నీ దర్శనమయిన రోజునే ఓడిపోయాను నేను."

ఇద్దరూ అన్ని కొట్లనూ చూచుకుంటూ నడుస్తున్నారు. ఓ కొట్టు ముందు వేలాడదీసిన రంగురంగు చీరలను చూసి "ఆ నల్లచీర బావుంది కదూ?" అంది సునంద.

"కావాలంటే తీసుకో."

"మీరింకా విద్యార్థులే. ఉద్యోగంలో చేరాక కొని పెడుదురుగాని, ఇప్పుడేం వద్దు."

ఎనిమిది గంటలవరకూ అలా తిరిగి తరువాత ఫౌంటెన్ దగ్గర కొచ్చారు. సీతారాం దమయంతి అప్పటికే వచ్చి వాళ్ళకోసం ఎదురు చూస్తూ నిలబడ్డారు. సీతారాం చేతిలో చాలా పొట్లాలున్నాయి. సునంద అన్నయ్యనుచూసి "ఏమన్నయ్యా చాలా చాలా కొన్నట్టున్నారు" అంది.

"ఊఁ గాజులు, రిబ్బన్లు, ఏవో కొన్ని బట్టలు......"

సునంద దమయంతినిచూసి "అన్నీ ఇప్పుడే కొనిపించేసుకోండి. పెళ్ళయ్యాక ఇంకేమీ కొని పెట్టడు" అంది.

"నేనేమీ అడగలేదు. అన్నీ తనే తీసుకున్నారు" అంది దమయంతి నెమ్మదిగా.

"దమయంతి నీతో మాట్లాడారా అన్నయ్యా?"

"మాట్లాడకేం, నేనే ఇక చాలు అని బ్రతిమాలుకోవాల్సి వచ్చింది."

దమయంతిని వాళ్ళింట్లో దిగబెట్టి తనకోసం కొంచెం దూరంలో కాచుకుని ఉన్న సీతారాం, శేఖరంల వద్దకువచ్చింది సునంద. శేఖరం మరోరెండు రోజులుండి బయలుదేరాడు.

సునందకు అతడంత తొందరగా బయల్దేరటం ఏ మాత్రం ఇష్టం లేదు. సునందకూడా స్టేషన్‌కు వెళ్ళింది. అక్కడ శేఖరాన్ని ఓ పక్కగా పిలిచి "నేనోమాట చెబుతాను. మీరు నవ్వరాదు" అంది.

"నవ్వనులే చెప్పు!"

"బొంబాయి, కలకత్తా అక్కడంతా బస్సులు కార్లరద్దీ ఎక్కువగా ఉంటుందట, జాగ్రత్తగా ఉండండేం."

"నేను నీ వాడినేగదా? నీకు చెందిన వాటిని జాగ్రత్తగా చూచుకుంటాను."

"ఊత, గీత అంటూ ఎక్కడా దిగకండి."

"అలాగే!"

"మీరు ఎక్కడున్నా, ఉత్తరాలు రాయటం మర్చిపోకండి."

"జీ హుజూర్!"

"ఆరోగ్యం బాగా చూసుకోండి."

"అలాగే!"

"నన్ను మరిచిపోకండేం!" సునంద మరీ మరీ చెప్పింది.

"ఎలాంటిమాట అడుతున్నావ్ సునందా? నిన్ను నేను మర్చిపోగలనా? జన్మజన్మాంతరాల సంబంధం మనది. ఒక స్త్రీకి ఓ పురుషుడికి పెళ్ళి అంత సులువుగా కాదు. పూర్వజన్మ సంబంధమే ఈ జన్మలో కలనివస్తుంది. ఈ జన్మ సంబంధమే ముందు వచ్చే జన్మలోను కలుగుతుంది, Marriages are made in Heaven అని వినలేదా నువ్వు?"

"మిమ్మల్ని నొప్పిస్తే క్షమించండి."

"అలా అనకు సునందా! నీ మాటలన్నీ నాకు వేదవాక్యాలే."

రైలు వచ్చింది. శేఖరాన్ని తీసుకుని తొందరగా వెళ్ళిపోయింది. సునంద బరువుగా ఇంటివైపుకు నడిచింది. ఇల్లు చేరేవరకూ ఆపుకున్న దుఃఖం ఇల్లు చేరగానే కట్టలు తెంచుకుని వచ్చింది. సునంద గదిలో శేఖరం ఫోటోముందు ఏడుస్తూకూర్చుంది.

చెల్లెలి విచారాన్ని గమనించిన సీతారాం గదిలోకివచ్చి "ఏమిటిది సునందా పిచ్చిదానిలా ఏడుస్తున్నావు? సాయంకాలప్పూట ఆడపిల్లలు కంటనీరు పెట్టగూడదు తెలుసా! అయినా శేఖరం ఊరికి వెళ్ళినంత

మాత్రాన ఇలా ఏడవడం దేనికి" అన్నాడు.

"లేదన్నయ్యా ఈమూరెందుకో చాలా ఏడుపొచ్చింది."

"సరేలే కింద అమ్మ పిలుస్తున్నట్టుందచూడు."

సునంద కిందికి వెళ్ళింది.

సీతారాం పెళ్ళికి బంధువులందరూ రాసాగారు. ఇంట్లో పెళ్ళి హడావిడిలో కొంచెం సంతోషంగానేఉంది సునంద. కాని, ఆయన ఉంటే అని రోజుకు వందమార్లయినా అనుకునేది. ఓ కొత్తచీర కట్టుకున్నా, నగలు పెట్టుకున్నా శేఖరం తలపులే వచ్చేవామెకు.

పెళ్ళిరోజుకు శేఖరం బొంబాయి నుండి సీతారాం కొకటి, సునందకొకటీ ఉత్తరాలు రాశాడు. పెళ్ళికొచ్చినవారందరూ 'శేఖరం ఏడీ' అని పదిమార్లు అడిగి ఆమెను మరింత నొప్పించేవారు.

పెళ్ళి అయిపోయాక బంధువులందరూ వెళ్ళిపోయారు. శేఖరం తను వెళ్ళిన ఊరులన్నిటినుండి ఉత్తరాలు రాసేవాడు. ఒక్క నెల రోజుల ప్రయాణాన్ని ముగించుకొని శేఖరం బెంగుళూరుకు బయలుదేరాడు. తను బయలుదేరే తేదీని భార్యకు తెలిపి మళ్ళీ ఉత్తరాన్ని బెంగుళూరు నుండి రాస్తానని రాశాడు. కాని ఉత్తరమే రాలేదు. సునంద రోజూ అతడి ఉత్తరం కోసమే ఎదురు చూస్తూంది.

ఓ రోజు అలాగే చూస్తూంటే రావుగారికి ఓ ఉత్తరం వచ్చింది. కవరుపైన బసవనగుడి ముద్ర ఉండటంతో అది శ్రీనివాసరావుగారి నుండి వచ్చిన ఉత్తరమేనని గ్రహించుకుంది సునంద. అయితే ఆయనెందుకని ఉత్తరం రాయలేదు?

సునంద ఉత్తరం తండ్రి చేతికిచ్చి ఆయన ఆ ఉత్తరాన్ని చదువుతుంటే ఆయన మొహాన్నే పరిశీలిస్తూ నిల్చుంది. ఉత్తరం చదువుతుంటే ఆయన కనుబొమలు ముడిపడ్డాయి. సునందతో "అమ్మను పిలు" అన్నారు.

సుందరమ్మగారు వచ్చారు.

"శ్రీనివాసరావుగారు ఉత్తరం రాశారు. శేఖరానికి ఒంట్లో బాగా లేదట. మొదట ఊళ్ళన్నీ తిరిగి రావటంవల్ల వచ్చిన అలసట కాబోలు ననుకున్నారట. కాని వచ్చిన జ్వరం తగ్గనేలేదు. మీరు సునందను

పిల్చుకొనివస్తే మంచిది" అని రాశారు.

సునంద వచ్చే ఏడుపును ఆపుకొంటూ లోపలికి పరుగెత్తి దేవుడి ముందు నిలబడి దీనంగా ప్రార్థించింది.

"ఆయనను బ్రతికించి నన్ను నీ దగ్గరకు తీసుకొనిపో."

♦ ♦ ♦

సుమంగళిగా తల్లిదండ్రులతో బెంగుళూరికి వెళ్ళిన సునంద విధవగా మైసూరికి తిరిగి వచ్చింది. బెంగుళూరికి వెళ్ళినప్పుడున్న ఆత్రుతగాని, బెంగగాని లేదప్పుడు. నిరాశా దుఃఖాలు ఆమెను ఆవరించుకున్నాయి. 15 రోజుల్లోనే పందొమ్మిదేళ్ళ సునంద వృద్ధురాలయి పోయింది.

తల్లితండ్రి సునందను తీసుకొని వస్తున్నారని తెలిసిన సీతారాం వంటాయనతో "నేను ఇంటికి రావటం ఆలస్యం కావచ్చు. ఎవరినీ భోజనానికి నాకోసం కాచుకూర్చోవద్దని చెప్పండి" అని చెప్పి వెళ్ళి పోయాడు.

సునందను పొదివి పట్టుకుని ఇంట్లోకి తీసుకుని వచ్చారు సుందరమ్మగారు. అందరికీ వడ్డించారు తాత.

"భోజనం చెయి సునందా, ఉదయం కూడా చేయలేదు."

సునంద భోజనం చెయ్యనంటుందను కున్నారు సుందరమ్మ గారు. కాని సునంద ఒక్కమాటా ఆడకుండా యాంత్రికంగా భోం చేసింది.

"సీతారాం ఏడి తాతా!" అనడిగారు రావుగారు.

"నేను రావటం ఆలస్యమవుతుంది. ఎవరూ నాకోసం కాచుకూర్చోవద్దు అని చెప్పి వెళ్లారయ్యా."

అందరి భోజనాలూ అయ్యాయి. సునంద పడుకోవడానికి మేడమీదికి వెళుతూంటే సుందరమ్మగారు,

"నేనూ అక్కడే పడుకోనా?" అన్నారు.

"అక్కర్లేదమ్మా" అంది సునంద.

సీతారాం రాత్రి పదకొండు గంటలకు ఇంటికొచ్చాడు. సుందరమ్మగారే తలుపులు తెరచారు.

"భోం చేస్తావా?" అని అడిగారు.

సీతారాం అక్కర్లేదన్నట్టు తలూపి మేడమీదికి వెళ్ళిపోయారు.

సునంద గదిలో దీపం వెలుగుతూనే ఉంది. సీతారాం నెమ్మదిగా చెల్లెలి గదిలోకి వెళ్ళాడు. సునంద కుర్చీలో కూర్చుని ఉంది.

"సునందా..."

"ఏమిటన్నయ్యా?"

ఆమె చూపుల్లోని దైన్యం అతని హృదయాన్ని ద్రవింపచేసింది.

"నువ్వెందుకని పుట్టావు సునందా?"

"నేనూ ప్రస్తుతం అదే ఆలోచిస్తున్నా నన్నయ్యా."

సీతారాం సునంద దగ్గర కొచ్చాడు. చెల్లెలి దీనమైన మొహం, ముఖాన్ని ఆవరించిన దుఃఖం పీటినిచూసి చెల్లెల్ని దగ్గరకు తీసుకుని ఓదార్చాలనిపించింది. కాని ఇంత పెద్ద చెల్లెలిని ఇలా ఓదార్చగలమా? చిన్నప్పుడోమారు సునంద చెట్టుమీదనుండి కిందకు పడినప్పుడు దగ్గరకు తీసుకుని కబుర్లుచెప్పి ఓదార్చాడారోజున. కాని చెట్టుమీదనుండి కింద పడటానికి, సౌభాగ్య శిఖరపు అంచునుండి కిందకు పడటానికి తేడా లేదా?

సీతారాం చెల్లెలి తలను నిమురుతూ నిల్చున్నాడు. సునందతలెత్తి అన్నయ్య మొహంవంక చూసింది. సీతారాం కళ్ళు ఎర్రగా వున్నాయి. మాటలు తడబడుతున్నాయి.

సునంద అన్నయ్య వాలకం చూసి ఆశ్చర్యపోయింది.

"ఎందు కన్నయ్యా ఇలా ఉన్నావు?"

"ఎవరో అన్నారు విస్కీ తాగితే ఈ ప్రపంచాన్నే మరచి పోవచ్చు అని. సరే శేఖరాన్ని మరచిపోదామని తాగాను. కాని మరచి పోలేక పోయానమ్మా."

"ఎన్ని రోజుల్నుంచి తాగుతున్నావన్నయ్యా?"

"ఇదే మొదటిరోజు."

"విస్కీ తాగి ఆయన్ను మరచి పోగలిగితే నాకూ తెచ్చిపెట్ట న్నయ్యా! నేనూ తాగుతాను."

"కాలం తప్పితే మరింకేమీ లేదమ్మా మందు. మనదంతా వట్టి భ్రమ పడుకోమ్మా నేను వెళుతున్నా."

"నువ్వు పడుకో అన్నయ్యా. నాకింకా నిద్రరావటం లేదు."

"ఎక్కువసేపు మేలుకొని ఉండకు సునందా!" అంటూ తన గదికి వెళ్ళిపోయాడు.

సునంద చాలా సేపు అలాగే కూర్చుంది. ఏమీ ఆలోచించకుండా ఎటువైపూ చూడకుండా ప్రాణంలేని బొమ్మలా కనురెప్ప వేయకుండా అలాగే కూర్చుంది.

ఉదయం సీతారాం లేచి వచ్చినప్పుడు కూడా అలాగే కూర్చుంది సునంద. పగలైనా దీపం వెలుగుతుందేమిటా? అని గదిలోకి వచ్చాడు. సునంద తను వెళ్ళినప్పుడు ఎలా వుందో ఇప్పుడూ అలానే వుంది.

"రాత్రంతా నిద్రపోనేలేదా?"

"లేదన్నయ్యా. ఇప్పుడే లేచాను" అంటూ సునంద లేచింది. కిందికివచ్చి తల్లితో అంది.

"అమ్మా, వదిన్ని పిలిపించేయమ్మా."

"ఇప్పుడప్పుడే ఎందుకూ? ఇంకో నాలుగు రోజులు పోనీ."

"ఉహూఁ వద్దు. సీతారాం నిన్నరాత్రి ఆలస్యంగా వచ్చినప్పుడు నాకు భయం వేసింది. ఏమన్నా చెడు తిరుగుళ్ళలో..."

"చెడుతిరుగుళ్ళా?" సుందరమ్మగారు ఆశ్చర్యపోయారు.

"అలాంటి భయం ఏమీలేదు. అయినా వదిన అన్నయ్య దగ్గర ఉండటం మంచిది"

"సరే ఈరోజే పిలిపిస్తాను" అన్నారు సుందరమ్మగారు.

సుందరమ్మగారే వెళ్ళి కోడలిని సాయంకాలంలోగా పంపించాలని చెప్పివచ్చారు. ఆవిడ వచ్చేశాక వాళ్ళింట్లో వాదులాడుకోసాగారు ఈ విషయం మీదే. దమయంతి తల్లి దండ్రులకు కూతుర్ని పంపటానికేం కష్టమూ లేదు. కాని బామ్మగారు మాత్రం ఒప్పుకోరు.

"ఓ ముద్దూ ముచ్చటా లేకుండా ఎలా పంపటం" అని అడ్డు చెప్పారు. దమయంతి తల్లికి కోపం వచ్చింది.

"మనిషి అంటే కష్టానికీ, సుఖానికీకూడా కావాలి. అల్లుడు పని

పోయాదని ఎంత దుఃఖంలో ఉన్నారో వాళ్ళు. ఇలాంటప్పుడు కోడలి కోసం ఏం పండుగ చేస్తారు? ఇంట్లో ఎంత బాధగా ఉందో ఏమో? దమయంతి కొంచెం ఇంటి బాధ్యత వహించుకుంటే భారం తగ్గుతుంది. ఇప్పటి వరకూ మీ మాటకు ఎదురు చెప్పలేదు. కాని దమయంతి సుఖానికే కాదు, కష్టానికికూడా వారి ఇంటి కోడలు" అని ఖచ్చితంగా చెప్పేశారు.

దమయంతి అత్తవారింటికి వెళ్ళటానికి తయారయింది. దమయంతిని వాళ్ళ అమ్మగారు సాయంకాలం ఆరుగంటల తరువాత వచ్చి దిగబెట్టి వెళ్ళిపోయారు.

సుందరమ్మగారు జీవంలేని నవ్వు నవ్వి కోడలిని ఇంట్లోకి ఆహ్వానించారు.

తల్లి వెళ్ళిపోయాక ఓ అరగంట ఏంచెయ్యాలో తోచలేదు దమయంతికి. సునందను ఎలా మాట్లాడించటమా అన్న సమస్యలో పడింది దమయంతి. తను ఎగ్జిబిషన్‌కు వెళ్ళేరోజు ఈ ఇంటికి వచ్చినప్పుడు ఎంత కళకళగా ఉండేదీ ఇల్లు. ఇప్పుడో పాడుపడిన గుడిలా వుంది.

సుందరమ్మగారు రంగడిని పిలిచి దమయంతి సామాన్లు పైన పెట్టమన్నారు.

దమయంతి వాటిని గదిలో పెట్టించి సునంద గదికి వచ్చింది.

"రండి వదినా" అంటూ పలుకరించింది సునంద.

సునంద మొహం చూడగానే దుఃఖం పొంగుకొని వచ్చింది దమయంతికి. ఎగ్జిబిషన్‌కు వెళ్ళే రోజున అప్పుడే వికసించిన పుష్పంలా ఉన్న సునంద జీవితం, కఠోరమైన విధివాతపడి వాడిపోయింది.

దమయంతి సునంద పక్కలో కూర్చుంది. ఆమె కంట్లో నీరు చూసింది సునంద.

"అత్తవారింటి కొచ్చిన రోజునే ఇలా కంటతడి పెడుతున్నారేం వదినా? ఇక మీదట సీతారాంని జాగ్రత్తగా చూసుకోండి" అంది.

"అయినా మీరెందుకిలా అయిపోయారు సునందా?"

"ఇంక ఎవరి సుఖం కోసం నేను జీవించాలి. మీ సుఖమే నా సుఖం."

"మీ రిప్పుడే ఇలా మాట్లాడితే ఎలా? మీరు దుఃఖపడుతూండగా సుఖాన్ని అనుభవించే హక్కు మాకు మాత్రం ఎక్కడుంది?"

"ఎవరి అదృష్టం వారిది."

"అప్పుడే ముసలమ్మలా మాట్లాడుతున్నారు మీరు."

"ఊఁ నే నిప్పుడు పందొమ్మిదేళ్ళ ముసలమ్మను" అంది సునంద.

సాయంకాలం ఏడుగంటలకు ఇంటికొచ్చిన సీతారాం భార్యను చూసి, "ఇదీ ఒకందుకు మంచికే" అనుకున్నాడు. సీతారాం ఇంటి కొచ్చినా దమయంతి కాఫీ టిఫిన్ ఇవ్వడానికి సిగ్గుపడింది సుందరమ్మ గారు రెండు సార్లు చెప్పాక కాఫీ తీసుకొని మేడమీదికి వెళ్ళింది.

"సునందను పలకరించావా" అని అడిగారు సీతారాం.

"ఊఁ. చాలా చిక్కిపోయారు."

వారి మాటలు నూతనంగా పెళ్ళయిన భార్యాభర్తల మాటలు కావు. ఇద్దరికీ ఒకర్నొకరు అర్థం చేసుకోవాలన్న ఆత్రుత లేనేలేదు. అయినా భార్య సాన్నిధ్యంలో తన్ను తానే మరచిపోయినప్పుడు ఏదో తప్పుచేసిన వాడిలా ఉలిక్కిపడ్డాడు.

"మనం ఇలా ఉండటం న్యాయమేనా దమయంతీ" అని అడిగే వాడు.

సీతారాం తన ఆఫీసుపని, కోర్టు, దమయంతి వీటిమధ్య శేఖ రాన్ని మరిచిపోగలిగేవాడు. అలా ఉదయం నుండి రాత్రివరకూ శ్రమ పడి ఇంటికివస్తే దమయంతి నవ్వు మొహం అతని బాధల నన్నిటిని మరిచిపోయేలా చేసేది. అయినా శేఖరాన్ని అంత తొందరగా మరవ లేక పోయాడు.

కాని సునందను పగలూ రాత్రీ భర్త జ్ఞాపకాలే వెంటాడేవి. అతని మాటలు, తనపైని ప్రేమ గుర్తు కొచ్చినప్పుడల్లా రంపపుకోత పడేది. తన స్నేహితురాళ్ళందరూ పెళ్ళి కాకుండా హాయిగా కాలేజీకి వెళుతూంటే సునంద చాలా బాధపడేది. ఆ వేసంగి తరువాత కాలేజీలో చేరటానికి నిశ్చయించుకున్నది. వాళ్ళలా తను అంత నిశ్చింతగా గడప గలదా ? తల దువ్వుకునేటప్పుడు, పూలు పెట్టుకునేటప్పుడు, బొట్టు

పెట్టుకునేటప్పుడు ఆమె హృదయం ఘోషించేది. "ఇది మంచిదేనా" అని మాటి మాటికీ ప్రశ్నించేది. సునంద తల్లిదండ్రులు ఆధునికులు కావటంవల్ల కూతురి అలంకారాలను ఎప్పుడూ విమర్శించేవారు కాదు.

ఒకరోజు దమయంతి మల్లెపూలదండ తెచ్చి యిచ్చింది.

"మీరు పెట్టుకున్నారా?"

"ఊఁ" అంటూ దమయంతి టేబుల్ మీద కూర్చుంది. సునంద పూలను చేతిలోకి తీసుకుంది.

అకస్మాత్తుగా వెంకమ్మగారు జ్ఞాపక మొచ్చారు. వెంకమ్మగారు రావుగారి అక్కయ్య. చిన్నప్పుడే భర్త చనిపోవడం వల్ల తమ్ముడి ఇంట్లోనే ఉండేవారు. ఆవిడకు సునంద అంటే చాలా ఇష్టం. సునంద పదేళ్ళ అమ్మాయిగా ఉన్నప్పుడు ఆవిడ చనిపోయారు.

ఇంతవరకూ సునందకు ఆవిడ జ్ఞాపకమే రాలేదు. ఈ రోజు పూల మాల చేతికి తీసుకోగానే ఎందుకనో జ్ఞాపకాని కొచ్చారు.

"పూలు ఎందుకిలా చేతిలో పెట్టుకునే నిలబడి పోయారు? నన్ను పెట్టమన్నారా?" అంటూ దగ్గర కొచ్చింది దమయంతి.

సునంద ఇంకా కలగంటున్నట్టుగానే దమయంతి వైపు చూసింది. కంట్లో నీరు ఆడుతోండటం వల్ల దమయంతి మొహం అస్పష్టంగా కనబడింది. ఏదో జ్ఞప్తికి తెచ్చుకుంటున్నట్లుగా అంది సునంద—

"నాకు పూలు వద్దు వదినా."

దమయంతి ఆశ్చర్యపడింది. సునంద ఎప్పుడూ ఇలా మాట్లాడ లేదు. ఆమె మొహాన్ని చూస్తేనే కొంచెం భయం వేసింది.

"ఎందుకు..."

"నా కొద్దన్న తరువాత వద్దు అంతే" అంటూ టేబుల్ మీదనే ఉన్న శేఖరు ఫోటో మీద పెట్టింది ఆ పూలు. దమయంతి ఆ విషయాన్ని సీతారాంతో చెప్పింది. అతడికీ ఆశ్చర్యం వేసింది.

"సునందకు ఎలా ఉండాలని అంటే అలానే ఉండనీ" అన్నాడు.

ప్రేమతో చూసేతల్లి. ఆప్యాయతతో ఆదరించే తండ్రి. ఓ స్నేహితుడిలాంటి అన్నయ్య. తోడబుట్టిన అక్కయ్యకన్నా ఎక్కువగా చూసుకునే వదిన. కంటికి నచ్చిన దుస్తులు, నగలు. ఇష్టం వచ్చిన తిండి.

ఇన్నీ ఉన్నా వాటి మధ్య దుఃఖితురాలే అయింది సునంద. భర్తను మరిచిపోవటానికి అన్నయ్యా వదినలతో ఊళ్ళన్నీ తిరిగివచ్చింది. కాని శేఖరం జ్ఞాపకాలు సర్వకాల సర్వావస్థలలోనూ ఆమెను వెన్నంటుతూనే వున్నాయి. కాలమే అన్ని రోగాలనూ నయం చేస్తుందని ఎంతమందో అనగా వింది సునంద. ఈ గాయాన్ని మాత్రం మాన్పలేకపోయింది కాలం.

వేసంగి శెలవులయ్యాక సునంద కాలేజీలో చేరటానికే నిశ్చయించింది. రావుగారికి కూతురు నిర్ణయాన్ని విని సంతోషం కలిగింది.

"ఇలాగైనా సునంద మునుపటి మనిషి అయితే చాలు" అన్నారు సుందరమ్మగారు భర్తతో.

సునంద బి. ఏ.లో చేరింది ఇంటరులో ఆమెతో చదివిన వారంతా సీనియర్ బి.ఏ.లో వున్నారు. వారందరూ తమగమ్యాన్ని నిర్ణయించుకోకుండా భవిష్యత్తుకోసం యెదురు చూస్తూ ఈ చదువులు చదువుకుంటున్నారు. సునంద భవిష్యత్తంతా శూన్యమే తప్ప మరింకేమీలేదు. పందొమ్మిదేళ్ళ వయస్సులోనే భర్తను పోగొట్టుకుని ఇంట్లో కాలం గడపలేక కాలేజీలో చేరింది సునంద.

అదే కాలేజి, అదే స్నేహితురాళ్ళు, అదే సునంద. కాని ఈ సునందలో మునుపటి ఉత్సాహం, సంతోషం, చురుకుదనం లేవు. ఇంట్లో పొద్దుపోక కాలేజీలో చేరింది. చేరాక రోజూ వెళ్ళాల్సింది తన కర్తవ్యం అన్న ఉద్దేశంతో రోజూ కాలేజీకి వెళ్ళి వచ్చేది సునంద.

సునంద కాలేజీలో చేరటం సుందరమ్మ, సీతారాంలకు చాలా సంతోషాన్ని కలిగించింది. ఇంతకు ముందులా ఆలోచించటానికే తీరిక లేదిప్పుడు.

కూతురి విచారపూరితమైన మొహాన్ని చూడగానే సుందరమ్మగారికి కడుపులో దేవినట్లయేది. శేఖరమే వుండి ఉంటే అతడి చదువు అయిపోయేది. సునంద అత్తారింట్లో సంతోషంగా కాపురం చేసుకుంటూ ఉండేది. అయినా కూతురు సుఖంగా ఉంటే చూసే అదృష్టం తమకు లేదా అని మనస్సులోనే చాలా బాధపడే వారు సుందరమ్మగారు.

దమయంతి సునంద ఈడు అమ్మాయే. మేడమీద సునంద గది

ఎదురుగుండా ఉన్న గదే దమయంతి-సీతారాంల గది.

ఓ రోజు రాత్రి సునంద గదిలో కూర్చుంది. ఆ రోజు పున్నమి కావటం వల్ల వెన్నెల ఆకాశాన్నంతా వ్యాపించి భూమిని కూడా ఆక్రమించుకుంది. సునంద తనగది దీపం ఆర్పేసి చీకట్లో కూర్చుని చంద్రుడినీ, వెన్నెలనూ చూస్తూ కూర్చుంది.

సీతారాం తన పనులన్నిటినీ పూర్తిచేసుకొని దమయంతి కోసం ఎదురు చూస్తూ కూర్చున్నాడు. సీతారాంకు ఒక యుగం గడిచి వుండ వచ్చునని అనిపించిందపుడు. దమయంతి అడుగులచప్పుడు వినిపించింది. సీతారాంకు పుస్తకంమీది భక్తి ఎక్కువయింది. తలుపుకు వీపుపెట్టి చూచున్నాడు.

దమయంతి తలుపు దగ్గరే ఓ నిమిషం నిల్చుంది. సీతారాం పుస్తకంలో ఎంత లీనమై పోయాడోకూడా తెలుసు నామెకు.

"చాలాచదువు కుంటూన్నట్టున్నారు నే నెందుకు మధ్యలోపాడు చేయటం" అంటూ మంచంమీద పడుకుంది దమయంతి సీతారాం తన వైపు తిరిగి చూడలేదు.

"లైటుంటే నాకు నిద్రపట్టదు" అంటూ లైటార్పేసింది దమయంతి. చాలా కోపం వచ్చినవాడిలా వచ్చి మళ్ళీ దీపం వేశాడు సీతారాం. మళ్ళీ ఆర్పేసింది దమయంతి.

"ఇంకోమారు ఆర్పితే చూడు" అంటూనే దీపం వేశాడు.

"ఏం చేస్తారో అదీ చూడనే చూద్దాం" అంటూ మళ్ళీ ఆర్పేసింది దమయంతి.

"నీకు చనువెక్కువయి పోయింది" అంటూ సీతారాం భార్య చేతిని పట్టుకున్నాడు.

"ఎందుకమ్మాయి యింత ఆలస్యమయింది?"

"అదంతా మీకెందుకు? మీరు మాత్రం రోజూ ఆఫీసునుండి ఏడు గంటలకు ఇంటికి రావచ్చును. కాని నేను మాత్రం తొందరగా మీదగ్గరకు వచ్చేయాలా? ఇది మరీ బావుంది."

"నువ్వు వచ్చేవరకు నేనేంచేయను? నాకు విసుగ్గా వుంటుంది."

"మీరు ఆలస్యంగా వస్తే నాకు మాత్రం సంతోషంగా ఉంటుందా?"

"అబ్బ? ఎన్నెన్ని మాటలాడుతున్నావు? ఆరోజు ఎగ్జిబిషన్‌లో నీకు మాటలాడటమే రాదేమోనని భయపడ్డాను సుమా!"

"ఇంతకూ నా మాటకు జవాబివ్వరేం? మీరు ఇంటికి ఆలస్యంగా రావటం మాత్రం బాగుందా? మీరు వస్తే చాలని నాకు మాత్రం అనిపించదా?"

"నేనేం చెయ్యను? స్నేహితులు ఎక్కడికైనా లాక్కునిపోతారు."

"అవున్లెండి. నాకన్నా మీకా స్నేహితులే ఎక్కువ."

"'How to win your wife' అని ఒక పుస్తకం ఉంది. దాన్లో భర్త ఎప్పుడూ ఇంట్లో ఉండకూడదు. అలాఉంటే భార్యకతను ఎక్కడికైనావెడితే చాలునురాబాబూ అనిపిస్తుంది. భర్త ఇంటికొస్తేచాలు అని భార్య కనిపించాలట. అలా అయితేనే మీ భార్యను మీరు జయించ గలుగుతారు అని రాసుంది"

"ఇంతయినా మీ భార్యను మీరు జయించలేదు."

"ఓ నాకిది తెలియనే లేదు. అయితే..." దమయంతి నవ్వు వినబడింది సునందకు.

"అయ్యో సునంద మేలుకునే ఉందో ఏమో ఆమె గది తలుపులు తెరిచే ఉన్నాయి వదలండి బాబూ...."

"ఆమె గదిలో లైటు ఆరిపోయి చాలా సేపయింది."

గాజులు నిండిన చేతిని లాగిన చప్పుడు. తరువాత నిశ్శబ్దం ఆవరించింది.

"వెన్నెల చూశావా దమయంతీ ఎంత బావుందో? ఇలాంటప్పుడు కూడా నువ్వు ఆలస్యంగా వస్తే నాకు కోపం రాదూ?"

"కోపం రావటం న్యాయమే."

"ఆ చంద్రుడిని చూడు..."

"ఆ చంద్రుడిని దేనికీ చూడటం, మీరే నా చంద్రుడు..."

అన్నావదినల సంభాషణంతా సునంద చెవుల్లో పడుతూనే ఉంది. చీకట్లోనే లేచి తన గది తలుపులు వేసుకుని వచ్చి పక్కమీద పడు

తుంది.

"నా దీపం మీరే, నా దీపం మీరే."

ఆమె హృదయం తల్లికోసం వెతికే పసిపాపలా ఆక్రోశించింది.

"ఇంకెక్కడుంది నీ దీపం? దీపంలేని ఇల్లు నీది. దేవుడు లేని గుడి. సంతోషం లేని జీవితం......"

సునంద వెక్కి వెక్కి ఏడ్చింది. తమ ప్రేమలోకంలోనే విహరిస్తున్న అన్నా వదినలకు తన దుఃఖం తెలియకూడదని ఏడుస్తున్న శబ్దంకూడ పైకి రాకుండా ఏడ్చింది సునంద. అన్నా వదినల సుఖమయ దాంపత్య జీవితాన్ని చూసి సునందకు సంతోషం కలిగినా, ఆ సుఖం తనకు లేదన్న విషయం జ్ఞాపకాని కొచ్చి బాధ కలిగింది. ఎవరిని తన జీవన సర్వస్వమని భావించిందో, అతడినే మృత్యువు నోట పడేసి, పందొమ్మిదేళ్ళ వయస్సులోనే విరాగిణిలా జీవితాన్నంతా గడపవలసి రావటాన్ని చూసి సునందకు తన జీవితంమీద రోత పుట్టింది.

o o o

కాలేజీకి చేరాక సునందకు శాంతి లభించకపోయినా మునుపటిలా ఆలోచిస్తూ కూర్చోవటానికి తీరిక దొరికేది కాదు. కాలేజీలో చదువుకుంటున్న అబ్బాయిల ప్రవర్తన మరింత విసుగు పుట్టించింది. ఒక్కోమారు వాళ్ళ అసహ్య ప్రవర్తనను చూసి మహారాజా కాలేజీలో చేరకుండా మహారాణీ కాలేజీలో చేరితే బావుండుననిపించేది. అబ్బాయిల్లో కొంతమంది బుద్ధిగా తమ చదువు తాము చూసుకునే వారైనా కొంతమంది చాల అసభ్యంగా ప్రవర్తించేవారు. అందులోనూ అమ్మాయిలు కొంచెం అందంగా ఉంటే చాలు వారి గొడవ మరీ ఎక్కువయ్యేది.

సునంద అందమైన అమ్మాయి. తల్లిదండ్రులు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలలో పెంచిన అమ్మాయి కావటంతో ధైర్యంగా చురుగ్గా ఉండేది. క్లాసులోకి వెళ్ళాలంటే తానే ముందు ప్రవేశించేది. క్లాసులో లెక్చరర్స్ ఏమైనా ప్రశ్నలు వేస్తే లేచి నిల్చుని జవాబు చెప్పేది. అమ్మాయి కొంచెం గడుసుగా ఉండటం వల్ల రౌడీ కుర్రకారు తన గడుసుదనాన్ని వేరేవిధంగా అనుకున్నారు.

ఇలా అనుకున్నవారిలో శశిధరుడు ఒకడు. శశిధరుడి నాన్నగారు

మళవళ్ళిలో పెద్ద షావుకారు. కొడుకు బాగా చదివి పెద్ద ఉద్యోగం చేయాలని కాలేజీ హాస్టల్లో పెట్టి చదివిస్తున్నారు. తల్లి, తండ్రి దగ్గరలేక పోవడంతో అతడిని అదుపులో పెట్టి చూసుకునే వారెవరూ లేరు.

సునందకాలేజీలో చేరిన ఒకటిన్నర నెలలకు సునందను కాలేజీ నుండి ఇంటికి దిగబెట్టే బాధ్యతను గ్రహించాడు. సునంద దానిని గమనించలేదు. శశిధర్ ఆమె తరగతి విద్యార్థికాదు అతను యువరాజా కాలేజీలో సీనియర్ ఇంటర్ చదువుతున్నాడు.

సునంద కాలేజి హాస్టల్ దగ్గరకు వచ్చేవరకు ఉండి తరువాత ఆమెను అనుసరించేవాడు. ఆమె లేడీస్‌రూమ్‌లోకి వెళ్ళాక తనుక్లాసుకు వెళ్ళేవాడు ఓ పిరియడ్ ఖాళీగా ఉంటేచాలు, మహారాజా క్వాడ్రాంగిల్‌కే వచ్చేసేవాడు.

కొన్ని రోజులయ్యాక ఓ మెల్లకన్ను అబ్బాయి తన వెనకే అనుసరించి వస్తున్నాడని గుర్తించింది సునంద. తన్ను మాట్లాడించకుండా ఉంటే చాలు అనుకొని ఊరుకుంది.

ఓ రోజు సునందా, శ్రీదేవి కాలేజినుండి ఇంటికి వస్తూండగా, వారినే అనుసరించి వస్తున్న శశిధర్ అకస్మాత్తుగా వేగం హెచ్చించి సునంద చేతికి తన చేతిని తగిలించి వేగంగా వెళ్ళిపోయాడు. సునంద ఉలిక్కిపడింది. అయినా మళ్ళీ ఏదో తొందరగా వెడుతుంటే తగిలింది గాబోలునని ఊరుకుంది.

కాని ఇలాంటి సంఘటనలు మళ్ళీ మళ్ళీ జరగటమే కాకుండా శశిధర్ తన ముందు నుండి వెళ్ళేటప్పుడు ఏమేమో ప్రేలుతూ వాగడం మొదలెట్టాడు. ఇక ఊరుకోవడం మంచిది కాదని ఓ రోజు సీతారాంతో అతడి గురించి చెప్పింది.

"అన్నయ్యా, నీకో విషయం చెప్పాలి. కాని......"

"ఫరవాలేదు చెప్పు."

"కాలేజీ హాస్టల్‌లో ఓ అబ్బాయున్నాడు. వాడి పేరు నాకు తెలియదు. కాని నా వెనుకే వచ్చి భుజంమీదో వీపుమీదో కొట్టి వెళ్ళి పోతున్నాడు......"

సీతారాంకు చాలా కోపం వచ్చింది. చేతిలోని పుస్తకాన్ని పారేసి

"నాతో ఇంతకుముందే ఎందుకని చెప్పలేదు?" అన్నాడు.

"వాడై వాడే ఊరుకుంటాడని నేనేం చెప్పలేదు."

"నేను బుద్ధిచెపుతాను వాడికి" అని వెంటనే కోటు వేసుకొని కాలేజీ హాస్టల్‌కు వచ్చాడు. చెల్లెలు చెప్పిన గుర్తులనే కొంతమంది విద్యార్థుల ముందు వర్ణించేడు

"అతడెవరు, పేరేమిటి అతడిది, ఇప్పుడు హాస్టల్లో ఉన్నాడా?" అని అడిగాడు.

"ఇప్పుడు లేడు. మీరు రాత్రి గనుక వచ్చారంటే దొరుకుతాడు. నా గది పక్కగదే వాడిదీను" అన్నాడు ఓ అబ్బాయి.

సీతారాం వార్డన్‌గారి అనుమతి తీసుకుని రాత్రి మళ్ళీ శశిధరుడిని వెతుక్కుంటూ హాస్టలికి వచ్చాడు.

శశిధర్ భోంచేసి తన గదిలో అబ్బాయిల మధ్యలో కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నాడు. మెల్లకన్ను అబ్బాయి అని చెప్పడంవల్ల తేలిగ్గానే శశిధరుడిని గుర్తుపట్టగలిగాడు సీతారాం. అతడు గదిలోకి వెళ్ళగానే వాళ్ళ నవ్వులు ఆగిపోయాయి.

"ఎవరు కావాలండీ?" ఓ అబ్బాయి అడిగాడు.

"శశిధర్..."

"నేనే..." అంటూ ముందుకొచ్చాడు శశిధర్. సీతారాం వెంటనే అతడి షర్టుకాలర్ పట్టుకుని ఫెడేల్మని చెంపమీద కొట్టాడు. తెల్లబోయి నిలబడిపోయారు మిగిలిన వారందరూ.

"రాస్కెల్. ఎందుకని కొడుతున్నానో తెలుసునా? ఇంకోమారు నా చెల్లెలు జోలికొచ్చావంటే పళ్ళు రాలగొడతాను. నా చెల్లెలంటే ఏమనుకుంటున్నావ్?" అంటూనే మళ్ళీ ఇంకో రెండు దెబ్బలు వేశాడు. అవమానంతోనో లేక నొప్పితోనో అతడి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. శశిధర్ మౌనంగా నిల్చున్నాడు.

ఓ అబ్బాయి ధైర్యం తెచ్చుకొని అన్నాడు.

"పోనీండి, ఈ సారి వదిలెయ్యండి. మళ్ళీ ఇలాంటి పనులు చేయకుండా చూస్తాం."

"మళ్ళీ ఇలాంటి పనులు చేస్తే ప్రిన్స్‌పాల్‌తో చెప్పి

యూనివర్శిటీ నుండే బయటకు పంపుతాను ఏమనుకున్నావో."

"ఈ ఒక్కమాటికీ క్షమించండి..." అన్నాడెవరో అబ్బాయి.

"అలాగే, ఇంకో రోజు నా చెల్లెలి జోలికి వెళితే..." అంటూ అక్కడనుండి వచ్చేశాడు సీతారాం.

"వీళ్ళే మన భావిపౌరులు" అంది సునన్ద వ్యంగ్యంగా. మరునాటినుండి శశిధరుడి గొడవ తప్పిపోయింది. మరింకెప్పుడూ ఆమె జోలికి రాలేదు ఎప్పుడైనా ఎదురుపడ్డా తొందరగా వెళ్ళిపోయేవాడు. సునంద నిట్టూర్పు వదిలింది.

సునంద శశిధరుడి విషయాన్ని తన స్నేహితురాలు వసుమతితో చెప్పింది. వసుమతి ముందు నవ్వింది. కాని గంభీరంగా ఆలోచిస్తూ కూర్చుంది. సునంద వసుమతినే చూస్తోంది.

వసుమతి మంచి అందమయిన పిల్ల. మంచి పొడుగు. దానికి తగ్గ లావు. పొడవైన జడ. పసిమిఛాయ, మంచి పెద్ద పెద్ద కళ్ళు, చూసిన వారిని ఆకర్షించే రూపం ఆమెది. వసుమతి గంభీరంగా మొహం పెట్టటాన్ని చూసి సునంద "ఎందుకలా ఊరుకున్నావు? ఏమిటాలోచిస్తున్నావ్" అని అడిగింది.

"ఏం లేదు నీకో విషయం చెబుదామా వద్దా అని ఆలోచిస్తున్నా."

"ఏమిటది?"

"ఎవ్వరికీ చెప్పకూడదు. నామీద ఒట్టు."

"అలాగే చెప్పు."

"నువ్వు శశిధరుడి గురించి చెప్పావు కదా! వాడింకా విద్యార్థి కాలేజీలో కొంతమంది లెక్చరర్సే అలా ప్రవర్తిస్తున్నపుడు, మనం వాడినెందుకు తిట్టాలి?"

"లెక్చరర్సే!" ఆశ్చర్యపోయింది సునంద.

"అవును సునందా. నాకు ఆయన ప్రవర్తనను చూసి చాలా విసుగెత్తిపోయింది. కంచే లేచి చేను మేస్తే ఇంకేముంది చెప్పు!"

"కొంచెం వివరించి చెప్పు తల్లీ. చంపకు...."

"మనకు హిస్టరీ తీసుకుంటారు కదూ రాజారావ్..."

"[illegible]డే ఎం. ఏ. [illegible] వచ్చారు గదూ..."

"ఊం ఆయనే ఇప్పుడు రెండు నెలలుగా."

"ఓ మైగాడ్. అతడు చాలా తెలివిగల వాడంటారు."

"కావచ్చు, బాగా టీచ్ చేస్తారు కూడా. ఐతేనేమిటి వెధవ బుద్ధి ఇప్పుడో రెండునెలలుగా రోజూ ఆయన దగ్గర్నుండే ఒకటో రెండో ఉత్తరాలు వస్తూనే ఉన్నాయి. మొదట్లో కొన్ని చదివాను. తరువాత చదవకుండా పొయ్యిలో పడేస్తున్నా...."

"తమ పేరుతోనే ఉత్తరాలు రాస్తున్నారా?"

"లేదు."

"మరి నీకెలా తెలుసు ఆయనే రాస్తున్నారని?"

"అదో కథ. రెండు నెలలు క్రితం ఓ రోజు రాత్రి తొమ్మిది గంటలకు రాజారావు మా ఇంటికేవచ్చి "వెంకట్రావుగారి ఇల్లు ఇదేనా?" అని అడిగారు. "ఎవరిల్లు కావాలి" అని నాన్నగారు మళ్ళీ అడిగారు. ఆయన ఓ చీటీ ఇచ్చి "ఈ డోర్ నంబరు కావాలి" అంటూ "మీ ఇంటి. డోర్ నంబరు ఎంత" అని టార్చ్‌లైటుతో మా యింటి డోర్ నంబరు చూసుకుని వెళ్ళిపోయారు."

"ఎంత ధైర్యం!"

"ఆయనలా వచ్చిన వారానికి ఉత్తరాలు రావడం మొదలెట్టాయి. మొదటి ఉత్తరంలో ఎన్ని పేజీలున్నాయో తెలుసా?"

"ఎన్ని?"

"సరిగ్గా ముప్పై పేజీలు."

"దాంట్లో ఏమని వ్రాశారు?"

"నన్ను వర్ణించి రాశారా ఉత్తరం. నువ్వు ఎంతో బావున్నావు. ప్రపంచంలోని అందమయిన వాళ్ళందరూ కలిసినా నీ కాలిగోటికి సరితూగరు. నీ అంత అందంగా ఉన్న వారిని నే నింతవరకూ చూడనేలేదు. ఇకముందుకూడా చూడబోను. నువ్వు ఓ గులాబి పుష్పంలా ఉంటావు. నీ నవ్వు అలా ఉంటుంది ఇలా ఉంటుంది..."

"కవి కుమారుల్లా ఉన్నారు. చూడబోతే."

"నేను నిన్ను ఎంతగానో ప్రేమిస్తున్నాను. ఎంత అనికూడా

వర్ణించలేను. నిన్ను చూచిన రోజునే ప్రేమలో పడ్డాను. నన్ను కరుణించు."

"వసుమతీ, ఆయనకు నిజంగానే ఎవరి ఇంటి అడ్రసో కావలసి వచ్చారేమో. ఆయన వచ్చి వెళ్ళటమూ ఉత్తరాలు రావటమూ కాకతాళీయమేమో...."

"పూర్తిగా వినుమరి. ఆ తరువాత కొన్ని రోజులకు నాకు ఓ హిస్టరీ టెక్స్టుబుక్ పోస్టుద్వారా పంపారు. ఇప్పుడా ఉత్తరాలనిండా రాజారావు పొగడ్తే ఉంటోంది."

అంటే

తాము రాజారావ్ స్నేహితుడు అనేలా వ్రాస్తున్నారు. నా స్నేహితుడు రాజారావే గదూ మీకు హిస్టరీకి వస్తారు. ఆయన చాలా మంచి లెక్చరర్ కదూ. బాగా పాఠం చెబుతారు. నువ్వు ఆయన ఇంటికే వెళ్ళి పాఠం ఎందుకు చెప్పించుకోకూడదూ? నువ్వు పాఠం చెప్పించుకుంటే నీకు బి. ఏ.లో ర్యాంక్ రావచ్చును. నీకు వాళ్ళింటికి వెళ్ళడానికి ఇష్టం లేకపోతే ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు వెళ్ళి ఏమేం పుస్తకాలు చదవాలో ఆయన్నే సలహా ఎందుకని అడగరాదూ? ఆయన......"

"ఈ ఉత్తరాలు రాస్తున్నది రాజారావు స్నేహితుడే కావచ్చును."

"పోనీ అలాగే అనుకుందాం అయితే రాజారావుని పొగడటం వల్ల ఈ ఉత్తరాలు రాసేవాడికేం లాభం? ఇప్పుడు నన్ను ప్రేమిస్తున్నది ఉత్తరాలు రాస్తున్నవాడేగాని రాజారావ్ కాదుగా? అలాంటప్పుడు తన్నుతాను పొగుడుకోవాలిగాని రాజారావ్‌ని కాదు."

"అదీ నిజమే."

"ఇప్పుడు కొన్నిరోజులుగా ఇంకోవిచిత్రం. ఇప్పుడు నాన్న గారికే ఉత్తరాలు రాయడానికి మొదలెట్టారు. ఆ ఉత్తరాల్లో వసుమతి చదువుతున్న కాలేజీలోనే హిస్టరీ లెక్చరర్ రాజారావ్ అని ఉన్నాడు. అతడు చాలా మంచివాడు. అందగాడు. అతడినే ఎందుకు మీ అల్లుడిగా చేసుకోకూడదు? అలాంటి అల్లుడు దొరకాలంటే మీ రెంతో పుణ్యం చేసుకుని ఉండాలి. రాజారావుకు కట్నం అక్కర్లేదు. మీ అమ్మాయిని

పువ్వుల్లో పెట్టి పూజిస్తాదు..."

"ఎందరో మహానుభావులు...పాపం నిన్ను చూసి పిచ్చెక్కి-నట్టయింది. నిన్ను చూసి ఆడవాళ్ళే ప్రేమిస్తారు. అలాంటిది అతనలా పడి చావటంలో ఆశ్చర్యమేముంది? పూర్ ఫెలో! అతడిని చూస్తే నీకే మనిపిస్తుంది?"

"ఆయన పాఠం బాగా చెప్తారు. అలా అనే ఇంతవరకూ గౌర వించేదాన్ని కాని..."

"ఇప్పుడు?"

"ఇప్పుడాయన కనీసం తలెత్తి చూడటానికయినా తగిన మనిషి కాదనిపిస్తుంది. ఒట్టి పిరికిపంద. ఏ మాత్రం పౌరుషమున్నా పేరు పెట్టి రాసేవారు తన పేరుతో ఉత్తరం రాయటానిక్కూడా భయం. ధైర్య ముంటే ఎదుటికి వచ్చి "ఐ లవ్ యూ డార్లింగ్" అని చెప్పమను. ఇష్టముంటే 'సరే' అనే దాన్ని. లేకపోతే నాకిష్టం లేదనేదాన్ని. దాంతో అంతా అయిపోయేది. అలా కాకుండా కనీసం తన పేరన్నా వేసు కోకుండా ఈ ఉత్తరాలూ..."

"అంటే నీకాయనమీద అసహ్యం ఉందంటావ్?......"

"ఒక్క అసహ్యమే కాదు. జుగుప్స, కోపం, ద్వేషం అన్నీ వున్నాయి. ఇప్పుడే నా కళ్ళెదుటే ఉరిపోసుకుని చచ్చిపోయినా సరే ఆ కోతిని మాత్రం నేను పెళ్ళిచేసుకోను. ఇష్టం వచ్చినన్ని ఉత్తరాలు రాసుకోమను. చివరికి విసుగెత్తి ఆయనే మానేస్తారు..."

"ప్రిన్సిపాలుగారికి ఆయన ఉత్తరం చూపితేనేం?" అని అడి గింది సునంద.

"అసలు అలా చూపితే స్కాండల్ అవుతుంది నాకది ఇష్టం లేదు. అదీకాకుండా ఆయన కెరియర్ నాశనమవుతుంది. ఏదో దౌర్బ ల్యానికి లోనయి రాస్తున్నాడు. దానికి ఆయన జీవితాన్ని పాడుచేయటం దేనికి? గమనించనట్టుగా ఊరుకుంటే పోతుంది అనుకుని ఊరుకున్నాను. కాలేజీలో తలెత్తి నావైపు చూడటానికికూడా ధైర్యంలేని పిరికిపంద."

"లెక్చరర్సే ఇలా ఉంటే స్టూడెంట్సు పరింకెలా ఉంటారు? గురువుగారి అడుగుజాడల్లోనే నడుస్తున్నారు. మీ నాన్నగారేమంటు

న్నారు?"

"ఏమీ చెయ్యకుండా ఊరుకుందామన్నారు. ఓ రెండేండ్లు నీకు రాస్తాడు. తరువాతింకెవరైనా అందంగా ఉండే అమ్మాయివస్తే ఆ అమ్మాయికే రాస్తాడు. పెళ్ళయ్యేవరకు ఇలాగే కాలం గడిపి తరువాత పెళ్ళానికి భయపడి ఊరుకుంటాడు అన్నారు."

సునంద మౌనం వహించింది. వసుమతే మళ్ళీ అడిగింది.

"ఈ రోజు సీనియర్ బి. ఏ. అమ్మాయిల కేమయిందో తెలుసా?"

"ఏమయింది?"

"సీనియర్ బి. ఏ. అమ్మాయిలందరూ మాట్లాడుకుని తెల్లచీరలు కట్టుకుని వెళ్ళారట మధ్యాహ్నానికి వాళ్ళు కూర్చునే బెంచీల మీదంతా ఎర్రసిరా..."

"ఛీ ఇక చెప్పకు తల్లీ వినలేకపోతున్నాను."

"వీళ్ళే భావి పౌరులు సునందా. స్వతంత్ర భారతంలోని ప్రజలు ఏ విధంగా అభివృద్ధి చెందుతున్నారో చూడటానికి ఈ ఉదాహరణ చాలదూ? ఈ విద్యార్థి రేపు ఓ స్త్రీ భర్త అవుతాడు. తండ్రిస్థానం అందుకుని తన పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దుతాడు... షేమ్."

"సరస్వతీ మందిరంలో విద్యాభిలాషతో వచ్చిన భక్తులువీరంతా" అంది వ్యంగ్యంగా సునంద.

"ఎలాగైనా ఏదవనీ, కాస్సేపు దేవుడిని ధ్యానంచేస్తే పుణ్యం వస్తుంది."

కొంచెంసేపు పాఠాల గురించి మాట్లాడుకొన్నారిద్దరూ. తరువాత చీకటి పడుతోందని సునంద ఇంటికి వెళ్ళటానికి లేచింది.

"చీకటి పడింది. ఒంటరిగా వెళ్ళకు సునందా. నాన్నగారు వచ్చి ఉంటే ఆయన్ని తీసుకుని ఇంటిదగ్గర దిగబెట్టేసి వస్తాను." అంటూ లోపలికి వెళ్ళింది వసుమతి. కొంచెం సేపట్లోనే తండ్రితోబాటు బయటికి వచ్చింది. సునందను ఇంటిదగ్గర దిగబెట్టి మళ్ళీ వెళ్ళిపోయారు వసుమతీ, ఆమె తండ్రీ.

దమయంతి భర్తకోసం ఎదురుచూస్తూ తలుపుదగ్గరే నిల్చుంది.

"లోపలికి రండి వదినా. అన్నయ్యవస్తే ఇంట్లోకి రాకుండా ఎక్కడకి వెళతాడు" అంది సునంద.

"ఉదయం భోంచేసి వెళ్ళారు...."

"హోటల్లో కాఫీ, టిఫిన్ తీసుకునే ఉంటాడు."

సుందరమ్మగారు కూడా కూతుర్ని సమర్థిస్తూ, "నేను ఎంత చెప్పినా వినటం లేదు చూడు సునందా. వాడు ఎక్కడైనా టిఫిన్ తీసుకునే ఉంటాడు. నువ్వు కాఫీ, టిఫిన్ తీసుకో అని ఎంత చెప్పినా "ఆయన్ని రానివ్వండి" అని అలాగే ఉండిపోయింది" అన్నారు.

"ఎందుకు వదినా ఇలా చేస్తున్నారు...."

సునంద ఇక మాట్లాడలేకపోయింది. తన గొంతును ఎవరో నొక్కి పెట్టినట్టుగా అయింది తొందరగా మేడపైకి వెళ్ళి తన గదిలో తలుపులు వేసుకుని కూర్చుంది.

తనకు పెళ్ళయిన కొత్తలో అత్తవారింటికి వెళ్ళినప్పుడు ఓ రోజు శేఖరం ఇంటికి రావడం ఆలస్యమయింది. అత్తగారు, మామగారు ఎంతమంది చెప్పినా శేఖరం వచ్చేంతవరకూ భోంచేయనని అలాగే ఉండిపోయింది. శేఖరం ఇంటికి వచ్చాక, "ఎందుకలా కాచుక్కూర్చున్నావ్ సునందా? నువ్వు భోంచేస్తే సరిపోయేదిగా" అన్నాడు.

"మీరు అలాగే అంటారు. కాని మీరు లేకుండా నేను భోంచేయలేను."

కాని ఇప్పుడో? శేఖరం లేకుండానే జీవితం గడిచిపోతోంది. అతడిని చూడకుండా, అతడి మాటలు వినకుండా, అతడి ప్రేమను పొందకుండానే కొన్ని నెలలు గడిచిపోయాయి. శేఖరం లేకుండా తను జీవించలేదు అనే అనుకుంది సునంద. అతడు చనిపోయిన మరుక్షణమే తనూ చనిపోవచ్చుననుకుంది సునంద. కాని సునంద చావలేదు. ఆత్మహత్య చేసుకోవాలన్న కోరిక చాలామార్లు పుట్టినా ధైర్యం చాలలేదు. శేఖరం చనిపోయాక తను నవ్వటం అసాధ్యం అనుకున్న సునంద తరువాత చాలా మార్లు నవ్వింది.

ఇప్పుడంతా మునుపటిలాగానే ఉంది. పెళ్ళికిముందు సునంద కాలేజీకి వెళ్ళేది. ఇప్పుడూ అలానే వెడుతోంది. శేఖరం స్వప్నంలోలా

ఆమె జీవితంలో ప్రవేశించి కొన్ని రోజులు ఆమె మనస్సును తనదిగా చేసుకుని కలలాగానే కరిగిపోయాడు.

భవిష్యత్తును గురించిన ఆలోచనలతో సతమత మయిపోతోంది సునంద. బి. ఏ. అయ్యాక ఏం చేయటం? బి. టి. కి వెళ్ళడం, తరువాత టీచ రవడం, పాఠాలు చెప్పుకుంటూ ఉండడం. ఎన్ని రోజులు? ఈ జీవితం అయిపోయేవరకు.

జీవితమంతా ఇంతేనా?

"సునందా...." అంటూ సుందరమ్మగారు కిందనుండి పిలిచారు.

సునంద తన యోచనా సముద్రంనుండి బయటపడి కిందకు దిగి వచ్చింది. సీతారాం ఇంటికి వచ్చి బట్టలు మార్చుకుని భోజనానికి కూర్చున్నాడు.

"దమయంతీ, సీతారాంలతోనే నువ్వూ భోంచేసెయ్యమ్మా."

"నా కాకలిగా లేదు నేను నీతోనే చేస్తానమ్మా..."

"ఫరవాలేదు రా సునందా" అంటూ సీతారాం పిలిచాడు.

"ఒద్దుబాబూ మీరు భోంచెయ్యండి, అమ్మతోబాటు చేస్తాను."

అన్నా వదినల కబుర్లకు మధ్యలో తను పానకంలో పుడకలా వెళ్ళి కూర్చోవటానికి ఇష్టపడేది కాదు సునంద. సీతారాం, దమయంతి ఎక్కడికి బయల్దేరినా సునందను పిలిచేవారు. కాని ప్రతిమారు సునంద ఏదో ఒక సాకు చెప్పి తప్పించుకునేది.

సినిమాకో, షికారుకో బయల్దేరినప్పుడు సునందను నిర్భయంగా పిలిచేది దమయంతి. ఆమె రానంటే బలవంతం చేసేది. కాని పేరంటానికి వెళ్ళేటప్పుడు సునందను పిలవటానికి జంకేది. సుందరమ్మగారికి చాలా బాధగా ఉండేది. విధవకు పసుపు, కుంకుమా, పూలు పెట్టుకునే హక్కు లేదని సుందరమ్మగారనుకోలేదు. "ఆడపిల్లలు పెళ్ళి అయ్యాకనే పూలూ, బొట్టూ పెట్టుకుంటారా? పూలూ బొట్టూ పెట్టుకొనే హక్కు స్త్రీకి పుట్టుకతోనే ఉంది" అని అభిప్రాయపడేవారావిడ. భార్య చనిపోయాక భర్త సామాజిక ధార్మిక జీవితాల్లో ఏ మాత్రం మార్పు లేనప్పుడు, వితంతువు వద్దనుండి చిన్న వయస్సులోనే భర్తను పోగొట్టుకున్న స్త్రీ దగ్గరనుండి అంత పెద్ద త్యాగాన్ని నిరీక్షించే హక్కు సమాజానికి

లేదని వాదించారామె. అయినా పేరంటానికి వెళ్ళేటప్పుడు పిలిచే సాహసం వచ్చేదికాదావిడకు. కష్టపడి అడుగుదామని ప్రయత్నిస్తే నోట్లోమాట పెగిలేది కాదు. సునంద కిష్టం వస్తే తల్లి, వదినలతో కలిసి వెళ్ళేది. ఇష్టం లేకపోతే "నేను రానమ్మా" అని చెప్పేది. అలాంటప్పుడు సుందరమ్మగారు రమ్మని బలవంతం చేసేవారు కాదు. సునంద అక్కడినుండి వెళ్ళిపోయాక "నాలుగూ చూసి సంతోషంగా తిరగాల్సిన పిల్ల ముసల్దానిలా ఇంట్లో ఉంటే నన్నెలా రమ్మన్నావ్ దమయంతీ" అంటూ ఏడ్చేవారు. దమయంతికి ఏడుపు వచ్చేది. అత్తగారిని ఎలా ఓదార్చాలో తోచక తనూ ఓ మూలన కూర్చునేది. సునంద పేరంటానికి రావటానికి ఇష్టపడకపోతే ఇంట్లో ఎవరూ వెళ్ళేవారుకాదు.

సునంద చాలా సూక్ష్మమతి అని సుందరమ్మగారు ఆమెతో మాట్లాడటానికి కూడా భయపడేవారు. ఏం మాట్లాడితే ఏ మర్థం చేసుకుంటుందోననే ఆమె భయం. అందువల్ల 'అలా చెయ్యి' 'ఇలా చేయి' అని చెప్పేవారే కాదు. "అంతా ఆమె ఇష్టం" అని ఊరుకునేవారు. సీతారాం మాత్రం సునంద విరక్తిగా గాని వైరాగ్యంతో కాని మాట్లాడినప్పుడు చెల్లెలిమీద కోపం చేసుకునేవాడు.

ఓ మారు ఏదో పండక్కి సీతారాం చెల్లెలికి భార్యకి ఒకేరకం వెలగలవి సిల్కు చీరలు తెచ్చాడు.

సునంద తన చీరచూసి "ఇది నాకెందుకన్నయ్యా తెచ్చావ్? సిల్కు చీరలు కట్టుకుని నేనేం సుఖపడాలి" అంది.

"సునందా, ఇంకోరోజు నా ముందు ఇలాంటి మాటలనకు" అని కఠినంగా మందలించాడు సీతారాం. సునందను మందలించి, తిట్టే ధైర్యం సీతారాంకు మాత్రమే ఉంది. సునందక్కూడా తల్లి, తండ్రీ, వదినా వాళ్ళ దగ్గరలేని చనువు, ఆప్యాయత అన్నయ్య దగ్గరుండేవి. తల్లితో కూడా చెప్పని విషయాలు అన్నయ్యతో చెప్పేది. తల్లిదండ్రులను కూడా తన దుడుకు మాటలతో నొప్పించేసేది సునంద. కాని అన్నయ్య మనస్సు నొప్పించడానికి భయపడేది.

కాలేజీలో సాయంకాలాలు జరిగే సమావేశాలకు కూడా సునంద వెళ్ళేదికాదు. మునుపటిలా తనకు స్నేహితులుకూడా అక్కర్లేదని

పిస్తోంది. ఇంతకు ముందు ఎంత మంది స్నేహితులున్నా తృప్తిగా ఉండేదికాదు. ఇప్పుడు కాలేజీలో వసుమతి తప్ప ఇంకెవరూ స్నేహితురాళ్ళేలేరు. మునుపటిలా కబుర్లు, మంచి సినిమాలు, రుచికరమైన ఆహారం, అందమైన దుస్తులు ఏమీ అక్కర్లేదు. పుట్టినందుకు తప్పక జీవించాలి. జీవించటానికి ఇంత అన్నం, కట్టుకోవటానికి రెండు చీరలు కావాలి. ఇంతకన్నా జీవితంలో ఇంకేమీ అక్కర్లేదన్న స్థితికి వచ్చింది సునంద.

జీవితంలో ఆకర్షణలు, సంతోషాలను విస్మరించి సునంద జూనియర్ బి.ఏ. ను ముగించింది.

దమయంతి పుట్టింటికి వెళ్ళింది. ఆమె రాకకోసమే ఉత్కంఠతో ఎదురు చూస్తున్నాడు. సుందరమ్మగారికి, రావుగారికి అందరికన్నా ఉత్సాహంగా ఉంది. దమయంతి మళ్ళీ వచ్చేటప్పుడు ఓ కూతురినో, కొడుకునో తీసుకుని రావటం వాళ్ళందరికీ సంతోషం కలిగించేవిషయం కాదా? మనుమడికి స్వాగతం ఇవ్వటానికి అన్ని ఏర్పాట్లూ చేసుకున్నారు

కాలేజీలు మళ్ళీ తెరవటానికి కొన్ని రోజులు ముందు దమయంతి కొడుకు నెత్తుకుని అత్తవారింటికి వచ్చింది.

సునందకు ఓ చిట్టి స్నేహితుడు దొరికాడు. కాలేజీలేని సమయంలో దినకరుడితో ఆడుకుంటూ కాలం గడిపేది.

ఈ మధ్యలోనే వసుమతి పెళ్ళి నిశ్చయమైంది. సునందకు తరువాత ఏమాత్రం తీరిక చిక్కేదికాదు. దినకరుడిని ఎత్తుకుని వసుమతి ఇంటికి వెళ్ళి, ఆమెను అల్లరి పెట్టి వచ్చేది సునంద. ఓ రోజు దినకరుడిని తీసుకుని వాళ్ళింటికి వెళ్ళినపుడు సునంద అడిగింది;

"వసూ, కాలేజీలో లెక్చరర్స్ అందరికీ ఇన్విటేషన్ ఇస్తావా?"

"ఆఁ అందులోనూ ఒకరికి తప్పకుండా ఇస్తాను" అంది కొంటె నవ్వుతో వసుమతి.

"పాపం? తరువాత గుండె పగిలి చస్తాడు."

"దానికి నేనేంచేయను? నేనేమో మనకొచ్చే లెక్చరర్స్ అందరికీ స్వయంగా ఇన్విటేషన్ ఇద్దామనుకుంటున్నా. అంతే నువ్వు ఇస్తే

నేను నీతోబాటు వస్తానంతే."

"రాజారావుకి పోస్టుద్వారా పంపేద్దాం వసూ, మళ్ళీ ఆయన ఏడుపు మనం ఎందుకూ చూడటం..."

వసుమతి కోపంతో అంది "ఆయన నన్నెంత ఏడిపించారో నీకేం తెలుసు. నేను ఆయన ఏడుపును చూసి తీరాల్సిందే" అంది.

సునంద మౌనం వహించింది.

వసుమతికి ఐ. ఏ. యస్. పరీక్ష పాసయి ఇన్‌కంటాక్స్ ఆఫీసరుగా బెంగుళూరిలో ఉద్యోగం చేస్తున్న అబ్బాయి దొరికాడు. అతను కూడా చూడటానికి చాలా అందంగా ఉన్నాడు. అతడు పెళ్ళి చూపులకు వచ్చిన రోజు సునంద కూడా వాళ్ళింటికి వెళ్ళింది. అబ్బాయిని చూసింది సునంద. వసుమతి ఆ రోజున ఆ కోతి మొహాన్ని చేసుకోనన్నమాట జ్ఞప్తికి వచ్చింది. ఈడూ జోడూ చక్కగాకుదిరింది, అనుకుంది సునంద.

వజ్రాన్ని బంగారంలో పొదిగితేనే అందం. ఇత్తడిలో పొదిగితే ఏం బావుంటుంది అనిపించింది సునందకు.

శుభలేఖలు ప్రింటయి రాగానే వసుమతి తన స్నేహితుల, లెక్చరర్స్ పేర్లన్నీ రాసి పెట్టింది. సునంద కాలేజీలో అందరికీ ఇచ్చింది. లేడీస్ రూమ్‌లోని అమ్మాయిలకందరికీ ముందు ఇచ్చారు. అందరూ వసుమతిని అభినందించారు.

"ఫరవాలేదు. ఐ. ఏ. ఎస్. చేసిన అబ్బాయే దొరికాడు వసుకు."

"సునందా వసుమతి వుడ్‌-బి. ఎలా ఉంటారు..."

సునంద, వసుమతి చాలా చాలా ఫ్రెండ్సయినందువల్ల సునంద వసుమతి కాబోయే భర్తను తప్పక చూసే ఉంటుందని తీర్మానించేశారమ్మాయిలు.

"నన్నడిగితే ఏం లాభం? వసుమతినే అడగండి."

"చెప్పు వసుమతీ..."

వసుమతి సిగ్గుతో తలవంచుకుంది. "నాకు తెలీదు పొండి" అంది చిరుకోపంతో.

"పోనీ మన అమ్మాయికి తగిన అబ్బాయేనా?" ఇంకెవరో అడిగారు.

"ఊఁ వసుమతి శ్రీవారు చాలా హ్యాండ్‌సమ్‌గా ఉంటారు." సునంద చెప్పింది.

"లక్కీ గర్లు...." అంటూ అభినందించారు అందరూ.

బెల్లు కొట్టారు. వసుమతికి బదులు సునంద లెక్చరర్స్ కందరికీ శుభలేఖలు ఇచ్చింది. ఇక రాజారావుకు ఇవ్వడం మాత్రం మిగిలింది. హిస్టరీ పీరియడ్‌లో ఇద్దామని అలాగే ఉంచేసిందా శుభలేఖను. హిస్టరీ పీరియడ్‌లో అమ్మాయిలందరూ వెళ్ళి క్లాసులో కూర్చున్నారు. సునంద, వసుమతి సీనియర్ బి. ఏ. హాలు తలుపు దగ్గరే నిలబడ్డారు.

రాజారావు తలుపు దగ్గరకు రాగానే సునంద ఓ అడుగు ముందుకు వేసి 'సర్' అంది. ఆయన ఆగిపోయారు. సునంద పుస్తకంలోనుండి కవరుతీసి రాజారావు చేతికిచ్చింది. ఆయన కవరులోనుండి శుభలేఖను తీసి చదివారు. వెంటనే ఆయన మొహం పాలిపోయింది. మొహమంతా చెమట పోసింది. జేబులోనుండి కర్చీఫ్ తీసుకుని మొహమంతా తుడుచుకుని 'చాలా సంతోషం' అన్నారు తడబడతూ.

"తప్పకుండా రావాలి మీరు" అంది వసుమతి.

"అలాగే" అని ఆయన క్లాసులోకి వచ్చారు. ఆయన వెనుకనే సునంద, వసుమతి కూడా క్లాసులోకి వచ్చారు. వసుమతి పెళ్ళిగురించి తెలిసిన అమ్మాయిలు బోర్డుమీద పెద్దగా 'కంగ్రాచ్యులేషన్స్' అని రాశారు.

రాజారావు కుర్చీమీద కూర్చునే 'అటెండెన్సు' తీసుకున్నారు. తరువాత ఓ పది నిమిషాలు పాఠం చెప్పారు.

"ఇవ్వాళ నాకేం వంట్లో బాగాలేదు. నేను తీసుకోనీ అవర్" అనేసి వెళ్ళిపోయారు.

ఇంటికి వెళ్ళేటప్పుడు సునంద అడిగింది.

"ఇప్పుడు తృప్తిగా ఉందా అమ్మాయిగారికి?"

"ఎందుకో ఆయన మొహం చూస్తే అయ్యో పాపం అనిపించింది సునందా. అయినా ఒట్టి శుంఠలా ఉత్తరాలు రాయటం మాత్రం తప్పు."

"ఒప్పు అని ఎవరన్నారు?"

"ఆయన అనుకుని ఉంటారు. ఉత్తరాలు రాసింది తనేనన్న

విషయం నాకు తెలియదని. ఆయన ఇన్ని రోజులు నన్ను బాధ పెట్టిం దానికి ఒక్క నిమిషంలో కసి తీర్చుకున్నాను నేను."

"నువ్వు చాలా చెడ్డదానివి వసూ."

"ఊహుం లేకపోతే అతడిలాగే నేనూ ఉత్తరాలు రాసి, ఇంద్రుడు చంద్రుడు అని పొగిడి ఆయన్నే వరించాల్సింది. అప్పుడు మంచిదాన్నయే దాన్ని... సినిమాల్లో చూసి నేర్చుకుని ఉంటారు."

"శాంతించుతల్లీ. నీకింత కోపం వస్తుందనుకోలేదు నేను."

వసుమతి పెళ్ళిరోజున చాలా ఉత్సాహంతో తిరిగింది సునంద. పెళ్ళికి రెండు రోజులు ముందునుండీ వసుమతి ఇంట్లోనే ఉండిపో యింది. పెళ్ళి చాలా వైభవంగా జరిగింది. వసుమతి క్లాస్ మేట్సందరూ కలిసి హృదయపుటాకారంలో ఉన్న వెండి పళ్ళెంకొని ప్రెజెంట్ చేశారు. అంత హడావిడిగా ఉన్నా వసుమతి సునందను పిలిచి "సునందా సాయంకాలం రిసెప్షన్‌కు రాజారావు వస్తారో లేదో చెప్పు" అంది.

"చాలా అల్లరి పిల్లవు తల్లీ నువ్వు. ఆ ప్రాణినెందుకనవసరంగా టార్చర్ చేస్తావు? అకస్మాత్తుగా వస్తే?"

"వస్తే మా దగ్గరకు పిల్చుకుని రా. నేను ఈయన్ను పరిచయం చేస్తాను. మా శ్రీవారు ఎంత హ్యాండ్‌సమ్‌గా ఉన్నారో తెలుస్తుంది. రాజారావులాంటి అల్లుడు దొరకాలంటే పూర్వజన్మలో పుణ్యంచేసి ఉండాలట. హుం"

అంతలో వసుమతి చెల్లెలు కల్యాణి వస్తూ "పిలుస్తున్నారు" అంది. వసుమతి మాటలాపి చెల్లెలితో లోపలకు వెళ్ళింది.

సాయంకాలం రిసెప్షన్ చాలా బాగా చేశారు.

ఓ పెద్ద సంగీత కచేరిని ఏర్పాటు చేశారు వసుమతి స్నేహితులు. లెక్చరర్స్ అందరూ వచ్చారు. కాని రాజారావు రాలేదు. సునంద వసుమతి చెవిలో 'రాజారావు రాలేదు' అన్నప్పుడు వసుమతి 'మొహం చూపించే ధైర్యం ఎక్కడుంది' అని వెక్కిరించింది.

♦ ♦ ♦

సునంద పరీక్షలు ఓ మాదిరిగా రాసింది. ఫస్టుక్లాస్ వస్తుందన్న ఆశ లేకపోయినా సెకండుక్లాస్ వస్తుందన్న నమ్మకం ఉంది.

దినకరుడి అల్లరి రోజు రోజుకూ ఎక్కువవుతోంది. ఇంతక్రితం ముందు నడవటం చేతకాకపోవడంవల్ల కూర్చున్న చోట్లోనే అల్లరిచేసేవాడు. ఇప్పుడు నడక నేర్చుకుంటున్న దినూ ఒక్క నిమిషంకూడా ఊరుకునేవాడే కాదు. దేన్నిపట్తే దాన్నే తీసి కింద పడేసేవాడు. అలా నడవటంలో కిందపడి ఏడిచి ఇంట్లోవాళ్ళందర్నీ గాభరాపెట్టేవాడు. ఇంట్లోవాళ్ళందరికీ అతడిని అల్లరి చేయకుండా చూసుకోవడమే ఓ పెద్ద పనయిపోయింది. దమయంతికి వాడిని చూసుకోవటంలో ఒక నిమిషం తీరికకూడా చిక్కటంలేదు. దమయంతి సీతారాం ఇంటికి రాగానే దినకర్‌ని భర్త కప్పగించేది.

"ఈపని ఇక మీరే చూసుకుని నన్ను రిలీవ్ చెయ్యండి" అని కూర్చునేది. దినకర్ ఓ రెండు నిమిషాలు నాన్న తొడమీద కూర్చుని తరువాత లేచి రేడియో రిపేర్ చేయటానికి మొదలెట్టేడు. సీతారాం దినూ, దినూ, అని పిలిచి కొడుకు తన పనిలోనే నిమగ్నుడయి తన వైపుకు తిరగక పోవడంతో భార్యతో "వాడిని కొంచెం అటువైపు తీసుకోకూడదూ" అని అడిగేవాడు.

"ఉదయంనుండీ వాడిని చూసుకొని నాకు విసుగెత్తింది. ఇక మీరూ మీ అబ్బాయీ ఏమైనా చేసుకోండి."

"నేనూ ఆఫీసులో పనిచేసి అలసిపోయి వచ్చాను. ఆ క్లయంట్సుతో మాట్లాడి మాట్లాడి చాలయింది...."

"సునందా, సునందా..."

సునంద బయటనుండి "ఏం వదినా?" అంటూ వచ్చేది.

"మీ అల్లుడిని కొంచెం ఇక్కడినుండి తీసుకుని వెళ్ళండి. మీ అన్నయ్యతో అర్జంటుగా దెబ్బలాడాలి."

"ఏమిటన్నయ్యా, ఎప్పుడూ వదినతో దెబ్బలాడుతూనే ఉంటావు? ఇప్పుడు దేన్ని గురించిబాబూ యీ దెబ్బలాట?"

"నీ అల్లుడి గురించే తల్లీ!"

"ఇంట్లో దినూను చూస్తే మీ కెవ్వరికీ ఇష్టమేలేదు. రా దినూ, మనిద్దరం అల్లల్లా వెడదాం" అంటూ సునంద దినకరుడిని తీసుకుని అక్కడనుండి వెళ్ళిపోయేది.

సీతారాం కళ్ళు మూసుకుని సోఫామీద అలాగే పడుకునేవాడు. దమయంతి ప్రేమతో, జాలితో అతడివైపు చూసేది. అలసిపోయిన అతని మొహాన్ని చూసి అయ్యో అని బాధపడేది. నెమ్మదిగా లేచి అతడి పక్కనే కూర్చుని నుదుటిమీద చెయ్యివేసి "చాలా అలసటగా వుందా?" అని మృదువుగా అడిగేది.

సీతారాం మాట్లాడకుండా తన నుదుటిమీదనున్న చేతిని పట్టుకునేవాడు. అక్కడికి వారి దెబ్బలాట పరిష్కారమయ్యేది.

ఓ రోజున సునంద దినకరుడిని తీసుకునిపోయిన రెండు నిమిషాలకే అల్లుడి బూట్లను వెతుకుతూ అన్నా వదినలున్న గదిలోకి వచ్చింది.

సీతారాం, దమయంతి తొడమీద తల పెట్టుకుని పడుకున్నాడు. దమయంతి అతడిని చిన్నపిల్లలను జోకొట్టి పడుకోబెట్టినట్టు జోకొడుతోంది.

సునంద నిమిషం ఏమీ తోచకుండా అలాగే నిలబడిపోయింది. తరువాత తేరుకుని నవ్వుతూ, "ఇదేనా మీ అర్థంటు దెబ్బలాట?" అంది.

సీతారాం లేవకుండానే "చూడు సునందా దినూ వచ్చాక మీ వదిన నాగురించి పట్టించుకోవడమేలేదు. నా స్థానాన్నంతటినీ వాడే ఆక్రమించాడు. అందుకే ఈరోజు దెబ్బలాడి నాప్లేస్ నేనే తీసుకుంటున్నా" అన్నాడు.

దమయంతి మొహం ఎర్రబడింది. కాని నవ్వుతూనే "ఉదయం నుండి పసిపాపాయిని చూసుకొన్నాను. ఇక ఈ పాపాయిని చూసుకోవాలి" అంది.

"వదినా దినూ బూట్లు ఏవి ? నాకెక్కడా కనిపించలేదు."

సీతారాం లేచి బూట్లు వెతికి ఇచ్చాడు. సునంద తీసుకుని బయటకు వచ్చింది.

అన్నా వదినల మధుర దాంపత్య జీవనం తనకు చాలా తృప్తినిచ్చింది. కాని...కాని తన జీవితం ? ఆమె జీవిత పుష్పం వికసించకుండానే వాడి రాలిపోయింది. ఇరవయ్యొక్క సంవత్సరాలకే జీవిత సౌఖ్యాలనుండి వంచింపబడింది. ఆమె వయస్సులోనే ఉన్న అమ్మా

యిలు చాలామందికి పెళ్ళి కాలేదు. వాళ్ళందరూ అమ్మాయిలే. కాని కాని సునంద?

దినకర్ సునంద ముందు నిలబడి 'బూచి, బూచి' అంటూ కాళ్ళు చూపుతున్నాడు. సునంద బూట్లు చేతిలో పట్టుకుని ఎక్కడో చూస్తోంది. దినకర్ కొంచంసేపు అలాగే నిల్చుని తరువాత తనే బూట్లు వేసుకుని, వెళ్ళిపోయాడు. సునంద లేచి తన గదికి వెళ్ళిపోయింది.

♦ ♦ ♦

సునంద సెకండ్‌క్లాసులో బి. ఏ. పాసయింది. ఇప్పుడు వసుమతి కూడా ఊళ్లో లేకపోవటంవల్ల సునందకు స్నేహితురాళ్ళే లేరు. అన్నయ్యా, తండ్రుల సలహా ప్రకారమే సునంద బి. టి కి అప్లికేషన్ వేసింది. బి. టి కాలేజీలో సీటు దొరకడం కష్టమయినా రెకమండేషన్ల ప్రభావంవల్ల సునందకు సీటు దొరికింది.

బి. టి కాలేజీ విచిత్రంగా కనిపించింది సునందకు. పద్దెనిమిదేళ్ళవారి దగ్గరనుండి ఇంకేం రిటైరయ్యే వయస్సులో ఉన్న వృద్ధుల వరకూ అందరూ బి. టి. విద్యార్థులే.

బి టి. విద్యార్థులు ప్రాక్టికల్ కోసం మహారాణీ హైస్కూలికి వెళ్ళాల్సి వచ్చేది.

సునంద మొట్టమొదటివారు ప్లాట్‌ఫారం ఎక్కినప్పుడు నిలువెల్లా వణికిపోయింది. వర్డ్స్‌వర్తు డ్యాఫోడిల్స్‌పద్యాన్ని ఫోర్త్‌ఫారం విద్యార్థినులకు టీచ్ చెయ్యాలి తను. ఎదురుగుండా కూర్చుని తన్నే చూస్తున్న విద్యార్థినులను చూసి కళ్ళు తిరిగాయి. టేబుల్‌ను గట్టిగా పట్టుకుని ఎవర్నీ చూడకుండా గోడనే చూస్తూ పాఠం చెప్పడం మొదలెట్టింది. మొట్టమొదట మాటలు పెగల్లేదు. తరువాత కూడా తన కంఠం ఏదో మారిపోయి నట్లనిపించింది. ఓ పది నిమిషాలకు తన గొంతును తన అదుపులో పెట్టుకోగలిగింది వణకటంకూడా తగ్గింది బెల్లు కొట్టినపుడు నిట్టూర్చి క్లాసులోనుండి బయటకు వచ్చింది

సునంద ఇంటికి రాగానే సుందరమ్మగారు అడిగారు.

"సునందా క్లాసు ఎలా ఉందమ్మా? ఉదయం చాలా భయపడ్డావు కదా?"

"మొదట్లో కొంచెం భయం వేసిందంతే. తరువాత అలాగే సరి పోయింది."

రాత్రి భోజనాల సమయంలో తండ్రి, అన్నయ్యా అందరూ అడిగారు.

"ఎలా పాఠం చెప్పావు? భయపడలేదుకదా?"

సునంద ధైర్యంగానే ఉందని తెలిసి సీతారాం సంతోషపడ్డాడు. ఆ తరువాత ఇంకెప్పుడూ సునందకు భయం వేయలేదు. పోను పోను టీచర్ ఉద్యోగం సునందకు చాలా నచ్చింది. తన్ను జ్ఞాపకం పెట్టుకున్న అమ్మాయిలు దోవలో ఎక్కడైనా కనపడితే-

"నమస్కారం టీచర్" అనేవారు.

వాళ్ళలా అన్నప్పుడు సునందకు చాలా సంతోషం వేసింది. కాని ఒక్కొక్కప్పుడు భరించలేని బాధకూడా కలిగేది.

"నా జీవితమంతా ఇంతేనా? అయ్యో!" అని రోదించేదామె హృదయం.

మహారాణి హైస్కూల్లో క్లాసు తీసుకోవాల్సిన రోజున ఉదయం నుండి హడావిడి పడేది. ఆమె ఫోర్త్ ఫిఫ్త్‌ఫారంల క్లాసులు మాత్రమే తీసుకునేది. ఇంగ్లీషు, హిస్టరీ, సివిక్సులను మాత్రమే టీచ్ చెయ్యాలి.

జీవితంలో విషాదాలనుండి దూరంగా ఉన్న ఆ ముగ్ధహృదయుల సాన్నిధ్యంలో శాంతి దొరికేది సునందకు. 'టీచర్, టీచర్' అంటూ తన చుట్టూ వాళ్ళు తిరుగుతూంటే చాలా సంతోషపడేది.

అమ్మాయిల్లో సునందకన్నా పెద్ద పిల్లలు కూడా ఉన్నారు. వాళ్ళందరూ చిన్నపిల్లల్లా అల్లరిచేస్తూ హాయిగా ఉన్నారు. జీవితంలో ఓ పెద్ద దెబ్బతిన్న సునందను మాత్రం ఎక్కడలేని గాంభీర్యం పెద్ద తనం ఆవరించింది.

ఇంటాబయటా కూడా సునంద పెద్ద దానిలా, బరువు తనమీద వున్నదానిలా, ఇప్పుడో అప్పుడో అంటున్న ముసల్దానిలా ప్రవర్తించేది. ఇలాంటి గాంభీర్యం తనకు నప్పదని తెలిసికూడా తన ప్రవర్తనను మార్చుకోలేదు.

అన్నా, వదినా, దినూ అప్పుడప్పుడూ సినిమాలకు వెళ్ళేవారు. అన్నయ్య మరీ బలవంతంచేస్తే సునందకూడా వెళ్ళేది. ఓమారు 'కోవాడీస్' సినిమాకు నలుగురూ వెళ్ళారు. దినకర్, ఓ పదినిమిషాలు సినిమా చూసి తరువాత దమయంతిని "అమ్మా...ఇంటికి పోదాం..." అంటూ గొడవ చేయసాగాడు.

దమయంతి బిస్కట్లు బిళ్ళలు ఇచ్చింది. వాటిని తినేసి మళ్ళీ మామూలు గొడవే ఎత్తాడు. చుట్టుపక్కలున్నవారు వీళ్ళనే చూశారు. సునంద వెంటనే దినకరుడిని తీసుకుని బయటికి వచ్చి బాల్కనీలో వున్న బొమ్మల్ని చూపింది. వాడు ఏడుపు ఆపాక లోపలికి తీసుకుని వచ్చింది. చీకట్లో మళ్ళీ గొడవ పెట్టసాగాడు. మళ్ళీ దినూ నెత్తుకుని సునంద బయటికి రాబోతున్నపుడు దమయంతి ఆమెను ఆపింది.

"మీరు కొంచెం సినిమా చూడండి. నేను బయటికి తీసుకొని వెడతాను" అంది. కాని సునంద ఒప్పుకోకుండా తనే దినూను తీసుకుని బాల్కనీలోకి వచ్చింది. ఇలా అయి ఓ అరగంటకూడా సినిమా చూడలేకపోయింది సునంద. ఇంటికి వచ్చేటప్పుడు దమయంతి సునందతో "చాలా మంచి సినిమా, ఈ వెధవల్ల మీరేం చూడలేక పోయారు. నేనే బయటికి తీసుకుని వెడతానంటే మీరొప్పుకోలేదు...." అంది

సునంద తృప్తితో "మీరు చూస్తే నేను చూసినట్టే అయింది" అంది. సీతారాం కామాట విని చాలా బాధ అనిపించింది.

ఇలా మాట్లాడాల్సిన వయస్సా సునందది. నువ్వు చూస్తే నేనూ చూసినట్టే, నువ్వు తింటే నేను తిన్నట్టే అని అనాలంటే తన కెంత బాధగా ఉందో!

సీతారాం నిట్టూర్చాడు. అతడి హృదయం బాధతో మూలిగింది. అతడి భుజంపైన తల పెట్టుకుని నిద్రపోతున్న దినకర్ "అత్తయ్యా... దీపాలూ..." అంటున్నాడు...

దమయంతి నవ్వి "నిద్రలో కూడా మీ అల్లుడు మిమ్మల్నే తల్చుకుంటున్నాడు చూడండి" అంది.

సునంద తనకు తెలియకుండానే విరాగిణిగా మారటం ఆమె తల్లిదండ్రులకు చాలా బాధగా ఉంది. ఓ రోజు సునంద ఇంట్లో

లేనప్పుడు సుందరమ్మగారు కొడుకుతో "సీతారాం, సునంద ఎందుకిలా అయిపోతోందో తెలియటం లేదు. తనకు జీవితంలో ఆసక్తిలేనేలేదు. దీనికి ఏం చేయటం?" అన్నారు.

"నేనూ అదే నీతో మాట్లాడదామనుకుంటున్నానమ్మా. కాని మన మెవ్వరం ఆమెకు చెప్పలేం."

"సునంద ఇలా ఉంటే నేనెలా జీవించను?"

సీతారాం ఏం మాట్లాడలేదు. తన ఆలోచనల్లో నిమగ్నమయి పోయినట్టే కనపడ్డాడు.

"అమ్మా, నాకో మార్గం కనపడుతోంది. కాని నువ్వు ఒప్పుకుంటావో లేదో!"

"ఏమిటది?"

"సునందకు ఇంకో పెళ్ళెందుకని చేయకూడదు?"

"ఏమిటి? ఇంకో పెళ్ళా?"

"అవునమ్మా ఎందుకని చేయకూడదు? సునంద ఇంకా చిన్నపిల్ల. పిల్లల్లేరు. తనూ నలుగురిలా జీవిస్తే మంచిదేగా."

"కాని...నలుగురూ ఏమంటారు?"

"సరి, నలుగురూ ఇప్పుడు తన దుఃఖాన్ని పోగొట్టగలరా? మగవాళ్ళు రెండు మూడు పెళ్ళిళ్ళు చేసికోవచ్చును కదా! అలాంటప్పుడు ఆడది మళ్ళీ పెళ్ళిచేసుకుంటేనేం? దాన్లో తప్పేముంది? విధురుడు అన్ని సుఖాలను అనుభవించి మళ్ళీ పెళ్ళి చేసుకోవచ్చును. ఆడది చేసుకుంటే తప్పేమిటి? తనూ ఓ రక్త మాంసాలున్న మనిషే కదా..."

సుందరమ్మగారికి కొడుకు అభిప్రాయం నిజమేననిపించింది.

"మరి మీ నాన్నగారేమంటారో?"

"నాకు ఆయనదేం బెంగలేదమ్మా. నువ్వు ఒప్పుకుంటావో లేదోనని భయపడ్డాను. నువ్వు ఒప్పుకున్నాక నాన్నగార్ని ఒప్పించటం కష్టమేం కాదు."

"కాని సునంద..."

"ఊఁ తనదే కొంచెం కష్టం. సునంద దగ్గర ఈ విషయమెత్త

దానిక్కూడా భయం నాకు. సునంద ఈకాలప్పిల్ల, చదువుకున్నదే. సనాతన సంప్రదాయాల్ని లెక్కపెట్టదు. ఐనా ఆమెతో ఈ విషయం చెప్పేంత ధైర్యం లేదు నాకు."

"సూక్ష్మంగా సూచిస్తే?"

"ఊహుఁ వద్దు, ఆమె ఏమన్నా అపార్థం చేసుకుంటే మరింత కష్టం."

"దమయంతి చేత చెప్పిస్తే?"

"అదేం బావుండదు. నువ్వు, నేను, లేకపోతే నాన్నగారు మనలోనే ఎవరైనా చెప్పాలి. పిల్లి మెడలో గంట కట్టే వారెవరన్నట్లుగా ఉంది మన పరిస్థితి. ఇప్పుడసలు ఈ మాటే ఎత్తొద్దు. పరీక్షలు దగ్గర కొచ్చాయి. శ్రద్ధగా చదవనీ — తరువాతెప్పుడైనా వీలునుబట్టి చెపుదాం."

కొడుకు మాటలకు సుందరమ్మగారంగీకరించారు.

పరీక్షలు దగ్గరకు రావటంతో తన బాధలను మరిచి శ్రద్ధగా చదువుకోవటానికి మొదలెట్టింది. దినకరుడికి అత్తయ్యమీద బోలెడు కోపం వచ్చింది. అత్తయ్య తనతో ఆడుకోకుండా ముప్పొద్దులా చదవటాన్ని చూచి గొడవపెట్టేవాడు. వాడిని ఓదార్చి గదినుండి బయటికి పంపేటప్పటికి సునంద తల ప్రాణం తోకకు వచ్చేది.

పరీక్షలయి పోయాయి. పరీక్షలో పాసవుతుందన్న నమ్మకం ఉంది.

పాసయ్యాక? ఇంకేముంది. ఏదయినా హైస్కూల్లో ఉద్యోగానికి ప్రయత్నించాలి. అందుకు నిశ్చయించుకుంది సునంద. జీవితం గడపటానికోసం ఉద్యోగం చెయ్యనక్కర్లేకపోయినా సన్మార్గంలో కాలం గడపటానికి టీచరు పని ఓ సాధనం. పనీ పాటా లేకుండా ఇంట్లో కూర్చుని బాధ పడటం కన్నా స్కూలుకి వెళ్ళి పాఠం చెప్పుకుని జీవితపు బాధలను మరవడం మంచిది కదూ?

సునంద ఉద్యోగం చేయటానికి బాపుగారు ఒప్పుకున్నా, సుందరమ్మగారు సుతరాము ఒప్పుకోలేదు.

"సునంద కష్టపడి సంపాదించి ఎవర్ని పోషించాలి? మాసిన

వాళ్ళేమంటారు. తినడానికి కట్టుకోవడానికి ఉన్నాగాని కూతురిచేత ఉద్యోగం చేయిస్తున్నారేమిటా అనిసవ్వరూ" అని వాదించారావిడ.

తల్లిమాటలు విని సీతారాం "ఉద్యోగం చేయటం నీచమైన పనా అమ్మా? మన వైపున ఆడ పిల్లలు ఉద్యోగం చేయటమే తప్పు అని ఎందుకనుకోవాలి? యూరోపియనులలో సాధారణంగా ఏ ఆడదీ ఇంట్లో గోళ్ళు గిల్లుటుంటూ కూర్చోదు. చదువయిపోగానే ప్రతి ఆడ పిల్లా ఏదో ఒక ఉద్యోగంలో చేరి తన కాళ్ళమీద తాను నిలబడుతుంది. మనదేశంలో ఒక్క మగవాడి సంపాదనమీద పదిమంది బ్రతుకుతారు. అందువల్లే పేదరికం తప్పదు మనకు..."

"మనం ఇప్పుడు పేదరికంతో బాధపడి పోవటం లేదుగదా?"

"దేవుడి దయవల్ల అలాంటి బాధ మనకు లేదు. కాని పనీపాటా లేకుండా, తన జీవితానికే ధ్యేయమన్నది లేకుండా సునంద కాలం ఎలా గడపాలి?"

"నువ్వనేది నిజమేననుకో!"

"ఉద్యోగంలో చేరితే నువ్వేమీ అడ్డు పెట్టకమ్మా. సునందను బాగా ప్రోత్సహించి ఈ తన పనిలో బాగా శ్రద్ధ తీసుకునేలా చూద్దాం."

"మీ ఇష్టం" అన్నారు సుందరమ్మగారు.

సునంద బి. టి. పరీక్షల్లో పాసయింది. సీతారాం చెల్లెలి పరీక్ష రిజల్ట్సు చూసుకుని రావటానికి వెళ్ళాడు. అతడు ఇంటికొచ్చేటప్పటికి సునంద స్నానంచేసి తల దువ్వుకుంటోంది.

"సునందా.. సునందా..." అంటూ హడావిడిగా పిలిచాడు.

"సెకండ్ క్లాస్ వచ్చింది సునందా.... కంగ్రాట్స్" అంటూ మేడమీదికి వచ్చాడు.

"ప్యాసయ్యాను కదా, నేనో పేపరు పాడుచేశాను."

"టిఫిన్ ఎప్పుడు ఇప్పిస్తావ్?"

"టిఫిన్ కేముటిలే! తాతతో చెపితే ఇప్పుడేం కావాలన్నా తెచ్చిస్తారు."

"అలా వద్దు, చిన్నగా ఓ పార్టీచేసి నీకు కావలసిన వాళ్ళందర్నీ నువ్వు పిలు. నాకు కావలసిన వాళ్ళను నేను పిలుస్తాను. ఏం?"

"బి. టి. ఏం మహా పెద్ద పరీక్షని అంత గ్రాండ్‌గా పార్టీ ఇవ్వా అన్నయ్యా? నాకేం ఇష్టం లేదు బాబు. ఇంట్లోని వాళ్ళం మనం చాలు."

"అదికాదు సునందా. ఈ మధ్యనే నా కొకరి పరిచయమయింది. అదో రకమయిన మనిషి. ఇంటికి రమ్మంటే వస్తానంటూనే ఉన్నాడు. కాని రానేరాడు. ఇప్పుడు ఆయన్నెందుకని పిలవకూడదూ?"

"ఏం ఉద్యోగం చేస్తున్నారు?"

"ఆయనా అడ్వొకేటే. ఈ సంవత్సరమే లా పాసయివచ్చాడు. నేను జూనియర్‌గా పనిచేసినవారిదగ్గరే ఆయన పని నేర్చుకున్నాడు."

"కాని నా కెవర్నీ పిలవటం ఇష్టం లేదన్నయ్యా!"

"నా ఇద్దరు ఫ్రెండ్స్‌ని నేను పిలుస్తాను. నీ ఫ్రెండ్స్‌ని నువ్వు పిలు ఈ ఒక్కమారు."

సునందకి ఇష్టం లేకపోయినా అన్నయ్య మాటను కాదనలేక పోయింది.

మర్నాడు నాలుగ్గంటలకు టీపార్టీ ఏర్పాటు చేశారు. సునంద తన స్నేహితురాలు మీనాక్షిని మాత్రం పిలిచింది. వసుమతి ఊళ్ళోలేదు. మూడుగంటలకు సీతారాం సునంద దగ్గరకొచ్చి "సునందా అంతా రెడియేనా" అని అడిగాడు.

"ఊ!"

"నువ్వు?"

"నాదేముంది? నేను ఇప్పుడు రెడీగానే ఉన్నాను."

సీతారాం చెల్లెలివైపు చూశాడు. సునంద ఓ నూలుచీర కట్టుకుని ఉంది.

సీతారాం మందలింపుగా "సునందా, ఇంటి కొచ్చేవారి ముందు ఎలా ఉండాలో నేను నీకు చెప్పాలా? కొంచెం నీటుగా" అన్నాడు.

"నీమాట వినేవరకూ ఊరుకోవుగదా."

"బాగా ముస్తాబవమని చెప్పటంలేదు. కాని కొంచెం స్మార్టుగా."

"సరేలే. స్మార్టుగా డ్రెసప్ అవుతానుగాని నువ్వు క్రిందికి వెళ్ళు బాబూ."

సీతారాం కిందికి వెళ్ళిపోయాడు. సునంద తెల్లటి సిల్కు చీర, ఎర్రటి అంచుకొంగు ఉన్నది కట్టుకొని ఎర్రటి బోర్డర్ ఉన్న తెల్లటి సిల్కు జాకెట్టు వేసుకుంది. జడ వేసుకుని పూలు పెట్టుకుని బొట్టు పెట్టుకుంటున్నపుడు సీతారాం క్రిందనుండి "సునందా, నీ ఫ్రెండు...." అంటూ పిలిచాడు.

సునంద తొందరగా మేడదిగివచ్చింది. మీనాక్షి సుందరమ్మ గారితో మాట్లాడుతోంది. దమయంతి టేబుల్ మీద గాజు గ్లాసులో నీళ్ళు నింపి పెడుతోంది. దినకర్ దమయంతి కొంగు పట్టుకొని తిరుగు తున్నాడు

నాలుగ్గంటలకు సరిగ్గా సీతారాం స్నేహితులు వచ్చారు. తన స్నేహితులను తల్లి, తండ్రి, భార్యకు పరిచయంచేసి సునందను పిలిచి వాళ్ళను పరిచయం చేశాడు.

"వీరు విజయేంద్ర..."

"నమస్తే"

"ఈయనే శ్రీధర్...ఈ మధ్యనే వీరితో పరిచయమయింది. ఈమె నా చెల్లెలు సునంద."

"నమస్తే"

"ఈమె నా చెల్లెలి స్నేహితురాలు మీనాక్షి"

అందరి పరిచయం చేశాక నోట్లో వేలు పెట్టుకుని కొత్తవారిని ఆశ్చర్యంతో చూస్తున్న దినకరుడిని ఎత్తుకుని పైకెగరేసి మళ్ళీ పట్టుకుని "వీడు మా సంసార సామ్రాజ్యపు డిక్టేటర్" అన్నాడు.

విజయేంద్ర నవ్వుతూ "డిక్టేటర్ మహాశయులకు నమస్కారం" అన్నారు.

సీతారాం కొడుకువైపుకు తిరిగి "నమస్తే చేయి బాబూ" అన్నాడు.

డిక్టేటర్ మహాశయులు నమస్తే చెప్పే మూడ్‌లో లేకపోవడంతో సీతారాం నమస్కారంచేసి కొడుకుచేతిలో నారింజపండు పెట్టి రంగడి చేతికిచ్చి బయటకు పంపాడు.

టేబుల్‌కు ఒకవైపున రావుగారూ, సుందరమ్మగారు, దమ

యంతి, మీనాక్షి కూర్చున్నారు. ఇంకో వైపున సీతారాం, శ్రీధర్, విజయేంద్ర కూర్చున్నారు. దమయంతి భర్త వైపు తిరిగి "సునంద?" అంది.

"ఆవిడ గా రివాళ మనకు సర్వ్ చేస్తారు...."

సునంద లోపలికి వెళ్ళి తాత అమర్చిపెట్టిన ప్లేట్లను తీసుకుని వచ్చి అందరి ముందు పెట్టింది.

"మీరూ కూర్చోవచ్చుగా" అన్నాడు విజయేంద్ర.

"అవును నువ్వూ కూర్చో సునందా" అన్నాడు సీతారాం. సునంద వదిన, మీనాక్షుల మధ్య కూర్చుంది.

రావుగారు, విజయేంద్ర ఏదో మాట్లాడుకుంటూ కూర్చున్నారు. సీతారాం అందరితోనూ మాట్లాడుతూ తింటున్నాడు. మీనాక్షి సంకోచంలో కూర్చోవటం చూసి "టిఫిన్ తినేటప్పుడు సిగ్గుపడ కూడదు" అన్నాడు.

మీనాక్షికి సీతారాంవద్ద చనువున్నా అతని స్నేహితులుండటం వల్లనే చాలా సిగ్గుపడింది. సీతారాంని తను చిన్నపిల్లగా ఉన్నప్పటి నుండి చూస్తూనే ఉండటంవల్ల అతను తమ ఇంట్లోని వాడేనన్న భావన ఉండేది.

శ్రీధర్ కూడా మీనాక్షిలాగే మౌనం వహించాడు.

"ఇదేమిటి శ్రీధర్ అలా కూర్చున్నారు? సునందా, అతిథులు తింటున్నారో లేదో చూడటం నీ బాధ్యత..."

సునంద తలెత్తి మీనాక్షిని పలకరించింది.

తన ఎదురుగుండా కూర్చున్న శ్రీధర్‌తో "సంకోచపడకండి. కేసరీ భాత్ కావాలా? తాతా కేసరీ భాత్ తెండి" అంది.

శ్రీధర్ తలెత్తి సంకోచంతో "ఏమీవద్దు" అన్నాడు.

తాత అందరికి వడ్డించి వెళ్ళిపోయాడు. కాఫీ టిఫిన్ అయ్యాక విజయేంద్ర సిగరెట్ ప్యాకెట్ తీసి ముందు రావుగారికివ్వబోయాడు.

"నాకు వద్దు బాబూ" అన్నారాయన. శ్రీధర్ కూడా సిగరెట్ వద్దన్నాడు. సీతారాం మాత్రం ఒక సిగరెట్ తీసుకుని "థ్యాంక్స్" అని చెప్పి దమయంతి వైపుచూశాడు అంతమంది ముందు భర్తనేమీ

అనలేక ఊరుకుంది దమయంతి. ఆమెకు కోపం వచ్చిందని గ్రహించి "టేబుల్ మ్యానర్స్ కోసం తీసుకున్నాను. ఈ ఒక్కరోజు క్షమించు ప్లీజ్" అన్నాడు.

విజయేంద్ర ఆశ్చర్యంతో "ఏమయిందిప్పుడు?" అన్నారు.

"ఏం చెయ్యను బాబూ. సిగరెట్టు కాల్చకూడదని నాచేత ప్రామిస్ చేయించుకుంది. ఏదో దౌర్బల్యానికి లోనై ఒప్పుకున్నాను. ఎందుకా మాట ఇచ్చానా అనిపిస్తోందిప్పుడు. సిగరెట్టు ఊపిరితిత్తులను నాశనం చేస్తుందని ఆవిడ బాధ. ఒక్క సిగరెట్టువల్ల ఏమీ నష్టం ఉండదు కదూ, విజయ్."

"అవును కాని మీ శ్రీమతి కిష్టం లేనప్పుడు ఎందుకు తీసుకుంటారు?"

"తీసుకున్నానుగా ఫర్వాలేదు లెండి!" అంటూ సిగరెట్టు ముట్టించాడు సీతారాం. రావుగారూ, సుందరమ్మగారు లోపలికి వెళ్ళిపోయారు. సునంద కిళ్ళీలు తెచ్చి వదినకూ, మీనాక్షికి ఇచ్చి మిగిలిన మూడింటినీ సీతారాం ముందు పెట్టింది.

"నువ్వే ఇవ్వమ్మా?"

సునంద విజయేంద్ర కిచ్చి శ్రీధర్ కివ్వబోతే "క్షమించండి. నేను కిళ్ళీ వేసుకోను" అన్నాడు.

విజయేంద్ర "అవునమ్మా. వాడిని క్షమించండి. కిళ్ళీ వేసుకోడు. సిగరెట్టు ముట్టుకోడు. సినిమాచూడడు. సిగరెట్టు పీల్చని, కిళ్ళీ వేసుకోని జీవితం ఏం జీవితం శ్రీధర్?" అన్నారు.

"నాకు అలవాటు లేదు."

"తాత చాలా బాగా చుడతాడు. వేసుకొని చూడండి" అంటూ అతడి ముందు కిళ్ళీ పెట్టింది. మౌనంగానే కిళ్ళీని నోట్లో వేసుకున్నాడు.

"కిళ్ళీ ఎలా ఉంది శ్రీధర్?"

"బావుంది."

కొంచెంసేపు అందరూ మాట్లాడుతూ కూర్చున్నారు. తరువాత విజయేంద్ర లేచి "నాకో అర్జంటు పని ఉంది. వెళ్ళాలి. మీ నాన్నగారేరి?" అన్నాడు. సీతారాం అతడిని లోపలకు తీసుకుని వెళ్ళాడు. వెళ్లొస్తానని

రావుగారితో చెప్పి బయటకు వచ్చి సునందతో "మీరు పాసవటం చాలా సంతోషకరమైన విషయం" అని చెప్పి వెళ్ళిపోయాడు. సీతారాం అతడిని గేటువరకూ దిగబెట్టి రావటానికి వెళ్ళాడు. మీనాక్షి విజయేంద్ర కన్నా ముందే వెళ్ళిపోయింది. దమయంతి దినకర్ ఇంటికి రావటంతో వాడిని తీసుకుని మేడెక్కింది.

శ్రీధర్, సునంద మౌనంగా కూర్చున్నారు. శ్రీధర్ చాలా సంకోచ స్వభావుడు కావటంచేత అక్కడే ఉన్న ఓ పుస్తకాన్ని తిరగ వేస్తూ కూర్చున్నాడు. ఇక ఆ మౌనాన్ని భరించలేక సునందే మాట్లాడింది.

"మీరు ఎల్. ఎల్. బి. ఎక్కడ చదివారు?"

"బొంబాయి."

"అన్నయ్యకూడా అక్కడే చదివాడు."

"అవునట. అలా అని ఆయనే ఓ రోజున చెప్పారు."

మళ్ళీ మౌనం ఆవరించింది. సునంద మాటలకోసం వెతుక్కుంటూండగా సీతారాం లోపలికి వచ్చాడు.

"ఏమిటి శ్రీధర్ మౌనంగా కూర్చున్నారు. సునంద రాయినైనా మాట్లాడించేస్తుంది, అలాంటి మిమ్మల్ని అలా వదిలేయటం మీ పుణ్యం..."

"నీకేదో ఒకటనకపోతే తోచదా అన్నయ్యా?"

"మంచి మాటల్లోనే నన్ను ఓ రాతికి పోలుస్తున్నారు. కానివ్వండి ఏం చేస్తాం" అన్నాడు శ్రీధర్.

"ఇంకా ఇప్పుడు నయం సునందా. మొదట్లో శ్రీధర్ నోరువిప్పే వారే కాదు. అంతా నేనే మాట్లాడాల్సి వచ్చేది...."

"ఎవరైనా ఒకరు మాట్లాడాలి. ఇద్దరూ మాట్లాడితే వినే వాళ్ళెవరు?"

"నన్నే ఒక వాగుడుడబ్బా అంటారు కదా మీరు, ఇక సునంద మాట్లాడితే ఏమంటారో?"

"అనటానికేముంది, అప్పుడూ వినే పాత్ర నాదే."

సునంద కిలకిలమని నవ్వింది.

"అన్నయ్యా నిన్ను మాటల్లో ఓడించేవారే లేరనేవాడిని. కాని ఇప్పుడు?"

"నే నసలు మాట్లాడనే మాట్లాడను. సీతారాం మాట్లాడి ఆఖరికి ఓడిపోతారంతే."

"మీరు నాకు విరుద్ధంగా ఎన్ని చెప్పినా నాకన్నా మించి పోలే రనే అనుకుంటోంది సునంద. కావాలంటే దమయంతి నడగండి."

"వదిన్ని పిలవనా అన్నయ్యా" అని అడిగింది సునంద.

"ఉహూ, ఈరోజు వద్దు" నేను సిగరెట్ పీల్చానన్న కోపంమీద ఉంది. నాకు విరుద్ధంగా మాట్లాడుతుంది రోజున. నేను చీరగాని జాకెట్టు గుడ్డగాని తెచ్చిన రోజున అడగండి."

మాటలమధ్యలో ఎంత టైము గడిచిందో గమనించలేదు వాళ్ళు. వారిలో సీతారాం ఎక్కువగా మాట్లాడాడు. శ్రీధర్, సునంద చాల కొద్దిగా మాట్లాడారు.

ఏడుగంటలు కొట్టగానే శ్రీధర్ ఇంటికి వెళ్ళటానికి లేచాడు.

"ఇక వెడతాను. మీరు పరిచయమవటం చాలా సంతోషకర మయిన విషయం."

"అప్పుడప్పుడూ వస్తూండండి."

"మీ రిలాగే టీ పార్టీలు ఇస్తూంటే నేనూ వస్తూంటాను."

సీతారాం, శ్రీధర్ తలుపుదాకా వెళ్ళారు. సునంద టేబుల్‌మీద ఉన్న కర్చీఫ్‌ను తీసుకుని "అన్నయ్యా" అంది ఇద్దరూ వెనుదిరిగారు.

"కర్చీఫ్ మరిచిపోయారు."

సీతారాం చెల్లెలి చేతినుండి కర్చీఫ్ తీసుకుని శ్రీధర్ కిచ్చాడు.

"మరచిపోయాను" అంటూ జేబులో దాన్ని పెట్టుకుని వెళ్ళి పోయాడు సీతారాం. అతడిని పంపివచ్చాక సునంద అంది.

"మీ స్నేహితుడికి చాలా సిగ్గులా ఉంది."

"సిగ్గూలేదూ. యేమీలేదు. బాగా పరిచయమయ్యేవరకూ అలా ఉంటాడు అంతే. తరువాత చక్కగా మాట్లాడతాడు. చాలా మంచి వాడు."

"విజయేంద్ర వచ్చారు గదా ఆయనా...?"

"కొంచెం దుడుకుగా మాట్లాడుతారు గాని స్వభావం మంచిది" అని సీతారాం చెబుతూండగానే దమయంతి గదిలోకి వచ్చింది. ఆమె రావటాన్ని చూసి సీతారాం మళ్ళీ అన్నాడు.

"నా స్నేహితులందరూ మంచివారే కాని అందులో ఒకరుమాత్రం కొంచెం చెడ్డవారు. నేను సిగరెట్టు పీలిస్తేనే ఇంత కోపం చేసుకుంటా రని ముందే తెలిస్తే నేనసలు పెళ్ళి చేసుకునేవాడినే కాదు..."

దమయంతి చటుక్కున గదిలోనుండి బయటకు వెళ్ళిపోయింది. సునంద నవ్వుతూ "వదిన చాలా కోపంగా ఉన్నట్టున్న దన్నయ్యా" అంది.

"దమయంతి కోపాన్ని మాయం చేయట మెంతసేపు? దినకరు డినీ, దమయంతినీ, ఒక్క నిమిషంలో నవ్వించగలను" అంటూ భార్య ననుసరించి మేడమీదికి వెళ్ళాడు.

వారిద్దరూ కిందకు వచ్చేటప్పటికి దమయంతి మొహం ప్రస న్నంగా ఉంది. అన్నయ్య అన్నది నిజమేననుకుంది సునంద. అయినా వదిన్ని ఏడిపించాలని, "ఏం వదినా అప్పుడే సంధి కుదిరిపోయిందా" అంది చిలిపిగా.

"మరింకేం చేయమన్నావ్ సునందా? నేను కోపంగా ఉన్నప్పు డల్లా దీనంగా మొహం పెట్టుకుని నా వెనకే తిరుగుతారు. అలా దీనంగా ఉంటే జాలేస్తుంది. అందుకని నన్ను నేనే సమాధానపర్చు కోవాల్సి వస్తుంది అంతే."

"సునందా! నేను కాలేజీలో చదివేటప్పుడు మంచి నటుడనని పేరు సంపాదించిన విషయంచెప్పకు. చెబితే నాదంతావట్టి నటన అనుకో గలదు. దాన్ని మాత్రం రహస్యంగా ఉంచు" అన్నాడు సీతారాం చెల్లెలితో.

"దీనమైన మొహాన్ని చూసి నేనేం కరిగిపోవటం లేదు. నా కోపం పోయిందని చెప్పేవరకూ మీరు నన్నేపనీ చేసుకోవటానికి వదలరు. అందుకని...."

అన్నా వదినల ప్రణయకలహాన్ని చూసి నవ్వుతూ నిల్చుంది సునంద. భార్యాభర్త లిద్దరూ అన్యోన్యంగా ఉండే కాపురాలు చాల

ళ్ళాద్దిగానే ఉంటాయి. భార్య సరిగ్గా ఉంటే భర్త సరిగ్గా ఉండదు. భర్త బావుంటే భార్య సరిగ్గా ఉండదు. ఇద్దరూ సరిగ్గా ఉంటే తనలాగే ఎవర్నో ఒకర్ని పోగొట్టుకోవాలి. విధి మనుష్యులు సంతోషంగా ఉంటే చూసి ఓర్చుకోలేదేమో. అన్నా వదినల కాపురం లాంటి కాపురం వెయ్యింటి కొకటి ఉంటుంది శేఖరం ఉండి ఉంటే...

ఆమె మొహంలో నవ్వు అంతరించిపోయింది. ఆమె మనస్సు శేఖర్ వద్దకు పోతూండగానే దినూ వచ్చి సునంద చీర కుచ్చిళ్ళు పట్టుకుని "అత్తయ్యా" అని పిలిచాడు. సునంద ఈ లోకంలోకి దిగి వచ్చి వాడిని ఎత్తుకుని అక్కడనుండి వెళ్ళిపోయింది.

♦ ♦ ♦

సునంద మహారాణీ హైస్కూల్లో ఉద్యోగానికి అప్లికేషన్ పెట్టింది. ఇంకేదైనా ఊళ్ళో అయితే ఉద్యోగం దొరకటం సులభమే కాని సుందరమ్మగారు ఒప్పుకోలేదు.

"కొంచెం ఆలస్యంగా ఉద్యోగం దొరికినా ఫరవాలేదు. దాన్ని మనకళ్ళెదురుగుండానే ఉండనివ్వండి"అని ఖచ్చితంగా చెప్పేశారావిడ. సీతారాంకూడా చెల్లెల్ని ఒంటరిగా పరాయిఊరికి పంపడాని కిష్టపడ లేదు. యౌవ్వనంలో ఉన్న అందమైన ఆడపిల్లను ఒంటరిగా ఎక్కడి కైనా పంపడం మంచిదికాదని తెలుసు నతనికి. రావుగారికి విద్యా శాఖలో బాగా తెలిసినవారు కొంతమంది ఉన్నారు వారి సహాయంతో హాళే నరసీపురంలో చిక్కిన ఉద్యోగాన్ని రద్దుచేయించి మైసూరులోనే మహారాణీ హైస్కూలులో ఉద్యోగం వచ్చేలా చేశారు. అదీ తాత్కా లికమైనదే.

"ఏదో ఒక ఉద్యోగం టెంపరరీ అయినా ఫరవాలేదు. ఆలస్యంగా ఖాయమయినా ఫరవాలేదు" అని రావుగారు విద్యాశాఖలో ఉన్న తమ స్నేహితులతో చెప్పారు.

ఉద్యోగపు ఆర్డర్ వచ్చినరోజున సునందకు ఒకేమారు భయమూ, సంతోషమూ కలిగాయి. అంతమంది విద్యార్థినులకు చదువు చెప్పటం తన చేతనవుతుందా అని భయం. ఇకమీదట కాలక్షేపం ఎలారా అన్న సమస్య తొలిగిపోయిందని సంతోషమూ కలిగాయి.

స్కూలుకు ఆమె బయలుదేరిన మొదటిరోజు ఇంట్లో వాళ్ళందరికీ హడావిడిగానే ఉంది. సునంద రెడీ అయి, నోట్‌బుక్కు, పెన్సిలు తీసికొని బయలుదేరబోతున్నప్పుడు శ్రీధర్ లోపలికి వచ్చాడు. అతడూ కోర్టుకు వెళ్ళటానికి సిద్ధంగా కొన్ని కాయితాలు చేతితో పట్టుకొని వచ్చాడు. సునందనుచూసి "మనసే సీతారాంఉన్నాడా?" అనిఅడిగాడు.

"ఉన్నాడు పిలుస్తాను. లోపలికి రండి" అని చెప్పి సునంద అన్నయ్యను పిలిచింది. సీతారాంకూడా కోర్టుకు వెళ్ళటానికి రెడీగా ఉన్నాడు.

"సునందకు మహారాణీ హైస్కూలులో ఉద్యోగం వచ్చింది శ్రీధర్! ఇప్పు డక్కడికే వెళ్ళబోతోంది ఆమె."

"చాలా సంతోషం. మన కింకోమారు టీపార్టీ దొరుకుతోందన్న మాట. సీతారాం, మిమ్మల్ని మన లాయరుగారు ఇప్పుడే పిలుచుకుని రమ్మన్నారు."

"జట్కాలో సునందను స్కూలుకు దిగబెట్టివెడదాం. ఇది మొదటి రోజుకూడా. ఏమంటారు?"

"నాకేం అభ్యంతరం లేదు" అన్నాడు శ్రీధర్. "మీకెందుకూ శ్రమ నేనే వెడతాను" అంది సునంద. "దీన్లో శ్రమేముంది? నేనే జట్కాను పిలుస్తానుండండి" అంటూ లేచాడు శ్రీధర్.

"వద్దు రంగడిని పంపుతాను నేను" అంటూ సీతారాం బయటికి వెళ్ళాడు.

"మీకు కోర్టు కాలస్యమవుతుందేమో?"

"మీలాగా మేమేం టైముకు సరిగ్గా వెళ్ళనక్కర్లేదుగా. మీరేమేం సబ్జక్ట్సు తీసుకుంటారు?"

"అది స్కూలుకు వెళ్ళాక తెలుస్తుంది. ఎందుకో చాలా భయంగా ఉంది. అమ్మాయిలను కంట్రోల్ చెయ్యగలనో లేదో అని అనుమానంగా ఉంది."

"ఇంతకే బెదిరిపోతున్నారా? బి.టి.కి వెళ్ళేటప్పుడు మీరు క్లాసులు తీసుకున్నారుగా?"

"అయినా అప్పటిలా నిర్లక్ష్యంగా ఉండలేం కదూ. ఒక్కో

సెక్షన్‌లో అరవై డెబ్భైమంది అమ్మాయిలుంటారు. అందర్నీ అల్లరి చేయకుండా చూసుకోవటం ఎలా?"

"అమ్మాయిలకు చాలా చనువివ్వకండి. అల్లరిచేస్తే కఠినంగా బయటికి పంపేయండి. మొట్టమొదటిరోజు ఇలుసిచ్చారంటే నెత్తికెక్కుతారు వాళ్ళు. అలా అని క్లాసులో చాలాస్ట్రిక్ట్‌గా ఉండకండి. పాఠం చెప్పేటప్పుడు పిట్టకథలూ అవీ చెబుతూఉండండి. వాళ్ళకీ సరదాగా ఉంటుంది."

"మీకు బాగా అనుభవమున్నట్టుంది దీన్లో."

"నే నెప్పుడూ పాఠం చెప్పి ఎరగను. కాని స్నేహితుడి అనుభవమే చెబుతున్నాను. అప్పుడప్పుడు అమ్మాయిలకు లేటెస్టు ఫ్యాషన్స్ మీద సలహాలివ్వండి. చాలఅల్లరిచేసే అమ్మాయిని లీడర్‌గా చేసేయండి."

"మీ సలహాలకు చాలా థ్యాంక్స్."

"సునందా జట్కా వచ్చింది" అని పిలిచాడు సీతారాం. ముగ్గురూ జట్కా ఎక్కారు. సునందను మహారాణీ హైస్కూలు వద్ద దిగబెట్టి, "విష్‌యూ సక్సెస్" అని చెప్పి సీతారాం శ్రీధర్ వెళ్ళిపోయారు.

రెండురోజు లయ్యాక ఆమె అనుభవాన్ని తెలుసుకోటానికి శ్రీధర్ వచ్చాడు.

"ఎలా ఉంది మీ ఉద్యోగం? అమ్మాయిల్ని కంట్రోల్ చెయ్యగలుగుతున్నారా?"

"ఊఁ అంతా మంచిపిల్లలు. ఓ అమ్మాయి చాలా అల్లరిచేస్తూంటే పిలిచి "నీ లంగా, జాకెట్ చక్కగా ఉన్నాయి. ఎక్కడ కొంటావు?" అని అడిగాను. ఆరోజునుండి అల్లరి చేయటం మానేసిందా అమ్మాయి. ఇప్పుడు నా ఫేవరెట్ ఆమె. కొంచెం పొగడితే చాలు, చక్కగా చెప్పిన మాట వింటారు."

"మీకు వశీకరణ విద్య వచ్చునేమో. లేకపోతే అమ్మాయిల్ని అదుపులో పెట్టుకోవడం చాలా కష్టం."

"నాకేం వశీకరణ విద్య రాదు."

సీతారాం దినకరుడిని తీసుకుని గదిలోకి వచ్చాడు. శ్రీధర్‌ని చూసి "హలో శ్రీధర్, మీరువచ్చి ఎంతసేపయిం దీ?" అన్నాడు.

"ఓ అయిదు నిమిషాలయింది. స్కూలుకు వెళ్ళే మొదటిరోజు మీ చెల్లెలు చాలా నెర్వస్‌గా ఫీలయ్యారు, ఎలా గెటాన్ అవుతున్నారో కనుక్కుందామని వచ్చాను."

సీతారాం మొహం సంతోషంతో వికసించింది. చెల్లెలి ఉద్యోగం విషయంలో శ్రీధర్ శ్రద్ధ తీసుకోవడం చూసి పొంగిపోయాడతను. ఓ పది నిమిషాలుండి "ఇక వెడతాను" అంటూ బయలుదేరాడు శ్రీధర్. సీతారాం కూడా అతడిని తలుపువరకూ పంపి రావటానికి లేచాడు. టేబుల్ పైన శ్రీధరుడి తాళపుచెవుల గుత్తి పడి ఉంది. సునందతో మాట్లాడేటప్పుడు ఆ గుత్తితో ఆడుకుంటూ కూర్చున్నాడు శ్రీధర్.

"అన్నయా తాళం చెవుల గుత్తి" అంటూ జ్ఞప్తికి తెచ్చింది సునంద.

"వెధవ మరుపు" అంటూ శ్రీధర్ వచ్చి తాళంచెవులు తీసుకుని వెళ్ళిపోయాడు.

♦ ♦ ♦

రెండో తేదీన డెబ్బై అయిదు రూపాయల జీతం అందుకుంది సునంద. జీతం అందుకున్నరోజు సునంద పొంగిపోయింది — దీన్లో ప్రతీనయాపైసా తనే సంపాదించింది - తనే కష్టపడి సంపాదించింది!

గాలిలో తేలుతూనే ఇంటికి వచ్చింది. ఆ నోట్లు ఇంట్లో అందరికీ చూపింది. సీతారాంకు చూపితే "ఈ డబ్బంతా ఎలా ఖర్చుచేస్తావు?" అని అడిగాడు.

"నాకు కావల్సిన వాళ్ళందరికీ ఏదో ఒకటి కొని తెస్తాను అన్నయ్యా, బజారుకు వెడదాం రా అన్నయ్యా..."

"నాకు ఆఫీసులో పని ఉంది. రేపు వెడదాం."

"ఇవాల్టి ఉత్సాహం రేపటికి చప్పగా చల్లారిపోతుందన్నయ్యా."

"దమయంతిని తీసుకుని వెళ్ళు."

"వదినా, అమ్మా వంటింట్లో కూర్చున్నారు. ఏదో పెద్దగా పని పెట్టుకున్నట్టున్నారు. వచ్చినప్పుడే పిలిచాను. ఈ రోజు వీలుపడదు అన్నారు...."

"సీతారాం!" శ్రీధర్ గొంతు వినిపించింది.

సీతారాం గబగబా వెళ్ళి శ్రీధర్‌ను లోపలికి పిల్చుకుని వచ్చారు.

"శ్రీధర్ మీ కిప్పుడేమైనా పనుందా ?"

"అంత పెద్ద పనేం లేదు."

"నా చిన్న కోరిక ఒకటి తీరుస్తారా ?"

"ఏమిటది?"

"సునంద ఈ రోజే మొదటినెల జీతం అందుకుంది. దాన్ని తన ఇష్టం వచ్చినట్టు ఖర్చుపెట్టాలట. నా కాఫీసులో పని ఉంది. మీరు దయచేసి..."

"ఓ ఇంతేకదా ? కానివ్వండి."

"ఇంకేం సునందా శ్రీధర్ వస్తారు. బజారుకువెళ్ళి నీకేం కావాలో అంతా తీసుకో."

సునంద ఓ క్షణం తల వంచుకుని నిలబడి తరువాత తలెత్తి అలాగే అంది. దినకరుడిని ముస్తాబుచేసి తీసుకుని బయలుదేరింది సునంద. దినకర్ జట్కాలో అల్లా వెళ్ళటమంటే ఎగిరి గంతేశాడు. రెండేళ్ళ దినకర్ చక్కగా మాట్లాడేవాడు. జట్కాలో గుఱ్ఱంఉన్నవైపే కూర్చుంటానని పట్టుపట్టాడు. దాంతో శ్రీధర్, సునంద వొకవైపునే కూర్చోవాల్సి వచ్చింది. సునంద ముందు కొంచెం సంకోచపడింది. అలా అని మగవాళ్ళతో సునంద మాట్లాడే అలవాటే లేదని కాదు. తను చిన్నపిల్లగా ఉన్నప్పటినుండి సీతారాం స్నేహితులతో చక్కగా ఆడుకునేది. కాని శ్రీధర్ పక్కనే కూర్చునేటప్పుడు ఆమె మొహం సిగ్గుతో ఎర్రబడింది. శ్రీధర్ ఆమె స్కూలు విషయం ఏవేవో ప్రశ్నలు వేస్తూనే ఉన్నాడు. సునంద అతడివైపు చూడకుండా రోడ్డువైపేచూస్తూ అతడి ప్రశ్నలకు జవాబిచ్చింది. శ్రీధర్ అంత దగ్గరగా ఉంటే తలెత్తి అతడివైపు చూస్తూ మాట్లాడలేకపోయింది సునంద. దినకర్ "మామయ్యా ఎక్కడికి వెళదాం" అన్నాడు.

సునంద మరింత తలవంచింది. దినకర్ సునందను అత్తయ్యా అనిపిలిచేవాడు సీతారాంని "నాన్నా" అని తాతయ్యని "తాతా" అని పిలిచేవాడు. మిగిలిన మగవాళ్ళంతా అతడికి మామయ్యలే. అప్పుడప్పుడు వాళ్ళ ఇంటికి వచ్చే విజయేంద్రకుమార్‌ని "మామయ్యా" అనే

వాడు. కాని ఈరోజు శ్రీధర్ని "మామయ్యా" అని పిలిచేటప్పటికి సునంద సిగ్గుపడింది.

జట్కాని బట్టలకొట్టుముందు ఆపాడు.

సునంద వదినకు వాయిల్‌చీర, తల్లికి ఓ చీర తీసుకుంది. ఆట వస్తువులమ్మే కొట్లో దినకర్ కోరినవన్నీ కొనిపెట్టింది. దినకర్ ఆట వస్తువులను చూసి ఎగిరి గంతువేశాడు.

"నీకేం కావాలో తీసుకో దినూ" అని చెప్పింది సునంద.

దినకర్ "అదికావాలి. ఇది ఇదిగో" అని అంటూ రైలు, కారు, పడవ. ఏరోప్లేనులను చూపాడు. వాడు చూసినవాటి నన్నిటినీ "సరే తీసుకో బాబూ" అనేది. శ్రీధర్ చేతులు కట్టుకుని మౌనంగా సునందను చూస్తూ నిల్చున్నాడు. దినకరుడి సంతోషాన్ని చూసి ఆమెకళ్ళు మెరుస్తున్నాయి. వాడు చెప్పినవన్నీ తీసుకుని సునంద దినకరుడివైపు తిరిగి ఇవి చాలా బాబూ" అంది.

"ఊఁ" అన్నాడు దినకర్.

కొట్టువాడు ఆ ఆటవస్తువులను ఓ అట్ట పెట్టెలో ప్యాక్ చేసి ఇచ్చాడు.

శ్రీధర్ ఆమె దగ్గరకు వచ్చి "నా చేతికివ్వండి నేను తెస్తాను," అన్నాడు.

"మీకు శ్రమ..."

"ఫరవాలేదు." సునంద శ్రీధరుడి చేతికా అట్టపెట్టెల్ని ఇచ్చింది.

ముగ్గురూ కొట్టువదలి బయటకు వచ్చారు. ఆ పెట్టెల్ని జట్కాలో పెట్టి "ఇప్పుడెక్కడికి వెడదాం?" అన్నాడు.

"గొడుగులమ్మే కొట్టుకి వెడదాం."

"నిజం గొడుగులేకపోతే టీచరులా కనిపించరు."

"గొడుగు నాక్కాదు...." అంటూ సునంద శ్రీధర్‌వైపు తిరిగింది. అతడి కళ్ళు అంత పెద్దగా ఉన్నాయని అప్పుడే తెలిసింది సునందకు. అతడు తనకన్నా ఎంత పొడుగ్గా ఉన్నాడో తెలిసింది కూడా అప్పుడే. సునంద ఏదో తప్పుచేసిన దానిలా చటుక్కున ఇంకో వైపు తిరిగింది. శ్రీధర్ చిరునవ్వుతో "అయితే గొడుగు మరిం

కెవరికి?" అన్నాడు.

"నాన్నగారికి. ఆయన గొడుగు చాలా పాతయిపోయింది."

తండ్రికోసం గొడుగు తీసుకున్నదయింది. సీతారాంకు ఏం తీసుకొనటమా అని ఆలోచిస్తూ నిలబడింది. ఆఖరికి శ్రీధర్‌నే అడిగింది.

"మీరూ కోర్టుకు వెళ్ళేవారేగా! అన్నయ్యకేం తీసుకుంటే బావుంటుందో చెప్పండి?"

"సీతారాంకి లెదర్ బేగ్ తీసుకోండి. కోర్టుకు తీసుకుని వెళ్ళటానికి బావుంటుంది."

సునంద రెండు లెదర్ కేసులు తీసుకుంది. శ్రీధర్ ఆమె రెండు కేసులు తీసుకొనటాన్ని చూసి సంశయంతో "రెండో దెవరికి?" అన్నారు.

"రెండోది ఇంకొకరికి."

"నేను తీసుకోను ప్లీజ్ నాకొద్దు."

"ఊహుఁ మీరు వద్దని అనటానికూడా వీల్లేదు. మీరు తీసుకోవల్సిందే."

"మీ ఇంట్లోని వారికి ఏమైనా ఇవ్వటం బాగానే ఉంది. కాని నేను పరాయివాడిని...."

"నేనలా భావించటం లేదు. మీరూ మావారే...."

సునంద మామూలుగా ఆ మాటయితే అంది గాని, వెంటనే నాలిక కొరుక్కుంది.

"అలా అయితే మీ ఇష్టం" అన్నాడు శ్రీధర్. తాతకోసం రెండు తువ్వాళ్ళు తీసుకుంది.

"జట్కావాడికివ్వటానికి డబ్బు మిగిల్చారా?"

"ఇంకా ఓ అరణాలు మిగిలాయి నా జీతంలో."

"మీ కోసం మరేమీ తీసుకోలేదే?"

"ఓ మర్చేపోయాను. పోనీ వుండి నాకేమీ వద్దు."

"అలా అయితే నేను మీకేమయినా కొంటాను. మీరు వద్దనకూడదు."

దగ్గరికి. ఇంటికి రాగానే తాను తెచ్చిన వస్తువులన్నీ అందరికీ చూపెట్టింది.

దినకరుడికోసం కొన్న ఆటవస్తువులని చూసి "రేపటివరకూ ఈ వస్తువులు ఇలాగే ఉంటే అది పుణ్యం. అన్నీ పాడుచేస్తాడంతే, వేస్టు" అంది దమయంతి. సునంద తనకోసం తెచ్చిన చీరను మాత్రం మెచ్చుకుంది. లెదర్ కేస్ చూసి "ఫరవాలేదు నాకు కావలసిన దాన్నే తెచ్చావే!" అన్నాడు సీతారాం.

"నీ స్నేహితుల సలహా ప్రకారం తీసుకున్నా!" అంది సునంద శ్రీధర్ని చూస్తూ.

"నీకోసం ఏం తీసు[illegible] సునందా?" సీతారాం అడిగాడు.

"నేను అసలు మర్చిపోయాను ఆ విషయం. కాని ఆయన వ్యానిటీ బ్యాగ్ కొనిచ్చారు. నేను లెదర్ కేసు ఇచ్చిన దానికి బదులు" అంటూ సునంద ఆ బ్యాగ్ని అన్నయ్యకు చూపించింది.

దానివైపు [illegible] చూ[illegible] సీతారాం తనలో తానే నవ్వుకున్నాడు. "ఎందుకన్నయ్యా నవ్వుతున్నావు? బాగా లేదా?"

"నాకేమో బాగానే ఉంది."

శ్రీధర్ తన లెదర్ కేస్ తీసుకుని ఇంటికి బయలుదేరాడు. కాని తను కొన్న కూరగాయల సంచి మర్చిపోయాడు.

"మీ కూరగాయలు!" అతడికి గుర్తు చేసింది.

తలుపువరకూ వెళ్ళిన శ్రీధర్ వెనక్కి తిరిగి వచ్చి సంచి తీసుకుని పోయాడు.

◆ ◆ ◆

సునంద ఫిఫ్త్‌ఫారం క్లాసుకు పాఠం చెపుతూంది. ఇంగ్లీషు పద్యం చెపుతూండగా సూర్యాదేవి చేతిలో [illegible] తన పాఠం వినకుండా ఏదో [illegible] గొంతు [illegible]పోయేలా కష్టపడి పాఠం చెపుతూంటే [illegible] వినకుండా తన పనేదో [illegible] చూసి సునందకు కోపం వచ్చింది. కొంచెం గట్టిగా "సూర్యాదేవీ, [illegible] తీసుకుని రా" అంది.

[illegible]

"ఇక్కడికి రా."

ఆ అమ్మాయి నేరస్తురాలిలా తలవంచుకుని దగ్గరకు వచ్చింది.

"నేను పాఠం చెప్తూంటే నువ్వేం చేస్తున్నావ్? ఏది ఆ పుస్తకం ఇలాతే..."

సురమ ఆ పుస్తకాన్ని తన వీపు వెనకదాచుకుంది. సునంద సురమ చేతినుండి ఆ పుస్తకాన్ని లాక్కుంది.

సురమ ఆ పుస్తకంమీద ఓ అమ్మాయి బొమ్మ వేసింది.

సునంద కోపంతో ఆ కాయితాన్ని చింపివేయబోయింది. అంతలోగా ఇంకోసారి ఆ బొమ్మను చూసింది. సునంద ఆశ్చర్యపోయింది. ఆ బొమ్మ తనదే. తన్ను ఒక్కసారి చూసినవాళ్ళు ఆ బొమ్మ ఎవరిదో సులభంగా గుర్తించవచ్చును. కళ్ళు, ముక్కు, పెదవుల దగ్గర ఉన్న పుట్టుమచ్చ....అన్నీ గమనించి ఒక్కటీవదలకుండా వేసిందా అమ్మాయి. రేఖలు సున్నితంగా లేవు నిజమే ఇంకా కొంచెం సాధన కావాలి అనేలా వున్నాయి. అయినా పద్నాలుగేళ్ళ సురమ ఎంత బాగా వేసిందా బొమ్మను! మంచి శిక్షణ, ప్రోత్సాహం దొరికితే మంచి చిత్రకారిణి అవుతుంది

సునంద మొహంలో కాఠిన్యం అంతరించింది. సురమవైపు చూసింది. ఆ అమ్మాయి తలవంచుకుని నిలబడింది సునంద అన్నది.

"ఇంటర్వెల్లో నన్ను కలుసుకో, అంతవరకూ ఇది నా దగ్గరే ఉండనీ."

సురమ "అలాగే టీచర్" అంది.

ఇంటర్వెల్లో సురమ స్టాఫ్‌రూమ్ తలుపు దగ్గరకు వచ్చి నిల్చుంది. సునంద బయటికి వచ్చి "ఆ చెట్టునీడలో కూర్చుందాం పద" అంది. ఇద్దరూ చెట్టుక్రింద కూర్చున్నారు. సునందే మొదట మాట్లాడింది.

"సురమా, ఇలా క్లాసులో కూర్చుని బొమ్మలు వేయకూడదమ్మా! నువ్వు పాఠం వినకపోతే ప్యాసవటం కష్టం. నువ్వు ఫెయిలయితే మీ అమ్మ, నాన్న బాధపడతారు. నీకు బొమ్మలు వేసుకోవాలని ఉంటే ఇంటి దగ్గరే వేసుకో."

సురమ నెమ్మదిగా అంది. "ఇంట్లో బొమ్మలు వేసుకుంటే అమ్మా నాన్నా కొడతారు టీచర్. ఇంట్లో నేను బొమ్మలు వేస్తున్నానో చదువుకుంటున్నానోనని పదిమార్లు పరీక్ష చేస్తూంటారు. అందువల్ల నేను స్కూల్లో బొమ్మలు వేసుకుంటాను "

"ఇంట్లో బొమ్మలు వేసుకుంటే ఎందుకు కొడతారు?"

"మా నాన్నగారికి నేను బాగా చదివి డాక్టరు కావాలని ఆశగా ఉంది. కాని నాకు..."

"నీకు డాక్టరు కావటం ఇష్టంలేదా?"

'ఊహుఁ నాకు బొమ్మలు వేసుకోవడమే ఇష్టం. కాని మా అమ్మా నాన్నా నన్ను బాగా చదివి డాక్టరవమంటారు. కాని నాకు బొమ్మలు వేయకపోతే అదోరకంగా ఉంటుంది."

"అంటే?"

"పరీక్షల టైముకి పోర్షన్ పూర్తికాకపోతే మీ కదోరకంగా ఉండదూ, నాకు అలాగే ఉంటుంది..."

మంచి తెలివైన పిల్ల అనుకుంది సునంద.

"ఒకే రోజులో ఈ బొమ్మలంతా వేశావా సురమా?"

"లేదు టీచర్, మూడు రోజులుగా మీ పీరియడ్‌లో నేను మీ బొమ్మే వేస్తున్నాను. మీ మొహం చూడటం బొమ్మ వేయటం, చూడటం బొమ్మ వేయటం ఇదే పని నాకు..."

"ఇంకా ఎవరెవరి బొమ్మలు వేశావ్? రంగమణి, వనజ...."

"ఊహుఁ అందరివీ వేయలేదు. వసంత లక్ష్మి, విజయ..."

"అదేం కొందరివే వేశావ్? మిగిలినవారి బొమ్మలెందుకు వేయలేదు?"

సురమ మొదట సిగ్గుపడింది చెప్పటానికి. సునంద మరీ బలవంత పెడితే "చూడటానికి బావుండే టీచర్ల బొమ్మలు మాత్రమే వేశాను" అంది.

పధ్నాలుగేళ్ళకే సౌందర్య జ్ఞానం వచ్చింది అమ్మాయికి.

"ఊఁ. అందంగా వుండే దానినుండి చూపు మరల్చుకోలేను." సురమ అలా చెపుతూంటే ఆమె కళ్ళు ఆరాధించేలా సునంద మొహాన్నే

చూస్తున్నాయి. ఆ చిన్నపిల్ల చూపుముందు ప్రియుడి చూపులను ఎదుర్కొన లేక తలవంచుకునే కన్నెపిల్లలా తలవంచుకుంది సునంద. సురమ కళ్ళల్లో ఎంతటి దాహం ఉంది! ఎంతటి తీక్షణత!

ఆ అమ్మాయిలో దాగివున్న కళను తల్లిదండ్రులు నాశనం చేస్తున్నారేమోనని సునందకు విచారం కలిగింది.

"సురమా నేను మీ అమ్మా నాన్నలతో మాట్లాడాలి. రేపుసాయంకాలం స్కూలు వదిలాక మీఇంటికివస్తే ఉంటారేమో కనుక్కుంటావా?"

"అలాగే టీచర్, రేపు సాయంకాలం నేనే మిమ్మల్ని తీసుకుని వెడతాను."

"ఊఁ ఈ బొమ్మ నాకిస్తావా?"

"అలాగే, కాని మీది ఇంకో బొమ్మ వేయటానికి పర్మిషన్ ఇవ్వాలి."

"నువ్వు ఏమయినా బొమ్మలు వేయటం మాత్రం మానెయ్యకు సురమా."

సురమ పుస్తకంలో ఆ కాయితాన్ని చింపి సునంద చేతికిచ్చి వెళ్ళిపోయింది. మర్నాడు సురమ సునందను తన ఇంటికి పిలుచుకొని వెళ్ళింది. సురమ తల్లిదండ్రులు ఆమెను ఆహ్వానించారు

"సురమా, టిఫిన్ తీసుకురామ్మా" అని తల్లి సురమను వంటింటిలోకి పంపారు. సురమ కనుమరుగవగానే సునంద ఆ బొమ్మను తీసి సురమ తండ్రి చేతికిచ్చి,

"ఇది ఎలా ఉంది?" అని అడిగింది.

ఆ బొమ్మను పరిశీలనగా చూసి, తరువాత సునంద వైపు తిరిగి మీబొమ్మకదూ? బాగా వచ్చింది."

"సురమ వేసింది దాన్ని...."

"సురమా!" అంటూ ఆశ్చర్యపోయారు వారు.

"అవును. సురమ క్లాసులో బొమ్మలు వేసుకుంటూ కూర్చుంటుంది. ఆ అమ్మాయికి పాఠాల్లో ఆసక్తిలేదు...."

"ఇంట్లో వేస్తే చెయ్యి విరగ్గొడతానని బెదిరించాను అందుకని..."

"మీరు చేస్తున్న పొరపాటిది. మీరు ప్రోత్సహిస్తే తనో మంచి

చిత్రకారిణి అవుతుంది. మీరు ఖచ్చితంగా బొమ్మలు వేయకూడదని ఆంక్ష పెడితే మీకు భయపడి క్లాసులో బొమ్మలు వేస్తుంది. దీనివల్ల పిల్లలకు మనమే దొంగతనం నేర్పినట్టు కాలేదూ?"

"సురమ డాక్టరు కావాలని మా ఆశ..."

"మీకు ఆశగా ఉందిగాని ఆమెకు లేదు మరి. బలవంతంగా మీ ఆశలను ఆమెపైన రుద్దటం న్యాయమేనా చెప్పండి? మీరు బలవంతపెట్టి ఆమెను డాక్టరుగా చేయగలరు. కాని ఆమె వృత్తిలో ఆసక్తి వహించకుండా చెడ్డపేరు తెచ్చుకోవచ్చు. అలా కాకుండా సురమకు దేన్లో ఆసక్తి ఉందో దాన్నే మీరూ ప్రోత్సహించండి."

"ఆమె మార్గానికే ఆమెను వదిలేయమన్నారా?" నిరాశతో అడిగారు సురమ నాన్నగారు.

"అదే మంచి పని. రేపట్నుండి సురమ ఇంట్లో బొమ్మలు వేస్తే తిట్టకండి. బావుంది అని ప్రోత్సహించండి. మంచి కళాకారులవద్ద చిత్రకళను అభ్యసించేలా చేయండి. మీరు ఇంట్లో బాగా ప్రోత్సహిస్తే స్కూల్లో పాఠాల విషయంలో కూడా శ్రద్ధ వహిస్తుంది..."

సురమ టిఫిన్ తెచ్చి సునందకిచ్చింది.

"నేను ఇక వస్తాను. నేనిలా చెప్పానని ప్రత్యేకం ఏమనుకోకండి"

సునంద ఇంటికొచ్చేటప్పటికి బాగా చీకటి పడింది. గేటుదగ్గరకొచ్చేటప్పటికి ఓ పురుష కంఠం వినబడి ఆమె గుండె వేగంగా కొట్టుకోసాగింది. ఎందుకిలా అవుతోంది, అని వెయ్యోమార్లు తన్ను తానే ప్రశ్నించుకుంది.

సీతారాం, శ్రీధర్, దమయంతి పేకాట ఆడుతూ కూర్చున్నారు.

"ఎందుకు సునందా ఇంత ఆలస్యమైంది?" అని సీతారాం అడిగాడు.

సునంద అంతా వివరించి పుస్తకంలోనుండి సురమ వేసిన బొమ్మ తీసి సీతారాం చేతికిచ్చింది. అందరూ ఆ బొమ్మను చూసి ఆశ్చర్యపడ్డారు.

"ఆ పిల్ల తండ్రికి చెప్పి చాలామంచి పనిచేశావు ఇకముందయినా ప్రోత్సాహమిస్తారేమో చూడాలి. అందరు టీచర్ల బొమ్మలూ వేసిందా

ఆ అమ్మాయి?" సీతారాం చెల్లెల్ని ప్రశ్నించాడు.

"లేదు. నాదీ, వసంత లక్ష్మిది విజయది, మాత్రమే వేసిందట!"

"అదేం?"

సునంద సిగ్గుపడింది. పుస్తకంలోని కాయితాలు అనవసరంగా తిప్పుతూ ఓ మారు శ్రీధర్‌ని చూసి మళ్ళీ తల దించుకుంది. తనవైపే ఎందుకలా చూడాలతను. చూడటానికింకేం లేదా?

"మరి......బావుండే వాళ్ళ బొమ్మలు మాత్రమే వేస్తుందట."

ఆ మాటకు ముగ్గురూ నవ్వారు.

"ఫరవాలేదు. ఆ అమ్మాయికి సెన్స్ అఫ్ బ్యూటీ ఉంది" అన్నాడు శ్రీధర్.

"ఏం సెన్సో ఏమిటో" అంటూ సునంద మాట మార్చటానికి ప్రయత్నించింది.

"కార్డ్స్ ఆడదాం వస్తావా?" సీతారాం చెల్లెలిని పిలిచాడు.

"అమ్మయ్య బ్రతికాను ఇద్దరమే ఆడటానికి విసుగ్గా ఉంటుంది. సునంద వచ్చేవరకూ ఆడుదువుగాని రమ్మని పీక్కు లాక్కొని వచ్చారు. ఇక నేను వెడతాను తల్లీ" అంటూ దమయంతి లోపలికి వెళ్ళింది. సునంద ఆమె స్థానంలో కూర్చుంది.

శ్రీధర్ ప్రతి ఆటలోనూ ఓడిపోయాడు. ఆటమీద మనస్సుంచి, ఆడితేగా. చేతిలో కార్డ్సు ఉన్నా చూపు ఇంకెక్కడో?

ఆట అయిపోయాక శ్రీధర్ ఇంటికి వెళ్ళటానికి లేచాడు.

సునంద టేబుల్ కింద, కుర్చీమీద ఎక్కడుందోనని తన చిత్రం కోసం వెతుకుతోంది.

"అన్నయ్యా నా బొమ్మ ఏది?"

"నాకు తెలీదు...."

శ్రీధర్ తన జేబులో వెతికి ఆమె బొమ్మను తీసి,

"మర్చిపోయి నా జేబులో పెట్టుకున్నా" అంటూ టేబుల్‌మీద ఆ బొమ్మను పెట్టడానికి వంగాడు. సునంద అతడి ఉంగరాల జుత్తునే చూస్తోంది.

అక్కడ పెట్టాక లేచి "చూడండి అక్కడే పెట్టాను. తరువాత

దొంగిలించానని ఆరోపించకండి" అన్నాడు.

అతడి కళ్ళు పెద్దగా ఉండటమే కాకుండా మెరుస్తున్నాయి కూడా అనుకుంది సునంద. అతడి మాటకు "ఇప్పుడు దొంగిలించి తీసుకుని వెళ్ళిపోబోయేరే?" అంది.

"మర్చిపోయి తీసుకుంటే దాన్ని దొంగతనం అని అనరు."

"మీ 'లా' కూడా అలాగే ఉంటుందా ఏం?"

"ఇంకా మీ వాగ్వాదం పూర్తికాలేదా ?" సీతారాం మధ్యలో అడిగాడు. శ్రీధర్ మధురంగా నవ్వుతూ సునందవైపు చూసి వెళ్ళిపోయాడు.

వెళ్ళేముందు తన్నుచూసి ఎందుకలా నవ్వాలతను? ఆ నవ్వు అర్థమేమిటి? 'నేను వెళ్ళనా! వెళ్ళక తప్పదా!' అని ఆ నవ్వు ఆమెను ప్రశ్నించింది. అలా అడిగితే తను మాత్రం ఏమని చెబుతుంది?

సీతారాం శ్రీధర్‌ను పంపి వచ్చేటప్పటికి కూడా సునంద అలాగే నిల్చుని వుంది.

"సునందా"

సునంద ఉలిక్కిపడింది, "ఓ నువ్వేనా?"

"మరింకెవరనుకున్నావ్?"

"..............."

"ఏమి టాలోచిస్తున్నావ్ సునందా?"

"ఏమీ లేదన్నయ్యా" అంటూ తన మొహం అన్నయ్యకు కనిపించ నీయకుండా తల వంచుకుని మేడ ఎక్కింది. గదిలోకి వెళ్ళి తలుపులు బిగించుకుని మంచంమీద పడి ఏడ్చింది.

ఆమె హృదయంలో సుడిగాలి, విప్లవం, ఎన్నో భావాలు ప్రళయ నృత్యం చేశాయి.

పెద్ద దెబ్బ తిన్నదానిలా, అవమానితురాలిగా, ఏదో జరగరానిది జరిగిపోయినట్లుగా వెక్కి వెక్కి ఏడ్చింది.

దినకర్ తలుపు తడుతూ "అత్తయ్యా..." అని పిలిచాడు.

సునందలేచి తలుపు తెరచింది. దినకర్ లోపలికి వచ్చాడు. దినకర్‌ను గట్టిగా పట్టుకుని క్రింద కూర్చుని "నన్నేమి చేయమన్నావ్

దినూ, నన్నేం చేయమన్నావ్" అంది.

వాడు తెల్లబోయి నిల్చున్నాడు. సునంద లేచి నిల్చుని కన్నీరు తుడుచుకుని "నేను వస్తున్నాను నువ్వు వెళ్లు" అంది. దినకర్ కిందికి వెళ్ళిపోయాడు.

సునంద మళ్ళీ తన ఆలోచనల్లో మునిగిపోయింది.

అతడెందుకలా చూడాలి? ఎందుకలా నవ్వాలి? తను ఏ విధంగా కూడా అతడిని ప్రోత్సహించలేదు.

సునంద ఆత్మ పరిశీలన చేసుకుంది.

ఊహుఁ అతడిని ప్రోత్సహించేమాట ఒక్క మాటకూడా తనెప్పుడూ పలకలేదు. ఇంతయినా తన్ను చూసిన వెంటనే అతడి మొహం వికసించేది. సీతారాం కొరకు అతడు వచ్చినాగాని ఇంకెవరికోసమో అతడి కళ్లు వెతికేవి. తనకు తెలియదా? అతడు ఎవరికోసం వస్తున్నాడో తనకు తెలుసు. రమ్మని తనెప్పుడూ చెప్పలేదతనికి. అయినా అతడు వస్తున్నాడు. అతడిని మాటలద్వారా ప్రోత్సహించకపోతేనేం మనస్సులో మెదిలే భావాలను మాటల ద్వారానే తెలపాలా? తను నోరు మెదపకపోతేనేం కళ్ళూ కళ్ళూ కలుసుకొని మాట్లాడుకునేవి. అతడి కంఠస్వరం వినగానే తన శరీరం పులకరించేది. అతడిని చూడగానే గుండె వేగంగా కొట్టుకునేది. కళ్ళూ కళ్ళూ కలుసుకోగానే తన కళ్లు భారంతో కిందికి వాలిపోయేవి. అతడిని చూడగానే మొహమంతా ఎర్రబడేది. అవును నిజమే. కాని ఎందుకలా కావాలి? ఎందుకు?

"సునందా" అంటూ దమయంతి పిలిచింది.

సునంద తన ఆలోచనల్లోనుండి మేలుకొని కిందకు వెళ్ళింది.

◆ ◆ ◆

ఆ తరువాత రెండురోజులు శ్రీధర్ రాలేదు. ఎందుకని రాలేదో? కులాసాగా ఉన్నాడో లేదో? అయినా అతడు కులాసాగా ఉంటేనేం లేకపోతేనేం? ఎక్కడో మంచం పట్టాడేమో! అన్నయ్యనడగనా? వద్దు ఏమైనా అపార్థం చేసుకోవచ్చు.

ఆ రెండురోజులూ సునంద స్కూల్లో పాఠం చెప్పేటప్పుడు కూడా పరధ్యానంగానే ఉండేది. విద్యార్థినులడిగిన ప్రశ్నలు వినబడేవి

కావు. వనజ 'ఏ రాజకుమారుడి గురించి కలలు కంటున్నావుసునందా?' అని అడిగింది. ఇంట్లో "భోజనం సరిగ్గా చేయటంలేదేమమ్మా" అని తాత అడిగాడు. పిళ్ళందరికీ ఏమి జవాబు చెప్పాలి ?

ఆ రోజు తను ఇంటికి వచ్చేటప్పటికి శ్రీధర్ కూడా వచ్చి ఉన్నాడు. తన హృదయంలోని భావాలను ఎంత కనబడనీయకూడదనుకున్నా లోపలి సంతోషం మొహంలో స్పష్టంగా కనబడుతూనే ఉంది. కళ్ళు జ్యోతుల్లా వెలుగుతున్నాయి. స్వాగతమిస్తున్నట్టుగా నవ్వులోంచి ఆమె మొహం హృదయపు సంతోష భారంతో మొహం వంగింది.

"సునందా గాయత్రిలో 'లోమహోబిడే' వచ్చింది. అందరం వెడదామంటున్నారు "

శ్రీధర్ అందర్నీ సినిమాకు పిలుస్తున్న దెందుకో ఆమెకు తెలుసు. తన ఒక్కదానికోసం అందర్నీ పిలిచాడు

"నేను రానన్నయ్యా మీరందరూ వెళ్ళిరండి."

"అందరం కలిసి వెడితే బావుంటుంది" అన్నాడు శ్రీధర్.

"నీ కోసమే నేను చెపుతున్నాను. నువ్వే ఇలా అంటే ఎలా" అని అతడి కళ్ళు అడుగుతున్నాయి. అతడు తనవైపు అలా చూశాక కూడా రానని ఎలా అనటం ? ఆ సాహసం తను చేయలేదు.

"అలాగే, పది నిమిషాల్లో రెడీ అవుతాను."

తాను అలా అన్నప్పుడు అతడి ముఖంలో ఆనందం కలిగింది. ఈ కళ్ళతోనే ముద్దు పెట్టుకునే వాడిలా చూశాడు ఛీ...

సునంద ఎందుకనో లోపలికి పరిగెత్తుకు వెళ్ళిపోయింది.

సుందరమ్మ, రావుగారు 'లోమహోబిడే'కి రావటానికొప్పుకోరు. దినకరుడిని ఇంట్లోనే వదిలిపెట్టి నలుగురూ సినిమాకు బయల్దేరారు. బాల్కనీకి శ్రీధర్ టిక్కెట్లు తీశాడు. సునంద ముందు లోపలికి వెళ్ళింది. ఆమె పక్కలో జమదుంబ, తరువాత సీతారాం, అతడి పక్కలో శ్రీధర్ కూర్చున్నాడు. సినిమా మొదలవటానికి ఇంకా టైముంది. శ్రీధర్ చిప్స్ తెస్తానని బయటికి వెళ్ళాడు నాలుగు ప్యాకెట్లు తెచ్చి ఒక్కొక్కరికి ఒక్క ప్యాకట్టు ఇచ్చి, సునందకూ ఓ ప్యాకట్టు

ఇచ్చాడు.

"థ్యాంక్స్" అంటూ సునంద దాన్ని అందుకుంది.

మిగిలినదాన్ని తనచేతిలో ఉంచుకుని సునంద పక్కలో ఖాళీగా ఉన్న కుర్చీమీద కూర్చున్నాడు. సునందకు అక్కడనుండి పారిపోవాలనిపించింది. దమయంతివైపు తిరిగింది. కాని దమయంతి భర్తతో మాట్లాడుతూ కూర్చుంది.

"మీరు తినటంలేదే ?" అన్నాడు శ్రీధర్.

తన చేతిలో చిప్స్ ఉన్న విషయమే మర్చిపోయిందామె.

"ఈ చిప్స్ ముగించటాని కింకా టైముందిగా."

సినిమాహాల్లో పాటలు మొదలయ్యాయి. దీపా లొక్కొక్కటిగా ఆరిపోయాయి. సునంద సోఫాలో వెనక్కు వాలింది. సునంద, దమయంతి పెట్టుకున్న మల్లెపూల వాసన చుట్టుపక్కలంతా వ్యాపించింది.

సునంద తెరవైపు చూడటంలేదు. ఇండియన్ న్యూస్ రీలంటే అంత ఇష్టంలేదామెకు. అప్పుడప్పుడు శ్రీధర్‌నే చూస్తోంది.

పక్కనుండిచూస్తే చాలాఅందంగా ఉన్నాడు అంది ఆమెమనస్సు. పక్కనుండే ఏమిటి ఎదురుగుండా చూసినా అందంగానే ఉన్నాడు.

శ్రీధర్ సినిమా శ్రద్ధగా చూస్తున్నాడు. ఇండియన్ న్యూస్‌రీల్ అయిపోయింది. రాబోయే చిత్రాల ట్రయల్ మొదలయింది. ఏదో సినిమాలోని నాయకీ నాయకుల ప్రేమఘట్టాన్ని చూపుతున్నారు.

ఇతని పక్కలో కూర్చుని సినిమా చూడటమా? అన్ని విధాలుగా అతడిని 'స్నబ్' చెయ్యాలి. అదే మంచిపని. కాని ఎందుకలా చెయ్యటం? లేకపోతే తన మౌనానికి వేరే అర్థాలు కల్పించుకోవచ్చు. అలా అర్థం చేసుకోవడంవల్ల ఏవో ఆశలను పెంచుకోవచ్చు. ఇప్పటినుండే అతడి ఆశల మందిరాన్ని భగ్నంచేస్తేనేం? కాని అది అతడి ఆశమాత్రమేనా? తన ఆశమాత్రం కాదూ?

శ్రీధర్ సునందవైపు తిరిగి "ఇప్పుడు ట్రైలర్ చూపుతున్న సినిమా చాలా బావుంటుంది, నేను ఇంతకుముందే చూశాను. ఇక్కడికి వచ్చినప్పుడు అందరం వెళదాం" అన్నాడు.

సునంద ఉలిక్కిపడి "ఊఁ– ఆఁ" అంది కాని, శ్రీధర్ ఏమ

న్నాడో మాత్రం వినపడలే దామెకు. శ్రీధర్ మాత్రం చాలా సంతోషంగా, తృప్తితో సినిమా చూస్తున్నాడు.

ఇంటర్వెల్ లో మళ్ళీ దీపాలు వెలిగాయి. హిందీపాట చెవులు గింగురుమనేలా వినిపిస్తోంది.

సీతారాం వంగి సునందను "రోమన్ హాలిడేలో ఎవరెవరు నటించారు?" అని అడిగాడు. సునందకు అన్నయ్య ప్రశ్న వినపడినా వినపడనట్టే నటించింది.

"ఈ పాట మధ్యలో ఏమీ వినబడ్డంలేదు" అంటూ అన్నయ్య పక్కలో ఖాళీగాఉన్న కుర్చీలో కూర్చుని "ఏమన్నావ్" అనిఅడిగింది.

"రోమన్ హాలిడేలో ఎవరెవరు నటించారు?"

"గ్రిగరి పెక్, ఆడ్రి హెబర్న్."

సునంద ఏదో మాటలు పెంచుతూ అన్నయ్యపక్కనే కూర్చొంది. శ్రీధర్ వైపు కన్నెత్తిచూసే సాహసం మాత్రం కలగలేదు. కాని సినిమా మాత్రం హాయిగా చూడగలిగిందిప్పుడు.

సినిమా చాలా బావుంది. ఆడ్రి హెబర్న్ సినిమా రంగానికి కొత్తదైనా చాలా బాగా నటించింది. తను ప్రేమించిన సామాన్య మానవుడిని పెళ్ళి చేసుకోలేని రాజకుమారిగా అద్భుతంగా నటించింది. గ్రిగరి పెక్ లాంటి మంచి నటుడి నటనను కూడా మీరి నటించిందామె.

సునంద సినిమా చూసేటప్పుడు ఎప్పుడూ ఏడ్చేదికాదు. కాని రోమన్‌హాలిడేలో రాజకుమారి, ఆమె ప్రేమికుడు విడిపోయేటప్పుడు ఏడుపు వచ్చింది సునందకు.

ఎప్పుడూరాని ఏడు పెందుకొచ్చిందీరోజు ? సినిమాలోని ప్రేమికులు విడిపోతే తనెందుకు ఏడవాలి ? ఉహుఁ తను సినిమా చూచి కాదు ఏడ్చింది. అయితే మరింకెందుకు ? ఎందుకు ?

"సిల్లీ స్టుపిడ్" అని తన్ను తానే అనుకుంటూ కన్నీరు తుడుచుకుంది.

సినిమా అయిపోయింది. అందరూ లేచి బయటకు వచ్చారు. వచ్చేటప్పుడు సునంద శ్రీధర్‌ను కనుకొలుకుల్లోంచి చూసింది. అతడి

మొహం గంభీరంగా ఉంది. సినిమాకొచ్చే ముందున్న ఉత్సాహం లేదిప్పుడు.

ఆలా చేయటంవల్ల తనకు కలిగిన లాభమేమిటి? శ్రీధర్ నీమారు కలుసుకున్నప్పుడు క్షమాపణ చెప్పుకోవాలి.

"ఏం శ్రీధర్ ఒంట్లో బాగాలేదా?" సీతారాం శ్రీధర్‌ని అడిగాడు.

"ఏం లేదు" అంటూ రాని నవ్వును బలవంతంగా పెదవుల మీదికి తెప్పించుకున్నాడు. శ్రీధర్ వాళ్ళతో కొంచెం సేపు నడిచి చటుక్కున ఆగిపోయి "గుడ్‌నైట్" అని చెప్పి వెళ్ళిపోయాడు.

"ఆయన మామూలుగా లేరివ్వాళ." దమయంతి అతను వెళ్ళిన వైపే చూస్తూ అంది. సీతారాం ఏదో మాట్లాడుదామని నోరువిప్పి చెల్లెలి వైపు చూశాడు. తల వంచుకుని నడుస్తున్న చెల్లెలి మొహంలోని భావోద్వేగాలను చూచి మౌనం వహించాడు.

ఆ తరువాత ఓ వారం రోజులు శ్రీధర్ వాళ్ళింటికి రాలేదు. మామూలుగా అయితే రెండు రోజులకోమారు వచ్చేవాడతడు. రోజూ అతడికోసం ఎదురుచూసి చూసి నిరాశ చెందేది సునంద.

అతడింక రాడు. ఆ రోజు తన ప్రవర్తన అతడిక కోపం తెప్పించింది. అతడు రాకూడదనేగా తను ప్రవర్తించింది. అయితే ఇలా బాధపడటం దేనికి? గేటు తెరచిన చప్పుడు వినగానే తలుపు దగ్గరకు వెళ్ళి నిల్చోవటం దేనికి? అడుగుల చప్పుడు వినగానే తల తిప్పిచూడటం దేనికి? నీ సామీప్యం నాకక్కర్లేదని నోరు విడిచి చెప్ప లేదంతే! కాని ఇప్పుడు తనకు సంతోషంగా ఉందా?

స్కూల్లోకూడా శ్రద్ధగా పాఠం చెప్పలేకపోయింది సునంద. భూగోళంలో మొదలయిన పాఠం చరిత్రలో ఆఖరయ్యేది. ఇలా అయితే విద్యార్థిను లెలా పాసవుతారు?

సునంద సాయంకాలం తన గదిలో కూర్చుని ముననాడు చెప్ప వలసిన పాఠాల నోమారు చూసుకుంటూంటేగా దమయంతి కిందనుండి 'సునందా' అని పిలిచింది...

అయితే అతడు వచ్చాడేమో! అయి ఉండాలి. లేకపోతే దమయంతి తన్ను పిలువదు. ఈ రోజు క్షమాపణ చెప్పుకోవాలి.

'సునందా' అంటూ క్రిందనుండి మళ్ళీ పిలుపు వినిపించింది.

"వస్తున్నా" అంటూ సునంద తొందరగా అద్దంలో చూసుకుని ముంగురులు దిద్దుకుని, మొహాని కోమారు పౌడర్ వేసుకుని కిందకు దిగి వచ్చింది.

"నీ స్టూడెంటువచ్చింది. డ్రాయింగురూములో కూర్చోబెట్టాను."

సునందకు నిరాశతో ఏడుపు వచ్చినంత పనయింది. తన్ను చూడటానికి వచ్చిన శిష్యురాలిని తన్ని బయటకు పంపేద్దామనిపించింది.

సునంద డ్రాయింగు రూము తలుపుదగ్గర నిలబడింది. వచ్చిన అమ్మాయి సురమ సురమలేచి నిల్చుని "నమస్తే టీచర్" అంది. సునంద బలవంతంగా నవ్వు తెప్పించుకుని "ఏమిటి సురమా!" అంది.

"ఆరోజు మీరు వచ్చి మా నాన్నగారికి..."

"అవును తరవాతేమన్నారు?"

"రోజూ రెండు గంటలు బొమ్మలు వేసుకోవటానికి అనుమతిచ్చారు. రెండు గంటలు బొమ్మలు వేసుకుని తరువాత స్కూలు పాఠాలు చదువుకుంటాను రేపట్నుంచి నీలలోచన్ దగ్గర శిక్షణ ఇప్పించటాని కొప్పుకున్నారు. నీలలోచన్ పేరు విన్నారా టీచర్?"

"ఆయన పేరు తెలియనివారెవరున్నారు? నువ్వే వాళ్ళింటికి వెడతావా లేకపోతే ఆయన మీ ఇంటికి వస్తారా!"

"నేనే వాళ్ళింటికి వెడతాను. ఆయన భార్య అమ్మకు బాగా తెలుసు ఉదయం ఎనిమిది గంటలనుండి తొమ్మిది గంటలవరకూ నేర్చుకుంటాను."

"చాలా సంతోషం. సురమా శ్రద్ధగా నేర్చుకో."

ఆ అమ్మాయి శ్రద్ధాసక్తులను చూచి ఆశ్చర్యపడింది సునంద. పద్నాలుగేళ్ళ పిల్లయినా చిత్రకళ అంటే ఎంత అభిమానం! ఆత్మ ప్రేరణ అంటే ఇదేనేమో? సురమ లేచి నిల్చుని "నేను ఇక వెడతాను టీచర్ మీకు ఈ విషయం చెబుదామని వచ్చాను" అంది

"పద నేను అంతవరకూ దిగబెట్టి వస్తాను."

సునంద సురమతోబాటు రోడ్డు చివరవరకూ వెళ్ళి వెనక్కి తిరిగింది సురమ వెళ్ళిపోగానే మళ్ళీ క్రోధరేఖ సునంద మనస్సునంతా

ఆక్రమించాడు.

తనపైన చాలా కోపం వచ్చిందేమో అతడికి. ఇక ఇంటి గడప కూడా తొక్కడేమో. ఇప్పుడు తనేం చెయ్యాలి? అతడి అడ్రసుకో ఉత్తరం రాస్తే? నిజమే అదే మంచి పద్ధతి. క్షమాపణ కోరుతూ ఉత్తరం రాసి ఇంటికి రమ్మనికూడా రాయాలి.

వరండాలో సీతారాం ఎవరితోనో మాట్లాడుతున్నట్టు కనిపించింది. అతడేనేమో వచ్చింది. అతడే అయి ఉండాలి దేవుడా.

వచ్చినది శ్రీధర్! సునంద వరండాలోకి రాగానే శ్రీధర్ లేచి చేతులు జోడించి "నమస్తే" అన్నాడు. సునంద మౌనంగానే చేతులు జోడించింది. సీతారాం ఏదో పెద్ద ఘనకార్యం చేసిన వాడిలా "సునందా! శ్రీధర్ ఓ వారంగా నన్ను తప్పించుకొని తిరుగుతున్నాడు. ఈ రోజు ఇంటికి వెళ్ళి బలవంతంచేసి లాక్కొని వచ్చాను" అన్నాడు.

ఈ వారం రోజులుగా తనకు మొహం చూపించకుండా బాధ పెట్టాడని చాలా కోపంగా ఉంది సునందకు.

"ఆయనకు ఇక్కడికి రావాలని లేకపోతే బలవంతం పెట్టడం దేనికన్నయ్యా?"

సీతారాం చెల్లెలు ఇలా మాట్లాడుతుందనుకోలేదు. ఈ వారం అంతా చెల్లెలి పరధ్యానం, విసుగుదల, నిరుత్సాహం చూసి ఇక ఊరుకోలేక తనే వెళ్ళి స్నేహితుడిని బలవంతంచేసి తీసుకుని వచ్చాడు. అయితే తాను అనుకున్నదంతా అబద్ధమేనా అని ఓ క్షణం భ్రాంతి చెందాడు. కాని మరుక్షణమే చెల్లెలు ఎందుకలా మాట్లాడిందో గ్రహించి నవ్వుతూ "సునందా శ్రీధర్‌కు కారప్పూస తెచ్చిపెట్టమ్మా — మన తాత చేసినట్టు కారప్పూస ఇంకెవరూ చేయలేరు" అన్నాడు.

శ్రీధర్ వెంటనే లేచి నిల్చుని "టైమయింది! ఇంటికి వెళతాను" అన్నాడు.

"ఫరవాలేదు కూర్చోండి శ్రీధర్. లోపల గదిలోనే కూర్చుందాం పదండి. కారప్పూస తీసుకురా సునందా."

సునంద లోపలికి వెళ్ళింది. సీతారాం శ్రీధర్‌ను లోపలగదిలో కూర్చోబెట్టాడు. వంటింట్లో దినకర్ పెద్దగా ఏడుస్తున్నాడు. కొడుకు

ఏడుపు వినగానే "ఇప్పుడే వస్తాను. లోపల దినూ ఏడుస్తున్నాడు. తల్లీ కొడుకులకు సంధిచేసి మళ్ళీ వస్తాను" అంటూ లోపలికి వెళ్ళిపోయాడు.

సునంద నీళ్ళగ్లాసు, కారప్పూస ఉన్న ప్లేటు తీసుకుని వచ్చింది. గదిలో శ్రీధర్ మాత్రం ఏదో పేపరు చూస్తూ కూర్చున్నాడు. అన్నయ్య గదిలో లేకపోవటాన్ని చూసి ఒక్క క్షణం అధీనురాలయింది. కాని శ్రీధర్ పెద్దపులి కాదుగా తనను మింగెయ్యటానికి ?

సునంద అతడి ముందో టీపాయ్ పెట్టి దాని మీద నీళ్ళగ్లాసూ ప్లేటూ పెట్టి ఎదురుగుండా ఉన్న ఇంకో కుర్చీమీద కూర్చొని 'తీసుకోండి' అంది. శ్రీధర్ మాట్లాడకుండా పేపరు మడిచి ఓ ప్రక్కగా పెట్టి మౌనంగానే తినటానికి మొదలెట్టాడు. సునందే ముందుగా మాట్లాడింది.

"కారప్పూస బావుందా?"

"ఊఁ"

"చాలా పని ఎక్కువగా ఉందనుకుంటా ?"

"ఊఁ"

"అందుకే ఇటువైపు రాలేదేమో?"

"ఊఁ"

"రోమన్ హాలిడే బావుందా ?"

"ఊఁ"

"నాలుగు దెబ్బలు కావాలా?"

"ఊఁ"

సునంద పెద్దగా నవ్వటానికి మొదలెట్టింది. శ్రీధర్‌కేమీ అర్థం కాలేదు. చేతిలో ఉన్న ప్లేటు టీపాయ్ మీద పెట్టి, కర్చీఫ్‌తో ఓమారు మొహం తుడుచుకుని ఎందుకు అనేలా చూశాడు.

"ఇప్పుడు నేను మిమ్మ ల్నేమని అడిగానో తెలుసా ? నాలుగు దెబ్బలు కావాలా అని అడిగాను."

"నేను దాని కేమని చెప్పాను? ఊఁ అని చెప్పానుకదూ!"

"నేనలా అడిగినప్పుడు మీరేదో పరధ్యానంగా ఉన్నట్టున్నారు."

"అలాగేం లేదే, దెబ్బలకు సిద్ధంగా ఉన్నాననిచెప్పాను. రోమన్ హాలిడే చూడటానికి వెళ్ళనరోజున మీరిచ్చిన దెబ్బకన్నా, మీరు ఇవ్వబోయే దెబ్బ చాలా హాయిగా ఉంటుంది."

సునంద మొహం గంభీరమయింది. చాల మృదువుగా అంది. "దయచేసి నన్ను క్షమించండి, ఆ రోజు నుండి మిమ్మల్ని క్షమాపణ కోరుకోవాలని చూస్తున్నాను. ఆ రోజు నే నెందుకలా చేశానో నాకే తెలియదు. తరువాత నేనలా చేసింది చాలా తప్పు అనిపించింది."

"నాపక్కన కూర్చునేంత నమ్మకం లేదా మీకు నామీద?"

"మీమీద నమ్మకం లేకకాదు. కాని...."

"కాని ఏమిటి?"

"ఏమీ లేదు కాని మీరలా భావించకండి. నే నెలా చేస్తే మీకు నా మాట మీద నమ్మకం కలుగుతుంది?"

శ్రీధరుడి మొహంలో ఆనందం వెల్లివిరిసింది. అతడి కళ్ళు నవ్వుతున్నాయి.

"మీ మాటలో నాకేం నమ్మకం లేదు. ఇంకోరోజు మీకు నామీద నమ్మకం ఉందని చూపండి, అప్పుడు నాకూ మీ మాటమీద నమ్మకం కలుగుతుంది, అప్పటివరకూ నేను మిమ్మల్ని నమ్మలేను."

"అలాగే" సునంద ఒప్పుకుంది.

"కోపం పోయిందా?"

"కోపం చేసుకున్నది మీరు, నేను కాదు."

శ్రీధర్, సునందలకు సంధి కుదిరే సమయానికి సరిగ్గా సీతారాం కూడా తల్లీకొడుకుల మధ్య సంధి కుదిర్చి దినకరుడినికూడా తీసుకుని లోపలికి వచ్చాడు. సునందా, శ్రీధర్ నవ్వుతూ మాట్లాడుతూండటాన్ని చూచి అతడి హృదయం తేలిక పడింది.

"కారప్పూస ఎలావుంది శ్రీధర్?"

"బావుంది, మీ తాత ఏంచేసినా బాగానే చేస్తారు "

సాయంకాలం షికారుకు వెళ్ళిన రావుగారు యింటికి వచ్చారు. శ్రీధర్ ఆయనతో కాస్సేపు మాట్లాడుతూ కూర్చున్నాడు. సునంద సురమా తండ్రి సురమకు చిత్రకళలో శిక్షణ ఇప్పించటానికి ఒప్పు

కున్న విషయం తండ్రితో చెప్పింది. ఆయన చాలా సంతోషించారు. శ్రీధర్ ఇంటికి వెళ్ళే ముందు సునంద హెచ్చరించింది.

"మీ కర్చీఫ్ మర్చిపోకండి."

"మర్చిపోతేనేం? మళ్ళీ వచ్చి తీసుకుని వెడతాను."

కాని సునంద ముందే హెచ్చరించినందువల్ల శ్రీధర్ తన కర్చీఫ్ మర్చిపోకుండా తీసుకుని వెళ్ళాడు. సునంద, సీతారాం, దినకరు అతడితోబాటు కొంచెం దూరం వెళ్ళి ఇంటికి వచ్చారు. తన మునుపటి ప్రవర్తనను మరపించటానికి సునంద శ్రీధర్‌తో చాలా మాట్లాడింది.

సునంద శ్రీధర్ కో సమస్యలా కనిపించింది. కొన్నిరోజులు మౌనం వహించేది. ఆమె మౌన వ్రతాన్ని వహించినప్పుడల్లా శ్రీధర్ లోని ఉత్సాహం చచ్చిపోయేది ఆమె మనస్సులో ఏముందో తెలిసేది కాదతడికి ఆమెకు తనపై ప్రేమ ఉందని కొన్నిమార్లు అనిపించినా అది భ్రాంతి మాత్రమేమోననిపించేది. ఆమె అతడికి సమీపంగా వచ్చినట్టే వచ్చి మళ్ళీ వెనక్కి వెళ్ళిపోయి అందీ అందకుండా ఆటలాడించేది. ఆమెకు తనపై నున్నది ప్రేమా, స్నేహమా అన్నది అర్థం కాలేదు శ్రీధర్‌కు.

మైసూరులో కలరా వ్యాపిస్తూండడం వల్ల రావుగారు ఇంట్లోవారికందరికీ ఇనాక్యులేషన్ చేయించారు. కూతుర్నీ, కొడుకునీ కోర్టు, స్కూలు క్యాంటీన్లలో కాఫీగాని, టిఫిన్‌గాని తినకూడదని ఖచ్చితంగా చెప్పేశారు.

మైసూరులో కలరా వ్యాపిస్తోందని తెలిసిన వెంటనే సునందకు శ్రీధర్ జ్ఞాపకానికొచ్చాడు. నాన్నగారికోసం తను ఇనాక్యులేషన్ వేయించుకుంది. కాని శ్రీధర్? అతడు వేయించుకున్నాడో లేదో? వెనకోమారు శ్రీధర్ తనకి ఇనాక్యులేషన్, వాక్సినేషన్‌లలో నమ్మకం లేదని చెప్పాడు.

దాన్లో నమ్మకం లేదుకదాననినిర్లక్ష్యంగావుంటే కలరా... సునంద నిలువెల్లా వణికిపోయింది.

"అలా కానివ్వను దాని కసలు అవకాశమే ఇవ్వను" అనుకుంది మనస్సులోనే.

మీరు ఇనాక్యులేషన్ చేయించుకుంటే, నాకు భయం అని అన్నయ్యముందు చెప్పడం ఎలా? నా భయాన్ని చూసి నవ్వవచ్చు. అయినా తనూ శ్రీధర్ మాట్లాడుతున్నప్పుడు సీతారాం ఇద్దర్నీ వదిలేసి లోపలికి వెళ్ళిపోతాడు. సాధారణంగా అప్పుడే సరిపోతుంది.

సునంద ఇంట్లోనివారు ఇనాక్యులేషన్ చేయించుకున్న మర్నాడే శ్రీధర్ ఆ ఇంటికి వచ్చాడు. మామూలుగానే పలకరించి చెల్లెల్ని అక్కడే వదిలేసి సీతారాం వెళ్ళిపోయాడు. అన్నయ్య బయటికి వెళ్ళగానే సునంద "మీతో ఓ చిన్న మాట చెప్పాలనుకుంటున్నాను" అంది. శ్రీధర్ ముందుకు వంగి "ఏమిటని" అన్నాడు

"నేను చెప్పిన మాటకు మీరు ఒప్పుకునేలా అయితేనే చెప్తాను."

"విషయ మేమిటో చెప్పండి. నాకు ఇష్టమయితే ఒప్పుకుంటాను. లేకపోతే లేదు."

"మీ కిష్టమవుతో కాదో నాకు తెలియదు. నేను చెప్పినదానికి మాత్రం మీరు ఒప్పుకోవాలి."

"దీన్నే మొండి వాదమంటాం మేము."

"మీ కోర్టులోని రూల్సు, రెగ్యులేషన్సు నా కక్కరలేదు. మీరు ఒప్పుకుంటారు కదూ?" సునంద మృదువుగా అడుగుతూ దీనంగా అతడి వైపు చూసింది.

ఆ కంఠం, ఆ చూపులకే లొంగిపోయాడతడు.

"ఏం చెప్తారో చెప్పండి"—తన లోపలి భావనలను కప్పి పుచ్చుకుంటూ అడిగాడు శ్రీధర్.

"ఈ ఊళ్ళో కలరా ఎక్కువగా ఉంది..."

"అవును, నాకూ ఆ విషయం తెలుసు."

"మా ఇంట్లో అందరం ఇనాక్యులేషన్ చేయించుకున్నాం."

"చాలా సంతోషం."

"మరి....మరి...మీరూ చేయించుకోండి" సునంద అతనివైపు చూడకుండా ఎక్కడో దృష్టి నిలిపి అంది.

శ్రీధర్ హడలిపోయినవాడిలా "అమ్మబాబాయ్! నేను పుట్టినప్పటి నుంచి ఒక్కమారుకూడా ఇలా పొడిపించుకోలేదు. ఇనాక్యులేషన్ కన్నా

క్షలరాయే నయం...."

"ఎందుకలాంటి మాటలంటారు?" సునంద కంఠంలో బాధ స్పష్టంగా ధ్వనించింది.

"నిజం చెప్పాలంటే నా కీ ఇనాక్యులేషన్‌లో నమ్మకం లేదు. దయచేసి క్షమించండి."

సునంద తల వంచుకుని కూర్చుంది. శ్రీధర్ తన మాటకు ఒప్పుకోకపోవటంతో ఏడుపు వచ్చింది. ఏడవకుండా ఉండటానికి ప్రయత్నిస్తూ "నా కోసం... నాకోసం వేయించుకోకూడదూ?" అంది.

శ్రీధర్ ఆమె కంఠం వణకటాన్ని, బుగ్గలమీదుగా ప్రవహిస్తున్న కన్నీటిని గమనించాడు. అయితే తాను అనుకున్నది నిజమేనన్నమాట.

"అలాగే, మీరు చెప్పారని చేయించుకుంటాను. మిమ్మల్ని నొప్పించలేను."

"ఈ రోజే వేయించుకోవాలి. ఇక్కడినుండి ఇంటికి వెళ్ళేటప్పుడు దోవలోనే వేయించుకుని వెళ్ళాలి."

"రైటో, మేడం."

"రేపు వచ్చి మీరు వేయించుకున్నారని చూపి వెళ్ళాలి."

"ఓ. కె."

"తరువాత... హోటల్లో కాఫీ టిఫెన్లు తీసుకోరాదు. ఈ కలరా వెళ్ళిపోయేవరకూ ఇంట్లో తప్పితే ఇంకెక్కడా ఏమీ తినకూడదు."

"మీ ఇంట్లోకూడా ఏమీ తినరాదా?"

"నేనలా అన్నానా? మా ఇంట్లో మాత్రం తినవచ్చు."

"జీ హుజూర్. ఈ సేవకుడికి చెప్పాల్సిందింకేమన్నా వుందా సర్కార్?"

"నేను చెప్పినదాన్ని మీరు సీరియస్‌గా తీసుకోవటంలేదు. అంతా తమాషా అనే అనుకుంటున్నారు. అందుకే ఇలా మాట్లాడు..."

శ్రీధర్ లేచి వచ్చి ఆమె కుడిచేతిని తన చేతిలోకి తీసుకొని ఆ అరచేతిమీద తన చెయ్యిపెట్టి "మీరు చెప్పినదాన్ని నేను అక్షరాలా పాటిస్తాను. అలా అని ప్రామిస్ చేస్తున్నాను" అన్నాడు.

సునంద అతనినుండి ఇలాంటి ప్రామిస్ వస్తుందనుకోలేదు.

ఉలిక్కిపడి తన చెయ్యి వెనక్కి తీసుకుని ఏమో చెప్పబోయింది. కాని గొంతు పెగలలేదు. శ్రీధర్ "నేనిక వెడతాను" అని చెప్పి ఇంటికి బయలేరాడు. గేటు దగ్గర ఎదురయిన సీతారాం "ఇంత తొందరగా వెళ్ళిపోతున్నారేం?" అన్నాడు.

"కొంచెం డాక్టర్ దగ్గరకు వెళ్ళాలి" అంటూ శ్రీధర్ సునంద వైపు చూశాడు.

"అలాగా, అయితే వెళ్ళండి" అన్నాడు సీతారాం

శ్రీధర్ వెళ్ళిపోయాడు. దినకర్‌వచ్చి భోజనానికి రమ్మని పిలిచే వరకూ సునంద అలాగే నిల్చుండిపోయింది. తన అరచేతిని బుగ్గమీద పెట్టుకుంది. వెంటనే చెయ్యితీసేసుకొని "సెంటిమెంటల్ ఫూల్" అని తన్ను తానే తిట్టుకుంది.

మర్నాడు శ్రీధర్ వచ్చి తను ఇనాక్యులేషన్ చేయించుకున్నట్టు సునందకు చెప్పాడు.

"ఇనాక్యులేషన్ చేయించుకున్నాను. కావాలంటే..."

"మీ మాటమీద ఆ మాత్రం నమ్మకం వుంది నాకు."

"శ్రీధర్, మీకి ఇనాక్యులేషన్‌లో నమ్మకం లేదనేవారు. అదెలా చేయించుకున్నారు?" అన్నాడు సీతారాం.

"ఎవరో ఒకరిమాట కాదనలేక చేయించుకోవాల్సి వచ్చింది" అంటూ శ్రీధర్ సునందవైపు చూసి నవ్వాడు.

సీతారాంకూడా సంతోషంతో నవ్వాడు. అయితే తననుకున్నట్టే అంతా జరుగుతోందన్నమాట. సీతారాంకి, సుందరమ్మగారికి, రావుగారికి గాని ఎవరికీ సునందకు పునర్వివాహం చేసుకోమని సలహాయిచ్చే ధైర్యంలేదు. విధవ అయిన సునందను మళ్ళీ సుమంగళిగా చేయడానికి ఏం చేయమన్నా చేయడానికి సిద్ధంగా ఉన్నారు. కాని, భర్త మరణంతో విరాగిణిగా జీవిస్తున్న సునందను మళ్ళీ పెళ్ళిచేసుకోమని చెప్పే ధైర్యం మాత్రం లేదు. సీతారాం నేర్పుతో సునంద మనస్సునే ఇటు తిప్పటానికి ప్రయత్నించాడు. శ్రీధర్ ఇంటికి వచ్చినప్పుడు వారిద్దరినీ మాటల్లో పడేసి తను నెమ్మదిగా అక్కడనుండి జారుకునేవాడు. వాళ్ళిద్దర్నీ కలిసి ఎక్కడికైనా వెళ్ళనిచ్చేవాడు. వాళ్ళిద్దరే వుండేలా చేత

నయినంత వరకు చేసేవాడు. సుందరమ్మగారు, రావుగారు, దమయంతికి కూడా వాళ్ళమధ్యకు వెళ్ళవద్దని చెప్పాడు. తనప్రయత్నాలు సఫలమయే సూచనలను చూసి అతడి సంతోషానికి అవధులు లేక పోయాయి.

దసరాకని స్కూళ్ళన్నీ మూసేశారు. పదిహేను రోజులు ఈ స్కూలు గొడవ లేకుండా హాయిగా ఉండవచ్చునని సంతోష పడింది సునంద. శ్రీధర్‌తో హాయిగా తిరగవచ్చుననే గుప్తమయిన కోరిక ఆమెను మరింత సంతోషపడేలా చేసింది.

మొదటిరోజు అన్నా, వదిన, శ్రీధర్‌తో కలిసి ఎగ్జిబిషన్‌కువెళ్ళి వచ్చింది. ఆ ఎగ్జిబిషన్ నుండి వచ్చేటప్పుడు శ్రీధర్ "రేపుమళ్ళీ అందరం వెడదాం" అన్నాడు. సీతారాంకూడా ఒప్పుకున్నాడు. సీతారాం, దమయంతి ఎదుట శ్రీధర్, సునందలు చనువుగా మాట్లాడుకోవటానికి సిగ్గుపడినా పరస్పర సాన్నిధ్యంతోనే తృప్తి చెందేవారు.

శ్రీధర్ అయిదు గంటలకు వస్తానని చెప్పాడు.

సునంద కొంచెం వదులుగా ముడివేసుకొని అర్థ చంద్రాకారంగా గులాబిపూల దండ పెట్టుకుంది. ముదురు నీలంరంగు జాకెట్టు వేసుకుని లేత నీలంరంగు జార్జెటుచీరె కట్టుకుంది. మెడలో ఓ ముత్యాల దండ వేసుకుంది. శ్రీధర్ తనకు ఇచ్చిన వ్యానిటీబ్యాగ్ తీసుకొని కిందకు దిగి వచ్చింది.

"వదినా, వదినా...మీరు ఇలాంటి చీరె కట్టుకోండి. ఇద్దరం ఒకే రకం చీరెలు కట్టుకుందాం" అంటూ దమయంతి కోసం వెదక సాగింది.

దమయంతి సునందను చూసి నవ్వి "నేనీ రోజు ఎక్కడికి రావటానికి వీల్లేదు" అంది. సునంద నిరాశతోనే అన్నయ్య దగ్గరకు వెళ్ళింది. అతడు "ఈరోజు నేను రాలేను సునందా, బెంగుళూరు నుండి నా స్నేహితుడు వచ్చాడు. అతడితోకలసి చాముండీ కొండకువెళ్ళాలి," అన్నాడు.

"అయితే శ్రీధర్‌తో ఇవాళ వెడదామనెందుకు చెప్పావ్?"

"ఈ స్నేహితుడు వస్తాడని నే నేమన్నా కలగన్నానా?"

"శ్రీధర్ వచ్చాక ఏం చెపుతావో చెప్పుకో, నాకేం."

సీతారాం చిలిపిగా "చెప్పేందు కేముంది? సునందను తీసుకొని వెళ్ళండి అంటాను" అన్నాడు.

"ఉహుం నే నొక్కదాన్నే వెళ్ళను బాబూ."

"నీతోబాటు శ్రీధర్ వస్తారు."

సునంద జవాబు చెప్పకముందే శ్రీధర్ లోపలికి వచ్చారు.

"రండి శ్రీధర్, మీకు వెయ్యేళ్ళాయుష్షు, దమయంతి ఈ రోజు ఎక్కడికి రావడానికి వీలులేదు. నేను నా స్నేహితుడిని చాముండీ కొండకు తీసుకొని వెళ్ళాలి, ఇప్పుడేంచేద్దాం?" అన్నాడు సీతారాం.

శ్రీధర్ సునందవైపు చూశాడు. ఆమె మొహంలోని భావాలను అర్థం చేసుకోవటానికి ప్రయత్నించి, విఫలుడై "అయితే ప్రోగ్రాం క్యాన్సల్ చేసేద్దాం" అన్నాడు.

"మేము రావటానికి వీలుపడలేదని, మీరెందుకు ప్రోగ్రాం క్యాన్సల్ చేసుకోవడం? మీరు, సునందా వెళ్ళిరండి"

"నాకేం అభ్యంతరం లేదు. కాని," అంటూ సునంద వైపు చూశాడు శ్రీధర్.

"నేను వెళ్ళను!" అంది సునంద.

"వెళ్ళటానికి రెడీ అయ్యాక అలా అనకూడదు సునందా!"

"ఆవిడ కంత ఇష్టం లేకపోతే బలవంతం చేయడం దేనికి" అన్నాడు శ్రీధర్.

"బలవంతమూలేదు. ఏమీలేదు. వస్తుంది, మొండిపట్టు పట్టక వెళ్ళు సునందా, ఇంకో రోజు అందరం కలసి వెడదాం."

సునంద అనుమానిస్తూనే "అలాగే" అంది. కాని ఆమెకు తన అలంకరణ చాలా బ్రహ్మాండంగా వుంది అనిపించింది. తనూ, దమయంతీ ఒకేరకంగా డ్రెస్ చేసుకోవచ్చునని ఇద్దరి దగ్గర ఉన్న లేత నీలంరంగు చీర కట్టుకుంది. ఈ ముస్తాబుతోనే శ్రీధర్‌తో వెళ్ళటమా? గదిలోకి వచ్చినప్పటినుండి శ్రీధర్ ఆమెనుండి దృష్టిమరల్చకుండా చూస్తున్నాడు. అతడితో తనొక్కతే ఇలా ముస్తాబు చేసుకొని...

"ఇంకా ఏమిటాలోచిస్తూ నిల్చున్నారు? బయలుదేరండి" అంటూ

సీతారాం వాళ్ళను బయలుదేర దీశాడు.

సునంద తలుపు వరకు వెళ్ళి వెనక్కి తిరిగి అన్నయ్యతో "దినూనికూడా తీసుకొని...." అంటుండగానే—

"దినూ వద్దు, యెవరూ అక్కర్లేదు, వాడు మధ్యలో ఏడవటానికి మొదలెట్టాడంటే ఏమీ చూడకుండా తిరిగి రావల్సివస్తుంది" అన్నాడు సీతారాం.

సునంద ఇంకేమి చేయలేక, శ్రీధర్‌తో బయలుదేరింది.

"జట్కాలో వెళదామా, నడిచే వెళదామా?"

"మీ యిష్టం."

"అయితే అంతా నా యిష్టానికే వదిలేశారా?"

"ఊఁ"

"నే నేమన్నా, ఏం చేసినా ఎదురు చెప్పరా?"

"ఉహుఁ చెప్పను"

"సరి, ఇప్పుడు జట్కాలోనే వెళదాం!" అంటూ జట్కాను పిలిచాడు శ్రీధర్. ఎగ్జిబిషన్ దగ్గర జట్కాదిగి సునంద టిక్కట్లు తేవటానికి వెళ్ళబోయింది. శ్రీధర్ ఆమెను ఆపాడు.

"అంతా నాయిష్టానికే వదిలేశారు. కనుక మీరు ఇక్కడే నిల్చుని ఉండండి, నేను టికట్లు తీసుకొని వస్తాను!" అంటూ టికట్లు తీసుకొని రావటానికి వెళ్ళాడు. అతను మళ్ళీ వచ్చేటప్పటకి సునందకు కొంచెం దూరంలోనే ఓముగ్గు రబ్బాయిలు సునందనే చూస్తూ నిల్చున్నారు. వాళ్ళను చూడగానే శ్రీధర్ హృదయం అసూయతో నిండిపోయింది. "అందమైన వస్తువు అందర్నీ ఆకర్షించటం సహజం" అనుకుని తన్ను తానే సమాధాన పర్చుకొని సునందవైపు చూశాడు. సునందవల్ల చీరకు అందం వచ్చిందో, చీరవల్ల సునందకు అందం వచ్చిందో తెలుసుకోలేక పోయాడు. శ్రీధర్ సునంద వద్దకురాగానే, ఆమెను చూస్తూ నిల్చున్న అబ్బాయిలు అక్కడి నుండి వెళ్ళిపోయారు. "ఒంటరిగా వచ్చింది. ఏడిపిద్దాం అనుకున్నారేమో" అనుకున్నాడు శ్రీధర్.

"ఇక వెళదాం పదండి." సునంద మౌనంగా అతడిని అనుసరించింది.

"చీరలేమైనా కొనుక్కుంటావా?"

"లేదు."

"దేవకన్యలు శాపవశాన భూమిమీద జన్మిస్తారు. నాకింత వరకు ఈ మాటపైన నమ్మకం లేదు।"

"ఇప్పుడో?"

"ఇప్పుడు అందులోను ఈరోజు మిమ్మల్ని చూశాక ఆ మాటమీద నమ్మకం వచ్చింది."

"ఓ సరి। మీరు భట్రాజులా పొగడకండి."

"నేనేం పొగడటంలేదు. ఉన్న దున్నట్లుగా చెబితే 'లా' ప్రకారం అది పొగడ్త అవదు."

"మీరు, మీ 'లా' రెండూ బాగానే ఉన్నారు."

"ఏం. నా కేమయింది?"

"ఏమీలేదు చాలా..." సునంద నాలిక కొరుక్కుని అక్కడే ఆగిపోయింది.

"ఆ వాక్యం పూర్తిచేయండి "

"ఉహుఁ. నేనిక చెప్పను."

"మీరు చెప్పి తీరాల్సిందే."

"ఖచ్చితంగా చెప్పను."

"నేనూ దినూలా ఉంటే పట్టుపట్టి ఏడ్చి రాగాలు తీసి..."

"ఇప్పుడూ పట్టుబట్టి చూడండి. నేను మీ కన్నా మొండిదాన్నే."

"మొండివాళ్ళకు బుద్ధి తెప్పించగలను నేను."

"నిరభ్యంతరంగా తెప్పించవచ్చు."

"హలో సునందా..."

వసంతలక్ష్మి, విజయ, వనజ ముగ్గురు ఎదురుపడ్డారు. ప్రశ్నార్థకంగా శ్రీధర్వైపు చూశారు వాళ్ళు.

"వీరందరూ నా కో టీచర్స్ ... వీరు మాఫ్యామిలీ ఫ్రెండ్ — శ్రీధర్."

"నమస్తే."

"ఏమేం కొన్నావు సునందా?"

"ఇంకా ఇప్పుడే వస్తున్నాను."

"మేం వెడతాం "

"మంచిది."

సునంద, శ్రీధర్ ఏడున్నరకు "మెర్రీ గోరౌండ్" దగ్గరకు వచ్చారు. కొంచెంసేపు దాన్నిచూసి, అక్కడనుండి "జెయింట్ వీలు" దగ్గరకు వచ్చారు.

"మనమూ ఎందుకెక్క గూడదూ?"

"ఇంత పెద్దవాళ్ళమయ్యాకనా ? అది చిన్నపిల్లలకు మాత్రమే."

"అక్కడ కూర్చున్నవాళ్ళందరూ చిన్నపిల్లలేనా?"

సునంద తలెత్తి చూసింది. ఓ తల్లి పిల్లవాడిని పక్కన కూర్చో పెట్టుకొని కూర్చుంది. ఓచోట ఇద్దరమ్మాయిలున్నారు. అరవైఏళ్ళ ముసలాయన తన స్నేహితుడితో కలని కూర్చున్నారు.

"నాకు భయం బాబూ. నేను రాను."

"నేను మీలోనే వుంటానుగా, భయందేనికి?"

"అయినా నాకు భయం, కళ్ళు తిరగవచ్చు."

"టికట్లు తెచ్చేస్తాను. తెమ్మన్నారా?"

"వద్దు బాబూ, వద్దు నాకు చాలా భయం."

"మొదట్లో కొంచెం భయంవేసినా తరువాత అంతా సరిపోతుంది. తెమ్మన్నారా?"

సునంద సంశయిస్తూనే ఒప్పుకుంది. శ్రీధర్ టికెట్లు తెచ్చాడు. ఇద్దరూ ఖాళీగా ఉన్న బెంచిమీద కూర్చున్నారు.

"నాకు భయం వేస్తోంది వీలు పైకివెళ్ళి కిందకు వచ్చేటప్పుడు కళ్లు తిరుగుతాయేమో అలా అయితే?"

"అప్పుడు నేనుంటానుగా."

"మీరుండి ఏంచేస్తారు?"

"మీకు భయం కలగకుండా చూసుకుంటాను!" అని శ్రీధర్ అంటుండగానే చక్రం తిరగసాగింది. మొదట్లో నెమ్మదిగా తిరిగినా, పోనుపోను వేగాన్ని అందుకుంది. సునందకు కళ్ళు చీకట్లు క్రమ్మాయి కళ్ళు తిరిగి తను పడిపోతున్నట్టుగా అయింది. చిన్నగా కేకవేసి ఆమె

శ్రీధర్ భుజాన్ని గట్టిగా పట్టుకుంది.

"ఓ చిట్టిపాపాయీ" అంటూ శ్రీధర్ ఆమె భుజంచుట్టూ చెయ్యి పోనిచ్చి సునందను తనవైపుకు లాక్కున్నాడు.

"ఇప్పుడు?" అన్నాడు.

సునందకు ఇప్పుడు భయంగాలేదు. కాని భావోద్వేగపు వేడిమికి ఆమె శరీరంలోని రక్తం వేగంగా ప్రవహించసాగింది. ఆమె మొహం అస్తమయ సూర్యుడి కాంతిని రంగరించుకుంది. అబ్బ! అతడి చేతుల్లో ఎంతటి బలం వుంది. అతడలా గట్టిగా పట్టుకోవడంవల్ల ఆమె చేతులు నొప్పి పెడుతున్నాయి. అయినా యీ క్షణమే శాశ్వతం కావాలని కోరుకుం దామె హృదయం.

శ్రీధర్ సునందవైపు తిరిగాడు. ఆమె కళ్ళు ఆకాశంలో మెరిసే తారల్లా తళ తళ లాడుతున్నాయి. అతడి హృదయంలో వెయ్యి జల పాతాలు దూకుతున్నట్లు సముద్రం హోరు పెడుతున్నట్టు చప్పుడు వినిపిస్తోంది. తానేదో పెద్ద ప్రవాహంలో కొట్టుకొని పోతున్నట్టు అనిపించిం దతడికి. ఈ క్షణమే చిరకాలం ఉండాలని కోరుకుం దతని హృదయం.

ఆ చక్రపువేగం తగ్గగానే శ్రీధర్ ఆమెను చుట్టిన తనచేతుల్ని తీసేసుకున్నాడు.

ఇద్దరూ కిందికి దిగారు. సునంద అడుగులు తడబడుతున్నాయి. శ్రీధర్ పట్టుకున్న భుజం ఇంకా నొప్పిగా ఉంది.

"చాలా భయం వేసిందా, సునందా!"

శ్రీధర్ మొట్టమొదటి మారుగా సునందను పేరుపెట్టి మాట్లాడాడు.

"ఊఁ, నేనెంత వద్దన్నా మీరు వినలేదు..."

"ఇప్పుడయిన పెద్దప్రమాదమేమిటి?"

ప్రమాదమా? ఇప్పుడయిన ప్రమాదం చాలదూ? తన హృదయంలో చిన్నపిల్లలు బొమ్మలాడుకునేలా ఆడుకున్నాడే. అది చాలదూ? తన హృదయంలో ప్రేమజ్యోతిని వెలిగించాడే!

"మీరుచేసేది ఒకటికాదు బాబూ!" సునంద కోపగించుకున్నట్టు అంది.

"నేనేం చేశానిప్పుడు?"

"అబ్బ! మీ చేతుల్లో ఎంత బలముంది! నా చెయ్యి ఇంకా నొప్పి పుడుతోంది."

"పుష్పాన్ని ఎలా పట్టుకోవాలో నాకు తెలియదు. అయినా ఆడ దాని చెయ్యి గదానని అయినంత తేలిగ్గా పట్టుకున్నాను."

"ఇప్పుడు మీరు పట్టుకున్నదే తేలిక అంటే మీరు కఠినంగా పట్టుకుంటే ఎలా వుంటుందో చూడాలి."

"ఇంకోమారు కూర్చుందాం రండి. అప్పుడు నేను కఠినంగా పట్టుకుంటే ఎలా ఉంటుందో చూపిస్తాను."

"ఎముకలు విరగ్గొట్టుకోవాలని నాకేం కోరిగ్గాలేదు."

"చాలా నొప్పిగా ఉందా? క్షమించండి."

"అలాగే, ఈమారు క్షమించాను." సునంద చిలిపిగా అంది.

"అంటే ఇంకోమారు క్షమించనని అర్థమా?"

"మీరు లాయర్లు, మీతో వాదించలేను నేను."

ఇద్దరూ కొంచెంసేపు మౌనంగానే నడిచారు. శ్రీధర్ ఏదో ఆలోచిస్తున్నట్టు కనపడ్డాడు.

"ఏమిటో చాలా ఆలోచిస్తున్నట్టున్నారు?"

"ఏంలేదు. మిమ్మల్నో విషయం అడుగుదా మనుకుంటున్నాను."

అతడేం అడిగేస్తాడో అని భయపడింది. అయినా అతడేంచెప్తాడో నన్న కుతూహలం ఓవైపు బాధిస్తోంది.

"ఏమిటది?" భయం, కుతూహలంతో అడిగింది సునంద.

"రోమన్ హాలిడేకి వెళ్ళినపుడు మీరు అవమానించారు. జ్ఞాపకముందా?"

"దాన్నంతా ఇప్పుడెందుకు జ్ఞప్తికి తెస్తున్నారు?"

"దానికి బదులు ఇంకో రోజు నాతో రావటానికి ఒప్పుకున్నారు. రేపు 'నాక్ అన్ ది వుడ్'కి వెడదామా?"

"ఈరోజు మీతో వచ్చానుగా మళ్ళీ ఎందుకు?"

"ఈరోజు మీ అన్నయ్య బలవంతానికి వచ్చారు."

"రేపు మీ బలవంతానికి రావాలి అంతేనా."

"అయితే మీరై మీరే నాతో ఒక్కరోజు రాకూడదా?"

ఒక్కరోజేనేమిటి. తన జీవితమంతా అతడితో వెళ్ళటానికే సిద్ధంగా ఉంది సునంద.

"నేను మీతో చాలా మాట్లాడాలి."

"ఇంట్లోనే మాట్లాడవచ్చునే?"

"ఇంట్లో వీలుబడదు. మీ అన్నయ్యా, వదినా, అమ్మా, నాన్నా అందరూ వస్తూపోతూ ఉంటారు. మీ రొక్కరే ఉండగా..."

"అదేమిటిబాబూ అంత రహస్యం? ఇప్పుడు మనిద్దరమే ఉన్నాంగా చెప్పండి."

"ఉహుం. ఈరోజు వీల్లేదు నేను రేపే చెప్పాలి."

"అలానే వస్తాను."

"మీరు ఇష్టపడే వస్తున్నారా? లేకపోతే నా బలవంతం..."

"నేను మొండిదాన్నని ముందుగానే చెప్పాను. నాకిష్టం లేకపోతే ఏం చేసినా వచ్చేదాన్ని కాదు."

"రేపు అయిదు గంటలకు మీ యింటికి వస్తాను."

"అలాగే."

తరువాత ఇద్దరూ మాట్లాడకుండానే నడక సాగించారు. శ్రీధర్ ఆమెను ఇంట్లో దిగబెట్టి సీతారాంతో ఓ రెండు నిమిషాలు మాట్లాడి ఇంటికి వెళ్ళిపోయాడు.

సునంద మేడ ఎక్కి తన గదిలోకి వెళ్ళి కూర్చుంది. ఎదురుగుండా ఉన్న నిలువుటద్దంలో ఆమెకు తన ప్రతిబింబం కనబడింది.

బుగ్గల్లోని ఎరుపు, కళ్ళల్లోని తళతళలు పెదవులపై వికసించిన చిరునవ్వు.. సునంద ఓ క్షణం తన ప్రతిబింబాన్ని తానే మోహించింది. కాని కొద్ది క్షణాల్లోనే అద్దంలోని మోహిని జీవచ్ఛవమయింది.

బుగ్గల్లో ఎరుపు మాయమయి బుగ్గలు పాలిపోయాయి. నుదుటి మీద స్వేదబిందువులు నిలిచాయి. కళ్ళల్లోని తళతళలు అదృశ్యమయ్యాయి పెదవులమీది చిరునవ్వు మటుమాయమయింది.

ఆమె హృదయంలో అదో రకమయిన బాధ, మంట, అసంతృప్తి, అశాంతి బయలుదేరాయి.

నే నిక జీవించలేను, జీవించకూడదు అనుకుంది సునంద. ఆమె మొహం ఉద్రేకంతో ఎర్రబడింది. సునంద ఏదో అవ్యక్తశక్తికిలోనయి డ్రాయర్ తెరచి అందులో వున్న పళ్ళు కోసే చాకు తీసుకుని గొంతు వరకూ తీసుకుని వెళ్ళింది.

"అత్తయ్యా భోజనానికి లేవండి" అంటూ దినకర్ తలుపు తట్టాడు. సునంద ఉలిక్కిపడి వెనక్కి తిరిగింది. ఆమె చేతిలోఉన్న చాకు కిందపడి చప్పుడు చేసింది.

ఆ చప్పుడు సునంద నీ లోకంలోకి తెచ్చి పడవేసింది. తాను ఆత్మహత్య చేసుకోవటానికి ప్రయత్నించిందా? ఎందుకు? తనకే మయిందసలు? తనకు ఒంటిమీద తెలివి లేకుండా ఏమయింది?

సునంద నేలమీద పడిఉన్న చాకును తీసి డ్రాయరులో పెట్టి తలుపు తెరచింది దమయంతి లోపలికి వచ్చింది

"ఇంకా బట్టలు మార్చుకోలేదా? ఇది మరీ బావుంది. ఇంత సేపూ తలుపులు వేసుకుని తపస్సుచేస్తూ కూర్చున్నారేమిటి?" అంది.

"అవును నన్నుచూస్తే మీకందరికీ అంతే" అంటూ సునంద ఏడవసాగింది.

దమయంతి నిశ్చేష్టురాలయింది. సునంద ఎన్నడూ ఇలాచేసి ఎరుగదు. దమయంతి సునంద నెన్నోమార్లు ఏడిపించింది. కాని ఎన్నడూ సునంద ఇలా ఏడవలేదు. ఎన్నోమార్లు సుందరమ్మగారు కోడలితో "సీతారాంది జేల మనస్సు. తొందరగా ఏడ్చేస్తాడు కాని సునంద అలా కాదు. తొందరగా ఏడుపురాదు ఆమెకు" అని చెప్పారు.

అలాంటి సునంద ఇంత చిన్నమాటకే ఇలా ఏడవాలా?

"నన్ను క్షమించండి సునందా. నేను మీకు ఏడుపు వచ్చేలా ఏమన్నానో నాకు తెలియదు, అయినా నన్ను క్షమించండి."

కొంచెంసేపు అయ్యాక సునంద ఏడుపు తగ్గింది. ఏడుపు తగ్గాక దమయంతితో "మీరు నన్ను ఏమీ అనలేదు వదినా, కాని ఎందుకో ఏడుపు వచ్చింది కాని నేను ఏడిచానని అన్నయ్యతోగాని, అమ్మతో గాని చెప్పకండేం" అంది.

"అలాగే చెప్పనులెండి."

"నిజంగానే చెప్పకండి....నామీద ఒట్టు."

దమయంతి ఒప్పుకుంది. సునంద బట్టలు మార్చుకుని కిందికి వెళ్ళింది.

మర్నాడంతా ఆలోచనలతో సునందకు మనస్సు స్థిమితంగా లేదు.

శ్రీధర్ తనతో చెప్పాల్సిన విషయమేమిటి? అందులోనూ తామిద్దరే ఉండేటప్పుడు! అతనేం అడుగుతాడో సునంద ఊహించుకుంది. అతడికి తనేం జవాబు చెప్పాలి? అయినా అతడికి చెప్పకుండా ఆ సమయానికి సరిగ్గా ఎక్కడకైనా వెళ్ళిపోతే ఏం? ఊహుం అది పిరికిపంద లక్షణంతప్ప మరింకేమీ కాదు. వచ్చినదాన్ని ఎదిరించి ఆ క్షణంలో ఎలాతోస్తే అలాగే చేయటం మంచిది.

స్కూల్లో ఆఖరి పీరియడ్ సునందకు కొంచెం తల నొప్పిగా వుంది. లీవ్ తీసుకొని ఇంటికి వెళ్ళిపోయింది. సీతారాంకూడా కోర్టునుండి ఇంటికొచ్చాడు. శ్రీధర్ తన్ను 'నాక్ అన్ ది వుడ్'కి పిలిచిన విషయం సునంద అన్నయ్యతో చెప్పి "ఆయనతో వెళ్ళనా వద్దా అన్నయ్యా?"

"వెళ్ళు."

సునంద కొంటెగా అడిగింది. "అదికాదన్నయ్యా! శ్రీధర్‌తో నన్నింత ధైర్యంగా ఎక్కడికంటే అక్కడికి పంపుతున్నావుగదా. రేపు ఏమైనా పొరబాటు జరిగితే!"

"నాచెల్లెలివిషయం నాకు తెలియదా? ఎప్పుడూ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయదు."

అన్నయ్యకు తనపై ఉన్న విశ్వాసాన్ని చూసి పొంగిపోయింది సునంద.

"నేను మంచిదాన్నే కావచ్చును కాని శ్రీధర్?"

"అతడి స్వభావం నీకన్నా నాకు బాగా తెలుసు. నువ్వు చిన్న పిల్లగా ఉన్నప్పటినుండి నా స్నేహితులతో మాట్లాడి చూశావుగదా. వాళ్ళలో ఎవరైనా ఏనాడైనా అసభ్యంగా ప్రవర్తించారా? నీలాంటి అందమైన అమ్మాయిలతో మాట్లాడుతున్నా......"

"స్నేహితుల్ని ఎంచుకోవడంలో నిన్ను మించినవాళ్ళెవరూ లేరులే అన్నయ్యా?"

"స్నేహితుల కేమిటి, బోలెడంతమంది ఉన్నారు. ఇంట్లోకి మాత్రం కొద్దిమందికే ప్రవేశముంది. శ్రీధర్ చాలా మంచివాడు."

"అయినా ఈరోజు ఆయనతో వెళ్ళటాని కిష్టంలేదన్నయ్యా."

"అయితే నీ యిష్టం, నేనేం బలవంతం చేయను."

"ఏం చెయ్యమన్నావన్నయ్యా?"

"నన్నడిగితే వెళ్ళమనే చెప్తాను."

"అలాగే వెడతాను" అంటూ సునంద మేడమీదికి వెళ్ళింది ముస్తాబు చేసుకోవటానికి.

రావుగారు సీతారాంచర్యలను ఆక్షేపించేవారుకాదు. సుందరమ్మ గారికి మాత్రం సునంద అలా శ్రీధర్‌తో చనువుగా తిరగటం ఇష్ట ముండేది కాదు. కూతురికి మళ్ళీ పెళ్ళి చేసుకోవాలని ఎంతో ఆశగా ఉన్నా, తామిచ్చిన స్వాతంత్ర్యాన్ని ఆమె దురుపయోగం చేసుకుంటే- అన్న భయం ఆమెను వెంటాడుతూనే ఉండేది. ఎంతయినా సునంద యువతి. ప్రపంచంలో ఎలాంటివారుంటారో ఎవరికి తెలుసు ? శ్రీధర్ మంచి కుర్రాడే కావచ్చును అయినా యౌవనంలో ఉన్న స్త్రీ పురుషులు చనువుగా కలిసి తిరిగేటప్పుడు వారి మనోభావా లెలా ఉంటాయో ఎవరు చెప్పగలరు? ఏదైనా చెడ్డ గడియల్లో తమ కోరికలకు బలి అయిపోతే? మాతృ హృదయం అను క్షణమూ కూతురిని గురించే చింతించేది. ఆమె తన భయాన్ని గురించి కొడుకుతో చెప్పినప్పుడు అతడు నవ్వి "నీ కూతురిపైనే నీకు నమ్మకం లేదుటమ్మా?"అన్నాడు.

"ఎంతయినా వయస్సులో వున్నా రిద్దరూ. రేపేమైనా అయితే?"

"దాన్ని గురించి నువ్వేం బెంగ పెట్టుకోకమ్మా. నువ్వు నన్నెంత నమ్మవచ్చునో శ్రీధర్ని అంతే నమ్మవచ్చు. నేను అతడి గురించి ఏమీ తెలుసుకోకుండా సునందను అతడితో తిరగనిచ్చేవాడినా అమ్మా? నా చెల్లెలి సౌఖ్యమేకదా నాక్కావలసిందీను "

"సరే నీ ఇష్టం ఏమయినా చేసుకో" అన్నారు సుందరమ్మగారు.

సీతారాం ధైర్యంగా చెల్లెల్ని ఆమె మార్గంలో వెళ్ళటానికి ప్రోత్సహించాడు.

సునంద తయారుఅయి కిందకు వచ్చేలోగా శ్రీధర్ కూడ వచ్చాడు. మర్యాదకు శ్రీధర్ సీతారాంని కూడా పిలిచాడు. సీతారాం వినయంగానే "ఈరోజు మీరు వెళ్ళండి, ఇంకోరోజు అందరం కలిసి వెడదాం" అన్నాడు.

శ్రీధర్ సునందను తీసుకుని బయలుదేరాడు. అతడు తనచేతి గడియారంలో టైం చూసి 'అయిదుంపావయింది. సినిమా ఆరున్నరకు మొదలవుతుంది. ఏదైనా హోటలుకు వెడదామా?' అన్నాడు. సునంద ఒప్పుకుంది.

మార్కెట్టుకు వెళ్ళే బస్సు ఎక్కి ఇద్దరూ ఇంద్రభవన్‌కు వెళ్లారు. 'ఫ్యామిలి' అని రాసి ఉన్న గదిలోకి వెళ్ళి కూర్చున్నారు. శ్రీధర్ తమ వెనకే వచ్చిన సర్వర్‌తో టిఫిన్ తీసుకుని రమ్మని చెప్పాడు. సర్వర్ బయటికి వెళ్లాడు.

"చాలా ఉక్కగా ఉందికదూ?" సునంద అడిగింది.

"అవును."

శ్రీధర్ చాలా మౌనంగా కూర్చున్నాడు. సునందే మళ్ళీ అడిగింది. "నాక్ ఆన్ ది వుడ్ బావుందటనా?"

"అలా అని ఎవరో అన్నారు."

మళ్ళీ మౌనం వాళ్ళిద్దరి మధ్యా ఆవరించింది. మాట్లాడకుండా ఒకర్నొకరు చూసుకుంటూ కూర్చోవటమెలా? సునందకు ఏం మాట్లాడాలో తెలియలేదు. కిటికీలోనుండి బయటికి చూస్తూ తనలోనే చెప్పుకుంటున్నట్టు "చాలా ఉక్క" అంది.

శ్రీధర్ చిరునవ్వు నవ్వుతూ "ఇది రెండోమారు" అన్నాడు.

"ఏది?"

"చాలా ఉక్కగా ఉందని మీరు చెప్పటం రెండోమారు"

"మీరిలా మౌనం వహిస్తే నన్నేం చేయమన్నారు?"

శ్రీధర్ ఏమో మాట్లాడటానికి ప్రయత్నించాడు. కాని మాట పెగల్లేదు. జేబులో చెయ్యిపెట్టి చిన్న చీటితీసి సునందముందు పెట్టి

మొహం తిప్పుకున్నాడు. సునంద శ్రీధర్ మొహాన్ని పరీక్షగా చూసింది. శ్రీధర్ తన ముఖం ఆమెకు కనబడనీయకుండా తల తిప్పుకున్నాడు. సునంద టేబుల్ మీద ఉన్న కాయితాన్ని చూసింది. వణుకుతున్న చేతులతో ఆ కాయితాన్ని తీసుకుంది. కంపిస్తున్న వేళ్ళతో మడిచి ఉన్న కాయితాన్ని విప్పింది. ఆమె కళ్ళు తొందరగా ఆ అక్షరాలమీద పరుగెత్తాయి.

"నేను నిన్ను ప్రేమిస్తున్నాను. పెళ్ళి చేసుకుంటావా ?"

"ఓహ్" అంది సునంద. ఆమె కళ్ళు చీకట్లు కమ్మాయి. తల తిరిగినట్టయింది.

తలుపు తెరుచుకుని సర్వర్ టిఫిన్, నీళ్ళు వాళ్ళముందు పెట్టి వెళ్ళిపోయాడు.

శ్రీధర్ మళ్ళీ సునందవైపు తిరిగినప్పుడు ఆమె ఆ కాయితాన్ని చేతిలో పట్టుకుని శ్రీధర్ మొహాన్నే చూస్తూ కూర్చుంది. కాని ఆమె మొహం వివర్ణ మయింది శ్రీధర్ ఏమీ జరగనట్టుగానే "టిఫిన్ తీసుకోండి" అన్నాడు.

సునంద ఓ రాతిబొమ్మలా కూర్చుంది. శ్రీధర్ క్షమాపణ కోరే వానిలా "నేను అలా అడగటం మీ కిష్టం లేకపోతే క్షమించండి" అన్నాడు.

"మీకు నా విషయం పూర్తిగా తెలుసా ? నేను విధవను."

"నాకు తెలుసు." చాల నిర్లిప్తంగా అన్నాడు శ్రీధర్.

"మీకెవరు చెప్పారు ?" సునంద ఆశ్చర్యంతో అడిగింది.

"మీ అన్నయ్యే ఓమారు చెప్పారు."

"తెలిసి తెలిసి నన్ను పెళ్ళి చేసుకుంటారా?"

"దీన్లో తప్పేముందిసునందా? మగవాళ్ళు రెండుమూడు పెళ్ళిళ్ళు చేసుకోవచ్చునన్నపుడు స్త్రీని మాత్రం అలా పెళ్ళి చేసుకోరాదనటం ఏం న్యాయం ? జీవితంలో సుఖాన్ని అనుభవించటానికి పురుషుడికెంత అధికారముందో స్త్రీకి అంతే అధికారముంది మీరు పెళ్ళిచేసుకోవటంలో తప్పేమీలేదు."

"తప్పని నేను చెప్పానా ? వితంతు వివాహం తప్పని నేనూ

ఎప్పుడూ అనుకోలేదు. కాని ప్రపంచంలో ఎంతమంది మీలాంటి విశాల హృదయులు ఉంటారు చెప్పండి? మీ ఇంట్లోవాళ్లొప్పుకుంటారా?"

"మీరు ఒప్పుకుంటే ఇంట్లో వాళ్ళను సులభంగా ఒప్పిస్తాను."

"వాళ్ళుకనక ఒప్పుకోకపోతే?"

"నా జీవితంలోని సుఖసంతోషాలు నాకు చెందినవేగాని వాళ్ళకు చెందినవి కాదు. నా సుఖసంతోషాలకు వాళ్ళేమీ అడ్డు చెప్పరనే అనుకుంటున్నాను. మీ అంగీకారమే నాకు ముఖ్యం."

సునంద తలదించుకుంది.

"ఏం చెప్తారు?"

"మీ దగ్గర పెన్నుంటే ఇవ్వండి. నోటితో చెప్పలేను, రాసి చూపిస్తాను."

శ్రీధర్ జేబులో నుండి పెన్ను తీసి సునందకిచ్చాడు. సునంద శ్రీధర్ రాసిన వాక్యం కిందే "నా కిష్టమే" అని రాసి ఇచ్చింది.

శ్రీధర్ ఆమె రాసినదాన్ని చూశాడు. ఏమో చెప్పుదామని నోరు తెరచేలోగా సర్వర్ లోపలికి వచ్చాడు.

"ఏం కావాలి సార్?" అని టిఫిన్ పళ్లాల వైపు చూశాడు. టిఫిన్ తాను తెచ్చి పెట్టింది తెచ్చి పెట్టినట్టేవుంది. కనీసం ముట్టుకున్నట్టయినా లేదు. మంచివారే అనుకున్నాడా సర్వర్.

"ఏమీ వద్దు బిల్ తెచ్చిపెట్టు."

సర్వర్ బయటికి వెళ్ళిపోయాడు.

"సినిమాకు టైమవుతోంది సునందా, టిఫిన్ తీసుకోండి."

"తీసుకోండి అంటే నేను తినను."

"ఇంకేమనాలి?"

"తీసుకో అంటే తింటాను."

"అలాగే కానీయి. తీసుకో సునందా."

ఇద్దరూ టిఫిన్ తిని హోటల్ బిల్లు చెల్లించి బయటికి వచ్చారు.

శ్రీధర్ చేతి గడియారం చూసుకున్నాడు. అప్పుడే ఆరున్నరయిపోయింది.

"సినిమాకు టైమయిపోయింది. ఏం చేద్దాం?"

"ఇంటికి వెడదాం."

"తిన్నగా వెళ్ళద్దు చుట్టుదోవగుండా వెడదాం" అన్నాడు శ్రీధర్."

ఇద్దరూ ఇల్లు చేరేటప్పటికి ఎనిమిదిగంటలయింది. వారిని చూసి సీతారాం "ఇంత తొందరగా సినిమా అయిపోయిందా?" అన్నాడు.

సునంద "మేం సినిమాకు వెళ్ళలా" అంది.

"మరింకెక్కడికి వెళ్ళారు?"

శ్రీధర్ చెప్పాడు "హోటల్‌కు వెళ్ళి అక్కడినుండి ఇంటికి వచ్చేశాం."

సునంద కళ్ళతోనే శ్రీధర్ ఆ గౌరవం తీసుకుని గదిలోనుండి బయటకు వెళ్ళిపోయింది. శ్రీధర్ సీతారాంతో కొంచెంసేపు మాట్లాడి ఇంటికి వెళ్ళిపోయాడు.

సునంద భోజనం చేశాక పడుకోవడానికి మేడమీదికి వెళ్ళింది. తను పడుకోబోతుండగా సీతారాం చెల్లెలు గది తలుపు దగ్గర నిల్చుని "కంగ్రాచ్యులేషన్స్" అన్నాడు. సునంద తలవంచుకొని నిలబడింది. "పడుకో గుడ్‌నైట్" అని చెప్పి సీతారాం వెళ్ళిపోయాడు

సునంద లైటార్పేసి పడుకుంది. వెన్నెల కాంతిలో గదిలోని ప్రతివస్తువూ — స్పష్టంగా కనబడుతోంది. కిటికీ ఊచలకు అల్లుకున్న సన్నజాజి తీగలు, టేబుల్‌మీదున్న టేబుల్‌క్లాత్. దాని చుట్టూ తానే చేసిన, అల్లికపని శేఖరు ఫోటో స్టాండుమీద తాను వేసిన చీర...

సునంద ఓమారు గదినంతా పరిశీలనగాచూసి కళ్ళుమూసుకుంది.

ఉదయం సునందలేచేటప్పటికి ఎనిమిదిన్నరఅయింది. సూర్యుడి కిరణాలు గదినంతా ప్రకాశవంతం చేశాయి. కళ్ళు తెరవగానే సునంద గడియారంవైపు చూసి 'అబ్బ! ఎనిమిదిన్నరయిందే! ఇంతసేపటివరకూ మెలకువ ఎందుకని రాలేదు' అనుకుంటూ లేచింది. ఆమెకు ఒళ్ళంతా భారంగా ఉన్నట్టనిపించింది. తలనొప్పిగాకూడా ఉంది. నెమ్మదిగా లేచి కిందకు వచ్చింది.

ఇంట్లో అందరికీ చాలా సంతోషంగా ఉంది. సునంద మళ్ళీ పెళ్ళిచేసుకోబోతూందన్న విషయం అందరినీ ఆనందపరిచింది. వయ

స్సులో ఉన్న కూతురు అలా భర్తలేకుండా ఒంటరిగా జీవిస్తూండటాన్ని చూసినప్పుడల్లా సుందరమ్మగారి కడుపు తరుక్కుని పోయేది. సునంద ఓ కొత్త నగ పెట్టుకున్నా, ఓ కొత్త చీర కట్టుకుని అందంగా మెరిసి పోతూ తిరుగుతున్నా ఈ అందం, యౌవనం అడవిగాచిన వెన్నె లయిందని బాధపడే దామె. జీవితానందాన్నే కోల్పోయిన సునంద జీవితంలో మళ్ళీ జీవనజ్యోతిని వెలిగించడానికి శ్రీధర్ ముందుకు వచ్చినప్పు డా మాతృహృదయానికి కలిగిన సంతోషానికి అంతే లేక పోయింది.

కాని అందరికన్నా ఎక్కువ సంతోషంగా ఉండాల్సిన సునంద కే సంతోషంగాలేదు. ఇంట్లోవాళ్ళతో మాట్లాడేటప్పుడు తన బాధలను కొంతవరకూ మర్చిపోగలిగేది. శ్రీధరు సాన్నిధ్యంలో ఆమెకు మరి యేదీ గుర్తుకొచ్చేది కాదు. ఎవరూ లేకుండా తన గదిలో ఒంటరిగా కూర్చున్నప్పుడు ఆమె మొహంలో నవ్వు అంతరించేది. అకారణంగానే కళ్ళలో నీళ్ళు తిరిగేవి. ఆత్మహత్యను గురించిన ఆలోచనలు రోజుకో మారైనా ఆమె మదిలో మెదిలేవి.

సునంద కాఫీతాగి స్నానంచేసి తన గదికి వచ్చింది. కాళ్ళు నొప్పిగా ఉంటే నిల్చుని జడవేసుకోలేక చిన్న అద్దం టేబుల్‌మీద పెట్టి అక్కడే ఓ కుర్చీమీద కూర్చుని తల దువ్వుకోసాగింది. సగం జడ వేసుకున్నాక ఎందుకో గదిలో ఏదో లేనట్టు వెల్తిగా కనిపించింది.

ఎందుకో గది బోసిగా ఉందే అనుకుంటూ సునంద గదినంతా ఓమారు పరిశీలనగా చూసింది. అన్ని వస్తువులూ అవి ఉండాల్సిన చోట్లోనే ఉన్నాయి.

తను సరిగ్గా చూడలేదేమో ఇంతకుముందు ఈ గదిలోనే ఉన్న వస్తువు ఏదో ఇక్కడ ఇప్పుడు లేదు, ఏదబ్బా అది!

సునంద మళ్ళీ చుట్టూ చూసింది.

టేబుల్ మీదున్న శేఖర్ ఫోటో మాయమయింది.

సునంద వెంటనే లేచి నిల్చుంది. మళ్ళీ ఇంకోమారు చుట్టూ చూసింది.

సునంద శేఖర్ల వివాహమయిన దగ్గర్నుండి ఒక్కరోజయినా ఆ

ఫోటోని టేబుల్ మీదినుండి కదల్చలేదు.

తనే మర్చిపోయి ఇంకెక్కడైనా పెట్టిందా? లేదే? నిన్నరాత్రి పడుకోబోతున్నప్పుడు వెన్నెల కాంతిలో టేబుల్‌మీద ఉన్న ఫోటో స్పష్టంగా కనబడింది. అప్పుడున్నది అంతలోందరగా ఎక్కడకుమాయ మయింది? లేకపోతే ఎవరయినా తీసుకున్నారా? ఉదయం నుండి ఎవ్వరూ గదిలోకి రానేలేదు.

సునంద హడావిడిగా గదంతా వెతికింది. గదిలో అన్నిచోట్లా వెతికింది.

కాని, శేఖరు ఫోటో ఎక్కడా కనిపించలేదు. ఇంట్లోవాళ్ళను అడుగుదామా అనుకుంది సునంద మొదట. ఎక్కడ పోయిందో-ఏమిటో దానికింత గొడవ పెట్టడం దేనికి అనుకుంటూ గోడమీదకు దృష్టి సారించింది.

ఆ గోడమీద పెళ్ళిలో సునందా శేఖర్లను ప్రక్క-ప్రక్కగా నిలబెట్టి తీసిన ఫోటో ఉంది. ఆ ఫోటోలో సునంద ముగ్ధంగా, పసిపాపలా చిరునవ్వు నవ్వుతోంది. కొంచెం శేఖరం మీదకు వాలి ఉంది ఆమె. ఇద్దరూ పూలమాలలతో అలంకృతులై జీవిత ప్రథమ సోపానం మీద నిల్చుని తీయించుకున్న ఫోటో అది.

పోనీ, ఇదయినా ఉందికదా నయం అనుకుని ఊరుకుంది.

స్కూలునుండి ఇంటి కొచ్చేటప్పటికే తల బాగా వాస్తోందని గదిలోకి వెళ్ళి పడుకుంది సునంద. దినకర్ వచ్చి శ్రీధర్ వచ్చారని చెప్పటంతో మేడదిగింది. శ్రీధర్‌ని చూడగానే తలనొప్పి సగంతగ్గింది. మండుతున్న హృదయానికి శాంతి చేకూరింది. సునందకు అతడి గుండెల్లో తలదాచుకుని, 'మీరు నన్ను వదలి ఎక్కడికీ వెళ్ళకండి. మీరు వెళ్ళిపోతే నాకెలాగో ఉంటుంది. మీరు నా ఎదుట ఉంటే అన్నింటినీ మరిచిపోగలను' అని చెప్పాలనిపించింది.

సునంద శ్రీధర్ ఎదురుగుండా ఉన్న కుర్చీలో కూర్చుంది.

"తలనొప్పి చాలా ఎక్కువగా ఉందా?" శ్రీధర్ మృదువుగా అడిగాడు.

"ఏదో కొద్దిగా......"

"నా దగ్గర తల నొప్పిని పోగొట్టే మందుంది. ఇవ్వనా?"

సునంద చిరుకోపంతో "పోండి మీరు మరీను..." అంది.

"నిన్ను ఇక్కడే వదిలేసి నే నెక్కడికి వెళ్ళను?"

"నన్ను తీసుకునే వెళ్ళండి."

"ఈ వేసంగివరకూ నిన్ను నాతో పంపరట మీ అమ్మా నాన్నా."

"దానికి నన్నేం చేయమన్నారు!"

"నువ్వు ఏమీ చెయ్యనక్కరలేదు. నవ్వుతూ ఉంటే చాలు."

"నేనిప్పుడేం ఏడవటం లేదే!"

"అయితే తలనొప్పి ఎందుకు వచ్చింది?"

"మీరు ఈ రోజు ఆలస్యంగా వచ్చారుగదూ. అందుకని...."

"సునందా, నువ్వు ఎల్.ఎల్.బి. చదివి లాయర్ కావాల్సింది."

"మీతో పగలూ రాత్రీ వాదిస్తూ కూర్చోవటానికా?"

"కాదు, అప్పుడు నేను నీదగ్గర వాదించటం ఎలాగో నేర్చుకుని మైసూరులో అంతా నాలాంటి లాయర్ లేదనే పేరుతెచ్చుకునే వాడిని."

"పేకాడదామా?" అంటూ సీతారాం లోపలికి వచ్చాడు. సునంద, శ్రీధర్ తమ మాటలు ఆపేసి 'అలాగే' అన్నారు. కొంచెంసేపు ఆడాక శ్రీధర్ ఇంటికి వెళ్ళిపోయాడు.

అతడు వెళ్ళిపోయాక అందరూ భోజనాలు చేశారు. భోజనాలయ్యాక సునంద మర్నాటి పాఠాలను నోట్స్ రాసుకోసాగింది. పది గంటలయినా చెల్లెలు గదిలో లైటు వెలుగుతూండటాన్ని చూసి సీతారాం లేచివచ్చి "ఏం సునందా ఇంకా నిద్ర రాలేదా?" అన్నాడు.

"రేపు ఏదో టెస్టుంది. ప్రశ్నలను సెట్ చేస్తున్నాను. ఇంక అయిపోవచ్చింది. నీకూ నిద్ర రాలేదా అన్నయ్యా?"

"లేదు. దినూ ఇంతవరకూ మాట్లాడుతూ కూర్చున్నాడు. ఇప్పుడే అలా పడుకున్నాడు."

"దమయంతి?"

"ఉదయం నుండి దినూని చూసుకుని అలసిపోయాను. ఇక మీరు చూసుకోండి అని చెప్పి దినూను నా కప్పగించి నిద్రపోయింది. నా కింకా నిద్ర రావటం లేదు." అంటూ సీతారాం గదిలోకి వెళ్ళి

పోయాడు. దమయంతి, దినూ, ఇద్దరూ హాయిగా నిద్రపోతున్నారు. సీతారాం ఏదో 'లా' పుస్తకం తీసుకుని చదువుకుంటూ కూర్చున్నాడు. రాత్రి ఒంటిగంటకు నిద్రవచ్చింది. లైటార్పి పడుకున్నాడు.

ఇంకేం, బాగా నిద్రపట్టబోతూండగా అతడికి బయట అడుగుల చప్పుడు వినిపించింది. వెంటనే లేచివెళ్ళి అదెవరో చూద్దామనుకున్నాడు. మరుక్షణమే పిల్లిఅయి ఉంటుంది అని నిద్రపోయాడు.

ఉదయం ఆతడు లేచేటప్పటికి ఏడున్నర అయింది. దమయంతి, దినూ లేచి వెళ్ళిపోయారు. సునంద లేచి పుస్తకాలు సర్దుకుంటోంది. సీతారాం బ్రష్షు సోపు తీసుకుని సునంద గది తలుపుల దగ్గర నిల్చుని "రాత్రి ఎన్ని గంటలకు నిద్రపోయావు సునందా?" అన్నాడు.

"నువ్వలా వెళ్ళగానే పడుకున్నానన్నయ్యా."

"లేకపోతే శ్రీధర్ గురించి—"

"పో అన్నయ్యా. ఎప్పుడూ ఇదే గొడవేనా?"

సీతారాం ఎర్రబడిన చెల్లెలి మొహాన్ని చూసి నవ్వుతూ వెళ్ళిపోయాడు. అన్నయ్య అలా వెళ్ళిపోగానే తలెత్తింది సునంద. ఆమె కళ్ళు యథాలాపంగానే ఎగుటవున్న గోడను పరికించాయి.

సునంద ఆశ్చర్యపోయింది. నిన్న ఆ గోడమీదనే ఉన్న తమ పెళ్ళిఫొటో ఈరోజు అక్కడ లేదు. తన గదిలోనుండి ఇలా ఒక్కొక్క వస్తువునే దొంగలిస్తున్న దెవరు? నేలమీద నిలబడితే ఫొటో అందదు. ఎవరో కుర్చీ వేసుకుని దించి వుండాలి. "అవును" అని ఫొటోవున్న చోటుకు కిందగానే ఉన్న కుర్చీ అంటోంది.

అయితే దొంగలు ఇంకా ఏమేం తీసుకున్నారో?

సునంద పెట్టె, బీరువాలన్నీ తెరచి చూసింది. ఆమె నగలు, చీరలు అన్నీ ఎక్కడ పెట్టినవి అక్కడే వున్నాయి. తను రాత్రిగడియ వేసుకుని పడుకున్నట్టు బాగా జ్ఞాపకముంది. అయినా ఎవరో తన గదిలోకి వచ్చారు. ఫొటో దొంగిలించటంవల్ల వాళ్ళకొచ్చే లాభమేమిటి?

అన్నయ్యకిగాని, తల్లికిగాని, తండ్రికిగాని ఈ విషయం చెప్దామా అనుకుంది ముందు. అయినా ఇంత చిన్న విషయాన్ని గురించి

ఇంట్లో అంతా గొడవచేయటమేమిటి అని ఊరుకుంది.

ఈ రోజు ఫొటో పోయింది. రేపు చీరలు, నగలుకూడా దొంగి లించవచ్చును. ఇకమీదట తను జాగ్రత్తగా ఉండాలి. పెట్టె బీరువాల తాళంచెవులు తన తలగడక్రింద పెట్టుకునే నిద్రపోవాలి.

రోజులు గడుస్తున్నాయి.

తన బాహ్య ప్రవర్తనలో మార్పేం లేకపోయినా, తన అంత రంగంలో మాత్రం ఏదో తనకు తెలియని విప్లవం జరుగుతోందని సునందకు తెలిసింది. భోజనంకూడా ఇంతకు ముందులా చేయలేక పోతోంది. తన ఉద్యోగంలోకూడా ఇంతకుముందు చూపినంత శ్రద్ధ చూపలేకపోతోంది. రాత్రిళ్ళు నిద్ర సరిగ్గా పట్టడంలేదు. చెడ్డకలలు కని రాత్రిళ్ల అప్పుడప్పుడు ఉలిక్కిపడి లేస్తూంది. తాను మునుపటిమాదిరి లేదని మాత్రం సునందకు తెలిసింది.

ఒకరోజు రాత్రి ఎనిమిది గంటలకు పెద్దగా వర్షం కురవడం మొదలెట్టింది. పది గంటలకు ఆగిపోయింది. వర్షం ఆగిపోయేవరకూ ఏదోనవల చదువుతూ కూర్చుని తరువాత నిద్రపోయింది సునంద.

ఉదయం మెలకువ రాగానే పడకమీదే లేచి కూర్చుంది. ఆశ్చ ర్యం, గాబరాతో ఆమె కళ్ళు పెద్దవయ్యాయి.

ఇదేమిటి? తెల్లటి స్వచ్ఛమైన పక్కమీద బురదయింది. స్వచ్ఛంగా ఉన్న పక్క బురదతో మురిగ్గా వుంది. సునంద తన కాళ్ల చూసుకుంది. అవికూడా బురదతో నిండిఉన్నాయి.

తన కాలుకు ఈ బురద ఎలా అంటుకుంది. ఎలా?

సునంద తన్నే వెయ్యిమార్లు ప్రశ్నించుకుంది.

అరేబియన్ నైట్స్ కథలో రాజకుమారికయిన అనుభవమే తనకూ అవుతోందా? రాజకుమారి నిద్రపోయేటప్పుడు ఓ దెయ్యం ఆమెను ఆమె ప్రియుడిదగ్గరకు తీసుకుని వెళ్ళేదట. తెల్లవారేటప్పటికి ఆమెను తన చోటికి తీసుకునివచ్చి దిగబెట్టేదట

ఆ కథ జ్ఞాపకానికొచ్చి సునంద నవ్వుకుంది. అదేదో కథ కావచ్చు కాని తను చిన్నపిల్లగా వున్నప్పుడు ఎదురింట్లో వారి నౌకరు కయిన అనుభవాన్ని స్వయంగా చూడలేదా? అమ్మానాన్న ఆ విష

యాన్ని గూర్చి మాట్లాడేవారు కాదా?

సునంద చిన్నపిల్లగా ఉన్నప్పుడుండిన ఇంటికి ఎదురుగుండా ఉన్న ఇంటిని దెయ్యాలకొంప అనేవారు. అందువల్ల ఇల్లు ఖాళీగా ఉన్నా, ఎవరూ ఆ ఇంట్లో అద్దెకు దిగేవారుకాదు. వేరే ఊరినుండి ట్రాన్స్‌ఫరయి వచ్చిన గవర్నమెంటు ఆఫీసరు ఒకరు తక్కువ అద్దెకు దొరికిందికదా అని ఆ ఇంట్లో దిగాడు. వాళ్ళ ఇంటి నౌకరు, ఇంటిముందున్న వరండాలో రాత్రిళ్ళు పడుకునేవాడు ఉదయానికల్లా రోడ్డుమధ్యలో పడుకుని ఉండేవాడు. వాడికి 'మోహిని' ఆడదెయ్యం పట్టుకుందని అందరూ అనుకునేవారు. దైహికమైన కోరికలు తీర్చుకోకుండానే చనిపోయిన యువతులు మోహినీ దెయ్యాలుగా అవుతారని. యువకులను ఇలా పట్టుకుంటారని ఎన్నోమార్లు వింది సునంద. తనకు కూడా ఓ మోహినీ దెయ్యం పట్టుకుందా!

అయినా మోహిని పురుషులను మాత్రమే కదా పట్టుకుంటుంది! తన్ను పట్టుకుని అదేం చేసుకుంటుంది? మోహిని లాగానే మగదెయ్యం కూడా ఒకటి ఉందేమో. అది ఒంటరిగా ఉన్న తన్ను ఇలా బాధిస్తోందేమో!

తన ఊహలకు తనే గట్టిగా నవ్వేసింది. మోహిని, దెయ్యాలు ఇలాంటి వాటిల్లో ఆమె కెన్నడూ నమ్మకంలేదు.

అయినా....అయినా...ఇలా కావటానికి కారణం?

సునంద మొహం మళ్ళీ గంభీరమయింది.

ఆమె అలాగే ఆలోచిస్తూ చాలాసేపు పక్కమీదే కూర్చుంది.

♦ ♦ ♦

సునంద స్కూలయ్యాక వసుమతి ఇంటికి బయలుదేరింది. వసుమతి ఊళ్ళోలేదని తెలిసినా వసుమతి చెల్లెలి కల్యాణిని చూడటానికి వెళ్ళింది. సునంద వాళ్ళింటికి వెళ్ళేటప్పటికి కల్యాణి ఇంకా కాలేజీనుండి రాలేదు. తల్లిమాత్రం ఉన్నారు. ఆవిడ "రా అమ్మా సునందా! వసూ అత్తవారింటికి వెళ్ళిపోయాక నువ్వు మమ్మల్నందరినీ మర్చిపోయినట్టున్నావు" అంటూ పలకరించారు.

"అబ్బేలేదండి. నాకు స్కూలు ఉండటంవల్ల ఎక్కడికీ వెళ్ళ

డానికి వీలుపడదు. స్కూలునుండి ఇంటికి వెళ్ళేటప్పటికే అలసిపోయి ఉంటాను. కల్యాణి ఏదీ?"

"కాలేజీనుండి ఇంటి కింకా రాలేదు."

సునంద తనచేతి గడియారం చూసుకుని "అప్పుడే అయిదున్నరయింది" అంది.

"వాళ్ళ కాలేజీలో టెన్నిస్‌కోర్టు వేశారు. టెన్నిస్ ఆడుకుని ఇంటి కొచ్చేటప్పటికి ఆరుగంటలవుతుంది."

"వసుమతి ఉత్తరాలు రాస్తూంటుందా?"

"ఊ రాస్తోంది. నీ పెళ్ళివిషయం రాశాను. వసు ఎంత సంతోషపడిందో! మొన్నటి ఉత్తరమంతా నీ విషయాలతోనే నింపేసింది. పెళ్ళి శుభలేఖ తనకు మర్చిపోకుండా పంపాలట. సునంద పెళ్ళికి ఎక్కడున్నా తప్పకుండా వస్తాను అని రాసింది."

ఆమె ఓవల్టిన్, టిఫిన్ తెచ్చి సునంద ముందుపెట్టారు. సునంద ఆమెతో మాట్లాడుతూ ఉండగానే కల్యాణి వచ్చింది.

"ఏమిటి సునందా అపురూప దర్శనం" అంటూనే పుస్తకాలు లోపలపెట్టి కల్యాణి సునంద దగ్గరే కూర్చుంది.

"అమ్మా నాకూ టిఫిన్ ఇక్కడికే తెచ్చిపెట్టమ్మా" అంది.

ఆవిడ వెళ్ళి కూతురికి టిఫిన్ తెచ్చిపెట్ట తమపనిమీద లోపలికి వెళ్ళిపోయారు. అప్పుడే ఆటలాడుకుని రావటంవల్ల కల్యాణి మొహం ఎర్రగా ఉంది. కల్యాణి వసుమతికన్నా అందకత్తె.

"కల్యాణీ వసుమతినే అబ్బాయిలు అంత ఏడిపించేవారుగదా మరి ఇప్పుడు నిన్ను ఇంకెంత....."

"ఓ దానికేముంది. రోజూ ఎవరో ఒకరి దగ్గర్నుండి ఉత్తరం వస్తూనే ఉంటుంది. ఓ పదిమంది ఉత్తరాల్లో ప్రపోజ్ చేశారు ఇక నేను పరించటమే తరువాయి..."

ఇద్దరూ పెద్దగా నవ్వేసాగారు.

"స్వయంవరం ఏర్పాటుచేసేయి!" సునంద సలహా ఇచ్చింది.

"ఇంకో విచిత్ర మేమిటో తెలుసా సునందా ? ఈ అబ్బాయిల ప్రేమ విరహాలన్నీ అందంగా ఉన్న అమ్మాయిలను చూస్తేనే పొంగు

కొని వస్తాయి. నిన్ను నేను నిజంగానే ప్రేమిస్తున్నాను. నీకోసమని ఏం చేయమన్నా చేస్తాను. నేను నీ అందాన్ని మాత్రమే చూసి ప్రేమించటం లేదు...అలా ఇలా అని రాస్తారుకదా అందంగా లేని అమ్మాయిల్ని ఎందుకు ప్రేమించరు?"

"నాకేం తెలుస్తుంది? ఎంతైనా సైకాలజీ ఆనర్సు తీసుకున్న దానివి నీకే తెలియాలి. నువ్వే చెప్పు కారణమేమిటో?"

"ప్రేమా లేదు, ఏమీ లేదు. రేపు నాకన్నా అందంగా ఉన్న అమ్మాయి వస్తే, ఆ అమ్మాయికి ఉత్తరాలు రాస్తారు. ఒక్కోమారు నాకేమనిపిస్తుందో తెలుసా? ఈ ఉత్తరాలు రాసేవాళ్ళందర్నీ పట్టుకుని విచారణ లేకుండానే ఉరికంబమెక్కించాలి."

"నీ చేతి కధికారమొస్తే అలాగే చేద్దువుగాని, మీ ప్రొఫెసర్ ఎలా ఉంటారు!"

"అంటే చూడటానికి ఎలా ఉంటారనా లేకపోతే ఎలాంటి వారనా..."

"ఆయన రూపంతో నాకేం పనిగాని మంచివారేనా? అందరితోనూ చనువుగా మాట్లాడుతారా అని అడిగాను."

"ఆయనకు గర్వం లేదమ్మా, చాలా మంచివారు. అందరితోనూ సరదాగా మాట్లాడతారు."

"ఆయన్ను కలుసుకోవాలి...."

కల్యాణి ఆశ్చర్యపడింది. ఎందుకు అని అడగాలనిపించింది. ఆ కుతూహలాన్ని అణచుకుని "సైకాలజీ నేర్చుకోవా లనిపించిందా?" అంది.

"ఊఁ ఆయన్ను ఓమారు చూడాలి."

"రేపు కాలేజీలో ఏమంటారో అడిగి తెలుసుకొని వస్తాను. ఆ తరువాత తీసుకొని వెడతాను."

"అలాగే కానీ, రేపు కనుక్కొని చెప్పు నేను ఇక వస్తాను" అంటూ సునంద ఇంటికి బయల్దేరింది.

వరండాలోనే కూర్చొన్న రావుగారు "ఎందుకమ్మా ఇంత ఆలస్యమైంది। శ్రీధర్ వచ్చారు" అన్నారు.

"వసుమతి ఇంటికి వెళ్ళాను. నాన్నా ఆయ నెక్కడున్నారు?"

"సీతారాంతో మాట్లాడుతున్నారు"

సునంద లోపలికి వెళ్ళింది.

చెల్లెలు రాగానే సీతారాంలేచి "ఇంకేం నాపనయింది. ఇక నిన్ను సునందే చూసుకుంటుంది" అన్నాడు.

సునంద శ్రీధర్‌ను చూసి చిన్నగా నవ్వింది. ఆమె నవ్వులో విషాదచ్ఛాయలున్నాయి ఆ నవ్వులో శబ్దమేగాని, ఆనందం లేదు.

"ఎందుకు సునందా ఇలా ఉన్నావు?"

"ఎలా?"

అదో రకంగా ఉన్నావు."

"ఎంతైనా మీరు లాయర్. లేనిదాన్ని ఉన్నట్టుగా చెప్పటంలో ఆరితేరినవారు."

ఈమారు ఇద్దరూ మనఃపూర్వకంగా నవ్వారు.

♦ ♦ ♦

మర్నాడు సునంద కల్యాణి ఇంటికి వెళ్ళేటప్పటికి కల్యాణి సునందకోసమనే ఎదురుచూస్తోంది.

సునంద ఆమెనుచూసి "ఈరోజు టెన్నిస్ ఆడటానికి వెళ్ళ లేదా?" అంది.

"లేదు. నువ్వు రావచ్చును. నిన్ను కాచుకునేలా చేయటం దేనికని టెన్నిస్ ఆడకుండా వచ్చేశాను. అదీకాకుండా శ్రీవారు మీ ఇంట్లో నీ కోసం కాచుక్కూచున్నప్పుడు నిన్ను ఇక్కడ ఉంచేసుకో కూడదు కదూ?"

"శ్రీవారి నలా ఉంచు. మీ ప్రొఫెసర్‌ను అడిగావా?"

"ఊఁ అడిగాను."

"ఏమని అడిగావు?" సునంద కుతూహలంతో అడిగింది.

"అబ్-నార్మల్ సైకాలజీ క్లాసయ్యాక అందరూ వెళ్ళిపోయారు. నేను మాత్రం తలుపుదగ్గరే నిల్చున్నాను ప్రొఫెసర్ ఏం కల్యాణీ అని అడిగారు. నా స్నేహితురాలు మిమ్మల్ని చూడాలని చాలా అను కుంటోంది, ఆమెను తీసుకొని రమ్మన్నారా అన్నాను."

"ఆయ నేమన్నారు?"

"న న్నెందుకు చూడా లనుకుంటోంది? అన్నారు. కారణం నాకు తెలియదని చెప్పాను, సరే తీసుకునిరా అన్నారు..."

"కాలేజీకే రమ్మన్నారా లేక ఇంటికే రమ్మన్నారా ?"

"కాలేజీకే రమ్మన్నారు."

"ఎన్ని గంటలకు?"

"రేపు సాయంకాలం అయిదు గంటలకు రమ్మన్నారు. నాలుగు న్నరకు స్కూలు అయిపోగానే ఇక్కడికి వచ్చావంటే ఇద్దరం వెళ్ళ వచ్చు."

"అలాగే, కాని నిన్ను శ్రమ పెడుతున్నాను, కల్యాణీ......"

"ఇలాంటివన్నీ వదిలేయి తల్లీ! నీ పెళ్ళి భోజనం పెట్టించి నప్పుడు అంతా మర్చిపోతాను!"

"నేనింక వెళతాను" అంటూ లేచింది సునంద.

మర్నాడు టైముకు సరిగ్గా సునంద కళ్యాణి ఇంటికి వెళ్ళింది. అక్కడి నుండి ఇద్దరూ కాలేజీకి వెళ్ళారు.

సాయంకాలం అయిదు గంటలు కావటం వల్ల సైకాలజీ డిపార్టు మెంటులో విద్యార్థులెవరూ లేరు. సునందా, కళ్యాణీ ప్రొఫెసర్ గదిలోకి వెళ్ళగానే ఆయన లేచి నిల్చున్నారు.

"రండి"

"ఈమె నా స్నేహితురాలు, సునంద. వీరు మా ప్రొఫెసర్..."

ప్రొఫెసర్ ముందుగానే చెప్పారు గాబోలు యూనియన్ నుండి సర్వర్ మూడు కాఫీలు, చౌ చౌ లు తెచ్చిపెట్టాడు. మామూలుగా మాట్లాడుతూ కాఫీ టిఫిన్ తీసుకున్నారు.

కల్యాణి లేచి నిల్చుని "ఇక నేను వస్తాను సార్" అంటూ వెళ్ళి పోయింది.

సునందకు ప్రొఫెసర్ని చూడగానే చాలా మంచివారు అనిపిం చింది. డాక్టర్ రంగనాథన్‌కి నలభయి అయిదేళ్ళ వయస్సు ఉండ వచ్చును. బట్టతల, కళ్ళజోడు మాటిమాటికీ తీసి తుడిచి మళ్ళీ పెట్టు కునేవారు. చిన్న విషయాలకే చిన్న పిల్లలు ఎగిరి గంతేసేలాగ ఆయన

చాలా చిన్న చిన్న కారణాలకే సంతోషపడేవారు.

కల్యాణి వెళ్ళిపోయేవరకూ సునంద మౌనంగా కూర్చుంది ఆమె వెళ్ళిపోగానే రంగనాథన్ సునంద వైపు తిరిగి "నేను మీకేమి సహాయం చేయగలను?" అన్నారు.

"సునందకు ఎలా మాటలు మొదలెట్టాలో తోచలేదు.

"భయపడకుండా అంతా చెప్పమ్మా! ఏం ఫరవాలేదు!" అని ఆయన సునందకు ధైర్యం చెప్పారు.

"ఈ మధ్య నా మనసేం సరిగా లేదనిపిస్తోంది..."

"నీకలా అనిపించటానికి కారణం ?"

"కారణమేమిటో తెలియదు. సంథింగ్ ఈజ్ రాంగ్ విత్ మై మైండ్ అని మాత్రం చెప్పగలను."

"సంథింగ్ ఈజ్ రాంగ్ అని ఎలా చెప్పగలుగుతున్నావు?"

"నేను మొదటిలా లేను."

"మొదటిలా అంటే? ఇంతకు మునుపు ఎలా ఉండేదానివి?"

"మునుపు ప్రశాంతంగా ఉండేదాన్ని భోజనం హాయిగా చేసే దాన్ని. రాత్రిళ్లు హాయిగా నిద్రపోయేదాన్ని, ఉత్సాహంగా ఉండగలిగే దాన్ని..."

"అంతకే మనస్సు సరిగా లేదని ఎలా చెప్పగలవు? నరాల దౌర్బల్యంవల్లకూడా ఇలా అయి ఉండవచ్చు. అజీర్ణమయినా నిద్ర పట్టదు. భోజనం సయించదు..."

"నాలో దైహికంగా ఎలాంటి మార్పు లేదు. మానసికంగానే ఏదో మార్పు జరిగింది. మనస్సులో నాకు తెలియకుండానే ఏదో బాధ పెడు తోంది నన్ను...."

"అదెలా చెప్పగలవమ్మా?"

"ఇప్పుడు... ఇప్పుడు....నాకేమీ అక్కర లేదు. అన్నిటిమీదా విసుగు జనిస్తోంది. ప్రపంచమంటేనే అసహ్యంగా ఉంది. ఒక్కోమారు ఆత్మహత్య చేసుకుందామా అనిపిస్తుంది "

ప్రొఫెసర్ ముందుకు వంగి అడిగారు "ఆత్మహత్యా ప్రయత్నం ఎన్నడైనా చేశావా?"

"రెండుమార్లు ప్రయత్నించాను. చావు అన్నా భయమే నాకు. మనకు కనుపించని చావుకన్నా కనిపించే జీవితమే నయమని ఆ ప్రయత్నాలను విరమించాను. అయినా రోజుకు రెండుమూడు మార్లయినా చావును గురించిన ఆలోచన వస్తూంటుంది. ఎప్పుడూ పరధ్యానంగా కూర్చుని ఉంటాను. మీతో మాట్లాడుతున్నా నా మనసు ఇక్కడ ఉండదు. మునుపటిలా ఇప్పుడు ఏ విషయంమీదా 'కాన్‌సెన్‌ట్రేట్' చేయలేకపోతున్నాను. ఒక్క క్షణంకూడా ఒకే విషయాన్ని గురించి ఆలోచించలేకపోతున్నాను. చాలా అల్పమైన విషయాలకుకూడా ఏడుపు వస్తోంది. చాలా చిన్నచిన్న విషయాలకు నాకెన్నడూ ఏడుపురాదు. ఎవరైనా ఒక చిన్నమాటన్నా ఏడుపు వస్తోంది...."

"ఒక ఉదాహరణ ఇస్తావామ్మా?"

"అన్నయ్య కొడుకు దినకర్ షికారుకు తీసుకొని వెళ్ళమని మొండికేశాడు. నాకు వెళ్లాలని లేదు. వాడు మొండికేయటం చూచి నాకు ఏడుపు వచ్చింది. నన్నెందు కందరూ ఇలా ఏడిపిస్తారు అని ఏడుస్తూ వెళ్ళిపోయాను—"

"అందరూ అంటే ఎవరెవరు?"

"నాకు తెలియదు. నేనేదో మాట్లాడుతూ అలా అన్నాను. తరువాత ఇంతచిన్న విషయానికే ఏడ్చేశానేమిటా అని ఆశ్చర్యపోయాను."

"నువ్వేం చదువుతున్నావమ్మా?"

సునంద స్కూలుకువెళ్లే అమ్మాయిలా వుండటంవల్ల రంగనాధన్ అలా అడిగారు. వాయిల్ చీర, కొత్తరకం జాకెట్, చేతిలో పుస్తకాలను చూసి చదువుకునే అమ్మాయనుకున్నారాయన.

"నేనిప్పుడు చదువుకోవటం లేదు. మహారాణీ హైస్కూలులో టీచర్‌గా పనిచేస్తున్నాను."

"ఏం చదువుకున్నావ్?"

"బి. ఏ., బి టి "

"పరవాలేదే? నువ్వింకా చదువుకుంటున్నావనుకొన్నా. బి ఏ. లో రీకాంబినేషన్ ఏమిటి?"

"హిస్టరీ, పొలిటిక్స్, ఎకనామిక్స్."

"అందువల్లే నీకు నా పరిచయం కాలేదు. సైకాలజీ తీసుకుని ఉంటే నా పరిచయం అయిఉండేది. ఉద్యోగంలోకి ఎప్పుడు చేరావు?"

"ఈ సంవత్సరమే."

"నీ కెన్నేళ్ళు?"

"ఇరవైమూడు."

"నీ మనస్సులోని మార్పులింకా ఏమేమున్నాయి?"

"ఇంతకు ముందు నా కసలు కోపం వచ్చేదికాదు. ఇప్పుడుచాలా తరచుగా, తొందరగా కోపం వస్తోంది. ఒక్కోమారు నామీదే నాకు కోపం వచ్చి నూతిలోపడి చచ్చిపోదామనిపిస్తోంది.

"నూతిలోపడే చావాలని ఎందు కనుకుంటున్నావు? చావాలంటే బోలెడు మార్గాలున్నాయి. విషం తీసుకోవచ్చు. ఉరిపోసుకోవచ్చు. కారుకింద పడవచ్చు ఇన్నుండగా నూతిలోపడే చావాలని ఎందుకను కుంటున్నావు?"

"చావాలంటే ఏదో ఒక మార్గం కావాలిగదా! నాకు తోచింది నుయ్యి; అంతే."

"ఇంకా ఏమేమనిపిస్తుంది?"

"చాలా సెల్ఫ్‌కాన్‌షస్‌గా ఫీలవుతున్నాను. వీధిలో నడుస్తూంటే అందరూ నన్నే చూస్తున్నారు. నా గురించే మాట్లాడుకుంటున్నారు అని పిస్తుంది. అందువల్లే నలుగురితో కలిసి తిరగలేకపోతున్నాను. ఇన్‌ఫీరి యారిటీ కాంప్లెక్సు ఈ మధ్యనే బయటికి వచ్చింది."

"మునుపు ఎలా ఉండేదానివి?"

"మునుపు నాకు స్నేహితులు, ఆటలు పాటలు అన్నీ కావాలని పించేది. నేను దేనిలోనూ మిగిలినవారికన్నా తక్కువ అనుకునేదాన్ని కాదు. కాని, ఇప్పుడలా ఉండలేకపోతున్నాను."

"తక్కువ అంటే ఏ విషయంలో మిగిలినవారికన్నా తక్కువ అనిపిస్తుంది? చదువులోనా, తెలివితేటల్లోనా, అందంలోనా, డబ్బులోనా, గుణంలోనా?"

"బి. ఏ , బి. టి. చదివి ఉండటంవల్ల నేను చదువులో తక్కువ

అని చెప్పలేను. నాకు చాలా తెలివితేటలు లేకపోవచ్చును. కాని నేనేం మొద్దునుకాను. ఇక అందం విషయంలో——"

"అందంలో తక్కువ అని అనుకోవటానికి వీల్లేదు. నీ ప్రతిబింబాన్ని చూసి నువ్వే గర్వపడతావు కదూ?" ప్రొఫెసర్ తమాషా చేస్తున్నట్టే అయినా నిజాన్నే పలికారు.

"అవును. నేను అంద వికారినని ఎన్నడూ అనుకోలేదు. నాకెలాంటి చెడ్డ గుణాలూలేవు దొంగతనం, అబద్ధాలు చెప్పటం, చాడీలు చెప్పడం, చెడ్డప్రవర్తన ఇలాంటివేవీ నాలోలేవు..."

"ఇంతవరకూ అబద్ధం చెప్పడంగాని చాడీలు చెప్పడంగానీ చేయలేదా?"

"నాకు జ్ఞాపకం వచ్చినప్పటి నుండి చేయలేదు. ఇంక డబ్బు విషయం - మేము పేదవాళ్ళం కాము. మధ్యతరగతికి కొంచెం పైనే ఉన్నామనే చెప్పవచ్చు. నచ్చిన బట్టలు, ఇష్టపడిన నగలు. కొనుక్కునే తాహతుంది మాకు. అందువల్ల మీ రడిగిన ఏ విషయంలోనూ నేను ఎవరికీ తక్కువ అని అనుకోలేను. అయినా అందరికన్నా నేను తక్కువ అనిపిస్తోంది."

"ఎవరినైనా ప్రేమించకూడదూ?" అని రంగనాధన్ పెద్దగా నవ్వసాగారు.

ఎవరినైనా ప్రేమించమన్న సలహా విని సునంద తలవంచుకుంది. ఆమె మొహం ఎర్రబడింది. ముచ్చెమటలు పోశాయి. ఏవో చెప్పాలని ప్రయత్నించింది సునంద. కాని గొంతు పెగల్లేదు. తమ మాట విని సునంద సిగ్గు పడిందనుకుని "ఫరవాలేదు. నేను సరదాకన్నాను. సిగ్గుపడకు. చీకటి పడింది. ఎల్లుండి అయిదు గంటలకు మా ఇంటికి వస్తారా?" అని అడిగారు ప్రొఫెసర్.

"అలాగే నేను మీపని కడ్డం వచ్చానేమో."

"అలాగేం లేదమ్మా" అంటూ ప్రొఫెసర్ లేచి తమ గది తలుపు తెరచి పక్కగా నిల్చున్నారు.

"నమస్కారం" అని చెప్పి సునంద బయటికి వచ్చింది.

సునంద ఇంటికి వచ్చేటప్పటికి శ్రీధర్ అప్పుడే ఇంటికి వెళ్ళబో

తున్నాడు. ఇద్దరూ గేటు దగ్గర కలుసుకున్నారు.

"అదేం అప్పుడే బయలుదేరారు?" సునంద అడిగింది.

"ఎంతసేపయినా దేవిగారు ప్రత్యక్షం కాకపోతే ఆయనేం చేస్తారు పాపం?" అంటూ సీతారాం చెల్లెల్ని ఉడికించ సాగాడు.

"గేటు దగ్గర నిల్చుని మీ దెబ్బలాటేమిటి? కనీసం లోపలి కయినా వెళ్ళండి" అన్నాడు శ్రీధర్.

"మీరూ రండి మా దెబ్బలాటకు సాక్షిగా" అంటూ సీతారాం మళ్ళీ శ్రీధర్ని లోపలికి లాక్కుని వెళ్ళాడు.

"సునందా రేపటినుండి కొన్ని రోజులు ఇక్కడికి రావటానికి వీలుపడదు. అది చెప్పి పోదామనే వచ్చాను" అన్నాడు శ్రీధర్.

"ఊళ్ళో ఉండరా ఏం?"

"ఊళ్ళోనే ఉంటాను. కాని ఏదో హత్యకేసు తీసుకున్నాను. అందువల్ల ఆఫీసులో పని ఎక్కువగా ఉంది. పదిహేను రోజులు ఇటు వైపుకు రావటానికి వీలుపడదు."

సునంద మనస్సులో ఇదీ మంచిదే అయింది అనుకుంది. తను స్కూలయ్యాక ప్రొఫెసర్ ఇంటికి వెళ్ళి రావటానికి ఎంత సేపవుతుందో ఏమో? శ్రీధర్ ఇక్కడ తనకోసం ఎదురుచూస్తూ ఉండాలి. దానికన్నా రాకుండా ఉంటేనే నయం.

అయినా పదిహేను రోజులు అతడిని చూడకుండా ఉండటమా ?

ఆమె మొహం అదోరకంగా అవటాన్నిచూసి శ్రీధర్ "రావటా నికి వీలుండదన్నానని కోపం వచ్చిందా" అన్నాడు.

"మీరు రాకపోతే నాకేం తోచదు. అంతే. రేపు ఆదివారం మా స్కూలు వార్షికోత్సవం జరుగుతుంది. మీరు తీరిగ్గా ఉంటే రండి."

"ఎన్ని గంటలకు రావాలి ?"

"అయిదున్నరకు టౌను హాలుదగ్గరకు వచ్చారంటే నేనులోపలికి తీసుకునివెళ్ళి కూర్చోబెడతాను."

"ప్రయత్నిస్తాను. వీలయితే వస్తాను."

"ఇన్విటేషన్ మీ ఇంటికి పంపుతాను."

"అలాగే ఇక నేను వెళ్తాను."

శ్రీధర్ వెళ్ళిపోయాడు సునంద చాలా సేపు ఏదో ఆలోచిస్తూ అక్కడే నిలబడిపోయింది.

"ఇకనైనా దేవిగారు, ఈ లోకంలోకి దిగిరండి" అన్నాడు సీతారాం.

"అలా దేవిని తపస్సునుండి లేపితే శాపమిస్తారు !"

"ఏమని ?..."

"వదినలాంటి కూతుర్ని కనమని."

"అమ్మబాబోయ్, ఆడపిల్లలే వద్దుబాబూ, ఆ బాధ్యత అక్కర్లేదు నాకు."

"అవునవును. పదిమంది ఆడపిల్లల్ని కని పెంచి పెళ్ళిచేసి నగమైపోయావు కదూ ? నీకూతురు వదినలా ఉంటే నేను చేసుకుంటా నంటే నేను చేసుకుంటానని నీ ఇంటిమీదకి ఎగబడతారు. ఇంకా ఏడు నెలలు కూతురుకోసం ఎదురుచూడాలి నువ్వు..." అని సునంద అర్థ గర్భితంగా అన్నయ్యవైపు చూసి నవ్వి లోపలికి వెళ్ళిపోయింది.

ప్రొఫెసర్‌ని చూసి రావటంవల్ల కాబోలు సునంద మనస్సు ప్రశాంతంగా ఉంది దినకరుడితో చక్కగా ఆడుకుంది తల్లిదండ్రు లతో స్కూలు విషయమంతా చెప్పింది. కూతురు సంతోషంగా కబుర్లు చెప్పటాన్నిచూచి సుందరమ్మగారు 'ఎప్పుడూ ఇలాగే ఉండకూడదూ సునందా" అన్నారు.

ప్రొఫెసర్‌గారు తమ ఇంటికి రమ్మన్న రోజున స్కూలుకి వెళ్ళే టప్పుడే సునంద తల్లితో "అమ్మా నేనీ రోజు ఇంటికి రావడం ఆలస్యం కావచ్చు" అంది.

"ఏం, ఏంపనుంది... ?"

"ఏదో కొంచెం పనుందిలే" అంటూ సునంద స్కూలుకి వెళ్ళి పోయింది. సాయంకాలం ఆఖరి పీరియడ్ అయిపోగానే జట్కా చేసుకుని ప్రొఫెసర్ల క్వార్టర్స్ దగ్గరకు బయలుదేరింది. ఆమెకు ఆయన ఇల్లు ఏదో సరిగ్గా తెలియకపోవడంవల్ల మొదటి ఇంటిదగ్గరే జట్కా ఆపి అక్కడే కనబడిన ఓ పనిమనిషిని "డాక్టర్ రంగనాథన్ గారిల్లు ఏదీ?" అని అడిగింది.

"మూడో ఇల్లు."

సునంద ఆటోవాడిని పంపేసి ఆ ఇంటికి వెళ్ళింది.

కాంపౌండు చాలా పెద్దగా ఉంది. గేటు దగ్గర్నుండి ఓ ఫర్లాంగు దూరం నడిస్తే ఇల్లు. చాలా పెద్దగా ఉంది. తలుపుదగ్గర ఓ నౌకరు కూర్చున్నాడు. సునంద అతడిని "ప్రొఫెసరుగారు ఇంట్లో ఉన్నారా?" అని అడిగింది.

"ఉన్నారు. అక్కడ బ్యాడ్మింటన్ ఆడుతున్నట్టున్నారు, పిలుస్తాను" అంటూ వెళ్లాడు. రెండు నిమిషాల్లో రంగనాధన్ భార్యతోనూ కొడుకుతోనూ కలిసివచ్చారు.

"ఈమె నా బెటర్‌హాఫ్, జలజాక్షి. నాకొడుకు సుభాష్‌చంద్ర."

"నమస్తే."

"ఈవిడ సునంద. మహారాణీ హైస్కూల్లో టీచరు."

"నమస్తే లోపలికిరండి" అంటూ జలజాక్షి సునందను లోపలికి తీసుకుని వెళ్ళారు. సుభాష్‌చంద్ర తల్లితో చెప్పి తన స్నేహితులతో ఆడుకోవడానికి వెళ్ళిపోయాడు.

"సుభాష్ స్కూలుఫైనల్ చదువుతున్నాడు. వాడికి క్రికెట్ అంటే ప్రాణం. స్నేహితులతో క్రికెట్ గురించి గంటల కొలది మాట్లాడుతూ ఉండిపోగలడు. లోపలికి రండి..." అంటూ జలజాక్షి సునందను డ్రాయింగ్‌రూములోనికి తీసుకుని వెళ్లారు. ఆమెతో మాట్లాడుతూ ఉండగానే ప్రొఫెసర్ గదిలోకి వచ్చారు. జలజాక్షి ఒకటి రెండు నిముషాలు అక్కడే కూర్చుని తరువాత లోనికి వెళ్ళి పోయారు. రంగనాధన్ సునంద ఎదురుగుండా ఉన్న కుర్చీలో కూర్చుని "నీ మానసిక పరిస్థితి ఎలా ఉంది?" అన్నారు.

"అలాగే ఉంది. మార్పేమీలేదు డాక్టర్."

"నిన్ను ఇంకో విషయం అడుగుదా మనుకున్నా. నీ తోడబుట్టిన వారెంతమంది?"

"నేనూ, మా అన్నయ్యా ఇద్దరమే."

"నీకు ఈ మధ్య ఇతరులకన్నా నువ్వు తక్కువ అనే భావం పైకొచ్చిందన్నావుగదూ?"

"అవును."

"మీ తల్లిదండ్రులు నిన్ను ఎలా పెంచారు? ఇలా ఎందుకు అడుగుతున్నానంటే కొంతమంది తల్లిదండ్రులు ఆడపిల్ల పుడితే "ఆడపిల్లా!" అని నిర్లక్ష్యంగా చూస్తారు. ఆడపిల్ల ఏ పని చేద్దామని పోయినా ఆడపిల్లవి నీ కెందుకు పెత్తనాలు? అని అడ్డుపుల్ల వేస్తారు. మాటి మాటికి ఆడపిల్లయి పుట్టాక అలాంటి పనులు నీకెందుకు, ఆడ పిల్లయ్యాక నాలుగు మాటలు పడాల్సిందేనని అంటూంటారు. దానివల్ల సహజంగానే ఆడపిల్లలకు తమ అన్నదమ్ములకన్నా తాము హీనస్థితిలో ఉన్నాం అనే భావం వారిలో పెంపొందుతుంది. మీ తల్లిదండ్రులు ప్రతీ పనిలోనూ మీ అన్నయ్యకే ప్రాధాన్యాన్నిచ్చి నిన్ను 'ఆడపిల్ల' అని హీనంగా చూసేవారా?"

"ఊహుం లేదు. మా ఇంట్లో అన్నయ్యకన్నా నాకే ఎక్కువ ప్రాముఖ్యత ఉందని చెప్పవచ్చును. నా అభిప్రాయాలను అందరూ గౌర విస్తారు. మా ఇద్దర్ని ఒకేరకంగా చూస్తారు. ఆడపిల్లల్ని హద్దుల్లో ఉంచాలి. అని అనుకోరు. చిన్నప్పటినుండి మా అన్నయ్య స్నేహితు లతో ఆటలాడుకునేదాన్ని. ఎన్నడూ మగపిల్లలతో ఏమిటి ఆటలు అని తిట్టేవారు కాదు."

"మీ తల్లిదండ్రులకు నీ పైన నమ్మకం ఉందా?"

"ఆఁ, నా పైన నమ్మకం విశ్వాసం ఉన్నాయి. నేను ఏ యువకుడితోనైనా సరదాగా మాటలాడినా, తిరిగినా అనుమానపడరు. నేను నా హద్దుల్ని దాటిపోనని వారికి తెలుసును."

"అలాగే ఉండాలి. ఏ పనైతే చెయ్యొద్దంటారో ఆ పని చేయటమే మానవ స్వభావం. మన సంఘం స్త్రీ పురుషులు కలిసిమెలిసి తిరగ టాన్ని నిషేధిస్తోంది. సమాజం దేన్నయితే నిషేధిస్తోందో దాన్ని మన అబ్బాయిలూ అమ్మాయిలూ చేస్తారు. ఇప్పుడు కాలేజీలలో అబ్బాయిలు అమ్మాయిల వెంటపడటం, ఉత్తరాలు రాయటం, బెంచీలమీద పేర్లు చెక్కటం చాలా మామూలయిపోయింది. దీనికి కారణం మన సమాజం స్త్రీ పురుషుల మధ్య స్నేహం ఉండే అవకాశాన్ని కల్పించకపోవడమే. స్త్రీ పురుషుల కలాంటి అవకాశాన్ని కల్పించి వారి మధ్య నిర్మలమైన

స్నేహాన్ని పెంపొందనిస్తే, ఏ అబ్బాయీ అమ్మాయి వెంటపడదు. పరస్పర స్నేహం పరిచయం ఉండటం వల్ల కుతూహలం ఉండదు. మీ యింట్లో నీకా స్వాతంత్ర్యాన్ని ఇచ్చారని విని చాలా సంతోషంగా ఉంది. మీ యింట్లో అందరూ నిన్ను ప్రేమతో చూస్తారా?"

"అమ్మ నాన్నా, అన్నయ్యా. వదినా, దినూ, తాతా అందరూ నన్ను ప్రేమతో చూస్తారు. వాత్సల్యం, ప్రేమ వీటిలో నాకేం లోటు లేదు."

రంగనాధన్ కొంచెంసేపు ఆలోచిస్తూ కూర్చున్నారు.

"నేను ఆ రోజు చెప్పాను గదా అలా ఎందుకని చేయకూడదు? ఎవరినైనా ప్రేమించి పెళ్ళిచేసుకో ; బహుశా నీ మనస్సు జీవితపు సహచరుడిని కోరుతూందేమో! పెళ్ళిచేసుకొని కాపురం చెయ్యాల్సిన వయస్సిది ఇంకా పెళ్ళికాకుండా ఉండటం వల్ల జీవితంలో ఏదో శూన్యం, లోటూ కనిపిస్తోంది. నువ్వు అన్నావుగదా వీథిలో నడుస్తూంటే నలుగురూ నీవైపే చూస్తుంటారు, నీ విషయమే మాట్లాడుకుంటూ ఉంటారనిపిస్తోందని. నీకింకా పెళ్ళికాలేదేమోనని అందరూ నీ వైపు చూస్తుంటారు. ఇంత వయస్సయినా పెళ్ళెందుకు చేసుకోలేదా అని అందరూ నీ విషయమే మాట్లాడుతున్నారనిపిస్తూ ఉండవచ్చు. పెళ్ళి చేసుకుని హాయిగా కాపురం చేసుకుంటున్నవారికన్నా నువ్వు తక్కువ అనే భావన నిన్ను బాధపెడుతోందేమో ఏమంటావ్?"

"......"

ప్రొఫెసర్‌గారు సునందను పరీక్షించేలా చూశారు. ఆమె మొహం ఎర్రబడింది. ఉద్వేగంతో పెదవులు బిగించి కర్చీఫ్‌ని వేలుకు చుట్టి విప్పుతోంది.

"నేను ఇలా చెప్పానని సంకోచపడకు, పెళ్ళి అనగానే సిగ్గుపడటం దేనికి? నీ యౌవనం సహజంగానే పురుషుని కోరుతోంది. దాన్లో తప్పేమీ లేదు. చిన్నప్పుడు బొమ్మలాడటం, కొంచెం పెరిగాక చదువుకోవడం, యౌవనంలో పెళ్ళిచేసుకుని కాపురం చేయటం ప్రకృతి నియమం "మీ తల్లిదండ్రులకు ఈవిషయం చెప్పటంఎలా అని ఆలోచిస్తు

న్నావేమో! అదీ సహజమే. ఏ అమ్మాయీ పెద్దవాళ్ళ దగ్గరకు వెళ్ళి 'నాకు పెళ్ళిచేయండి. ఈ మధ్య నా మనస్సు సరిగ్గాలేదు. పెళ్ళిచేస్తే నేనూ నలుగురిలా తిరగగలను' అని చెప్పలేదు. నీకలా అడగటం సిగ్గనిపిస్తే మీ నాన్నగారితో వచ్చి చెప్తాను."

"......"

"పెళ్ళయితే నీ జీవితంలో నీకు కావలసిన సంతోషం, ఉత్సాహాలను నీ భర్త నీకు ఇవ్వగలరేమో. ఈ మానసికమైన బాధలకు పెళ్ళి చేసుకోకపోవడమే కారణం. పెళ్ళిచేసుకో. మళ్ళీ మామూలుగానే అయిపోతావు."

సునంద మౌనంగా కర్చీఫుని వేలుకి చుట్టి విప్పి కాలక్షేపం చేస్తోంది.

"ఏం నేను చెప్పింది నీకు నచ్చలేదా?"

"......"

"అపార్థం చేసుకోకు. నేను ఉన్న సంగతే చెప్తున్నాను."

సునంద నెమ్మదిగా అంది "పెళ్ళి నిశ్చయమయింది."

"ఏమన్నావు?" డాక్టర్ రంగనాధన్ ఆశ్చర్యంతో అడిగారు.

"ఈ వేసంగిలో నా పెళ్ళి జరగబోతోంది."

"పెళ్ళి నిశ్చయము ఎన్నిరోజులయింది?"

"మూడు నెల్ల క్రితమే నా పెళ్ళి నిశ్చయమయించి."

"వరుడెవరు?"

"మా అన్నయ్య స్నేహితుడు, శ్రీధర్ అని ఆయన పేరు."

"ఏం ఉద్యోగం చేస్తున్నారు?"

"ఈ ఊళ్ళోనే అడ్వొకేటుగా ఉన్నారు."

"అయితే...అయితే...ఈ అబ్బాయిని నీకిష్టం లేకుండానే పెళ్ళిచేసుకోవటానికి ఒప్పుకున్నావా? బహుశా అతడంటే నీకు ఇష్టం లేకుండా ఉండి తల్లిదండ్రుల మాట కాదనలేక ఒప్పుకున్నావా! అందువల్ల నీ మనస్సులో ఇలా విప్లవం చెలరేగిందేమో?"

"మాది ప్రేమ వివాహం."

"ప్రేమ వివాహమా?"

"అవును. శ్రీధర్ మా అన్నయ్య స్నేహితులు. మా యింటికి తరచుగా వస్తూండేవారు. మా మధ్య పరిచయం స్నేహంగా మారింది. మూడు నెల్ల క్రితం మేమే పెళ్ళి చేసుకోవటానికి ఒప్పుకొని పెద్ద వాళ్ళకు తెలియచేశాం. అందరూ ఈ పెళ్ళికి అంగీకరించారు. ఈ వేసంగిలో మా పెళ్ళి జరుగుతుంది."

ఓ రెండు నిమిషాలు మౌనం వహించి మళ్ళీ రంగనాథన్ అడిగారు :

"పెళ్ళి నిశ్చయమయ్యాక నీకా అబ్బాయిలో అనుమానం రేకెత్తిందా? అతడు నిన్ను సరిగ్గా ప్రేమించటం లేదన్న అనుమానం గాని, లేకపోతే నువ్వు అతడిని కావలసినంతగా ప్రేమించటం లేదన్న సంశయం కాని బయలుదేరిందా నీ మనస్సులో? ఈ సందేహంతో ఉండగా పెళ్ళి చేసుకోవడం ఎలా అన్న ఆలోచన......"

"శ్రీధర్ నన్ను ఎంతగానో ప్రేమిస్తున్నారు. ఆయన నన్ను ఎంత ప్రేమిస్తున్నారో నాకు తెలుసు."

"కాని నువ్వో?"

"నేనూ ఆయన్ని ప్రేమిస్తున్నాను. మనఃపూర్వకంగా ప్రేమిస్తున్నాను. నా మాటలు నమ్మండి. నేను అబద్ధం చెప్పటంలేదు. నేను ఆయన్ని చాలా...చాలా...ప్రేమిస్తున్నాను." సునంద స్వప్నంలోలాగా మాట్లాడింది.

"నీ మాటల్లో నాకు నమ్మకముంది. కాని ఈ విప్లవం ఎప్పటి నుండి మొదలయిందీ? పెళ్ళి నిశ్చయం కాకమునుపేనా లేకపోతే నిశ్చయమయ్యాకా?"

"పెళ్ళి నిశ్చయమయ్యాకనే, అంతకుముందే మనస్సు అదో రకంగా ఉండేది. పెళ్ళి నిశ్చయమయ్యాక నా మనస్సు ప్రశాంతంగా వుండలేకపోతోంది. శ్రీధర్ నా దగ్గర ఉండేంత వరకూ అన్నిటినీ మరచిపోయి హాయిగా ఉంటాను. ఆయన కనుమరుగయిన వెంటనే ఏమేమో ఆలోచనలు వస్తాయి."

"ఏమేమో ఆలోచనలు?"

"ఆత్మహత్య చేసుకుందా మనిపిస్తుంది. ఏడుపు వస్తూంది. కోప

ద్వేషాలు నన్ను చుట్టు ముడతాయి."

"ఎవరిమీద కోపం, ద్వేషం వస్తుంది?"

"ఫలానా వ్యక్తి అనికాదు. అందరిమీద వస్తుంది. ఒక్కోమారు నామీదే ఆపుకోలేనంత కోపం వస్తుంది"

మాట్లాడుతూనే చేతిగడియారం చూసుకుని "అప్పుడే ఏడున్నర అయింది. ఇక నేను వెడతాను" అంది సునంద.

"మళ్ళీ ఎప్పుడొస్తావమ్మా?"

"ఎప్పుడు రమ్మన్నారు?"

"ఆదివారం సాయంకాలం రావటానికి వీలుపడుతుందా?"

"ఆదివారం మా స్కూలు వార్షికోత్సవం ఉంది. సోమవారం గాని, శనివారంగాని వస్తాను."

"సోమవారం రా."

"అలాగే" అంటూ సునంద ఇంటికి బయల్దేరింది.

◆ ◆ ◆

స్కూలు వార్షికోత్సవం అయిన మర్నాటి ఉదయం తన పనులన్నీ అయ్యాక రాత్రి బయట పడేసిన వన్నీ లోపల పెట్టసాగింది సునంద. చీర, జాకెట్టు మడిచి లోపల పెట్టాక, వజ్రపు టుంగరాని కోసం చుట్టూ చూసింది. సునందకు ఉంగరం అంటే అంత పెద్ద ఇష్టం లేకపోయినా ముస్తాబు చేసుకునేటపుడు పెళ్ళిలో శేఖరం తనకు ఇచ్చిన వజ్రపు టుంగరాన్ని పెట్టుకుంటుంది. ఉంగరం పెట్టుకునే అలవాటు లేకపోవటంవల్ల రాత్రి పడుకోబోయేముందు టేబుల్ మీద పెట్టిపడుకుంది.

సునంద గాబరాగా మడిచిపెట్టిన చీర తీసి విప్పి చూసింది. పెట్టె అంతా తీసి వెతికింది. అయినా ఉంగరం ఎక్కడా కనబడలేదు.

అమ్మా, నాన్నా, అన్నయ్యా, వదినలను అడిగింది సునంద. అందరూ ఉంగరాన్ని చూడనేలేదని చెప్పారు. "ఏడిపించడానికని తీసి ఉంటే ఇచ్చెయ్యన్నయ్యా" అని సీతారాంని అడిగింది.

"నే నసలు చూడనేలేదు. అలాంటప్పుడు ఎక్కడినుండి తెచ్చి పెట్టమన్నావు?" అని సీతారాం చెల్లెలిని అడిగాడు.

ఇలా వస్తువులన్నీ దొంగిలిస్తున్న దెవరు?

సునంద ప్రొఫెసరుగారి ఇంటికి వెళ్ళేటప్పటికి ఆయన ఇంకా కాలేజీనుండి రాలేదు. జలజాక్షి సునందకు ఎదురువచ్చి "ఆయనింకా రాలేదు, ఆయన వచ్చేవరకూ బ్యాడ్మింటన్ ఆడుకుందాం రండి" అన్నారు. సునంద బ్యాడ్మింటన్ ఆడసాగింది.

రంగనాధన్ ఇంటికి రాగానే ఆట ఆపారు.

"కాలేజినుండి రావటం ఆలస్యమయింది, క్షమించండి" అన్నారు రంగనాధన్. డ్రాయింగ్ రూములో కూర్చున్నా రిద్దరూ.

"ఇంకా నీ మానసిక పరిస్థితిని గురించి ఏమేం చెప్పాలి?"

"ఇంకేమీ లేదనుకుంటా."

"నీమనస్సును ఒక్కచోట కాన్సెన్ట్రేట్ చెయ్యలేనన్నావు గదూ. అప్పుడు నీ మనస్సు దేన్నిగురించి ఆలోచిస్తుందో చెప్పగలవా?"

"చెప్పలేను."

"పోనీ నీకు రాత్రిళ్ళు కలలు వస్తుంటాయా?"

"ఊఁ కలలకేమిటి? బోలెడెన్ని కలలు వస్తుంటాయి."

"నీకో వారం టైమిస్తాను. రోజూ నీకు వచ్చే కలలన్నిటినీ రాసి నాకు చూపుతావా?"

"ఉదయం లేచేటప్పటికే ఏమేం కలలు వచ్చాయో మరిచి పోతూంటాను."

"అయితే ఇంకోపనిచేయి. కల వచ్చాక నీకు ఎప్పుడు మెలకువ వస్తే అప్పుడే రాసేయి."

"అలాగే! మామూలుగా కలరాగానే నాకు చటుక్కున మెలకువ వస్తుంది. వెంటనే ఎంత టైమయినా లేచి రాస్తాను."

"మళ్ళీ వారం ఇదే టైముకి నీ కలలజాబితాకూడా తీసుకునిరా."

"అలాగే."

ఆరోజునుండి రోజూ రాత్రిలేచి తనకు వచ్చిన కలలు నన్నిటిని రాసి పెట్టడం ఓ పెద్ద పనయింది సునందకు. ఆమె కన్న కలలన్నీ విచిత్రంగా ఉన్నాయి. అవి చదువుతూంటే తనకే నవ్వు వచ్చేది. ఓ వారంలో తనకు వచ్చిన కలల నన్నిటినీ తీసుకుని ప్రొఫెసరుగారి ఇంటికి వెళ్ళింది.

తాను రాసిన కాయితాలను రంగనాథన్ ముందుంచింది. ఆయన ఒక్కొక్క కాయితాన్నే తీసుకుని చదవసాగారు.

ఒకటవ కల:

ఓ పెద్ద కొండ, ఆ కొండ శిఖరాన ఓ కోవెల, ఆ కోవెలలో ఉన్న దేవుడికి పూజ చేయటానికి నేనో పూల సజ్జనిండా ఎర్రటి తామర పూలను తీసుకుని కొండ నెక్కడానికి ప్రారంభిస్తాను. సగం కొండ ఎక్కాక పక్కనే ఇంకో గుడి కనిపించింది. ఈ దేవుడిసికూడా పూజించి వెళ్ళమని అంటుంది మనస్సు. ఆ చిన్నగుడికి వెళ్ళి ఆదేవుడికి నమస్కరించి ఓ నాలుగే నాలుగు తామరపూలతో దేవుని పూజిస్తాను. మళ్ళీ సజ్జవంక చూస్తే దానిలో ఒక్కపూవయినా లేదు. ఇదెందుకు ఇలా చేశావు? మళ్ళీ పైనున్న దేవుడిని ఏ పూలతో పూజిస్తావు? అని నన్ను నేనే ప్రశ్నించుకున్నాను. ఇప్పుడు మళ్ళీ కిందకు వెళ్ళి పూలు తేవా లంటే చాలా ఆలస్య మయిపోతుందే. ఏం చేద్దామని ఆలోచించి చివరికి చిన్న దేవుడిని పూజించిన పూలతోనే సజ్జ నింపుకుని పైకెక్కుతాను. దేవస్థానపు ద్వారాలవద్ద ఓ వికేశి వితంతువు నిలబడి నావైపు కోపంగా చూస్తూ అంటుంది.

"ఆ దేవుని పూజించిన పూలనే ఇక్కడికి తెచ్చావా? ఈ నిర్మాల్య పుష్పం వద్దు. మళ్ళీవెళ్ళి కొత్తపూవులు తీసుకునిరా." నేను ఏడుస్తూ "మళ్ళీ కిందికి వెళ్ళి పూలు తేలేను. ఇప్పటికే నా కాళ్ళు నొప్పి పెడుతున్నాయి. ఈ పూలనే పూజిస్తాను" అంటాను. ఆవిడ కోపంతో నన్ను భస్మీపటలం చేసేలా చూస్తూ నా చేతిలో పూలసజ్జ తీసుకుని నేల మీదకు పడేస్తుంది. అప్పుడు నేను ఉలిక్కిపడి లేచి కూర్చున్నాను.

రెండవ కల:

మా ఇంటి హాల్లో చాలామంది మనుష్యులు కూర్చున్నారు. కొంచెం ముసలి వితంతువు-ఒకావిడ పువ్వొత్తులు చేస్తున్నారు. రుద్రాక్ష మాల వేసుకున్న దాసుగా రొకరు హరికథ చెప్తున్నారు. నేను ఆవిడ పక్కనే కూర్చుని వింటున్నాను. ఆయన ఏ కథ చెప్తున్నారో నాకు సరిగ్గా గుర్తుకు రావటంలేదు. బహుశా సావిత్రి కథే అయి ఉండాలి. అవును సావిత్రి కథే. ఆ దాసుగారు బాగా మంచి రసపట్టుగా ఉండే

చోట కథను వివరిస్తున్నారు. సావిత్రి యముని వెన్నంటి మూడు వరాలను కోరే ప్రసంగం - అయినా ఎంత తెలివిగలది ఆమె. మాటల్లోనే యముడిని ఓడించింది కదా? తనకు నూరుగురు పిల్లలు పుట్టాలి అని వరం కోరుకుంది కదా?

దాసుగారు ఆ ఘట్టాన్ని వివరించేటప్పుడు మాపక్కనే కూర్చున్న వారొకరు చిన్నగా నవ్వునవ్వి "ఆ యముడే తెలివితక్కువ మొద్దు. సావిత్రికి నూరుగురు పిల్లలుపుట్టాలంటే మళ్ళీ సత్యవాన్ పునర్జీవితుడు కావాలా? మరింకేమీ మార్గంలేకపోయిందా" అన్నారు, చాలా నెమ్మదిగా.

ఈమాట వత్తులు చేస్తూ కూర్చున్నావిడకు వినిపించింది ఆవిడ కోపంతో అతడివైపు చూసి "సావిత్రిలాంటి పతివ్రత విషయంలో నోటి కొచ్చినట్లల్లా మాట్లాడకు. పెళ్ళికి ముందే సత్యవంతుడికి 'అర్ధాయుష్షు' అని నారదుడు చెప్పినా ఆవిడ నేను మనసా అతడినే వరించాను. అతని దప్ప మరింకెవరినీ పెళ్ళాడను। అతడే నా భర్త' అని ఖచ్చితంగా చెప్పలేదూ? అలాంటి దృఢమైన మనస్సు మరింకెవరికుంది" అంటూ కఠినంగా మందలిస్తున్నారు.

మూడవ కల :

'పరిణీత' సినిమా చూశాను. కాని మళ్ళీ కలలో కూడా పరిణీత. 'పరిణీత' అంటే పెళ్ళయిన స్త్రీ అని అర్థం. అశోక్‌కుమార్, మీనా కుమారి చాలా బాగా నటించారు। లలితగా మీనా, శేఖర్‌గా అశోక్ ఆ పాత్రలకు జీవం పోశారు. కలలో పరిణీత చూస్తున్నప్పుడు ఓ ఘట్టం నాకు అసహజమనిపించింది, లలితచెల్లి ఏడెనిమిదేళ్ళచారు బొమ్మల పెళ్ళి చేస్తుంది. లలిత బాబాయి అప్పులమూలంగా కలకత్తా వదిలి వెళ్ళిపోతారు. వెళ్ళేటప్పుడు చారు మగబొమ్మను ఊళ్ళోనే మర్చిపోయి ఆడబొమ్మను మాత్రం తీసుకుని వెడుతుంది. తరువాత ఆ విషయాన్ని లలితతో చెప్పి 'అక్కయ్యా ఇప్పుడేం చెయ్యమన్నావు వరుడు అక్కడే ఉండిపోయాడు' అని చెపుతుంది. లలిత చిలిపిగా ఫరవాలేదు; వధువుకు మళ్ళీ పెళ్ళి చెయ్యి అంటుంది. దానికా ఏడెనిమిదేళ్ళ పిల్ల 'ఆడదాని కొక్కమారే పెళ్ళి' అని చెప్పి వెళ్ళిపోయింది. అంత చిన్న పిల్ల అంత

పెద్ద మాటలాడటం సాధ్యమా; అయినా దబ్బివ్వకుండా ఇంకోమారు 'పరిణీత' సినిమా చూసినట్టయింది.

నా లు గ వ క ల :

నేనేదో పెళ్ళికి వెడుతున్నదానిలా బాగా అలంకరించుకుని బయలుదేరబోతుంటాను. అప్పుడు వదినవచ్చి నాతో దెబ్బలాడటానికి మొదలెడుతుంది.

"ఎక్కడికి వెడుతున్నావు?"

"నా ఇష్టం వచ్చినచోటికి వెడతాను."

"నువ్వు వెళ్ళటానికి వీల్లేదు."

"నాకూ, ఒకేచోట కూర్చుంటే విసుగెత్తదూ? మీరు మాత్రం మీ ఇష్టం వచ్చినచోటికి వెళ్ళటం లేదా?"

"నా విషయం వేరు. నన్నూ, నిన్నూ పోల్చుకోకు. నేను వెళ్ళటం మంచిదే. నువ్వు వెళ్ళటం తప్పు. నువ్వెక్కడికి వెళ్ళటానికి వీల్లేదు" అంటూ వదిన కోప్పడుతూ నన్ను ఆపేస్తారు. కోపంతో మండి పడుతున్న ముఖం, రేగిన వెంట్రుకలు, కోపంగా ఉన్న ధ్వని విని భయపడతాను.

అ యి ద వ క ల :

భయంకరంగాఉన్న నలుగురైదుగురు మనుష్యులు నన్నెక్కడికో లాక్కుని వెడుతున్నారు. నేను భయంతో ఏడుస్తూ నన్ను వది లేయండి, అని వేడుకుంటున్నాను. కాని వాళ్ళుమాత్రం నిన్ను వది లేయం, నీకు తగిన శిక్ష వేస్తాం, అంటూ నన్ను నలసలా కాగుతున్న నూనెలోకి ఎత్తి పడేశారు. నేను పెద్దగా కేక పెట్టాను. అంతలోగా మెలకువ అయింది.

ఆ ర వ, ఏ డ వ క ల :

మా ఇంట్లో ఎందుకో చాలామంది మనుష్యులు వచ్చారు. ఓ వితంతువు తలుపుదగ్గరే కూర్చుని వత్తులు చేసుకుంటున్నారు. నేను ఆమె నానుకొని కూర్చున్నాను. హరికథలు చెప్పే దాసుగారొకరు నల దమయంతి చరిత్ర, లోపాముద్ర, సీతా వీళ్ళందరి కథలు చెప్తు తున్నారు. ఆవిడ అప్పుడప్పుడు నన్నుచూసి "దాసుగారు చెప్పే కథ

లన్నీ జాగ్రత్తగా విను అమ్మలూ, అందువల్ల ఇహపరాల్లో పుణ్యం లభిస్తుంది" అంటూ నా వీపు నిమురుతున్నారు.

రంగనాధన్ సునంద కల లన్నిటినీ చదివి ఆ కాగితాలు ఓ పక్కకు పెట్టి,

"నిన్నో రెండు ప్రశ్నలు అడగనా ?"

"అడగండి "

"మీ ఇంట్లో ఎవరైనా వితంతువులు ఉన్నారా?"

"లేరు."

"ఇంతకు ముందెప్పుడైనా ఉండేవారా?"

"నేను అయిదారేళ్ళ పిల్లగా ఉన్నప్పుడు మా నాన్నగారి అక్కయ్య వెంకమ్మగారని ఉండేవారు."

"ఆ విషయం నీ కేమన్నా తెలుసా?"

"ఆమెకు చాలా చిన్న వయస్సులోనే భర్త చనిపోయారు. అప్పటి నుండి మాఇంట్లోనే ఉండేవారావిడ. చాలా మడిగా వ్రతాలూ అవీ చేస్తూ నిష్ఠగా ఉండేవారావిడ. నాకు ఎనిమిదేళ్ళప్పుడు గాబోలు ఆవిడ చనిపోయారు. నా కావిడ విషయం అంతగా తెలియదు."

"ఆవిడ నువ్వంటే ప్రేమగా ఉండేవారా?"

"ఊఁ నేనంటే ఆవిడ ప్రాణంగా చూసుకునేవారట. నేను కూడా ఎప్పుడూ "అత్తయ్యా" అంటూ ఆవిడ వెనకే తిరిగేదాన్నట. భోజనం చేయటం, పడుకోవటం అంతా ఆవిడదగ్గరే కావాలని పట్టుబట్టేదాన్నట. ఆవిడ నాకు కథలు చెప్పి నిద్రపుచ్చేవారట . కాని నాకేదీ అంత స్పష్టంగా జ్ఞాపకం లేదు."

"రేపు నువ్వు వచ్చేటప్పుడు కొన్ని విషయాలు తెలుసుకునిరా. మొదటిది మీ అత్తయ్యకోసమని అప్పుడప్పుడూ మీ ఇంట్లో హరికథలు చెప్పించేవారా ? రెండోది ఆవిడ వ్రతాలు నియమాలు ఆచారం వీటి విషయంలో కొంచెం వివరంగా తెలుసుకునిరా."

"అలాగే."

"మీ వదినా, నువ్వూ స్నేహ విశ్వాసాలతోనే ఉంటారా ? లేక పోతే అప్పుడప్పుడూ దెబ్బలాడుకుంటూంటారా ?"

"వదిన నన్ను ఓ తల్లిలాగే చూసుకుంటారు. మేమిద్దరం వదినా మరదళ్ళలాగా లేము, స్నేహితులలాగా ఉన్నాం."

"మీ వదిన ఒక్కమారయినా నీమీద కోపం చేసుకోలేదూ?"

"లేదు. ఆమె నన్ను చాలా వాత్సల్యంతో చూస్తారు."

"నువ్వు?"

"మా అన్నయ్య నెంత ప్రేమతో, గౌరవంతో చూస్తానో వదిననీ అంతే ప్రేమతో గౌరవంతో చూస్తాను."

"నిజమే చెప్పుతున్నావా?"

"ఊఁ, నే నెప్పుడూ అబద్ధాలాడను."

"నేను కొన్ని విషయా లడిగానుకదా వాటిని గురించి వివరంగా తెలుసుకుని రేపు రామ్మా."

సునంద ఇంటికి బయల్దేరింది. రంగనాధన్ అడిగిన ప్రశ్నలు కొంచెం విచిత్రంగా కనిపించాయి. ఎప్పుడో చనిపోయిన అత్తయ్యను గురించిన వివరాలు ఆయన కెందుకు? అనిపించింది.

సునంద రాత్రి భోజనాలయ్యాక వరండాలో కూర్చున్న తండ్రి దగ్గరకొచ్చి పక్కనే కూర్చుంది.

"చల్లగా గాలి వీస్తోంది కదూ నాన్నా?"

"అవునమ్మా, భోంచేశావా?"

"చేశాను. అన్నట్టు వెంకమ్మత్తయ్య చనిపోయి ఎన్నేళ్ళయింది నాన్నా?"

"ఇప్పుడెందుకు జ్ఞాపక మొచ్చిందమ్మా?"

"ఏమో అలా జ్ఞాపకానికొచ్చింది, అడిగాను అంతే."

"ఆమె చనిపోయే టప్పటికి నీకు ఎనిమిదేళ్ళు, ఇప్పటికి పదిహేనేళ్ళవుతుందేమో చనిపోయి."

"అత్తయ్య చాలా మంచావిడకదు నాన్నా!"

"అవునమ్మా! నువ్వంటే ఆమెకు పంచప్రాణాలూను, పాపం పెద్దమనిషి కాకముందే భర్త చనిపోయాడు. మనసంసారపు సుఖమే తన సుఖమని అనేది. మన సంసారపు సుఖాని కోసమే తన సర్వశక్తులూ

ధారపోసింది."

"చాలా మడిగా ఆచారంగా ఉండేవారనుకుంటా, ఏం నాన్నా?"

"అవునమ్మా పన్నెండేళ్ళకే మొగుడు చనిపోయాడు. తరువాత ఎంతమంది చెప్పినా భర్త లేనివాళ్ళు వెంట్రుకలుంచుకోకూడదు. భర్త లేని ఆడదాని వెంట్రుకలనుండి ఒక్క చుక్కనీరు నేలమీదపడినా భర్తను యమదూతలు నరకహింస పెడతారు. బ్రతికున్నప్పుడు ఆయన్నేమీ సుఖపెట్టలేకపోయాను. చచ్చి స్వర్గంలో ఉన్న పుణ్యాత్ముడిని ఈ వెంట్రుకలు అలాగే ఉంచుకుని నరకానికి పంపనా అని చెప్పి జుత్తు తీయించేసుకుంది."

"మీరయినా మానిపించాల్సింది నాన్నా."

"ఏంచేస్తామమ్మా. మేమెంత చెప్పినా వినలేదు. అదీ కాకుండా ఆనాటి పరిస్థితులు అలా ఉండేవి. మొగుడు చనిపోయిన ఆడది జుట్టు తీయించుకోకపోతే అందరూ ఆక్షేపించేవారు. ఆమె చాలా నిక్కచ్చి మనిషికూడా."

"ఏమయినా మన సంఘం ఇంకా చాలా మారాలి నాన్నా. అన్నట్లు అత్తయ్య కాలం ఎలా గడిపేది?"

"జపాలూ, తపాలూ, ఉపవాసాలూ, పూజలూ వీటితోనే గడిచిపోయేది. రోజూ స్నానంచేసి 'భక్తవిజయం' చదివేది. తరువాత గీతా పారాయణం చేసేది. రోజూ సాయంకాలాలు శివాలయానికి వెళ్ళేది. ఆమె కోసమే శనివారం ఇంట్లోనే హరికథ ఏర్పాటు చేసేవాడిని. దాసుగారొకరు వచ్చి హరికథ చెప్పేవారు..."

'ఓ!' అంది ఆశ్చర్యంతో సునంద. అత్తయ్య తనకు జ్ఞాపకం లేకపోయినా హరికథను గురించిన కల తనకు రావటాన్ని చూసి ఆశ్చర్యపడింది సునంద.

"అంతా అప్పుడే మరిచిపోయావా సునందా. రోజూ రాత్రిళ్ళు వెంకమ్మ దగ్గర పడుకుని భక్తుల కథలు, పతివ్రతల కథలు చెప్పించుకునేదానివి. మళ్ళీ వాటినన్నిటిని ఏడేళ్ళ పిల్లగా ఉన్నప్పుడే ఎంత చక్కగా చెప్పేదానివి? అంతా మరచిపోయావా అమ్మా?"

"నాకేదీ సరిగ్గా జ్ఞాపకంలేదు నాన్నా. అయితే నేను భక్తుల

కథలు, పతివ్రతల కథలూ అన్నీ చెప్పేదాన్నా?"

"లోపాముద్ర, సావిత్రి, నల-దమయంతి, అహల్య, సీత, అరుంధతి, సక్కుబాయి, కబీర్, తులసీ మొదలయిన కథలన్నీ ఎంత చక్కగా చెప్పేదానవో! వెంకమ్మ నీకు ఆ కథలన్నీ చెప్పి నువ్వూ వాళ్ళలాగే కావాలమ్మలూ అనేది."

"నాకేమీ జ్ఞాపకంలేదు నాన్నా."

"నువ్వప్పటికి చాలా చిన్న పిల్లవి. అంతా మరిచిపోయుంటావు. భర్త చనిపోయినదానికేం సుఖమని రాత్రిళ్లు భోంచేసేది కాదు. ఓరోజు నువ్వు మల్లెపూలదండ పెట్టుకుని ఇంకోదండ ఆవిడ దగ్గరకు తీసుకుని వెళ్ళి 'అత్తయ్యా నువ్వు పూలు పెట్టుకోవూ' అని అడిగావు. దానికామె 'ఈ జన్మలో నాకా పుణ్యంలేదు. ఈ జన్మలో నోములు నోచుకుని వచ్చేజన్మలో ఆ పుణ్యం సంపాదిస్తాను. మొగుడు లేనిదానికి పూలు దేనికమ్మా?' అంది.

'పెట్టుకుంటే ఏమవుతుందేమిటి?' అని అడిగావు నువ్వు. మళ్ళీ 'తప్పమ్మా, అలా చేయకూడదు'... అంటూ ఏడ్చేసింది. అప్పుడు మీ అమ్మ వచ్చి నిన్నెత్తుకుని వెళ్ళిపోయింది."

"పాపం! నా మాటల కత్తయ్య ఎంత నొచ్చుకుందో!"

ఇద్దరూ కొంచెంసేపు మౌనంగా కూర్చున్నారు.

"నీ ఉంగరం దొరికిందామ్మా?" అన్నారు రావుగారు.

"లేదు నాన్నా. ఇంకోమారు వెతికి చూడాలి. నిద్ర వస్తోంది పడుకుంటాను" అంటూ లేచి మేడమీదకి వెళ్ళింది.

◆ ◆ ◆

మరునాడు సునంద రంగనాథన్‌గారితో తండ్రి తనకు చెప్పిన విషయాలన్నిటినీ తెలియచేసింది. ఆయన మౌనంగా అంతా విన్నారు. తరువాత కొంచెంసేపు ఏదో ఆలోచిస్తూ కూర్చుని, తలెత్తి సునంద వైపు చూశారు.

"నువ్వు నానుండి ఏ విషయాన్నీ దాచిపెట్టలేదు కదా!" అన్నారు.

"లేదు."

"నీ విషయంలో చెప్పవలసిందంతా చెప్పావా?"

"ఆఁ"

"నాకేమో అనుమానంగా ఉంది. శ్రీధర్‌ని ప్రేమించే ముందు ఇంకెవరినైనా ప్రేమించావా?"

సునంద తొందరగా జవాబు చెప్పలేదు. ఆమె మనస్సు అద కత్తెరలో పడినట్టుగా ఉంది. మనస్సులో జరుగుతున్న విప్లవంవల్ల ఆమె మొహం పాలిపోయింది. కర్చీఫ్‌ను వ్రేలికి చుట్టి, విప్పి వేస్తూనే ఉంది. రంగనాథన్ ప్రశ్నకు సునంద "మీకు దెయ్యాల్లో నమ్మకం ఉందాండి?" అని అడిగింది.

తమ ప్రశ్నకు జవాబు చెప్పకుండా సునంద ఎదురు ప్రశ్న వేయటాన్ని చూసి ఆయనకు కోపం వచ్చింది. తమ కోపాన్ని బయట పడనీయకుండా "ఇప్పుడీ ప్రశ్న దేనికి?" అన్నారు.

"నాకు దెయ్యాల్లోనమ్మకంకలిగేలాంటి సంఘటనలు జరిగాయి."

"నువ్వు చెప్పటం చాలా వింతగా ఉంది. నీ అనుభవం చెపుతావా?"

"ఊఁ, ఓరోజు రాత్రి ఎనిమిది గంటలకు వర్షం కురవటానికి మొదలయింది. పది గంటలకు ఆగిపోయింది. ఆ రోజు వర్షం రావటం మొదలయ్యాక నేను గడప దాటలేదు. కాని ఉదయం లేచేటప్పటికి నా కాళ్ళు, పక్క మీది దుప్పటి బురదయింది. బురదనీరు నా చీర కుచ్చిళ్ళకు అంటుకుని ఉంది...."

రంగనాథన్ ఉత్సాహంతో ముందుకు వంగి "ఆ తరువాత?" అన్నారు.

"నా చిన్నప్పుడు విన్నాను దెయ్యాలు నిద్రపోయేటప్పుడు ఎక్కడికైనా తీసుకుని వెడతాయని. ఒకతను వరండాలో పడుకునేవాడు. ఉదయానికల్లా నడివీధిలో ఉండేవాడు. వాడిని మోహిని ఆవహించింది అనేవారు."

"ఇంకా ఏమేం అనుభవం అయ్యాయి?" కుతూహలంతో రంగనాథన్ నుదుటిమీది నరాలు పొంగాయి.

"నా గదిలోని కొన్ని వస్తువులు పెట్టిన చోట్లో నుండి మాయ

మయ్యాయి."

"ఎవరూ దొంగలించలేదని నీకు బాగా నమ్మకముందా?"

"ఊఁ- నేనే స్వయంగా నిల్చుని గది ఊడిపిస్తాను. మా అమ్మా, నాన్నా మేడమేదకు సాధారణంగా రారు. ఇక అన్నయ్యా వదినా, దినూ మాత్రమే నా గదిలోకి వస్తారు. వాళ్ళమీద నాకేం అనుమానం లేదు. కాని ఆ వస్తువులు తీసుకోవటంవల్ల వాళ్ళకే లాభంలేదు."

"దొంగిలింపబడిన వస్తువులు ఏవేవి?"

"ఒకటి రెండు ఫొటోలు, ఉంగరం, కొన్ని ఉత్తరాలు..."

"ఎవరి ఫొటోలు? ఎవరు రాసిన ఉత్తరాలు?" ఆమె చేతులు కర్చీఫును వేలికి చుట్టి విప్పివేస్తున్నాయి.

"ఎవరివో చెపుతావా?"

"నా పెళ్ళిఫొటో, మావారి ఫొటో, పెళ్ళి ఉంగరం..."

రంగనాధన్ ఆశ్చర్యంతో లేచి నిల్చున్నారు. కొంచెం సేపు పచార్లుచేసి మళ్ళీ వచ్చి ఆమె ముందు నిలబడ్డారు.

"శ్రీధర్‌తో ఈ వేసంగిలో పెళ్ళవుతుందని చెప్పావు గదూ?"

"అవును."

"అలా అయితే పెళ్ళిఫొటో, పెళ్ళి ఉంగరం అని చెప్పటంలో నీ అభిప్రాయమేమిటి? మాట్లాడే ముందు కొంచెం ఆలోచించుకుని మాట్లాడరాదూ?"

"నేను.... విధవను.... ఈ వేసంగిలో నాకు శ్రీధర్‌తో పునర్వివాహం జరగబోతోంది."

రంగనాధన్ నిర్ఘాంతపోయి నెమ్మదిగా కుర్చీమీద కూర్చుని తమ చైతన్యాన్నంతా కోల్పోయిన వారిలా వెనక్కి వాలారు. ఆశ్చర్యంతో ఆయన కళ్ళు పెద్దగా అయ్యాయి.

"నువ్వు...... నువ్వు....... విధవవా! ఇంతకు ముందే ఎందుకని చెప్పలేదు?"

"అవును నా పదిహేడవ ఏటనే నాకు పెళ్ళయింది? పందొమ్మిదేళ్ళ వయస్సులో ఆయన చనిపోయారు. ఆ తరువాత నేను చదువుకుని ఉద్యోగంలో చేరాను. తరువాత శ్రీధర్ పరిచయమయ్యారు."

"నువ్వు విధవవని శ్రీధర్‌కు తెలుసునా?"

"తెలుసు. అయినా ఆయన నన్ను చాలా ప్రేమిస్తున్నారు. నేను విధవను కానివ్వండి, అంద వికారిని కానివ్వండి, ఏమయినా కానివ్వండి, శ్రీధర్ నన్ను పెళ్ళి చేసుకుంటారు. దీనివల్ల ఆయన నన్ను ఎంత ప్రేమిస్తున్నారో ఊహించుకోవచ్చును కదూ? నేను ఆయనను చాలా ప్రేమిస్తున్నాను."

"నీకు ఇంతకుముందే పెళ్ళయిందన్న విషయం నాతో ఎందుకని చెప్పలేదు?"

"అదేమంత ముఖ్యవిషయం కాదని ఊరుకున్నాను. నేనే ఆ పెళ్ళినీ, నన్ను చేపట్టినవారినీ మరచిపోయాను. దీనిని జ్ఞాపక ముంచు కోవటంవల్ల ప్రయోజనమేముంది?" సునంద తన్ను తాను సమర్థించు కుంటూ అంది.

"నువ్వన్నదీ నిజమే, నువ్వు లాంగ్‌ఫెలో పద్యం విన్నావా?

"Trust no future however Pleasant
Let the dead past bury it's dead
Act, act in the Living Present
Heart with in and God over head"

అని. సునందా, మీ అన్నయ్యతో కొంచెం మాట్లాడాలి. రేపు సాయం కాలం పంపుతావా?"

"అన్నయ్యనా? ఎందుకూ?"

"ఆయనతో కొంచెం మాట్లాడాలి. నీ వస్తువుల్ని దొంగిలిస్తున్న దొంగను పట్టుకోవాలి."

"అలానే పంపుతాను. కావాలంటే నేనుకూడా వాడితో వస్తాను."

"నువ్వు రానక్కర్లేదు. మీ అన్నయ్యను పంపితే చాలు. నేను ఎదురుచూస్తూ ఉంటాను."

సునంద రంగనాథన్ చెప్పినదానికి అంగీకరించింది.

మర్నాడు సాయంకాలం రంగనాథన్ సీతారాం కోసమే ఎదురు చూస్తూ కూర్చున్నారు. అయిదుంపావుకు యువకుడొకడు క్వార్టర్సు దగ్గరకు రావటాన్ని చూసి రంగనాథన్ ఆత్రుతతో గేటు దగ్గరకొచ్చి

నిలబడ్డాడు.

సీతారాం సంశయంతో వెనుకంజవేస్తూ గేటు దగ్గరకు వచ్చి నిలబడటాన్ని చూసి రంగనాధన్ చిరునవ్వుతో అతడి దగ్గరకొచ్చి "నేనే రంగనాధన్. మీరు సునంద అన్నయ్య అనుకుంటా, లోపలికి రండి నా పరిచయం అయింది కదా..."అంటూ మళ్ళీ నవ్వారు.

ఆయన స్వచ్ఛమైన నవ్వు సీతారాంను ఆకర్షించింది. అతడి బిడియం మాయమయింది. అతడు నవ్వుతూ "మీ పరిచయమవటం చాలా సంతోషకరమైన విషయం. నాపేరే సీతారాం"అంటూ చెయ్యి చాచాడు. రంగనాధన్ కరచాలనంచేసి లోపలికి తీసుకొని వెళ్ళారు. సీతారాం ఆశ్చర్యం కలవరంతో రంగనాధన్ మొహమే చూస్తూ కూర్చున్నాడు.

"మిమ్మల్నెందుకు రమ్మన్నానో తెలుసా ?" "సునంద మీ ఇంటికి వెళ్ళమని మా తం చెప్పింది. కారణం అడిగితే ప్రొఫెసరుగారు చెప్తారు అని చెప్పింది " సునంద కల్యాణి ద్వారా తన పరిచయం చేసుకున్నప్పటినుండి అంతవరకూ జరిగిన విషయాలను రంగనాధన్ సీతారాంకి వివరించారు.

"మీ చెల్లెలు చాలా తెలివిగల పిల్ల. తన మనస్సు బాగాలేదని చాలా తొందరగా తెలుసుకొని నన్ను కన్సల్ట్ చేసింది. తన మనస్సులోని సంచలనాన్నీ, పోరాటాన్నీ ముందుగానే తెలుసుకొని నా దగ్గరకు రావటం చాలా మంచిపని అయింది. లేకపోతే ఈ బాధలవల్ల ఏ పరిణామం వచ్చేదో చెప్పలేం. ఆమె చాలా బుద్ధిమంతురాలు. సునంద తన వైవాహిక జీవనం సుఖంగా గడపాలనే నా వాంఛ. మీరు నాకో సహాయం చెయ్యాలి."

"సునంద సుఖం కోసం నన్నేం చేయమన్నా చేస్తాను. ఆమె మళ్ళీ పెళ్ళి చేసుకోవాలనే ఇంట్లో అందరి అభిప్రాయం. అందువల్లే నేను శ్రీధర్‌లాంటి కుర్రాడికి ఆమెతో చనువుగా తిరిగే అవకాశాన్నిచ్చాను నేను ఏ ఉద్దేశ్యంతో వారిద్దరి మధ్యా పరిచయం పెంపొందించేలా చేశానో అది ఫలించింది. ఇక ముందుకూడా ఆమె సుఖంగా జీవితం గడపాలనే మా కోరిక. శేఖరాన్ని పెళ్ళాడి ఆమె కొన్నిరోజులు మాత్రమే సుఖపడింది. పందొమ్మిదేళ్ళకే ఆమెకు వైధవ్యం ప్రాప్తించి

నపుడు మా బాధ వర్ణనాతీతం. నేను, అమ్మ, దమయంతి......"

"దమయంతి! దమయంతి ఎవరు?"

"దమయంతి నాభార్య" సునంద వదిన. "ఒక్క నిమిషం ఆగండి..." అంటూ రంగనాథన్ టేబిల్ దగ్గరకు వెళ్ళి సునంద కల లన్నిటినీ మరోమారు చదివి విషాదంతో చిరునవ్వు నవ్వి మళ్ళీ వచ్చి సీతారాం ముందు కూర్చున్నారు."

"సీతారాం, మీరో చిన్నపని చెయ్యాలి. ఈ రోజు నుండి మీరు రాత్రిళ్ళు నిద్రపోకూడదు. ఈ రోజునుండి రాత్రిళ్ళు మేలుకొని మీచెల్లె లిని పరీక్షించాలి. మీ చెల్లెలిగదికి ఎవరొస్తారు? గదినుండి ఎవరు బయ టకు వెడతారు. ఏంచేస్తారు. అనేది కనుక్కొని, బయటికి వెళ్ళేవారిని అనుసరించి వారెక్కడికి వెళతారు. అనేదాన్ని కనుక్కొని నాతో చెప్పండి. మీ చెల్లెలి గదినుండి బయటికి వెళ్ళేవారిని మీరు ముట్టుకో కూడదు. మాటలాడించరాదు. కేకవేయరాదు. మీరు వారికి తెలియ కుండా వెంటాడాలి, అన్నట్టు ఈ విషయం మీలోనే ఉంచుకోండి. ఇంకెవరికీ తెలియనీకండి."

సీతారాం కోపంతో మండిపోతూ అన్నాడు. "నా చెల్లెలి ప్రవర్త నలో మీకేమన్నా అనుమానం కలిగిందా? అలా అనుమానం వచ్చి వుంటే ఖచ్చితంగా చెపుతున్నాను- మా చెల్లెలు ఎన్నటికీ అలాంటిది కాదు. మాకు నీతినియమాలంటూ ఉన్నాయి" "కొంచెం శాంతించండి సీతారాం, మీ చెల్లెలు చెడ్డవారని నేనన్నానా? ఆమె సుఖంగా ఉండా లనే మీకీపని అప్పచెబుతున్నాను. ఈ రోజు రాత్రి చూడండి. ఎవరూ కనిపించకపోతే రేపు రాత్రి చూడండి. తరువాత వచ్చే ఫలితాలను నాకు తెలుపండి."

"అలాగే. సునందనలా ఆమెకు తెలియకుండా పొంచి చూడటం నా కిష్టం లేదు ఐనా మీరు ఆమె సుఖానికే అని అంటున్నారు కనుక అలాగే చేస్తాను, ఇక నేను వస్తాను అంటూ సీతారాం లేచి వచ్చేశాడు.

సీతారాం మనస్సు కలత చెందింది. రాత్రి భోజనంకూడా చేయలేదు. అన్నయ్య మొహం అదోరకంగా ఉండటాన్ని చూసి సునంద "ఎందు కన్నయ్యా అలా వున్నావు? ప్రొఫెసరు ఏమన్నారు?"

అంది. సీతారాం బలవంతంగా పెదవులమీద నవ్వు తెచ్చుకున్నాడు. "సునంద పెళ్ళి శుభలేఖ నాకూ పంపండి అన్నారు. మరింకేమంటారు?' అని ఊరుకున్నాడు. దమయంతి తన పనులన్నీ ముగించుకొని పైకి వచ్చేటప్పటికి సీతారాం నిద్రపోతున్న వాడిలా పడుకున్నాడు. దినకరుడు దుప్పటి కప్పుకోకుండానే పడుకున్నాడు. దమయంతి దినూకు దుప్పటి కప్పి, సీతారాం దగ్గర కూర్చుని అతడి నుదుటిపై చెయ్యివేసి 'జ్వరం కూడా లేదు. అయినా ఎందుకని భోంచేయలేదో" అని తనకు తానే నెమ్మదిగా చెప్పుకుని భర్తకు దుప్పటి కప్పి లైటార్పి తనూ పడుకుంది.

అరగంట గడిచింది. దమయంతి నిద్రపోతోందని నమ్మకం కలిగాక సీతారాం లేచి కూర్చున్నాడు. వెన్నెల గదినంతా ఆవరించింది. వెన్నెల్లో నిద్రిస్తున్న దమయంతి చాలా అందంగా కనపడింది, అతడి కళ్ళకు.

వదినెలాగే ఉండే కూతురు పుడితే నేను చేసుకుంటానంటే నేను చేసుకుంటానని జనం ఎగబడతారు అని సునంద చెప్పినమాట జ్ఞాపకాని కొచ్చింది. సీతారాం కొంచెం సేపు ప్రేమగా ఆమెవైపు చూశాడు. ఆమె నిద్రలోనే చిరునవ్వు నవ్వుతోంది. సీతారాం తన్మ్నతానే మరచి ముందుకు వంగాడు. మరుక్షణమే ఆమెకు మెలుకువ వస్తే - అనుకొని వెనక్కి తగ్గాడు. నిద్రలోకూడా దినూ కొంటెగానే కనిపించాడు.

కలలోకూడా ఏ మల్లరిచేస్తున్నాడో ? అనుకుంటూ సీతారాం లేచాడు. ఒళ్ళు విరుచుకొని ఆవలిస్తూ తన గది తలుపు తెరచి నెమ్మదిగా బయటకు వచ్చి మళ్ళీ చప్పుడు కాకుండా తలుపు మూసేశాడు. తలుపు వేసే ఉంది. సీతారాం కిటికీ ప్రక్కనే ఉన్న కుర్చీమీద కూర్చుని బయటకు చూశాడు.

వెన్నెల్లో ప్రపంచమంతా నిద్రిస్తోంది. కొబ్బరాకులు వెన్నెల్లో తళ తళా మెరుస్తున్నాయి. కీచురాల శబ్దం అప్పుడప్పుడూ వినిపిస్తూంది. కుక్కల అరపులు తప్ప అంతా నిశ్శబ్దంగా ఉంది. గడియారంలో ఒంటి గంటయింది. సీతారాంకి నిద్ర ముంచుకొస్తోంది. వెన్నెలను చూస్తూ నిద్రపోయాడు సీతారాం.

ఎక్కడో తలుపు గడియ తీసిన చప్పుడయింది. సీతారాం ఉలిక్కి పడి లేచి కూర్చున్నాడు. ఎక్కడ? ఎవరు తీశారు తలుపు గడియ? సీతారాం చుట్టూ చూశాడు. మళ్ళీ ఇంటినంతా భయంకరమైన నిశ్శబ్దం ఆవరించింది. అంతా తన భ్రమేనేమో. సీతారాం మళ్ళీ కుర్చీలో కూర్చుని ఆవలించాడు ఎవరో నడుస్తున్నట్టు అడుగులు చప్పుడు.

సీతారాం చటుక్కున లేచి కొంచెం చీకటిగా ఉన్నచోట్లో నిల్చు న్నాడు. అతడి గుండె వేగంగా కొట్టుకుంటోంది.

ఎవరో పెట్టెమూతతీసి మళ్ళీ నెమ్మదిగా మూసిన చప్పుడ యింది. సీతారాం ఒళ్ళంతా కళ్ళు చేసుకొని చుట్టూ చూస్తున్నాడు.

సునంద గదితలుపులు నెమ్మదిగా చప్పుడు కాకుండా తెరచు కున్నాయి. గదిలోనుండి బయటికి ఎవరు వస్తారా అని సీతారాం కుతూ హలంతో అటువైపే చూస్తున్నాడు.

బయటికి వచ్చింది సునంద!

సునంద బయటకెందుకు వచ్చింది అనుకుంటూ సీతారాం చెల్లెలి మొహాన్నే పరిశీలనగా చూశాడు. సునంద తెల్లటి వాయిల్ చీర కట్టుకుని వుంది. తెల్లటి జాకెట్ వేసుకుంది. ముంగురులు నుదుటిని కప్పేశాయి. పొడుగాటి జడ వీపుమీద వేలాడుతోంది. కొంగు నేలను తాకుతోంది.

సునంద ఒక్కక్షణం తలుపు నానుకుని నిల్చుంది. ఆమె కళ్ళు సగం మూసుకొనిఉన్నాయి. సునంద కళ్ళు మొహాన్ని చూస్తే ఆమె మేలుకొని ఉన్నట్టు కనిపించడం లేదు. ఆమె కళ్ళు ఎటువైపుకూ చూడ టంలేదు. భావశూన్యంగా ఉన్న ఆమె అరమోడ్పు కన్నులలో నిద్ర స్పష్టంగా కనబడుతోంది. ఒక్క క్షణం తలుపు నానుకుని నిలబడింది. తరువాత మెట్లవైపు నడిచింది. అక్కడ పడిపోతుందేమో? ఆమె మేలు కుని లేదు. వెళ్ళి పట్టుకుందామా అనుకున్నాడు సీతారాం. కాని రంగ నాధన్‌గారి మాటలు జ్ఞాపికి వచ్చాయి. మీరు ముట్టుకోకూడదు. మాట లాడించరాదు. కేక వేయరాదు........

'అలా చేయడమే మంచిది' అంది అతడి మనస్సు.

సునంద నెమ్మదిగా మెట్లు దిగడానికి ప్రారంభించింది. ఆమెపడి పోతుందేమోనని సీతారాం భయపడ్డాడు. కాని సునంద ఎక్కడా పడ

లేదు. సునంద త్రోవలో ఉన్న కుర్చీలా, సోఫాను దాటుకుని పెరటి వైపుకు వెళ్ళసాగింది. సీతారాం చప్పుడు చేయకుండా నీడలా ఆమెను అనుసరించాడు.

సునంద ఇంటి వెనుక వైపునున్న తలుపుతీసి పెరట్లోకి అడుగు పెట్టింది. ఆమె పాదాలు మృదువుగా నేలను తాకుతూ నడుస్తున్నాయి. గాలికి ఆమె కొంగు ఎగురుతోంది. నల్లటి జడ అటూ ఇటూ ఊగుతోంది.

దేవకన్యలు వెన్నెలలో విహారంచేసే కథ జ్ఞాపకమొచ్చింది సీతారాంకి. వెన్నెలలో తెల్లటి చీరలో సునంద చాలా అందంగా అగుపిస్తోంది.

పెరట్లో ఒక చివర పాడుబడిన నుయ్యి ఒకటి ఉంది. రావుగారు ఎప్పుడో నుయ్యి తవ్వించడానికి ప్రయత్నించారు. ఎంత లోతుగా తవ్వినా నీరు పడకపోవటంతో తమ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. మళ్ళీ దాన్ని పూడ్చేయాలని ప్రయత్నించి రాతి పలకను ఆ నూతిమీద వేయించారు. కాని అది నూతిని పూర్తిగా కప్పలేదు. రాతి పలక రెండు వైపుల చెయ్యిపట్టేటంత స్థలముండిపోయింది. రాత్రిళ్ళు ఎవరైనా చూడకుండా నూతిలో పడతారనే భయంవల్ల రావుగారలా చేశారు.

సునంద ఆ పాడుపడిన నూతి దగ్గరే ఆగింది. తన కుడిచేతిలో ఉన్న వస్తువులోసహా రాతి పలకమీద అడుగుపెట్టింది.

భయంతో నిలువెల్లా వణికిపోయాడు సీతారాం. ఆ రాతి పలక అకస్మాత్తుగా పక్కకు జరిగి సునంద నూతిలో కనక పడిపోతే? ఆ రాతి పలకమీద నిల్చున్న సునందను పక్కకు లాగుదామని సీతారాం రెండడుగులు వేశాడు. రంగనాథన్ మాటలు అతడిని నిరోధించాయి.

సునంద ఆ రాతి పలకమీద కూర్చొని తన చేతిని ఆ సందులో దూర్చి ఒక్క నిమిషం అలాగే కూర్చుని సునంద మళ్ళీ లేచి నిల్చుంది. అంతకుముందు ఆమె చేతిలో ఉన్న వస్తువు ఇప్పుడు లేదు.

సునంద మళ్ళీ ఇంటివైపుకు బయలుదేరింది. సీతారాం వేగంగా ఆమెను అనుసరించాడు. ఆమె లోపలికి వెళ్ళి తలుపులు వేసుకుంటుందేమోనని భయపడ్డాడు సీతారాం. అలా కనక చేసినట్టయితే ఇకరాత్రంతా

చలిలో ఆరుబయటే గడపాల్సి వచ్చేది.

సునంద లోపలికి వెళ్ళగానే సీతారాంకూడా ఆమె వెంటనే లోపలికి దూరాడు. అయినా సునంద సీతారాంని గమనించినట్టే లేదు.

ఎంత విచిత్రంగా ఉందిది? కళ్ళు సగం తెరచి ఉన్నాయి. ఆమె వెనుకనే నేనూ వచ్చాను. తలుపు గడియ వేసుకొనేటప్పుడుకూడా నన్ను గమనించలేదే అనుకున్నాడు.

సునంద తలుపు గడియ వేసుకుని నెమ్మదిగా మేడ మెట్లెక్కి తన గదిలోకి వెళ్ళిపోయింది. తరువాత మామూలుగానే తలుపు మూసికొని గడియ పెట్టుకుంది. సీతారాం కొన్నిక్షణాలు ఏమీ ఆలోచించలేక మనస్సు మూగవోయి అలాగే నిల్చున్నాడు. ఐదునిమిషాలు అలాగే నిల్చుని తరువాత సీతారాం ఏదో నిశ్చయానికి వచ్చి మేడెక్కి చెల్లెలి గది తలుపుతట్టేడు.

"సునందా" అని పిలిచాడు. లోపలినుండి ఎలాంటి చప్పుడూ వినబడలేదు. సీతారాం మళ్ళీ తలుపులు తట్టి 'సునందా' అని పిలిచాడు.

సునంద మేలుకుని లేచి, లైటువేసి తలుపులు తెరచి "ఏమిటన్నయ్యా?" అంది. "నిద్రపోతున్నావా?"

"ఊఁ నువ్వు పిలిస్తేనే మెలుకువ వచ్చింది."

"ఏదో చప్పుడయినట్టుంది. అందుకే లేచి వచ్చాను. నీకేమైనా చప్పుడు వినబడిందా?" లేదు బాబూ. నాకేం వినబడలేదు. నువ్వుపిలిచే వరకూ నాకసలు మెలుకువే రాలేదు."

అయితే ఎక్కడ చప్పుడయిందో ఏమిటో నిద్రపో. అంటూ సీతారాం తన గదికి వచ్చి పడుకున్నాడు. ఎంత ప్రయత్నించినా కన్నుమూత పడలేదు.

ఉదయం లేచి కాఫీ తాగగానే సీతారాం రంగనాధన్‌గారింటికి వెళ్ళాడు. రంగనాథన్ అప్పుడే లేచి షేవ్ చేసుకుంటున్నాడు. సీతారాం మొహంలో ప్రస్ఫుటంగా కనిపిస్తున్న కలవరపాటును చూసి నవ్వుతూ "ఏమిటి విశేషాలు?" అన్నాడు.

సీతారాం రాత్రి తాను చూసినదాన్నంతా వివరించి చెప్పాడు. "సునంద ఎందుకలా చేసిందంటీ?" అని కుతూహలంతో ప్రొఫెసరు

గారిని ప్రశ్నించాడు.

"సాయంకాలం సునందనుకూడా తీసుకొని రండి. అప్పుడంతా వివరంగా చెప్పుతాను." అన్నారు రంగనాథన్.

సీతారాం ఇంటికి వచ్చి సునందతో ప్రొఫెసర్‌గారు రమ్మన్న విషయం చెప్పాడు. సాయంకాలం అయిదు గంటలకు అన్నాచెల్లెళ్ళిద్దరూ కలిసి రంగనాథన్ గారింటికి బయల్దేరారు. దినూకూడా వాళ్ళతో వస్తానని మొండికేసినా బిస్కట్లు, బిళ్ళలు తెచ్చిపెడతామని చెప్పి వాడి నుండి తప్పించుకుని బయలుదేరారు. రంగనాథన్ వారిద్దరి కోసమే ఎదురు చూస్తున్నట్టు కనబడింది.

"లోపలికి రండి" అంటూనే డ్రాయింగ్ రూములో ఇద్దర్నీ కూర్చోబెట్టి తామూ వారి ఎదురుగుండా కూర్చున్నారు. రంగనాథన్ సునందనే చూస్తూ "మీ సమస్యలకు జవాబు దొరికింది"అన్నారు.

"నిజంగానా?" సునంద ఉద్వేగంతో అడిగింది. ఊం మీ సమస్యలేమిటో ఒక్కొక్కటిగా చెప్పండి. నేను జవాబు చెబుతాను.

"ఆత్మహత్యను గురించిన ఆలోచనలు, చాలాతొందరగా ఏడుపు రావడం, నామీద నాకే కోపం రావడం, అందరూ నన్నే చూసి నా గురించే మాట్లాడుకుంటున్నారు అనుకోవడం, వీటన్నిటికీ కారణం ఏమిటి?"

ఆత్మహత్యను గురించిన ఆలోచనలు నీకు రావటానికి కారణం నీ కేం చెయ్యాలో తెలియకుండా ఉండటం. నీ చిన్నతనంలో నేర్చుకున్న భావాలకు చదువుకున్న తరువాత నీలో వచ్చిన ఆధునిక మనోభావాలకూ సంఘర్షణ జరుగుతోంది. నీ మనస్సు చీలిపోయింది. కాని దాన్ని నువ్వు గుర్తించలేను వెంకమ్మత్తయ్య ఒళ్ళో పెరిగి సీతా, సావిత్రి, నలదమయంతి, అహల్య, లోపాముద్రల కథలను విని పతివ్రతల కర్తవ్యం, ధర్మం వీటికి ఎక్కువ ప్రాధాన్యత నిచ్చిన సునంద ఒకవైపు. చదువుకుని పూర్వకాలపు ఆచారాలు నియమాలు తప్పని భావించి వితంతు వివాహం మంచిదే దాన్లో తప్పేమీ లేదని వాదించే సునంద మరొకవైపు, యీ ఇద్దరిమధ్యా నలిగిపోతున్నావు నువ్వు. నీ జాగృత మనస్సు ఈ పాతభావాలను లెక్కచెయ్యటంలేదు కాని,

నీ అత్తయ్య నీలో నాటిన పతివ్రతా ధర్మబీజం సుషుప్తంగా పెరిగి మహావృక్షమై కూర్చుంది. కాని నువ్వు దానిని గుర్తించలేదు నీకు తెలియకుండానే నీ మనస్సులో అంటే సుషుప్తచిత్తాన్ని ఆ మనోభావాలు ఆక్రమించుకున్నాయి. కాని శ్రీధర్ మీది ప్రేమతో వాటిని ఎదిరించ టానికి ప్రయత్నించావు మనస్సులో ఏదో విప్లవం, పోరాటం జరుగు తూందని నీకు తెలిసినా కారణాన్ని మాత్రం ఊహించలేకపోయావు. ఆధునిక భావాలకూ, సనాతన భావాలకూ పోరాటం జరిగినప్పుడు ఆత్మ హత్యను గురించిన ఆలోచన నీ మనస్సులో మెదిలేది. ఏంచేయటానికీ తోచకుండా, చీకట్లో దోవతప్పిన పసిపాపాయిలా ఏడ్చేసేదానివి. కారణరహితమైన ఏడుపు రావటానికి కారణం యీ దౌర్బల్యమే. మళ్ళీ పెళ్ళి చేసుకోవడం తప్పని భావించినా శ్రీధర్‌ని వివాహం చేసుకోవ డానికి ఒప్పుకున్న ధైర్యసాహసాలను చూసి నీమీద నీకే కోపంవచ్చేది. అందరూ నిన్ను చూసి ఈమె విధవ రెండో పెళ్ళి చేసుకోవటం తప్ప యినా ఈ స్త్రీ పునర్వివాహం చేసుకోబోతోంది. అనుకుంటున్నారని భ్రమపడ్డావు. నీ జాగృత మనస్సు ఈ రెండో పెళ్ళి తప్పని అనుకోవ టంలేదు, కాని సుప్తమనస్సుఅలా భావిస్తోంది.

నేను మిగిలినవారికన్నా తక్కువ అనే భావన రావటానికి కార ణం మన సంఘం స్త్రీకి పునర్వివాహం చేసుకునే అధికారాన్ని ఇవ్వ లేదు. పురుషుడు మళ్ళీ పెళ్ళి చేసుకున్నంత సులువుగా స్త్రీ పెళ్ళి చేసుకోలేదు. వితంతు వివాహం ఓ రకంగా ధర్మం కాదని భావిస్తు న్నావు నువ్వు. అందువల్ల మిగిలినవారికన్నా నువ్వు తక్కువ అను కుంటావు."

"శ్రీధర్‌తో నా పెళ్ళి నిశ్చయమయ్యాకనే ఈ పోరాటం మొద లవటానికి కారణం?"

"శ్రీధర్‌ని కలుసుకునేవరకూ నీకు మళ్ళీ పెళ్ళిచేసుకోవాలన్న కోరిక లేదు. అత్తయ్య ఒళ్ళో పెరిగిన సునందతో దెబ్బలాడేవా రెవరూ లేకపోయారు. రెండు చేతులు కలిస్తేనే చప్పట్లు అంతేనా?"

"ఆ కలల అర్థాన్ని వివరిస్తారా?"

రంగనాథన్ వెళ్ళి డ్రాయర్‌లోనుండి సునంద కలల కాయితా

లను తీసుకొనివచ్చి కూర్చున్నాడు.

"మొదటికల అర్థమేమిటంటే, నువు భర్తను దేవుడిగా భావించావు. నీ మొదటిభర్త శేఖరుని నిజంగానే ప్రేమించావు.

తామరపూవులే కావాలా పూజకు. ఇంకే పూలైనా కలలో రావచ్చునే? హృదయాన్ని సామాన్యంగా తామరపూవుతోనే పోలుస్తుంటారు. హృదయపద్మం అని అనటాన్ని వినే ఉండవచ్చును. శేఖరాన్ని నువ్వు మనఃపూర్వకంగా ప్రేమించావు. అతడు చనిపోయాక శ్రీధర్‌ని ప్రేమించావు. ఒకరికిఅర్పించిన హృదయాన్ని మళ్ళీ ఇంకొకరికి అర్పించటం తప్పు అనేభావనవల్ల ఈ కల వచ్చింది. మీ అత్తయ్య ప్రభావం నీమీద ఎంతగాఉందో రెండో కల చూపుతోంది. మూడవ కలలో చారు అన్నమాట "ఆడదానికి ఒకే మారు పెళ్ళి" అన్నది వెంకమ్మత్తయ్య పెంచిన సునంద మనస్సులో మెదులుతున్న మాటలు. నాలుగవ కలలో నీ వదిన నీతో దెబ్బలాడుతోంది. కాని నిజానికి నీతో దెబ్బలాడుతున్నది మీ వదిన దమయంతికాదు. కలలో వచ్చి "నువు చేస్తున్నది తప్పు" అని ఖండించింది నలమహారాజు భార్య దమయంతి. నువ్వు నలుడి భార్య దమయంతి నెన్నడూ చూడలేదు. నువ్వు చూసిన దమయంతే నీతో నువ్వు చేస్తున్నది తప్పు అని దెబ్బలాడుతోంది. పేర్ల సామ్యాన్నిబట్టే నీకీ కలవచ్చింది.

పునర్వివాహం తప్పు అని నీ అంతరంగం భావిస్తున్నందువల్ల శ్రీధర్‌ని పెళ్ళి చేసుకుంటే నరకంలో శిక్ష లేస్తారేమోనని చాలా భయపడుతున్నావు.

ఏడవ కల మీఅత్తయ్యప్రభావంనీమీదఎంతఉందో చూపుతోంది."

"ఫోటోలు, ఉత్తరాలు, ఉంగరాల దొంగతనం మాటేమిటి?"

"వాటిని నువ్వే నిద్రలో తీసుకునివెళ్ళి మీ పెరట్లో ఉన్న పాడుబడిన నూతిలో వడేశావు. సునంద ఆశ్చర్యంతో. "నేనా? అసంభవం చీకట్లో ఒంటరిగా నడవటానికే భయం నాకు" అంది.

"కాని నీ ప్రవర్తనను మీఅన్నయ్యచూశాడు.కావాలంటే అడుగు." సునంద సీతారాంవైపు తిరిగింది. అతడు అంతకుముందు రాత్రి జరిగినదాన్నంతా వివరించి చెప్పాడు సునందతో. అద్భుతాలను వినే పసి

పిల్లలా వింది. ముచ్చెమటలు పోశా యామెకు.

"అమ్మయ్యో! రాత్రిళ్ళు ఎలా బయటికి వెళ్ళేదాన్ని? తల్చుకుంటేనే వణుకు పుడుతోందే."

"నిద్రలో ఇలా నడవటానికి సోమ్నాంబులిజం అంటారు. దీన్ని మన భాషలో నిద్రాభ్రమణమంటారు. అలాంటప్పుడు ఆ వ్యక్తికి మెలకువ ఉండక తానేంచేస్తున్నాను, ఎక్కడికి వెడుతున్నాను, అనే జ్ఞానం ఉండదు. నీలా నిద్రలో నడిచేవారికి నరాల దౌర్బల్యంకాని, (గిల్టీ కాంప్లెక్సు)గాని ఉంటుంది. లేడి మ్యాక్‌బెత్ రాజును చంపేశాక ఈ గిల్టీ కాంప్లెక్సువల్ల రాత్రిళ్ళు నిద్రలో అశాంతితో తిరగటాన్ని మనం మ్యాక్‌బెత్ నాటకంలో చదివాంకదా. శేఖరుడి ఫొటో, మొదటి పెళ్ళి ఫొటో ఉంగరం, శేఖరుడి ఉత్తరాలు నీ కంట బడినప్పుడల్లా నువ్వు తప్పు చేస్తున్నావని అనిపించేది. ముల్లు గుచ్చుకున్న కాలు అడుగు వేసినప్పుడల్లా నొప్పి పెట్టేటట్లు శేఖరుని తలుపుకు తెచ్చే వస్తువేది కనబడినా నీకు మనస్సులో బాధ కలిగేది. వాటిని నీ కంట బడకుండా ఎక్కడైనా పెడితే మనస్సులో పోరాటం, విప్లవం శాంతించవచ్చునని అనుకున్నావు కాని జాగృత మనస్సు ఇలా పునర్వివాహాన్ని తప్పు అనుకోవటం లేదు. అందువల్ల నిద్రపోయేటప్పుడు శేఖరుని తలపుకు తెచ్చే వస్తువు లన్నిటినీ తీసుకుని వెళ్ళి ఆ పాడుబడిన నూతిలో పడేసి వచ్చేదానివి. శ్రీధర్‌మీది ప్రేమా, మళ్ళీ నలుగురిలా హాయిగా కాపురం చేసుకోవాలనే కోరికా నీచేత ఆ పనిని చేయించాయి."

"నిద్రలో నడిచే అలవాటునుంచి తప్పించుకోలేనా?"

'అలా' అన్నదెవరు ? నీ మనస్సులో ఉండే తన భావాలను సంపూర్ణంగా నాశనంచేసి జీవితాన్ని కొత్త దృష్టితో చూడటానికి ప్రయత్నించు, జాగృత మనస్సుకూ, సుప్తచేతనానికీ మధ్య అభిప్రాయ భేదం రాకుండా చూసుకో. విధవ – అందులోనూ చిన్నవయస్సులో ఉన్న విధవ ప్రేమించటంకాని, మళ్ళీ పెళ్ళి చేసుకోటంకాని తప్పు కాదు. నువ్వు ఇంకా చిన్నపిల్లవి. నలుగురిలా జీవించాలి అన్న అపేక్ష ఉంది నీ జీవితం ఇప్పుడే మొదలయింది. నువ్వు సంతోషంగా,

హాయిగా జీవించే అవకాశం దొరికినప్పుడు ఏదో మూఢనమ్మకానికి తావిచ్చి నీ జీవితాన్నే నాశనం చేసుకోవడంలో న్యాయంలేదు. నువ్వు చనిపోయేవరకూ బ్రహ్మచారిణిగా ఉండాలని ఆజ్ఞాపించే అధికారం లోకులకుగాని, సమాజానికిగ్గాని లేదు. ఇంకా ముందు ముందు యౌవనంలో ఒంటరిగా జీవించలేక కోర్కెలకు లోనయి, పతిత అనిపించుకోవటంకన్న శ్రీధర్‌ని పెళ్ళి చేసుకుని న్యాయమైన మార్గంలో జీవించటం ఉత్తమం. శేఖరం జీవించి ఉన్నప్పుడు నువ్వు అతడికి ద్రోహం తలపెట్టలేదు. కాని అతడు అంత తొందరగా చనిపోవడం నీ తప్పు గాదు. అంతదానికే నువ్వు నీ దేహాన్ని మనస్సునూ శిక్షించడం న్యాయంకాదు. శ్రీధర్ నిన్ను పెళ్ళిచేసుకోవటానికి ముందుకొచ్చారు. ఆయన్ను పెళ్ళి చేసుకుని సుఖంగా జీవించు, లోకానికి భయపడకు. నాలుగురోజులు మీ గురించి మాట్లాడుకోవచ్చును. కాని అలాంటివాటికి భయపడకుండా పెళ్ళి చేసుకుని ఇంక మిగిలినవారికి కూడా మార్గం చూపండి. శేఖరుడితో ఎంత ప్రేమగా ఉండేదానివో, శ్రీధర్‌తోనూ అలాగే ఉండు. శేఖర్ శ్రీధర్ వేర్వేరు వ్యక్తులు కారు అనుకో. అప్పుడు శేఖరంగా ఉన్నవాడీనాడు శ్రీధర్‌గా వచ్చాడు. ఇలాంటి పాత సంఘటనలను గురించి బాధపడడంవల్ల ప్రయోజనం ఏమీలేదు. శేఖరాన్ని తలపుకు తెచ్చే వస్తువులవల్ల నీకు బాధ కలుగుతుందంటే వాటి నన్నిటినీ దూరంగా ఉంచేయి. నువ్వు చనిపోయి శేఖరం బతికి ఉంటే అతడికిపాటికి పెళ్ళయి ఉండేది. అప్పుడు శేఖరానికి తాను చేస్తున్నది తప్పని అనిపించేది కాదు. నీకలా తప్పు అనిపించటానికి కారణం మన సంఘపురీతి, నీతులు, మన సంఘంలో మార్పు వస్తోంది. కాని అదింకా పూర్తిగా రాలేదు. మీలాంటి చదువుకున్నవారు ముందంజ వేయాలి. నువ్వు ప్రయత్నిస్తే శేఖరాన్ని మర్చిపోగలవు. మనస్సును మించిం దేమీ లేదు. శ్రీధర్‌పై నీకున్న ప్రేమ శేఖరాన్ని మరచిపోయేలా చేస్తుంది. శేఖరుని తల్చుకుంటే శ్రీధర్‌కు ద్రోహం చేసినట్టే అని భావించు. అప్పుడు శేఖరాన్ని తొందరగా మర్చిపో గలుగుతావు. ఈ రోజులోని ఆనందం, సుఖం నీవి. అలాంటప్పుడు నిన్నటి గురించి, రేపటిగురించి బాధపడడంలో అర్థంలేదు. ఉమర్ ఖయ్యాం అన్నమాటలు వినలేదా ?

"To-morrow is unborn, and dead yesterday. Why feel about them if to day be sweet."

నిన్న గడిచిపోయింది. రేపు ఇంకా పుట్టలేదు. ఈ క్షణం మాత్రం నీది. ఇప్పుడు సుఖపడు".

రంగనాథన్‌గారి మాటలు వింటున్న సునంద 'మీ మాటలవల్ల నా కెంతో ధైర్యం కలిగింది. కాని మీరు ఇంకా కాస్త ధైర్యం..." అంది.

"అలాగే కానీ, సంహోశక్తి ఎలాంటిదో చూద్దువుగాని, ఇంకో నెలలో నీ పాత భావాలను సంపూర్ణంగా నాశనం చేస్తాను. రోజూ అరగంటవచ్చి విసువుపుట్టినా నా ఉపన్యాసం వినిపో"...అంటూ ఆయన సీతారాంవైపు తిరిగేరు.

"మీరు ఈ పనిలో నాతో సహకరించాలి. సునంద మంచి ధైర్యంగల పిల్ల. మంచి దృఢమైన మనస్సుంది. కాని అది చాలా సూక్ష్మమైనది కూడా. మన అందరి ప్రయత్నం కన్నా తన ప్రయత్నం వల్ల రాత్రిళ్ళు నిద్రలో నడిచే అలవాటునుండి తప్పించుకోవచ్చును. నేను మనస్సును ఓడించగలను. మనస్సు నా అదుపులో ఉండాలి. కాని నేను దీని అదుపులో కాదు, అనుకునేంత ఆత్మవిశ్వాసం భరోసా నీకుండాలి సునందా. మనస్సును మించిం దేమీ లేదు" అన్నారు.

సునందా, సీతారాం ఇద్దరూ ఇంటికి వచ్చేటప్పటికి శ్రీధర్ దినూతో ఆడుకుంటూ కూర్చున్నాడు. సునంద శ్రీధర్‌నిచూసి అంది. "కొన్నిరోజులు రావటానికి వీలుపడదన్నారు..."

"అలా చెప్పాను. కాని ఎందుకో విసుగ్గా అనిపించింది. ఓ అర గంట తీరిక కూడా దొరికింది. నిన్నుచూసి వెళదామని వచ్చాను. ఎక్కడికి వెళ్ళావు?"

"అప్పుడే మొదలైంది సునందా—ఎక్కడికి వెళ్ళావు, ఎందుకు వెళ్ళావని అడగటం. నువ్వు దానికి జవాబు చెప్పు రా దినూ మనం వెళదాం" అంటూ సీతారాం దినకర్‌ని తీసుకొని లోపలికి వెళ్ళారు.

సునంద తాను రంగనాథన్ దగ్గరకు వెళ్ళిన రోజునుండి ఈనాటి

వరకూ జరిగిన విషయాలన్నీటినీ చెప్పింది. శ్రీధర్ చాలా సేపు మౌనం వహించాడు.

"ఎందుకలా మౌనంగా కూర్చున్నారు? నేను చెప్పిందంతా విని విసుగ్గా ఉందా ?" శ్రీధర్ నిట్టూరుస్తూ అన్నాడు. "నువ్వు ఇంత బాధ పడుతూ ఉన్నా ఒక్కమాట నా చెవిన వేస్తే ఏం పోయేది సునందా? నువ్వు ఇంత బాధ పడేటప్పుడే. నేను నీ నవ్వు మొహాన్నీ, మాటల్నీ విని ఎంత ఆనందంగా ఉండేవాడినో తెలుసా. నీ నవ్వు మొహం వెనుక ఇంత జ్వాలాముఖి ఉందని నాకు తెలిసిం దీ రోజునే. నువ్వు నాకేమీ చెప్పలేదు...."

"నా మనస్సు ఇలా ఉందని నాకు తెలిస్తేగదా నేను మీకు చెప్పటానికి? నా మనస్సు ఇలా ఉందని నాకు తెలిసిం దీ రోజే; అదీ రంగనాథన్ గారు వివరించాకనే..."

"నీ మనస్సులో అంత బాధగా ఉన్నప్పుడు ఎలా నవ్వగలిగేదానివి సునందా?"

"మిమ్మల్ని చూసేటప్పటికే అంతా మర్చిపోయేదాన్ని. అప్పుడు నా హృదయాన్నంతా మీరే ఆక్రమించేవారు. అందువల్ల మీకు నా పరిస్థితి తెలియలేదు."

"నువ్వు నిజంగా సంతోషంగా ఉన్నావనే అనుకునేవాడిని నేను."

'ఓ సామెతుంది వినలేదా? దూరపుకొండలునునుపు అని. దగ్గఱకు వెడితేనేకదా కొండపైనున్న రాళ్ళు, చెట్లు, ఎత్తుపల్లాలు తెలుస్తాయి? నా మనస్సులోని ఎత్తు పల్లాలు, రాళ్ళూ, చెట్లూ అన్నీ నాకిప్పుడు కనబడ్డాయి. ఇకమీదట కాలుజారకుండా, ముళ్ళు గుచ్చుకోకుండా, కొండ ఎక్కుతాను."

"నేనూ నీతోబాటే వస్తాను. నువ్వు పడిపోకుండా చూసుకుంటాను. పడిపోయేలా ఉంటే నా ఆసరా ఇస్తాను. ఏమంటావు ?"

"మీ రన్నదాని కెప్పుడైనా కాదన్నానా?"

"నీతో మాట్లాడుతూ నిల్చుంటే నా ఆకలి తీరదు. క్లయింట్సు కాచు కూర్చుంటారు. ఇక వెళ్ళనా?"

"ఊఁ" సునంద ఇష్టం లేకుండా ఒప్పుకుంది.

"వెళ్ళాలా?"

"వెళ్ళాలని మీరేకదా అన్నది? ఇంక కొన్ని రోజులు. అంతే. ఆ తరువాత...?"

"ఆ తరువాత ఏమిటి?"

"ఆ తరువాత తోడు నీడ నేను లేనూ?"

"కవిత్వం చదవటం ఎక్కువయినట్టుందే, నా చేతికి దొరికాక నీకు బాగా బుద్ధొచ్చేలా చేస్తాను."

"మళ్ళీ మాట్లాడుతూ నిల్చున్నా రేం? బయలుదేరండి."

"నే నుంటే నీకేం నష్టం?"

"నష్టమేమీలేదు. ఇలా దూరంగా కూర్చోవటం కష్టం అంతే"

శ్రీధర్ చిరుకోపంతో లేచి నిలబడి "అయితే నే నెందుకూ ఇక్కడ? నేను వెడతాను" అన్నాడు.

సునంద చిలిపిగా నవ్వుతూ "మీ వస్తువులను వేటినీ మరచిపోకుండా తీసుకుని వెళ్ళండి. అలా మర్చిపోతే అర్థమేమిటో తెలుసా?" అంది.

"ఏమిటి?"

"ఆ చోటు వదలి వెళ్ళటానికి ఇష్టం లేదని అర్థం. ఈ రోజు ఏం మర్చిపోయారు?..."

శ్రీధర్ తన కోటు బటన్ హోలులో అలంకరించుకున్న చిన్న గులాబిపువ్వు తీసి అనురాగంతో సునందమీదికి విసిరి, తన హృదయాన్ని చూపుతూ అన్నాడు:

"దీనిని!"

(సమాప్తం)